

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 16 సంచిక: 252

SUNDAY Special | ఆదివారం | 3-12-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



చెస్ జీఎం వైశాలి

భారత్‌కు చెందిన వైశాలి రమేశ్‌కుమార్ గ్రాండ్ మాస్టర్ హోదాను సొంతం చేసుకుంది. భారత్ తరఫున ఈ ఘనత సాధించిన మూడో మహిళా ప్లేయర్‌గా గుర్తింపు.

- వివరాలు 12లో



పని మొదలెట్టిన ఆదిత్య-ఎల్ 1

సూర్యుడిని అధ్యయనం చేసేందుకు రోదసిలోకి దూసుకెళ్లిన ఆదిత్య-ఎల్ 1 తన ప్రయాణంలో మరో మైలు రాయిని అందుకుంది.


- వివరాలు 6లో



ఏ క్షణమైనా కుప్పకూలొచ్చు!

ఇటలీలోని బొలోగ్నాలో ఉన్న గారిసెండా టవర్ నానాటికీ ఓ పక్కకు వాలిపోతోంది. ఇప్పటిదాకా 4 డిగ్రీల కోణంలో ఒరిగింది.

- వివరాలు 6లో



మెలోనీ 'మెలోడీ'కి మోదీ ఫిదా

ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ చేసిన 'మెలోడీ'కి ప్రధాని నరేంద్ర మోదీతో పాటు నెటిజన్లంతా ఫిదా అయ్యారు.

- వివరాలు 6లో



'బహిష్కరణ'పై చర్చ జరగాల్సిందే

తృణమూల్ ఎంపీ మొయిత్రాను లోక్‌సభ నుంచి బహిష్కరించాలంటూ కమిటీ చేసిన సిఫార్సులు అఖిలపక్ష భేటీలో వేడిపుట్టించాయి.

- వివరాలు 6లో



వాట్సాప్ స్టేటస్‌గా డెడ్‌బాడీ

గర్ల్ ఫ్రెండ్‌ను గొంతు నులిమి చంపేసిన ఓ యువకుడు, ఆమె మృతదేహాన్ని ఫొటో తీసి వాట్సాప్ స్టేటస్‌లో పెట్టుకున్నాడు.

- వివరాలు 6లో

జడ్జిమెంట్ డే..!



హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలోని కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్, నగర పోలీస్ కమిషనర్ సందీప్ శాండిల్య

అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచేదెవరు? ఓడేదెవరు?.. తేలేది నేడే..

- ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు షురూ..
- తొలుత పోస్టల్ బ్యాలెట్ల కౌంటింగ్..
- అరగంట తర్వాత ఈవీఎంలలోని ఓట్ల లెక్కింపు మొదలు
- కౌంటింగ్‌కు ఏర్పాట్లన్నీ పూర్తిచేసినట్టు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ప్రకటన
- 49 ప్రాంతాల్లో మొత్తం 119 కేంద్రాల ఏర్పాటు
- మొత్తంగా 2,417 రౌండ్లలో జరగనున్న కౌంటింగ్
- ఉదయం 10.30కల్లా ఆధిక్యతపై స్పష్టత
- తొలుత భద్రాచలం నియోజకవర్గ ఫలితం వచ్చే చాన్స్
- అధికారంపై ఎవరి ధీమా వారిదే...

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజల తీర్పు ఏమిటో మరికొన్ని గంటల్లో వెల్లడికానుంది. దాదాపు రెండు నెలల ఉత్కంఠకు కాసేపట్లో తెరపడనుంది. ఆదివారం ఉదయం 8 గంటలకు అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు మొదలుకానుంది. రాష్ట్రంలోని మొత్తం 119 శాసనసభ నియోజకవర్గాల్లో పోటీపడిన 2,290 మంది అభ్యర్థుల భవితవ్యం తేలిపోనుంది. ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు నిజమవుతాయా? అందుకు భిన్నంగా ఫలితాలు వస్తాయా? ఎవరెవరు గెలుస్తారు? ఎవరికి దెబ్బపడుతుంది? అధికారంలోకి వచ్చేది ఎవరన్న దానిపై రాష్ట్ర ప్రజల్లో ఉత్కంఠ కనిపిస్తోంది. ఈ ఓట్ల కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించి అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈఓ) వికాస్‌రాజ్ శనివారం ప్రకటించారు.

49 ప్రాంతాల్లో లెక్కింపు కేంద్రాలు

రాష్ట్రంలో 31 జిల్లా కేంద్రాల్లోని 31 ప్రాంతాల్లో, హైదరాబాద్‌లో 14, రంగారెడ్డి జిల్లాలో నాలుగు ప్రాంతాల్లో కలిపి మొత్తం 49 ప్రాంతాల్లో ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఇందులో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒకటి చొప్పున 119 కౌంటింగ్ సెంటర్లలో ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నారు. నియోజకవర్గాల్లో పోలింగ్ కేంద్రాలు, పోలైన ఓట్ల సంఖ్య ఆధారంగా ఒక్కో సెంటర్‌లో కౌంటింగ్ టేబుళ్లను సిద్ధం చేశారు. దీని ప్రకారం అతి తక్కువగా షాద్‌నగర్ స్థానానికి సంబంధించి

మిగతా 2వ పేజీలో ▶

మధ్యప్రదేశ్, రాజస్తాన్, ఛత్తీస్‌లో

నేడే ఓట్ల లెక్కింపు

- ఏర్పాట్లన్నీ పూర్తి, కౌంటింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత
- 11 గంటలకల్లా ఫలితాల సరళిపై స్పష్టత వచ్చే అవకాశం
- మిజోరంలో ఓట్ల లెక్కింపు, ఫలితాలు రేపు

- వివరాలు 6లో

కాంగ్రెస్.. 'మిషన్ తెలంగాణ'

నేడు కౌంటింగ్ ముగిసేదాకా అనుసరించాల్సిన వ్యూహాలకు పదును

- ఇప్పటికే హైదరాబాద్‌కు డీకే సహా పలువురు కర్ణాటక మంత్రులు, పరిశీలకులు
- టీపీసీసీ నేతలతో రాహుల్ వర్చువల్ భేటీ.. ఫలితాల తర్వాతి వ్యూహాలపై చర్చ
- పూర్తి మెజారిటీ వస్తే ప్లాన్-ఏ... తారుమారైతే ప్లాన్-బీ అమలుకు నిర్ణయం
- మొదటిది అమలైతే డీకేతో ఢిల్లీకి టీపీసీసీ ముఖ్యులు.. రెండోదైతే అందరూ బెంగళూరుకే
- అవసరమైతే గెలుపు సర్టిఫికెట్లు చీఫ్ ఎలక్షన్ ఏజెంట్లు తీసుకునేలా నిర్ణయం



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో అధికారాన్ని దక్కించుకోవాలన్న కృతనిశ్చయంతో ఉన్న కాంగ్రెస్ హైకమాండ్ తన ఆపరేషన్‌ను ప్రారంభించింది. 'మిషన్ తెలంగాణ'పేరుతో నేటి కౌంటింగ్ ప్రక్రియ మొదలై ముగిసే దాకా అనుసరించాల్సిన వ్యూహాలకు పదునుపెట్టింది. ఈ బాధ్యతను కర్ణాటక ఉపముఖ్యమంత్రి, 'ట్రబుల్ షూటర్' డి.కె. శివకుమార్‌కు అప్పగించింది. ఆయనకు తోడుగా పలువురు కర్ణాటక మంత్రులు, కొందరు ఏఐసీసీ కీలక నేతలు ఆపరేషన్‌లో పాలుపంచుకోనున్నారు. కర్ణాటక మంత్రులు జార్జి, బోసురాజు శనివారం మధ్యాహ్నానికే హైదరాబాద్ చేరుకోగా డి.కె.శివకుమార్ రాత్రికి హైదరాబాద్ చేరుకున్నారు. ఈ ఆపరేషన్ కోసం రెండు ప్లాన్‌లను ఏఐసీసీ సిద్ధం చేసినట్లు తెలుస్తోంది.

కీలక నేతలతో రాహుల్ మీటింగ్

ఎన్నికల కౌంటింగ్ ఆదివారం ప్రారంభం కానున్న నేపథ్యంలో శనివారం సాయంత్రం ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ వర్చువల్ మీటింగ్ నిర్వహించారు. ఈ భేటీలో టీపీసీసీ ముఖ్య నేతలు రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డితోపాటు కర్ణాటక మంత్రులు జార్జి, బోసురాజు, పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే, పరిశీలకులు పాల్గొన్నారు. ఫలితాలు వచ్చాక అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. పార్టీ అభ్యర్థులను ముందే హైదరాబాద్‌కు పిలిపించాలన్న కొందరి సూచనలను రాహుల్ తిరస్కరించినట్లు తెలిసింది. కౌంటింగ్ కేంద్రాల్లో అభ్యర్థులు లేకుంటే నష్టం జరుగుతుందని, ప్రజల్లోకి కూడా తప్పుడు సంకేతాలు వెళ్తాయని ఆయన చెప్పినట్లు సమాచారం. ఈ పరిస్థితుల్లో కౌంటింగ్ ప్రక్రియ ముగిసే వరకు అభ్యర్థులను అక్కడే ఉంచాలని, ఫలితాలను బట్టి అభ్యర్థుల తరలింపుపై నిర్ణయం తీసుకోవాలని సూచించినట్లు తెలిసింది. ఏఐసీసీ పంపుతున్న కీలక నేతలు రాష్ట్ర వ్యాప్తంగా పరిస్థితులను పర్యవేక్షించాలని, ఏఐసీసీ పరిశీలకులతోపాటు జిల్లాల్లోని ముఖ్య నాయకులు

మిగతా 3వ పేజీలో ▶

న్యూస్‌రీల్

ఉద్యోగులు, పెన్షనర్ల డీఏ విడుదలకు ఓకే



రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు గత అక్టోబర్ నుంచి కరువు భత్యం (డీఏ) చెల్లించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం అనుమతి ఇచ్చింది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి లేఖ రాసింది.

- వివరాలు 2లో

కృష్ణా బోర్డు చేతికి శ్రీశైలం, సాగర్!



శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాలు, వాటి పరిధిలోని కాంపోనెంట్లను కృష్ణా నదీ యాజమాన్య బోర్డుకు అప్పగించే అంశంపై తెలంగాణ, ఏపీ అధికారులతో కేంద్ర జలశక్తి శాఖ ఢిల్లీలో సమావేశం నిర్వహించనుంది.

- వివరాలు 5లో

కిసాన్ క్రెడిట్ కార్డులపై రుణాల పేరిట భారీ మోసం



కిసాన్ క్రెడిట్ కార్డులపై చేపల చెరువుల నిర్మాణానికి రుణాలు ఇచ్చినట్టు లెక్కల్లో చూపి కోట్లాది రూపాయలను దారి మళ్లించిన కేసు దర్యాప్తును ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు ముమ్మరం చేశారు.


- వివరాలు 14లో

ఊరూవాడా.. రిజల్ట్‌పై అటెన్షన్!

- ఎన్నికల ఫలితాలపై జనంలో ఉత్కంఠ... పొలంకాడి నుంచి హోటళ్ల వరకు ముచ్చట్లు ఇవే..
- పార్టీలు, అభ్యర్థుల గెలుపోటములపై పందేలు
- సోషల్ మీడియాలో వచ్చే పోస్టులపై చర్చ

2 లో

ఇదం జగత్



..గ్యారంటీగా గెలుస్తారని జోస్యం చెప్పాడట!

ఎడతెగని మథనం!

ప్రగతిభవన్‌లో కేసీఆర్‌తో కేటీఆర్, హరీశ్, ఇతర కీలక నేతల భేటీ

- ఏయే సెగ్మెంట్లలో గెలుస్తాం, ఎక్కడ గట్టి పోటీ జరిగిందనే పరిశీలన
- సొంతంగానే మేజిక్ ఫిగర్ సాధిస్తామని బీఆర్‌ఎస్ అధినేత ధీమా
- హంగ్ వస్తే ఎంఐఎం మద్దతుతో సర్కారు ఏర్పాటుపై చర్చ?
- బీజేపీ, స్వతంత్ర అభ్యర్థులు గెలిచే అవకాశమున్న చోట అప్రమత్తం
- ఫలితాలు రాగానే గెలిచిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలంతా హైదరాబాద్‌కు రావాలని ఆదేశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర శాసనసభ ఎన్నికల ఫలితాలు కొద్దిగంటల్లో వెలువడనుండగా బీఆర్‌ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు భవిష్యత్ కార్యాచరణపై దృష్టి సారించారు. ప్రగతిభవన్‌లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మంత్రి హరీశ్‌రావు, పార్టీ పార్లమెంటరీ నేత కె.కేశవరావు, ఇతర నేతలతో రెండో రోజూ ఎడతెగని మంతనాలు జరిపారు. పార్టీ వార్‌రూమ్ నివేదికలతోపాటు ఎగ్జిట్‌పోల్స్, వివిధ సంస్థలు, నిఘా వర్గాలు, పార్టీ అభ్యర్థులు, ఇన్‌చార్జులు అందించిన నివేదికలను లోతుగా విశ్లేషించారు. ఆదివారం వెలువడే ఫలితాలు బీఆర్‌ఎస్‌కు సానుకూలంగా ఉంటాయని గట్టిగా విశ్వసిస్తున్న కేసీఆర్.. మళ్లీ మన ప్రభుత్వమే ఏర్పడుతుందంటూ పార్టీ నేతలకు భరోసా కల్పిస్తున్నారు. సొంతంగానే మేజిక్ ఫిగర్‌ను అందుకుంటామని చెప్తున్నారు.

అవసరమైతే ఎంఐఎంతో కలసి..

కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ మేజిక్ ఫిగర్ అయిన 60 సీట్లు దక్కించుకునే అవకాశం లేదని బీఆర్‌ఎస్ శిబిరం లెక్కలు వేస్తోంది. ఒకవేళ

మిగతా 2వ పేజీలో ▶



'హ్యాట్రిక్ లోడింగ్ 3.0... వేడుకలకు సిద్ధంగా ఉండండి' అంటూ మంత్రి కేటీఆర్ శనివారం రాత్రి ఇలా తాను తుపాకీ గురిపెట్టిన ఫొటోను 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

'ఎగ్జిట్ పోల్స్' కంటే మిన్నగా..

ఎన్నికల సరళిపై విశ్లేషణలో బీజేపీ నేతల ధీమా

- 35–40 నియోజకవర్గాల్లో గట్టి పోటీ.. 18–22 చోట్ల గెలుస్తామంటున్న నేతలు
- ఓట్ల శాతం 7 నుంచి 20కి పెరగొచ్చని అంచనా... గెలిచే అవకాశాలున్న స్థానాలకు నేడు పార్టీ పరిశీలకులు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై వివిధ సంస్థలు ప్రకటించిన ఎగ్జిట్ పోల్స్ అంచనాల గురించి బీజేపీ ముఖ్యనేతలు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో అత్యధిక సీట్లు వస్తాయని తాము భావిస్తుంటే సర్వే సంస్థలు మాత్రం నామమాత్రపు ఫలితాలు ఇవ్వడాన్ని తప్పుబడుతున్నారు. తమ అభ్యర్థులు బరిలో నిలిచిన 111 స్థానాలకుగాను కనీసం 35–40 సీట్లలో గట్టిపోటీ ఇచ్చి 18–22 సీట్లలో గెలిచే అవకాశాలున్నాయని ఎన్నికల సరళిని విశ్లేషించి చెబుతున్నారు. ఓటింగ్ శాతం కూడా 2018లో వచ్చిన ఏడు శాతం పోలిస్తే

మిగతా 2వ పేజీలో ▶

రాష్ట్రంలో రెండ్రోజులు మోస్తరు వర్షాలు

నైరుతి బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం

- ఆదివారం ఉదయానికి తుపానుగా మారే అవకాశం
- ఈనెల 5వ తేదీ నాటికి తీరం దాటనున్న తుపాను

- వివరాలు 14లో



జడ్జిమెంట్ డే..!

▶ మొదటి పేజీ తరువాయి

12 టేబుళ్లనే ఏర్పాటు చేశారు. 99 స్థానాలకు 14 టేబుళ్ల చొప్పున, 4 స్థానాలకు 16 టేబుళ్ల చొప్పున, 6 స్థానాలకు 18 టేబుళ్ల చొప్పున, మూడు స్థానాలకు 30 టేబుళ్ల చొప్పున.. 500కిపైగా పోలింగ్ కేంద్రాలున్న 6 నియోజకవర్గాలకు సంబంధించి 28 టేబుళ్ల చొప్పున ఏర్పాటు చేశారు. ప్రతి నియోజకవర్గానికి సంబంధించి టేబుళ్లకు అదనంగా.. రిటర్నింగ్ అధికారి (ఆర్వో) కోసం మరో టేబుల్ ఉంటుంది. మొత్తం 1,798 టేబుల్స్ ఏర్పాటు కాగా.. వాటిలో ఆర్వో, పోస్టల్ బ్యాలెట్ల కోసం 131 టేబుల్స్ వినియోగిస్తారు.

తొలి ఫలితం.. భద్రాచలం

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో అత్యధికంగా 26 రౌండ్లలో, భద్రాచలం నియోజకవర్గంలో అతి తక్కువగా 13 రౌండ్లలో ఓట్ల లెక్కింపు జరగనుంది. అంటే భద్రాచలం నియోజకవర్గం ఫలితాలు తొలుత వెల్లడయ్యే అవకాశం ఉందని అధికారులు చెప్తున్నారు. మొత్తంగా 119 స్థానాల్లో కలిపి 2,417 రౌండ్లలో ఓట్ల లెక్కింపు జరగనుంది. ప్రతి రౌండ్ కౌంటింగ్ ముగిశాక.. ఆ రౌండ్‌లో ప్రతి అభ్యర్థికి పడిన ఓట్లను నోట్ చేస్తూ వెళ్లాల్సి ఉంటుంది. అధిక పోలింగ్ జరిగిన నియోజకవర్గాలు, ఎక్కువ మంది అభ్యర్థులు పోటీలో ఉన్న స్థానాల్లో ఓట్ల లెక్కింపునకు ఎక్కువ సమయం పట్టే అవకాశం ఉంది. కౌంటింగ్ సమయంలో ఈవీఎంలకు ఏవైనా సాంకేతిక సమస్యలు వస్తే పరిష్కరించడం కోసం 119 మంది ఇంజనీర్లను నియమించారు.

మైక్రో అబ్జర్వర్ల పర్యవేక్షణలో..

ప్రతి కౌంటింగ్ టేబుల్ వద్ద ఒక సూక్ష్మ పరిశీలకుడు (మైక్రో అబ్జర్వర్), సూపర్‌వైజర్, ఇద్దరు అసిస్టెంట్లు ఉంటారు. ప్రతి రౌండ్ ఓట్ల లెక్కింపును మైక్రో అబ్జర్వర్ పర్యవేక్షిస్తారు. ఒక నియోజకవర్గానికి సంబంధించిన టేబుళ్లపై ఏక కాలంలో జరిపే లెక్కింపును ఒక రౌండ్‌గా లెక్కిస్తారు. ఆ రౌండ్‌లో అభ్యర్థులకు పోలైన ఓట్ల సంఖ్యను నమోదు చేస్తారు. ఓట్ల సంఖ్యను మరోసారి పరిశీలించి నిర్ధారించుకుంటారు. తర్వాత మైక్రో అబ్జర్వర్ పరిశీలనకు పంపుతారు. మైక్రో అబ్జర్వర్ ఆమోదించాక.. తదుపరి రౌండ్ లెక్కింపు ప్రారంభిస్తారు. ఒక్కో రౌండ్ పూర్తయిన కొద్దీ స్థానిక ఆర్వో/ఏఆర్వో మీడియా రూమ్ వద్దకు వచ్చి ఆ ఫలితాన్ని ప్రకటిస్తూ ఉంటారు.

మూడంచెల భద్రత

లెక్కింపు కేంద్రాల వద్ద కేంద్ర సాయుధ బలగాలు, రాష్ట్ర ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులు, రాష్ట్ర పోలీసులతో మూడంచెల భద్రతా ఏర్పాట్లు చేశారు. ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు, పరిశీలకులు, అభ్యర్థులు, ఎన్నికల ఏజెంట్లు, కౌంటింగ్ ఏజెంట్లు, పాసులు కలిగిన మీడియా ప్రతినిధులను మాత్రమే కౌంటింగ్ కేంద్రాల్లోకి అనుమతిస్తారు. కాలిక్యులేటర్లు, సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను కౌంటింగ్ కేంద్రాల్లోకి తీసుకెళ్లడానికి వీలుండదు.



కొత్త ప్రభుత్వం కొలువుదీరనున్న నేపథ్యంలో అసెంబ్లీకి రంగులు వేస్తున్న దృశ్యం

అధికారంపై ఎవరి ధీమా వారిదే..

శాసనసభ ఎన్నికల్లో మ్యాజిక్ ఫిగర్ సాధించి అధికారంలోకి వస్తామని అధికార బీఆర్ఎస్, ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీ ధీమాగా ఉన్నాయి. ఈ ఎన్నికల్లో మళ్లీ గెలిచి హ్యాట్రిక్ కొడతామని బీఆర్ఎస్.. తెలంగాణలో తొలిసారి అధికారం చేపడతామని కాంగ్రెస్ అంటున్నాయి. హంగ్ ఏర్పడితే ప్రభుత్వంలో భాగస్వామ్యం లభిస్తుందని బీజేపీ, ఎంఐఎం ఆశలు పెట్టుకున్నాయి. తుది ఫలితాలు ఎలా ఉన్నా తొలి రెండు స్థానాల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్‌లే ఉంటాయని.. మూడో స్థానం కోసం ఎంఐఎం, బీజేపీ తలపడనున్నాయని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. రాష్ట్రంలోని మొత్తం 119 అసెంబ్లీ సీట్లలో బీఆర్ఎస్ పోటీ చేయగా.. కాంగ్రెస్ 118 చోట్ల, పొత్తులో సీపీఐ ఒక స్థానంలో బరిలో ఉన్నాయి. మరో కూటమిలో బీజేపీ 111, జనసేన 8 స్థానాల్లో పోటీచేశాయి. బీఎస్పీ 107, ఎంఐఎం 9, సీపీఎం 19, సీపీఐఎల్ (న్యూడెమోక్రసీ) ఒక స్థానంలో బరిలో ఉన్నాయి.

ఉదయం 10.30కల్లా ఆధిక్యతపై స్పష్టత

ఆదివారం ఉదయం 8 గంటలకు తొలుత పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కిస్తారు. అరగంట తర్వాత అంటే 8.30 గంటలకు ఈవీఎంలో నిక్షిప్తమైన ఓట్ల లెక్కింపు మొదలుపెడతారు. ఒకవేళ పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ఎక్కువ సమయం కొనసాగినా, ఈవీఎం ఓట్ల లెక్కింపును సమయానికే ప్రారంభిస్తారు. చాలా నియోజకవర్గాల్లో ఉదయం 10.30 గంటలకల్లా ఏ అభ్యర్థి ఆధిక్యతలో ఉన్నదీ దాదాపుగా స్పష్టత వచ్చే అవకాశం ఉందని అధికారులు చెప్తున్నారు. మధ్యాహ్నం 12.30 గంటలకల్లా పోలింగ్ సరళి ద్వారా పార్టీల గెలుపోటములపై స్పష్టత రావొచ్చని పేర్కొంటున్నారు. ఎక్కడైనా పోటీ ఎక్కువగా ఉండి, రౌండ్ రౌండ్‌కు ఆధిక్యతలు మారిపోతూ ఉంటే.. లెక్కింపు పూర్తయ్యేదాకా ఫలితంపై ఉత్కంఠ కొనసాగుతుందని అంటున్నారు. ఓట్ల లెక్కింపు సరళిని కేంద్ర ఎన్నికల సంఘం వెబ్‌సైట్ https:// results.eci.gov.in ద్వారా ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు.

ఆ స్థానాలపైనే అందరి దృష్టి!

సీఎం కేసీఆర్ ఈసారి గజ్వేల్, కామారెడ్డి స్థానాల నుంచి పోటీలో ఉండగా.. ఆయనపై గజ్వేల్‌లో బీజేపీ తరఫున ఈటల రాజేందర్, కామారెడ్డిలో కాంగ్రెస్ తరఫున టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి బరిలోకి దిగి సవాల్ విసిరారు. దీనితో రాష్ట్రవ్యాప్తంగా ఈ రెండు నియోజకవర్గాల ఫలితం ఎలా ఉంటుందన్నది ఉత్కంఠ రేపుతోంది. మరోవైపు మంత్రులు కేటీఆర్ (సిరిసిల్ల), హరీశ్‌రావు (సిద్దిపేట), ఎర్రబెల్లి దయాకర్‌రావు (పాలకుర్తి), సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి(వనపర్తి), ఇంద్రకరణ్‌రెడ్డి (నిర్మల్), స్పీకర్ పోచారంశ్రీనివాస్‌రెడ్డి (బాన్సువాడ)ల ఎంపికపైనా అంతటా ఆసక్తి నెలకొంది.

- కాంగ్రెస్ తరఫున సీఎం ఆశావహులు/సీనియర్లు అయిన టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి (కొడంగల్), భట్టి విక్రమార్క (మధిర), ఉత్తమ్‌కుమార్‌రెడ్డి(హుజూర్‌నగర్), దామోదర రాజనర్సింహ (ఆందోల్), కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి (నల్లగొండ), టి.జీవన్‌రెడ్డి (జగిత్యాల), దుద్దిళ్ల శ్రీధర్‌బాబు (మంథని), సీతక్క (ములుగు), తుమ్మల నాగేశ్వర్‌రావు (ఖమ్మం)ల జయాపజయాలపై చర్చ నడుస్తోంది.
- బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బండి సంజయ్ (కరీంనగర్), ఈటల రాజేందర్ (హుజూరాబాద్), బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్(సిర్పూర్) తదితరులు సాధించనున్న ఫలితాలపైనా ఆసక్తి కనిపిస్తోంది.
- కొల్లాపూర్ నుంచి పోటీచేస్తున్న శిరీష (బర్రెలక్క) గెలిచే అవకాశాలు పెద్దగా లేవని, అయినా ఆమెకు ఎన్ని ఓట్లు పడతాయి, అక్కడ ఎవరు విజయం సాధిస్తారన్న దానిపై చర్చ జరుగుతోందని రాజకీయ నిపుణులు చెప్తున్నారు.

క్లుప్తంగా...

కౌంటింగ్ కేంద్రాల వద్ద అప్రమత్తంగా ఉండండి

టెలీకాన్ఫరెన్స్‌లో పోలీసులకు డీజీపీ ఆదేశాలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా ఆదివారం జరగనున్న అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని పోలీస్ అధికారులు, సిబ్బందిని డీజీపీ అంజనీకుమార్ ఆదేశించారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహణపై పోలీస్ ఉన్నతాధికారులతో శనివారం ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. అభ్యర్థుల గెలుపోటముల నేపథ్యంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. కౌంటింగ్ కేంద్రాల పరిసర ప్రాంతాల్లో అదనపు బలగాలతో పికెట్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గెలిచిన అభ్యర్థులు విజయోత్సవ ర్యా లీల సందర్భంగా దాడులు, ప్రతిదాడులకు అవకాశం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నాటి నుంచి ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పోలీసు అధికారులు, సిబ్బంది ఎంతో శ్రమించారని, మరో రెండురోజులు ఇదే స్ఫూర్తితో అప్రమత్తంగా ఉండాలని డీజీపీ కోరారు.

కేసీఆర్ నాయకత్వమే తెలంగాణకు శ్రీరామరక్ష

బీఆర్ఎస్ సీనియర్ నేత దాసోజు శ్రవణ్



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు నాయకత్వమే తెలంగాణకు శ్రీరామరక్ష అని, బీఆర్ఎస్ 70 సీట్లకుపైగా గెలుస్తుందని ఆ పార్టీ సీనియర్ నేత దాసోజు శ్రవణ్ ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ భవన్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ...పెయిడ్ ఎగ్జిట్‌పోల్స్‌తో కాంగ్రెస్ పైశాచిక ఆనందాన్ని పొందుతోందని ధ్వజమెత్తారు. ఆలూ లేదు చూలూ లేదు కొడుకు పేరు సోమలింగం అన్నట్లుగా కాంగ్రెస్ పార్టీ నేతలు తమ లేకితనాన్ని ప్రదర్శిస్తూ సీఎం కేసీఆర్‌పై బట్టకాల్చి మీద వేసే చిల్లర రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం, ఉద్యమ ప్రస్థానాలే మూడోసారి బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చేందుకు కారణమన్నారు. అవుట్ ఆఫ్ టెర్మ్‌లో కమీషన్ల కోసం కాంట్రాక్టర్లకు రూ. 6వేల కోట్ల బిల్లులు ఇచ్చారని ఈసీకి లేఖ రాయడం కాంగ్రెస్ పార్టీ చిల్లర రాజకీయానికి పరాకాష్ట అని నిప్పులు చెరిగారు. ప్రజల తీర్పు ఇంకా ఈవీఎంలలోనే నిక్షిప్తమై ఉన్నా.. కాంగ్రెస్ పార్టీ నేతలు పోర్టు పోలియోలా పంచాయితీలు పెట్టుకుంటున్నారని విమర్శించారు. ఇంకా తీర్పు ఈవీఎంలలో ఉన్నప్పుడే కేసీఆర్ ప్రగతిభవన్ ఖాళీ చేస్తున్నారని, రేవంత్‌రెడ్డి ఇంటి వద్ద భద్రత పెరిగిందని సోషల్ మీడియాలో చిల్లర ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఉద్యోగులు, పెన్షనర్లకు శుభవార్త

డీఏకు ఈసీ ఆమోదం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు గత అక్టోబర్ నుంచి కరువు భత్యం (డీఏ) చెల్లించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం అనుమతిచ్చింది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం అండర్ సెక్రటరీ సంజయ్‌కుమార్ శుక్రవారం రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి లేఖ రాశారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో డీఏ చెల్లింపు విషయంలో ఎలాంటి రాజకీయ లబ్ధి పొందడానికి ప్రయత్నించరాదని ఎన్నికల సంఘం స్పష్టం చేయడం తెలిసిందే. డీఏ చెల్లింపునకు అనుమతి కోరుతూ గత నెల 21న రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాయగా, పోలింగ్ ముగిసిన తర్వాత ఈసీ నిర్ణయం తీసుకోవడం గమనార్హం.

మొత్తం రూ.241.52 కోట్ల నగదు స్వాధీనం

- 2018 అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే 248 శాతం పెరుగుదల
- ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలపై 11,859 ఎఫ్ఐఆర్‌ల నమోదు
- రూ.469 కోట్ల విలువైన నగదు, బంగారం, డ్రగ్స్ స్వాధీనం
- అక్టోబర్ 9 నుంచి డిసెంబర్ 1 వరకు వివరాలు వెల్లడించిన పోలీస్ శాఖ



స్వాధీనం	రూ.కోట్లలో విలువ	నమోదైన ఎఫ్ఐఆర్‌లు
నగదు	241.52	241
బంగారం, వెండి	175.95	05
మద్యం	13.36	11,195
డ్రగ్స్	22.17	323
ఇతర వస్తువులు	16.63	95
మొత్తం	469.63	11,859

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ చివరి అంకానికి చేరుకుంది. రాష్ట్రంలో అక్టోబర్ 9న ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి డిసెంబర్ 1 వరకు పోలీసు బృందాల తనిఖీల్లో మొత్తం రూ.241.52 కోట్ల నగదు స్వాధీనం చేసుకున్నారు. 2018 అసెంబ్లీ ఎన్నికల సమయంలో రూ.103 కోట్ల నగదు పట్టుబడగా ఈసారి ఎన్నికల నగదు స్వాధీనంలో 248 శాతం పెరుగుదల నమోదైంది. ఈ మేరకు శనివారం డీజీపీ కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై మొత్తం 11,859 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

కామారెడ్డి కింగ్ ఎవరో.?!

వీవీఐపీ సెగ్మెంట్‌లో నరాలు తెగే ఉత్కంఠ

- కేసీఆర్, రేవంత్‌తో పాటు పోటీలో కేవీఆర్
- మూడు పార్టీల్లోనూ గెలుపు ధీమా
- మరికొన్ని గంటల్లో తేలిపోనున్న భవితవ్యం



కేసీఆర్



రేవంత్‌రెడ్డి



వెంకటరమణారెడ్డి

సాక్షి, కామారెడ్డి: రాష్ట్రంలోనే వీవీఐపీ సెగ్మెంట్‌గా అందరి దృష్టిని ఆకర్షించిన కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గం ఫలితంపై నరాలు తెగే ఉత్కంఠ నెలకొంది. కామారెడ్డి కింగ్ ఎవరవుతారన్న దానిపై తెలంగాణ రాష్ట్రంలోనే కాదు.. తెలుగు రాష్ట్రాల్లోనే చర్చ జరుగుతోంది. సీఎం కేసీఆర్ గజ్వేల్‌తో పాటు కామారెడ్డి నుంచి ఎన్నికల బరిలో నిలబడటంతో సీఎంను ఓడిస్తానంటూ పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పోటీకి దిగారు. వీళ్లిద్దరికీ స్థానికుడైన జడ్పీ మాజీ చైర్మన్ కాటిపల్లి వెంకటరమణారెడ్డి గట్టిపోటీ ఇచ్చారు. కేసీఆర్ గెలుపు ఖాయమని బీఆర్ఎస్ నేతలు, రేవంత్‌రెడ్డి గెలుస్తాడంటూ కాంగ్రెస్ నేతలు నమ్మకంతో ఉన్నారు. ముక్కోణపు పోటీలో ఎవరు గెలుస్తారన్నదే ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్నగా ఉంది.

కేసీఆర్ తరఫున కేటీఆర్ ఎన్నికల బాధ్యతలు

సీఎం కేసీఆర్ బీఆర్ఎస్ అభ్యర్థిగా గత నెల 9 న కామారెడ్డిలో నామినేషన్ దాఖలు చేసి అదే రోజు ప్రభుత్వ డిగ్రీ కాలేజీ గ్రౌండ్స్‌లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో ప్రసంగించారు. కేసీఆర్ తరఫున ఎన్నికల బాధ్యతలను మంత్రి కేటీఆర్ నిర్వహించారు. ఎన్నికల ప్రచార బాధ్యతలను ఎమ్మెల్సీ షేరి సుభాష్‌రెడ్డి, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ చేపట్టారు. అలాగే మంత్రులు మహమూద్ అలీ, శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ బండా ప్రకాశ్, నాయకులు కర్నె ప్రభాకర్, మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, బాలమల్లు, బాల్క సుమన్, అయాచితం శ్రీధర్ తదితరులు ప్రచారంలో ఉధృతంగా పాల్గొన్నారు.

రేవంత్‌కి అండగా వచ్చిన రాహుల్, కర్ణాటక సీఎం

గత నెల 10న పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. అదే రోజు ఇందిరాగాంధీ స్టేడియంలో బీసీ డిక్లరేషన్ సభ ఏర్పాటు చేశారు. రేవంత్‌రెడ్డితో పాటు కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య సభలో పాల్గొన్నారు. 26న కామారెడ్డిలో నిర్వహించి బహిరంగ సభలో ఏఐసీసీ నేత రాహుల్ గాంధీ పాల్గొని ప్రసంగించారు.

కేవీఆర్ కోసం వచ్చిన ప్రధాని మోదీ

ఇద్దరు వీఐపీల మధ్య స్థానిక నేతగా బరిలోకి దిగిన బీజేపీ అభ్యర్థి కాటిపల్లి వెంకటరమణారెడ్డి నామినేషన్ కార్యక్రమానికి కేంద్ర మంత్రి పురుషోత్తం రూపాల హాజరయ్యారు. గత నెల 25న జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ గ్రౌండ్స్‌లో జరిగిన బహిరంగ సభలో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొని ప్రసంగించారు. గత నెల 4న జిల్లా కేంద్రంలో జరిగిన బైక్‌ర్యాలీ, సభల్లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి కిషన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఫలితంపై ఉత్కంఠ..

ఓట్ల లెక్కింపు ప్రక్రియ మరికొద్ది గంటల్లో షురూ అయి, మధ్యాహ్నంలోపు ఫలితాలు వెలువడనున్నాయి. మూడు పార్టీల నేతల్లోనూ గెలుపు ధీమా కనిపిస్తోంది. పోలింగ్ ముగిసినప్పటి నుంచి ఎవరిలెక్కలు వారు వేసుకుంటున్నారు. పోలింగ్ కేంద్రాల వారీగా తమ పార్టీకి వచ్చే ఓట్లపై కూడికలు, తీసివేతలు చేసి గెలుపు ధీమా వ్యక్తం చేస్తున్నారు. అయితే విజయం ఎవరిని వరిస్తుందన్నది కాసేపట్లో తేలిపోనుంది.

‘ఉపా’ చట్టాన్ని ఎత్తివేయాలి

- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ డిమాండ్
- గోపీనాథ్, గాదె ఇన్నయ్యలపై పెట్టిన కేసులను ఎత్తివేయాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం (హైదరాబాద్): దేశంలో ‘ఉపా’లాంటి చట్టాలను తీసుకువచ్చి, ప్రజల హక్కుల కోసం పోరాటం చేస్తున్న వారిపైన ప్రయోగించడం దుర్మార్గమైన చర్య అని, వెంటనే ఆ చట్టాన్ని రద్దు చేయాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ కేంద్రాన్ని డిమాండ్ చేశారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ‘నిర్బంధ వ్యతిరేక వేదిక తెలంగాణ’ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ.. భారత్ బచావో జాతీయ కౌన్సిల్ నాయకులైన డాక్టర్ ఎం.ఎఫ్.గోపీనాథ్, గాదె ఇన్నయ్య, జంజర్ల రమేశ్‌లపై ఉపా, ఐపీసీలోని సెక్షన్లతో నమోదు చేసిన అక్రమ కేసులను ఎత్తివేయాలని కోరారు. గత యూపీఏ ప్రభుత్వ హయాంలో ‘ఉపా’చట్టాన్ని తీసుకురాగా, ఈ చట్టానికి ఎన్డీఏ ప్రభుత్వం అనేక కోరలు తొడిగి మరింత పదును పెట్టిందని విమర్శించారు. ప్రశ్నించే వారిపై ఈ చట్టాన్ని అమలు చేస్తున్నారని మండిపడ్డారు. సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ మాడభూషి శ్రీధర్ మాట్లాడుతూ తెలంగాణలో ప్రజాసంఘాల నాయకత్వంపై నమోదు చేసిన ఉపా తదితర అక్రమ కేసులను ఎత్తివేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కోరారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి మాట్లాడుతూ రాష్ట్రంలో ఉపా కేసులను విచ్చల విడిగా పెడుతుండటంతో ‘నిర్బంధ వ్యతిరేక వేదిక’ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తోందన్నారు. ఈ నేపథ్యంలో రాజకీయ పార్టీలు, వివిధ సంఘాలు ముందు చూపుతో ఉపా చట్టానికి వ్యతిరేకంగా పోరాడాలని ఆయన కోరారు. డాక్టర్ గోపీనాథ్ తొలి దళిత కార్డియాలజిస్టుగా దేశమంతటికీ తెలుసునని, అలాంటి వ్యక్తులపై కూడా ఉపా లాంటి కేసులను మోపడం సరైంది కాదని అన్నా రు. ఈ కార్యక్రమంలో నిర్బంధ వ్యతిరేక వేదిక కన్వీనర్ ప్రొఫెసర్ హరగోపాల్, కోకన్వీనర్లు ప్రొఫె సర్ జి.లక్ష్మణ్, ఎం.రాఘవాచారి, ప్రొఫెసర్ కోదండరాం, సీపీఎం నేత డి.జి.నర్సింహారావు, ప్రొఫెస ర్ పి.ఎల్.విశ్వేశ్వర్‌రావు. న్యూడెమోక్రసీ నాయకు డు గోవర్ధన్, పీవోడబ్ల్యూ నేతలు సంధ్య, ఝాన్సీ, వీక్షణం ఎడిటర్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

‘ఎగ్జిట్ పోల్స్’ కంటే మిన్నగా..!

▶ మొదటి పేజీ తరువాయి

ఈసారి 20 శాతం వరకు రావచ్చని అంచనా వేస్తున్నారు.

గతంలో ఎన్నడూ లేనంత స్థాయిలో...

గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి అసెంబ్లీ ఎన్నికలను బీజేపీ నేతలు అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకొని సిద్ధమయ్యారు. ప్రధాని మోదీ ఐదు రోజుల ప్రచారంలో మొత్తం 8 సభలు, ఓ రోడ్ షో, కేంద్ర హోంమంత్రి అమిత్ షా 22 బహిరంగ సభలు, రోడ్ షోలు, ఇంకా పెద్ద సంఖ్యలో సభల్లో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, పలువురు కేంద్ర మంత్రులు, బీజేపీపాలిత రాష్ట్రాల సీఎంలు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. అగ్రనేతల ప్రచారం తాలూకు ఫలితాలు తప్పకుండా ఓట్లు, సీట్ల రూపంలో ప్రతిబింబిస్తాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. బీసీ నినాదం, అధికారంలోకి వస్తే బీసీ నేత సీఎం, ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ, జాతీయ పసుపు బోర్డు, సమ్మక్క–సారక్క గిరిజన వర్సిటీ ఏర్పాటుతోపాటు వివిధ వర్గాల ప్రజలకు ప్రయోజనం చేకూర్చేలా మేనిఫెస్టోలో ప్రస్తావించిన వివిధ అంశాలు తప్పకుండా పార్టీకి ఎన్నికల్లో కచ్చితంగా ఉపయోగ పడుతుందని గట్టిగా నమ్ముతున్నారు.

కిషన్‌రెడ్డిని కలిసిన పలువురు పార్టీ అభ్యర్థులు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డిని శనివారం పార్టీ కార్యాలయంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ, ఎన్నికల్లో పోటీ చేసిన ఏలేటి మహేశ్వర్‌రెడ్డి (నిర్మల్), ఆరేపల్లి మోహన్ (మానకొండూరు), తోకల శ్రీనివాస్‌రెడ్డి (రాజేంద్రనగర్) తదితరులు కలిశారు. ఈ సందర్భంగా పోటీ చేసిన స్థానాల్లో పార్టీకున్న విజయావకాశాలు, అభ్యర్థులకు కలిసొచ్చే అంశాలు చర్చకు వచ్చినట్లు తెలిసింది.

పరిశీలకులను పంపిస్తున్నాం...

ఓట్ల లెక్కింపు సందర్భంగా పార్టీ గెలిచే అవకాశాలు, గట్టి పోటీ ఇచ్చే నియోజకవర్గాల్లో క్షేత్రస్థాయి పరిస్థితుల పర్యవేక్షణకు తమ పార్టీ నుంచి పరిశీలకులను పంపిస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. కాసం వెంకటేశ్వర్లు యాదవ్ ‘సాక్షి’కి తెలిపారు. అలాగే పార్టీ కార్యాలయంలో ముఖ్య నేతలంతా ఎప్పటికప్పుడు ఫలితాల సరళిని పరిశీలించి పార్టీ జిల్లా నేతలు, అభ్యర్థులకు తగిన ఆదేశాలు జారీ చేస్తారన్నారు. కౌంటింగ్ సందర్భంగా ఉత్పన్నమయ్యే పరిస్థితులను బట్టి వెంటనే స్పందించి ఈసీకి ఫిర్యాదు చేసేలా బీజేపీ లీగల్ సెల్ కూడా అందుబాటులో ఉంటుందని చెప్పారు.

కౌంటింగ్ కేంద్రాల వద్ద అగ్నిమాపకశాఖ అప్రమత్తం



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద ఎలాంటి అగ్నిప్రమాదం సంభవించినా వెంటనే అప్రమత్తం అయ్యేలా అగ్నిమాపక శాఖ పూర్తిస్థాయిలో సన్నద్ధమైంది. 119 నియోజకవర్గాల పరిధిలోని కౌంటింగ్ కేంద్రాల వద్ద ఫైర్ టెండర్లు, మిస్ట్ బుల్లెట్లు, మంటలు ఆర్పే పరికరాలతో ప్రత్యేక బృందాలను అందుబాటులో ఉంచినట్టు అగ్నిమాపక శాఖ డీజీ వై.నాగిరెడ్డి తెలిపారు. అన్ని కౌంటింగ్ కేంద్రాల వద్ద విధుల్లో ఉండే సిబ్బంది, అగ్నిమాపక శాఖ అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించినట్టు పేర్కొన్నారు. ఇప్పటికే అగ్నిమాపక శాఖ అధికారులు కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసిన ప్రాంతాలను తనిఖీ చేసుకున్నారని, ప్రమాదాలకు ఆస్కారం లేకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకున్నారని తెలిపారు.

ఢిల్లీలో మణిపూర్ వాసులపై దాడి

న్యూఢిల్లీ: మణిపూర్‌కు చెందిన దంపతులు, వారి బంధువుపై ఢిల్లీలో గుర్తు తెలియని వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. మణిపూర్‌కు చెందిన ఈ బాధితులు.. తమ ప్రత్యర్థి వర్గానికి చెందిన వారే ఈ దాడికి కారణమని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. బాధితుడు, ఆయన భార్య, సోదరి గురువారం అర్ధరాత్రి సమయంలో తమ స్నేహితుడి ఇంటికి వెళ్లి తిరిగి వస్తున్నారు. దార్లో ఒక మహిళ సహా ముగ్గురు అపరిచితులు వారిని ఆపారు. తమ ఫోన్‌లో బ్యాటరీ డౌనయిందని, మునిర్కా ప్రాంతానికి ఉబెర్‌లో కారు బుక్ చేయాలని కోరారు. సరేనని, కారు బుక్ చేశారు. కారు వచ్చేలోగానే అపరిచితుల్లో ఒకరు బాధితుడిని తీవ్రంగా దూషించసాగాడు. అతడి భార్య, సోదరి వారించబోగా చుట్టుపక్కల వారిని పిలిచి వారిపై దాడికి పాల్పడ్డారు. గాయపడిన బాధితుడు ఆస్పత్రిలో చేరాడు. దాడికి పాల్పడినవారు మణిపూర్‌కు చెందిన తమ ప్రత్యర్థి వర్గానికి చెందిన వారని బాధితుడు అనుమానం వ్యక్తం చేశాడు. మణిపూర్‌లోని ప్రధాన కుకీ, మెయితీ వర్గాల ప్రజల మధ్య మే నుంచి జరుగుతున్న దాడుల్లో సుమారు 180 మంది చనిపోయిన విషయం తెలిసిందే. తాజా ఘటనతో ఢిల్లీ పోలీసులు అప్రమత్తమయ్యారు. పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి, సీసీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేపట్టారు.

ఊరూవాడా.. రిజల్ట్‌పై అటెన్షన్!

అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై జనంలో ఉత్కంఠ

- పొలంకాడి నుంచి హోటళ్లలో ముచ్చట్లదాకా ఇదే..
- పార్టీలు, అభ్యర్థుల గెలుపోటములపై పందేలు
- సోషల్ మీడియాలో వచ్చే పోస్టులపై చర్చ



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు మొదలవుతున్న నేపథ్యంలో రాష్ట్రంలో జనం దృష్టి అంతా ఫలితాలపైనే పడింది. ఊరూవాడా పల్లె పట్నం ఎక్కడ చూసినా.. చిన్నాపెద్దా ఎవరిని కదిలించినా ఉత్కంఠ కనిపిస్తోంది. ఎవరెవరు గెలుస్తారు? ఏ పార్టీ గెలుస్తుంది? ప్రభుత్వం ఏర్పాటు చేసేదెవరు? కేసీఆర్, కేటీఆర్, రేవంత్, ఈటల వంటి ప్రముఖ నేతల్లో ఎవరెవరికి ఎలాంటి ఫలితం ఎదురవుతుందన్న చర్చ కూడా సాగుతోంది. పొలాల్లో పనిచేసుకుంటున్న రైతులు, కూలీల నుంచి హోటళ్లలో, బస్టాండ్లలో పిచ్చాపాటీ దాకా ఎక్కడ నలుగురు కలసినా ఇదే తీరు. చివరికి ఆలయాలు, ఇతర ప్రార్థనా స్థలాల్లో పరిచయస్తులు కనిపించినా ఎలక్షన్ల ప్రస్తావన రాకుండా ఉండటం లేదు. సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న పోస్టులపై విస్తృత విశ్లేషణలు చేస్తున్నారు. మొత్తంగా రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల ఫలితాల హీట్ కనిపిస్తోంది.

పందెం కాస్తావా?

పల్లె, పట్నం తేడా లేకుండా ఎక్కడ చూసినా ఫలితాలపై చర్చలు సాగుతుంటే.. వివిధ పార్టీల అభిమానుల మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్లు కనిపిస్తున్నాయి. మేం గెలుస్తామంటే, మేం గెలుస్తామంటూ అభ్యర్థులు, పార్టీల తరఫున సరదా పందేలూ జరుగుతున్నాయి. మరోవైపు అసెంబ్లీ ఫలితాలపై జోరుగా బెట్టింగ్‌లు కూడా జరుగుతున్నాయని, ఇప్పటికే రంగ ప్రవేశం చేసిన బుకీలు ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లు, సోషల్‌మీడియా గ్రూపుల్లో హడావుడి చేస్తున్నారని తెలిసింది. సీఎం ఎవరవుతారు, ఏ పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయనే అంశంపై రూ.లక్షల్లోనే బెట్టింగులు సాగుతున్నాయి. కర్ణాటక, ఏపీ వంటి పొరుగు రాష్ట్రాల్లోనూ తెలంగాణ ఫలితాలపై ఆసక్తి కనిపిస్తోంది. అక్కడి వారూ బెట్టింగ్‌లు కడుతున్నట్టు సమాచారం.

సోషల్ మీడియాలో జోరుజోరుగా..

వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో ఎన్నికల ఫలితాల అంచనాలు, విశ్లేషణలు పోటెత్తుతున్నాయి. ఎక్కడ ఫలితాలు ఎలా ఉంటాయనే అంచనాలు, ఊహాగానాలు క్షణం తీరిక లేకుండా పోస్టు అవుతున్నాయి. ఫోన్‌లో నోటిఫికేషన్ సౌండ్ వచ్చిందంటే చాలు చేతిలోకి తీసుకుని చెక్‌చేసుకుంటున్నారు. రాజకీయ పోస్టులను చదవడమే కాదు.. వాటిపై తమ అభిప్రాయాలు, అంచనాలనూ రిప్లైలో ఇస్తున్నారు. తమకు నచ్చినవాటిని ఆయా ప్లాట్‌ఫామ్‌లపై, గ్రూపుల్లో షేర్ చేస్తున్నారు. దీంతో ఎవరు గెలుస్తారన్నది, ఎవరు ఓడుతారన్నది గందరగోళంగా మారిపోయింది.

ఎడతెగని మథనం!

▶ మొదటి పేజీ తరువాయి

హంగ్ ఫలితాలు వస్తే, అవసరమైతే మిత్రపక్షం ఎంఐఎం సహకారంతో ప్రభుత్వం ఏర్పడుతుందని కేసీఆర్ సంకేతాలు ఇస్తున్నట్టు తెలిసింది. మరోవైపు కాంగ్రెస్ శిబిరంలో చోటు చేసుకుంటున్న పరిణామాలను కూడా కేసీఆర్ నిశితంగా గమనిస్తున్నారని బీఆర్ఎస్ వర్గాలు చెప్పాయి. ఫలితాలు వెలువడిన వెంటనే గెలిచిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలంతా హైదరాబాద్‌కు చేరుకోవాలని ఆదేశించారని తెలిపాయి. ఇక ఓట్ల లెక్కింపు ప్రక్రియను పార్టీపరంగా సమన్వయం చేసే బాధ్యతను కేటీఆర్ ఆధ్వర్యంలోని వార్‌రూమ్‌కు.. పార్టీ ఎమ్మెల్యేలు హైదరాబాద్‌కు చేరుకునేలా చూడాల్సిన బాధ్యతను కేటీఆర్, హరీశ్‌రావులకు అప్పగించారు.

గెలిచే చాన్స్ ఉన్నవారి జాబితా సిద్ధం చేసి..

వివిధ వర్గాల నుంచి అందిన నివేదికల ఆధారంగా గెలుపు అవకాశాలున్న నియోజకవర్గాలు, అభ్యర్థులతో బీఆర్ఎస్ ఓ ప్రాథమిక జాబితాను సిద్ధం చేసుకుంది. మరోవైపు స్వల్ప మెజారిటీతో గెలిచే అవకాశమున్న (ఉత్కంఠ పోటీతో) నియోజకవర్గాల పరిస్థితిని మదింపు చేసి మరో జాబితాను రూపొందించుకున్నట్టు సమాచారం. బీజేపీ, స్వతంత్ర అభ్యర్థులు గెలిచే అవకాశమున్న స్థానాలపైనా బీఆర్ఎస్ ఇప్పటికే ఓ అంచనాకు వచ్చింది. ప్రభుత్వ ఏర్పాటులో వారి మద్దతు అవసరమయ్యే పక్షంలో సంప్రదింపులకు సిద్ధంగా ఉండాలని పార్టీ కీలక నేతలను ఆదేశించినట్టు తెలిసింది. ఉమ్మడి నల్గొండ మినహా ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాలో గణనీయంగా సీట్లు సాధిస్తామని... ఉమ్మడి హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో పైచేయి బీఆర్ఎస్‌దే ఉంటుందని కేసీఆర్ భావిస్తున్నట్టు పార్టీ వర్గాలు చెప్తున్నాయి. ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్‌లలో బీజేపీ బలంగా ఓట్లు చీల్చుతుందని.. దీనితో ఆయా జిల్లాల్లో బీఆర్ఎస్ మిశ్రమ ఫలితాన్ని సాధిస్తుందనే అంచనా వేసుకుంటున్నట్టు వివరిస్తున్నాయి.

కౌంటింగ్ జాగ్రత్తలపై కేటీఆర్ సూచనలు

ఆదివారం జరిగే ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించి ఏజెంట్ల నియామకం, కేంద్రాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పార్టీ అభ్యర్థులతో మంత్రి కేటీఆర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. చాలా నియోజకవర్గాల్లో స్వల్ప ఓట్లతోనే గెలుపోటములు మారే అవకాశం ఉందని.. చివరి నిమిషం వరకు ఏజెంట్లు లెక్కింపు కేంద్రంలోనే ఉండాలని, అభ్యర్థులు కూడా పర్యవేక్షించాలని ఆదేశించారు.

క్లుప్తంగా...

4 రాష్ట్రాల సీఎల్పీ సమావేశాల కోసం ఏఐసీసీ పరిశీలకుల నియామకం

- తెలంగాణకు డీకే శివకుమార్‌సహా ఐదుగురు



సాక్షి, న్యూఢిల్లీ: నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ నేడు (ఆదివారం) జరగనున్న నేపథ్యంలో కాంగ్రెస్ శాసనసభా పక్ష(సీఎల్పీ) సమావేశాల సమన్వయానికి తెలంగాణసహా నాలుగు రాష్ట్రాలకు శనివారం ఏఐసీసీ పరిశీలకులను నియమించింది. తెలంగాణకు నియమించిన ఐదుగురు ఏఐసీసీ పరిశీలకుల్లో కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, దీపాదాస్ మున్షీ, డాక్టర్ అజోయ్ కుమార్, కె.మురళీధరన్, కె.జె.జార్జి ఉన్నారు. రాజస్తాన్ పరిశీలకులుగా భూపేందర్‌సింగ్ హుడా, మధుసూదన్ మిస్త్రీ, ముకుల్ వాస్నిక్, షకీల్ అహ్మద్ ఖాన్, మధ్యప్రదేశ్ పరిశీలకులుగా అధీర్ రంజన్ చౌదరి, పృథ్వీరాజ్ చవాన్, రాజీవ్ శుక్లా, చంద్రకాంత్ హండోర్, ఛత్తీస్‌గఢ్ పరిశీలకులుగా అజయ్ మాకెన్, రమేష్ చెన్నితల, ప్రీతంసింగ్‌ను నియమించారు.

ఊహించని మెజార్టీతో కాంగ్రెస్‌కు అధికారం

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



జగిత్యాల టౌన్: ముఖ్యమంత్రి కేసీఆర్ నియంతృత్వ, నిరంకుశ వైఖరితోనే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఘోర పరాభవాన్ని మూట కట్టుకోబోతోందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆయన జిల్లాకేంద్రంలోని ఇందిరాభవన్‌లో శనివారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఎన్నికల ఫలితాలపై విశ్లేషించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటమి తప్పదని గ్రహించిన కేసీఆర్.. గవర్నర్‌కు రాజీనామా సమర్పించేందుకే సోమవారం మంత్రిమండలి భేటీ కావాలని నిర్ణయించారని చెప్పారు. ప్రజావిశ్వాసం కోల్పోవడంతో ఓటమిని ఒప్పుకుని రాజీనామా చేస్తున్నామనే ఏకవాక్య తీర్మానంతో కేబినెట్ భేటీ ముగియనుందని పేర్కొన్నారు. కేసీఆర్ నియంతృత్వ వైఖరి, ఒంటెత్తు పోకడలపై తీవ్ర అసంతృప్తిగా ఉన్న ప్రజలు కాంగ్రెస్‌కు అనుకూలంగా ఓటు వేశారని తెలిపారు. కాంగ్రెస్ భారీ విజయం సాధించబోతోందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ తీర్పును బీఆర్‌ఎస్ నాయకులపై వ్యతిరేకతగా భావించరాదని, ఇది ముమ్మాటికీ ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యతిరేక ఓటేనని స్పష్టం చేశారు. సంక్షేమ కార్యక్రమాల అమలు నెపంతో తెలంగాణ సమాజాన్ని తాగుబోతులుగా మార్చారని జీవన్‌రెడ్డి విమర్శించారు.

నిధులు మళ్లిస్తున్నారు.. భూములు మార్చుకుంటున్నారు

- రాష్ట్ర ప్రభుత్వంపై కేంద్ర ఎన్నికల సంఘానికి కాంగ్రెస్ ఫిర్యాదు
- సీఈవో వికాస్‌రాజ్‌కు వినతిపత్రం ఇచ్చిన రేవంత్, ఉత్తమ్, యాష్కీ, పొంగులేటి తదితరులు
- కట్టడి చేయాలని ఈసీని కోరాం: ఉత్తమ్



ఎన్నికల కమిషనర్ వికాస్ రాజ్‌ను కలిసి వినతిపత్రం సమర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

సాక్షి, హైదరాబాద్: రైతుబంధు కింద పంపిణీ చేయాల్సిన నిధులను తమకు నచ్చిన కాంట్రాక్టర్లకు మళ్లిస్తున్నారని, హైదరాబాద్ శివారు జిల్లాల్లోని వేలాది ఎకరాల అసైన్డ్ భూముల రికార్డులను మారుస్తున్నారని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న సమయంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేస్తున్న అధికార దుర్వినియోగాన్ని కట్టడి చేయాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని కాంగ్రెస్ కోరింది. ఈ మేరకు ఆ పార్టీ నేతలు రేవంత్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మధుయాష్కీగౌడ్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జి.నిరంజన్, అంజన్‌కుమార్ యాదవ్, మహేశ్‌కుమార్‌గౌడ్, హర్కర వేణుగోపాల్, రోహిణ్‌రెడ్డి, అనిల్‌కుమార్‌యాదవ్ తదితరులు శనివారం రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారిని కలసి వినతిపత్రం అందజేశారు. కేంద్ర ఎన్నికల సంఘం ఇచ్చిన ఆదేశాల మేరకు రైతుబంధు నిధుల పంపిణీ ఆగిపోయిందని, ఈ నేపథ్యంలో ఆ పథకం కింద ఇవ్వాల్సిన రూ.6 వేల కోట్లను తమకు ఇష్టమైన కాంట్రాక్టర్ల నుంచి కమీషన్లు తీసుకుని పంపిణీ చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆ వినతిపత్రంలో తెలిపారు. అదేవిధంగా రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని వేలాది ఎకరాల అసైన్డ్ భూముల హక్కు రికార్డులను ధరణి పోర్టల్ ద్వారా ముఖ్యమంత్రి కుటుంబ సభ్యుల బినామీల పేరిట మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ విషయాల్లో సరైన పద్ధతిలో ప్రభుత్వం వ్యవహరించేలా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి తగిన ఆదేశాలు జారీ చేయాలని, ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న సమయంలో ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడకుండా కట్టడి చేయాలని ఆ వినతిపత్రంలో కోరారు.

నాలుగు అంశాలపై వినతిపత్రం ఇచ్చాం: ఉత్తమ్

సీఈవో వికాస్‌రాజ్‌ను కలసిన అనంతరం ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ రైతుబంధు నిధుల మళ్లింపు, అసైన్డ్ భూముల రికార్డుల మార్పిడికి సంబంధించి బీఆర్‌ఎస్ ప్రభుత్వం దిగిపోయే ముందు అధికార దుర్వినియోగానికి పాల్పడకుండా చూడాలని సీఈఓకు విజ్ఞప్తి చేశామని చెప్పారు. అలాగే తమ పార్టీ నుంచి గెలిచే వారి ఎలక్షన్ సర్టిఫికెట్లను చీఫ్ ఎలక్షన్ ఏజెంట్లకు ఇచ్చేలా ఆదేశాలివ్వాలని కోరామని తెలిపారు. పాతబస్తీలో రిగ్గింగ్ జరిగిందని, దీనికి సంబంధించి సీసీటీవీ రికార్డులున్నాయని, ఈ రికార్డుల ఆధారంగా తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా కోరామని వెల్లడించారు. ఈనెల 4వ తేదీన కేబినెట్ సమావేశం నిర్వహించాలన్న కేసీఆర్ నిర్ణయంపై స్పందిస్తూ, కేబినెట్ ఎందుకు పెడుతున్నారో తమకు తెలియదని, రాజీనామాను ఇచ్చేందుకు ఈ సమావేశం నిర్వహించి ఉండవచ్చని, విషయం తెలియకుండా మాట్లాడలేమని ఉత్తమ్ చెప్పారు.

తొలి గెలుపు దక్కేదెవరికో?

- బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ నుంచి మొదటిసారిగా శాసనసభకు పోటీ చేసిన వారు 102 మంది
- ఎంపీగా చేసినా ఎమ్మెల్యేగా గెలవాలని బరిలోకి దిగిన కొందరు



సాక్షి, హైదరాబాద్: శాసనసభ ఎన్నికల్లో తొలిసారి ప్రధాన పార్టీల నుంచి బరిలోకి దిగిన 102 మందికి పైగా అభ్యర్థుల భవితవ్యం నేడు తేలనుంది. 'అధ్యక్షా'అనాలనే కుతూహలంతో ఉన్నవాళ్ల పోటీ ఫలితం ఆదివారం రానుంది. స్థానిక పరిస్థితులు, మారిన రాజకీయ సమీకరణాల నేపథ్యంలో ఈసారి అన్ని పార్టీ లూ కొత్తవారికి అవకాశాలిచ్చాయి. బీజేపీ 50 మందికిపైగా కొత్త వాళ్ళకు అవకాశమిచ్చింది. కాంగ్రెస్ కూడా 45 మందికి పైగా కొత్త వాళ్ళకే టికెట్లు ఇచ్చింది. సిట్టింగ్‌లకే ఎక్కువ సీట్లిచ్చిన బీఆర్‌ఎస్ ఏడుగురుకి మాత్రం తొలిసారి పోటీ చేసేందుకు అవకాశమిచ్చింది. మొత్తంగా ప్రధాన పార్టీల నుంచి 102 మంది కొత్త అభ్యర్థులు బరిలో ఉన్నారని లెక్కలు చెబుతున్నాయి. మరోవైపు ఇండిపెండెంట్లు గా కూడా అనేక మంది తొలిసారి పోటీ చేస్తున్నారు.

తొలిసారి బరిలో ఉన్న కొందరు..

పాలకుర్తిలో కాంగ్రెస్ నుంచి యశస్వినిరెడ్డి, బీజేపీ నుంచి రామ్మోహన్‌రెడ్డి పోటీ చేస్తున్నారు. డోర్నకల్‌లో కాంగ్రెస్ నుంచి రాంచంద్రునాయక్, బీజేపీ నుంచి భూక్యా సంగీత, దేవరకద్రలో కాంగ్రెస్ నుంచి మధుసూదన్‌రెడ్డి, బీజేపీ నుంచి కొండా ప్రశాంత్‌రెడ్డి, వనపర్తిలో కాంగ్రెస్ నుంచి మేఘారెడ్డి, బీజేపీ నుంచి అనుజ్ఞారెడ్డి, మక్తల్ నుంచి వాకిటి శ్రీహరి, బీజేపీ నుంచి జలంధర్‌రెడ్డి, గద్వాలలో కాంగ్రెస్ నుంచి సరిత, బీజేపీ నుంచి బోయ శివారెడ్డి, మహబూబ్‌నగర్‌లో బీజేపీ నుంచి మిథున్ రెడ్డి, నారాయణపేటలో పర్ణికారెడ్డి, అలంపూర్‌లో బీఆర్‌ఎస్ నుంచి కె విజయుడు, బీజేపీ నుంచి రాజగోపాల్, ఖానాపూర్‌లో బీఆర్‌ఎస్ జాన్సన్ నాయక్, కోరుట్లలో బీఆర్‌ఎస్ నుంచి డాక్టర్ సంజయ్ పోటీ చేయగా... బీజేపీ నుంచి ఎంపీగా ఉన్న అర్వింద్ ఈసారి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నారు. అదేవిధంగా మెదక్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా రోహిత్‌రావు, బీజేపీ నుంచి విజయ్‌కుమార్, నర్సాపూర్‌లో కాంగ్రెస్ నుంచి ఆవుల రాజిరెడ్డి, బీజేపీ తరఫున మురళీయాదవ్, తుంగతుర్తిలో కాంగ్రెస్ టికెట్‌పై మందుల సామేలు, బీజేపీ నుంచి రామచంద్రయ్య, ఆలేరులో కాంగ్రెస్ తరఫున బీర్ల ఐలయ్య, బీజేపీ టికెట్‌పై పడాల శ్రీనివాస్, ఆర్మూర్‌లో కాంగ్రెస్ నుంచి వినయ్‌రెడ్డి బీజేపీ తరఫున పైడి రాకేష్ రెడ్డి, సికింద్రాబాద్‌లో కాంగ్రెస్ నుంచి సంతోష్ కుమార్, బీజేపీ టికెట్‌పై సారంగపాణి, శేరిలింగంపల్లిలో కాంగ్రెస్ నుంచి జగదీశ్వర్‌గౌడ్, బీజేపీ నుంచి రవికుమార్, కంటోన్మెంట్‌లో బీఆర్‌ఎస్ టికెట్‌పై లాస్య నందిత, కాంగ్రెస్ తరఫున జీవీ వెన్నెల, జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ టికెట్‌పై అజహరుద్దీన్, బీజేపీ నుంచి దీపక్‌రెడ్డి తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.

కాంగ్రెస్..'మిషన్ తెలంగాణ'

▶ మొదటి పేజీ తరువాయి

అక్కడి పరిస్థితులను సమన్వయం చేసుకోవాలని... జిల్లాలవారీగా బాధ్యులను నియమించుకొని కౌంటింగ్ సమయంలో అనుసరించాల్సిన వ్యూహాలపై నిర్ణయాలు తీసుకోవాలని ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు.

ద్విముఖ వ్యూహంతో ముందుకు..

ఈసారి అధికారం దక్కించుకునేందుకు రెండు వ్యూహాలను కాంగ్రెస్ సిద్ధం చేసింది. ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు అవసరమైన మ్యాజిక్ ఫిగర్ వస్తే ప్లాన్-ఏ, కొన్ని స్థానాలు తక్కువ పడే సందర్భంలో ప్లాన్-బీని అమలు చేయాలని నిర్ణయించింది. సంపూర్ణ మెజారిటీ సాధిస్తే అభ్యర్థులందరినీ హైదరాబాద్ పిలిపించి డి.కె.శివకుమార్ సమక్షంలో తొలుత సమావేశం ఏర్పాటు చేయనుంది. అనంతరం ఆయనతోపాటు టీపీసీసీ ముఖ్యులంతా కలసి ఢిల్లీ వెళ్లి హైకమాండ్‌తో సీఎల్పీ సమావేశం తేదీని నిర్ణయించాలని, ఆ తర్వాత సీఎల్పీ నేత ఎంపిక బాధ్యతను హైకమాండ్‌కు అప్పగించాలని పార్టీ యోచిస్తోంది. ఒకవేళ హంగ్ పరిస్థితులు ఏర్పడి మెజారిటీకి కొన్ని స్థానాలు తక్కువగా వస్తే ప్లాన్-బీని అమలు చేయాలని, అప్పుడు



బేగంపేట విమానాశ్రయంలో కర్ణాటక మంత్రి జార్జ్‌కు స్వాగతం పలుకుతున్న హర్కర, మన్సూర్

వీలైనంత త్వరగా అభ్యర్థులందరినీ హైదరాబాద్‌కు పిలిపించి టీపీసీసీ ముఖ్య నేతలతో సహా అందరినీ బెంగళూరుకు తరలించాలని భావిస్తోంది. హంగ్ వస్తే ఇతరుల మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు అవసరమైన సంప్రదింపులు జరిపేందుకు గెలిచిన ఎమ్మెల్యేలందరినీ సురక్షిత ప్రాంతానికి తరలించాలనేది ఏఐసీసీ ఆలోచనగా కనిపిస్తోంది. ఈ పరిస్థితుల్లోనే గెలుపు ధ్రువీకరణ పత్రాలను చీఫ్ ఎలక్షన్ ఏజెంట్ల ద్వారా తీసుకొనే ఏర్పాటు చేసుకోవాలని యోచిస్తోంది. ఈ విషయమై టీపీసీసీ ముఖ్యనేత ఒకరు 'సాక్షి'తో మాట్లాడుతూ క్యాంపు రాజకీయాలకు వెళ్లాల్సిన అవసరం తమకు ఈసారి ఉండదనే ధీమా వ్యక్తం చేశారు. కౌంటింగ్ ముగిశాక అనుసరించాల్సిన వ్యూహాలను సమన్వయం చేసేందుకే ముఖ్య నాయకులు ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్నారని, అది ఏఐసీసీ వ్యూహంలో భాగమేనని చెప్పారు.

ఎంఐఎం అవసరం ఏర్పడితే?:

ఫలితాల్లో తమకు మ్యాజిక్ ఫిగర్ వస్తుందని ధీమాతో ఉన్న కాంగ్రెస్.. ప్రత్యామ్నాయ అవకాశాలపైనా సమాలోచనలు చేస్తోంది. ఒకవేళ అతిపెద్ద పార్టీగా అవతరించి ఎంఐఎంతో కలసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సిన పరిస్థితులు వస్తే ఏం చేయాలన్న దానిపైనా పార్టీలో చర్చ జరుగుతోంది. ఎన్నికల సందర్భంగా బీఆర్‌ఎస్, బీజేపీ, ఎంఐఎం ఒక్కటేనని ప్రజలకు చెప్పిన నేపథ్యంలో ఎంఐఎం మద్దతు తీసుకోవాలా వద్దా అనే దానిపైనా ముఖ్యనేతలు కసరత్తు చేస్తున్నారు. ప్రభుత్వ ఏర్పాటుకు ఎంఐఎం మద్దతిచ్చేందుకు ముందుకొస్తే బయటి నుంచి ఆ పార్టీ మద్దతు తీసుకోవడంలో అభ్యంతరం ఏమీ ఉండబోదని, తెలంగాణలో రాజకీయ సుస్థిరత కోసం ఈ నిర్ణయం తీసుకున్నా ప్రజలు అర్థం చేసుకుంటారనే చర్చ కాంగ్రెస్ నేతల్లో జరిగినట్లు తెలుస్తోంది.

వ్యాయామం.. క్యాన్సర్ దూరం

యుక్త వయసులో వ్యాయామం, శారీరక శ్రమతో ఆరోగ్యకర జీవనం

- అత్యధిక కార్డియోస్పిరేటరీ ఫిట్‌నెస్‌తో క్యాన్సర్ల ప్రమాదం తగ్గుదల
- 9 రకాల క్యాన్సర్ల ముప్పు 40 శాతం నియంత్రణ
- బ్రిటిష్ జర్నల్ ఆఫ్ స్పోర్ట్స్ మెడిసిన్‌లో ప్రచురించిన ఓ కొత్త అధ్యయనంలో వెల్లడి
- వారానికి 150-300 నిమిషాల వ్యాయామాన్ని సిఫారసు చేస్తున్న అమెరికన్ క్యాన్సర్ సొసైటీ



సాక్షి, అమరావతి : యుక్త వయసులో నిత్య వ్యాయామం.. శారీరక శ్రమ ద్వారా ఆరోగ్యకర జీవన శైలిని అలవర్చుకుంటే క్యాన్సర్ల ముప్పు తగ్గుతుంది. దినచర్యలో భాగంగా రన్నింగ్, సైక్లింగ్, స్విమ్మింగ్, మెట్లు ఎక్కడం, ఏరోబిక్స్ వ్యాయామం చేసే వ్యక్తుల్లో కార్డియోస్పిరేటరీ (గుండె, ఊపిరితిత్తుల ఆరోగ్యం) ఫిట్‌నెస్ సామర్థ్యం పెరుగుతుంది. ఫలితంగా ఆరోగ్యవంతమైన కార్డియోస్పిరేటరీ వ్యవస్థ కలిగిన వారిలో 9 రకాల క్యాన్సర్లు వచ్చే ప్రమాదం దాదాపు 40 శాతం నిరోధించవచ్చని పరిశోధకులు గుర్తించారు. బ్రిటిష్ జర్నల్ ఆఫ్ స్పోర్ట్స్ మెడిసిన్‌లో ప్రచురించిన ఓ కొత్త అధ్యయనంలో ఫిట్‌నెస్ స్థాయిలు అనేక జీవనశైలి మార్పులకు మంచి సూచికలని, నిర్దిష్ట క్యాన్సర్ల నుంచి మరింత రక్షణగా నిలుస్తుందని పేర్కొన్నారు.

వారానికి 150–300 నిమిషాల వ్యాయామం

దీర్ఘకాలిక అధ్యయనంలో భాగంగా పరిశోధకులు 10 లక్షల మంది పురుషుల ఆరోగ్య డేటాను విశ్లేషించారు. ఇందులో అత్యల్ప కార్డియోస్పిరేటరీ ఫిట్‌నెస్ ఉన్న వ్యక్తులతో పోలిస్తే అధిక ఫిట్‌నెస్ స్థాయిలు కలిగిన వ్యక్తుల్లో తల, మెదడు (19 శాతం), కడుపు (21శాతం), పాంక్రియాస్ (12 శాతం), కాలేయం (40 శాతం), పేగు (18 శాతం), రెక్టల్ (5 శాతం), అన్నవాహిక (39 శాతం), మూత్రపిండాలు (20 శాతం), ఊపిరితిత్తుల(42 శాతం) క్యాన్సర్ల ప్రమాదం తగ్గుతుందని ధ్రువీకరించారు. ఫిట్‌నెస్, క్యాన్సర్ల మధ్య సంబంధాన్ని జీర్ణాశయ క్యాన్సర్ల విషయంలో స్పష్టంగా తెలుసుకోవచ్చని సూచిస్తున్నారు. ఇందులో భాగంగానే అమెరికన్ క్యాన్సర్ సొసైటీ ప్రతి వారం పెద్దలకు 150-300 నిమిషాల వ్యాయామాన్ని సిఫారసు చేస్తోంది.

మరో రెండు రకాల క్యాన్సర్ల పెరుగుదల

అధిక కార్డియోస్పిరేటరీ ఫిట్‌నెస్ కలిగిన వ్యక్తుల్లో ఆశ్చర్యకరంగా చర్మ (31శాతం), ప్రోస్టేట్ (7శాతం) క్యాన్సర్లు వచ్చే ప్రమాదాన్ని పెంచుతోంది. దీనికి అధ్యయనంలో పరిశోధకులు కచ్చితమైన సమాధానాలు ఇవ్వలేదు. శారీరకంగా మరింత దృఢంగా ఉన్న వ్యక్తులు ఎండలో ఎక్కువ సమయం గడపడంతో చర్మ క్యాన్సర్లు వస్తున్నట్టు భావిస్తున్నారు. ఊబకాయులుగా ఉండటంతో పాటు మద్యపానం, ధూమపానం, మాదకద్రవ్యాల వినియోగించే వ్యక్తుల్లో తక్కువ కార్డియోస్పిరేటరీ ఫిట్‌నెస్‌కు ఒక కారణంగా చెబుతున్నారు. ఇక్కడ తల్లిదండ్రుల విద్యార్హతలు కూడా యుక్త వయసులో వ్యక్తుల ప్రవర్తన, జీవన శైలిని ప్రభావితం చేస్తున్నట్టు గుర్తించారు. చిన్నారులు, యుక్తవయస్కులు టీవీలు, వీడియో గేమ్స్, సెల్‌ఫోన్లకు దూరంగా ఉంటూ రోజూ గంటపాటు మైదానాల్లో ఆటల్లో తీవ్రంగా శ్రమించాలని అధ్యయనం సూచిస్తోంది.

పట్టణాల్లో ఒకలా, పల్లెల్లో మరోలా..

ముగ్గురు పిల్లల నిబంధనపై హైకోర్టులో పిటిషన్


సాక్షి, హైదరాబాద్: ముగ్గురు లేదా అంతకంటే ఎక్కువ మంది పిల్లలు ఉంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి అనర్హులన్న తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ చట్టం 2018లోని సెక్షన్ 213ని సవాల్ చేస్తూ న్యాయవాది, సామాజిక కార్యకర్త రాపోలు భాస్కర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు సంబంధించి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వం వివక్ష చూపుతోందన్నారు. 'పోటీ చేసే అభ్యర్థులకు ముగ్గురు పిల్లల నిబంధన గ్రామాల్లో ఒకలా.. పట్టణాల్లో మరోలా ఉంది. సెక్షన్ 213 ప్రకారం ముగ్గురు లేదా అంతకంటే ఎక్కువ మంది పిల్లలున్న వారు గ్రామపంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ సహా ఇతర స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి అనర్హులు. ఈ నిబంధన పట్టణ ఎన్నికలకు వర్తించదు. తెలంగాణ మునిసిపాలిటీ చట్టం ప్రకారం కౌన్సిలర్, మేయర్, కార్పొరేటర్, చైర్మన్ స్థానాలకు పోటీ చేసే అభ్యర్థులకు పిల్లల సంఖ్యతో సంబంధం లేదు. రెండు చట్టాల మధ్య ఈ వ్యత్యాసం రాజ్యాంగంలోని 13, 14, 19 అధికరణలను ఉల్లంఘించడమే కాదు.. సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధం. దీన్ని పరిగణనలోకి తీసుకుని తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్ చట్టం 2018లోని సెక్షన్ 213 రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించాలి. పట్టణ, గ్రామీణ



అభ్యర్థుల మధ్య వివక్షను సరిదిద్దేలా ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేయాలి'అని పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టనుంది.

మీరు నాటిన చెట్టును మీరే నరుక్కుంటున్నారు

- సీపీఐలో ఉంటూ పువ్వాడ అజయ్‌కు ఎలా ప్రచారం చేస్తారు?
- పువ్వాడ నాగేశ్వర్‌రావుకు సీపీఐ నారాయణ బహిరంగ లేఖ



సాక్షి, హైదరాబాద్: ఖమ్మం బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌కు ఆయన తండ్రి, సీపీఐ నేత పువ్వాడ నాగేశ్వర్‌రావు మద్దతు పలుకుతూ వివిధ రకాలుగా ప్రచారం చేయడంపై సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు పువ్వాడ నాగేశ్వర్‌రావుకు శనివారం ఆయన బహిరంగ లేఖ రాశారు. 'మీకు ఇలాంటి ఉత్తరం ఎప్పుడో రాయాల్సి ఉన్నా మీ గత చరిత్ర, మీరు పార్టీకి చేసిన సేవరీత్యా మనసంగీకరించక రాయలేదు. ఇంకా భరించడం నా వల్ల కాదు'అని నారాయణ ఆ లేఖలో పేర్కొన్నారు. 'మీ కుమారుడు అజయ్‌కుమార్ రాజకీయాలలో చురుకైన పాత్ర వహించింది మొదలు మీలో మౌలిక మార్పులు వచ్చాయి. మీరు సీపీఐలో ప్రముఖ పాత్ర వహించారు. రాష్ట్ర రాజకీయాలలో క్రియాశీల పాత్ర పోషించారు. ఖమ్మం జిల్లాలో సీపీఐని ఉన్నత స్థాయికి తెచ్చారు. మీరు ఏ సభలకు వచ్చినా పార్టీ మిమ్మల్ని గౌరవంగా చూస్తుంది. చివరకు ఖమ్మం జిల్లా సీపీఐ కార్యాలయం ముందు కూడా మీ ఫ్లెక్సీ నేటికీ ఉంది. ఇంత గౌరవం పొందిన మీరు సీపీఐకి ఇస్తున్న మర్యాద ఏది? మీ అబ్బాయి రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత ప్రతి సందర్భంలోనూ మీ కుమారుడిని సమర్థించారు తప్ప, సీపీఐ తీసుకున్న విధానాలను బహిరంగంగా సమర్థించలేదు. తాజాగా కొత్తగూడెం స్థానాన్ని కాంగ్రెస్ సీపీఐకి కేటాయిస్తే అక్కడ పార్టీ తరఫున రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావును పోటీకి పెట్టింది. కనీస మర్యాదకైనా కొత్తగూడెం స్థానం బలపడే విధంగా ఈ ఎన్నికల్లో సీపీఐ విధానాన్ని సమర్థిస్తూ ఒక ప్రకటన చేయకపోగా, ఏ పద్ధతుల్లోనూ మీరు సమర్థించలేదు. మీ కుమారుడు, బీఆర్‌ఎస్ అభ్యర్థి అజయ్‌కుమార్‌ను బలపరుస్తూ వివిధ పద్ధతుల్లో ప్రచారం చేశారు'అని నారాయణ విమర్శించారు. 'మీరు నాటిన చెట్టుని నరుక్కుంటున్నారు. మీకు మీరు నరుక్కుంటే నాకు అభ్యంతరం లేదు. పార్టీ కార్యకర్తలను, పార్టీ ప్రభావాన్ని కించపరచకండి. జిల్లా పార్టీ కార్యాలయం ముందున్న మీ ఫ్లెక్సీని మీరే తీయించేసుకోండి'అని నారాయణ హితవు పలికారు.



మన పాపములను మనము ఒప్పుకొనిన యెడల,
ఆయన నమ్మదగినవాడును నీతిమంతుడును గనుక ఆయన మన
పాపములను క్షమించి సమస్త దుర్నీతి నుండి మనలను పవిత్రులనుగా చేయును.
– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు కార్తీక మాసం, **తిథి:** బ.షష్ఠి సా.6.23 వరకు, తదుపరి సప్తమి, **నక్షత్రం:** ఆశ్లేష రా.9.24 వరకు, తదుపరి మఖ, **వర్జ్యం:** ఉ.9.08 నుండి 10.52 వరకు, **దుర్ముహూర్తం:** ప.3.56 నుండి 4.44 వరకు, **అమృతఘడియలు:** రా.7.38 నుండి 9.23 వరకు.

సూర్యోదయం : 6.18
సూర్యాస్తమయం : 5.20
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

రాహుల్ గాంధీ (కాంగ్రెస్ ఎంపీ)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

కౌంటింగ్ మొదలైంది.

ముందే తెలిసిపోయిన ఎన్నికల ఫలితాల కోసం టీవీ ముందు కూర్చోవడంలో మజా ఏం ఉంటుంది?

కానీ ఖర్గేజీ అంటారూ... కొన్నిసార్లు తెలిసిన విషయాన్నే మళ్లీ మళ్లీ తెలుసుకోవడంలో కూడా మజా ఉంటుందని!!

"అలా నాకేమీ అనిపించదు ఖర్గేజీ! ఒకసారి చూసిన ప్రదేశాన్ని చూడటంలో నాకెలాంటి ఆసక్తీ ఉండదు. ఎందుకంటే దాని గురించి నాకు తెలిసిపోయి ఉంటుంది కనుక..." అన్నాను.

"ప్రదేశాలు వేరు, ఫలితాలు వేరు రాహుల్‌బాబు..." అన్నారు ఖర్గేజీ.

"నేను ప్రదేశాల గురించి, ఫలితాల గురించి మాట్లాడ్డం లేదు ఖర్గేజీ! ప్రదేశాలైనా, ఫలితాలైనా... అవి 'ముందే తెలిసి ఉండటం" గురించి మాట్లాడుతున్నాను" అన్నాను.

నేను ఆ మాట అన్న తర్వాత ఆయన మరేమీ మాట్లాడలేదు!

ఐదు రాష్ట్రాల్లోనూ కాంగ్రెస్ ఆధిక్యంలో ఉన్నట్లు ఫలితాలు వస్తున్నాయి. ఆ ఫలితాలను



ఖర్గేజీ నిశితంగా గమనిస్తున్నారు! నాకైతే బయటికి వెళ్లి తృప్తిగా ఏదైనా తిని రావాలని, స్వేచ్ఛగా ఎక్కడైనా ఎగిరి రావాలని ఉంది.

"ఖర్గేజీ... కాకరకాయలు, పచ్చి బఠాణీలు, పాలకూర మీకు ఇష్టమేనా?" అని అడిగాను.

"బాగుంటాయి కదా..." అన్నారు నవ్వుతూ ఆయన!

"ఆ మూడూ తప్ప ఈ లోకంలో తయారయ్యే ఏ పదార్థాన్నైనా నేను ఇష్టంగా తింటాను ఖర్గేజీ! మీ నిశితమైన గమనింపు టీవీలో వస్తున్న ఫలితాల మీద కాకుండా నా మీద ఉండి ఉంటే కనుక మీరొక సంగతిని కనిపెట్టి ఉండేవారు. డైనింగ్ టేబుల్ మీద ఇష్టం లేని కూరల్ని చూస్తూ కూర్చున్నట్లుగా, టీవీలో కౌంటింగ్ ఫలితాలను నేను ఇష్టం లేకుండా చూస్తూ కూర్చున్నానని..." అన్నాను.

ఖర్గేజీ నవ్వారు.

"మరి అలా వెళ్లొస్తారా రాహుల్ బాబూ! మరీ దూరంగా వెళ్లిపోకుండా త్వరగా వచ్చేయండి. దగ్గర మీరుండాలి..." అన్నారు.

బయటికి వచ్చాక ఒక్కక్షణం నిలబడ్డాను. నిలబడి ఆలోచించాను.

'మరీ దూరంగా వెళ్లిపోకండి. దగ్గర మీరుండాలి...' అని ఖర్గేజీ ఎందుకు అన్నట్లు?!

సీఎంల సర్దుబాటు కోసమా?!

రాజస్థాన్‌లో ఎలాగూ మళ్లీ కాంగ్రెస్సే వస్తుంది. ఆ వెంటనే.. సీఎంగా అశోక్ గెహ్లోతా, సచిన్ పైలటా అనే సమస్య వస్తుంది.

తెలంగాణలో తొలిసారి కాంగ్రెస్ రాబోతోంది. దాంతోపాటే సీఎంగా రేవంత్ రెడ్డా, భట్టి విక్రమార్కా, వాళ్లిద్దరూ కాకుండా టి. జీవన్‌రెడ్డా అనేది సమస్య కాబోతుంది.

మధ్యప్రదేశ్‌లో సగం టర్మ్‌లో జ్యోతిరాదిత్య కాంగ్రెస్ నుంచి బీజేపీలోకి వెళ్లిపోయి కమల్‌నాథ్ ప్రభుత్వాన్ని అక్రమంగా పడగొట్టాడన్న కోపంతో రగిలిపోతున్న ప్రజలంతా మొన్న ఓట్లన్నీ కాంగ్రెస్‌కే వేసి ఉంటారు. కనుక కమల్‌నాథే సీఎం అవుతారు. ఒకవేళ జ్యోతిరాదిత్య, ఆయన టీమ్ తిరిగి కాంగ్రెస్‌లోకి వచ్చేస్తామంటే మాత్రం వాళ్లను తీసుకోవాలా, వద్దా అనేది సమస్య కావచ్చు.

ఛత్తీస్‌గఢ్‌లో మళ్లీ కాంగ్రెస్సే వస్తుంది. బాఘేల్‌కు ముందు పదిహేనేళ్లు బీజేపీ సీఎంగా ఉన్న రమణ్‌సింగ్ ఛత్తీస్‌గఢ్‌కు చేసిందేమీ లేదు కనుక కాంగ్రెస్‌దే విజయం. సీఎంగా మళ్లీ బాఘేలేనా, లేక టీఎస్ సింగ్‌దేవా అనే సమస్యైతే వస్తుంది.

మిజోరమ్‌లో బీజేపీ ఎప్పుడూ లేదు. ఇప్పుడూ ఉండదు. ఉంటే కాంగ్రెస్. లేకుంటే మిజో నేషనల్ ఫ్రంట్. జోరంతంగాపై కేసులున్నాయి. కరప్షన్ ఛార్జీలున్నాయి. కాబట్టి ఈసారి కాంగ్రెస్‌దే గవర్నమెంట్. సీఎం లాల్సవతానా, లేక రాల్టేనా అన్నది సమస్య కావచ్చు.

ఐదు రాష్ట్రాల విజయాలతో పాటుగా వచ్చే ఐదు రాష్ట్రాల సమస్యల్ని పరిష్కరించడానికే 'దగ్గర మీరుండాలి' అని ఖర్గేజీ అన్నారా?

ఎమ్మెల్యే... ఓ ఎమ్మెల్యే!



జనతంత్రం

వర్ధెల్లి మురళి

అధికారికంగా ఓట్ల లెక్కింపు పూర్తి కాకుండానే ఫలితాలపై కామెంట్ చేయడం న్యాయం కాకపోవచ్చు. కాకపోతే దేశంలో ఎగ్జిట్ పోల్ అనే ప్రక్రియ క్రమంగా శాస్త్రీయతను సంతరించుకుంటున్నది. చిన్నాచితకా ఔత్సాహిక సంస్థలను, రాజకీయ ప్రయోజనం కోసం చేయించుకునే సర్వేలను మినహాయిస్తే, దేశంలో ప్రముఖ సంస్థలు చేసిన ఎగ్జిట్ పోల్స్ ఎక్కువ సందర్భాల్లో నిజమయ్యాయి. అలా నిజమైన సందర్భాల్లో కూడా ట్రెండ్‌ను మాత్రమే సూచించగలుగుతున్నాయి కానీ సీట్ల సంఖ్యను కచ్చితంగా అంచనా వేయడంలో ఇంకా పరిపూర్ణత రాలేదు.

మెజారిటీ స్థానిక ఏజెన్సీలతో పాటు ప్రముఖ జాతీయ ఏజెన్సీలు కూడా ఈసారి తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ విజయాన్ని సంశయాతీతంగా ప్రకటిస్తున్నాయి. ఏబీపీ – సీ వోటర్, జన్ కీ బాత్‌లు 60 స్థానాలకు పైగా కాంగ్రెస్ గెలుస్తుందని అంచనా వేస్తే, ఇండియాటుడే – మై యాక్సిస్, టైమ్స్ నౌ- ఈటీజీ, ఇండియా టీవీ – సీఎన్‌ఎన్, టుడేస్ చాణక్య తదితర సంస్థలు ఈ సంఖ్య 70 దాకా వెళ్లొచ్చని ఊహిస్తున్నాయి. సమాజంలో గొంతు విప్పే స్వభావం వున్న ప్రభావ వర్గాల్లో ప్రభుత్వ వ్యతిరేకత గత కొంతకాలం నుంచి స్పష్టంగానే కనిపిస్తూ వచ్చింది. అయితే ఈ వ్యతిరేకత పాటక వర్గాల్లో, కింది సెక్షన్లలో ఉండకపోవచ్చనే అభిప్రాయం ఉండేది. రైతుబంధు, ఇతర సంక్షేమ కార్యక్రమాలు అందుకు కారణం కావచ్చు.

ఎగ్జిట్ పోల్స్ ఇస్తున్న సంకేతాల ప్రకారం ప్రభావ వర్గాలు, పాటక వర్గాలు అనే తేడా లేకుండా ప్రభుత్వ వ్యతిరేకత అంతటా ఆవరించినట్టు అర్థం చేసుకోవాలి. మెజారిటీ ఓటర్లు మార్పు కోరుకున్నట్టు కనిపిస్తున్నది. ప్రభుత్వానికి అనుకూలంగా నలభై శాతం కంటే తక్కువ మంది, వ్యతిరేకంగా అరవై శాతం కంటే ఎక్కువ మంది ఓటేసినట్టు అంచనాలు వెలువడ్డాయి. ఈ అంచనాలు ఎంతమేరకు వాస్తవమో ఆదివారం మధ్యాహ్నం కల్లా తేలిపోతుంది. గడిచిన కొంతకాలంగా ప్రభావ వర్గాల్లో బహిరంగంగా వ్యక్తమవుతున్న అసమ్మతికి, పాటక వర్గాల్లో మౌనంగా గూడుకట్టుకుంటున్న అసంతృప్తికి బలమైన కారణాలే కనిపిస్తున్నాయి.

సామాన్య జనం సంగతి దేవుడెరుగు, ప్రజాప్రతినిధులకు కూడా ముఖ్యమంత్రి దర్శనం దుర్లభమన్న ప్రచారం బాగా వ్యాపించింది. ప్రజాస్వామ్య ప్రియులెవరికీ ఇది రుచించలేదు. రాష్ట్రంలో పరిపాలనంతా ఒక్క కుటుంబం చేతిలోనే కేంద్రీకృతమైందన్న ఆరోపణలను జనం బాగా నమ్ముతున్నారు. తెలంగాణ ఏర్పడితే విద్యాధికులందరికీ ప్రభుత్వ ఉద్యోగాలు దొరుకుతాయని బలహీన వర్గాలకు చెందిన వారు బాగా ఆశలు పెట్టుకున్నారు. వారి ఆంకాంక్షల మేరకు ప్రభుత్వం కొలువుల్ని భర్తీ చేయలేదనే అసంతృప్తి చాలా కాలంగా వ్యక్తమవుతున్నది. ధరణి పోర్టల్ వలన క్షేత్రస్థాయిలో ఏర్పడిన ఇబ్బందులను, సమస్యలను గుర్తించడంలో రాష్ట్ర యంత్రాంగం విఫలమైనట్టు కనిపిస్తున్నది.

ఇటువంటి సమస్యలు ఒక ఎత్తయితే, క్షేత్రస్థాయిలో అవినీతి, ఎమ్మెల్యేల 'విశ్వరూపం' మరో ఎత్తు. ముప్పయ్ మందికి పైగా ఎమ్మెల్యేలపై (వారిలో కొందరు మంత్రులు) ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉన్నదనే సమాచారాన్ని విస్మరించి వారందరికీ టిక్కెట్లను కేటాయించడం వల్ల పాలక పార్టీకి భారీ నష్టం జరిగి ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. వీరంతా వరసగా రెండోసారి ఎన్నికయ్యారు. తొలివిడత పదవీకాలంలో ఇంత తీవ్రస్థాయి ఆరోపణలు రాలేదు. రెండోసారి ఎన్నికైన తర్వాత వారు జూలు విదిల్చారు. మండలస్థాయి ఉద్యోగులు, అధికారుల పోస్టింగులు, బదిలీలు అన్నీ ఎమ్మెల్యేల కనుసన్నల్లోనే! కొందరు ఘనాపాఠీలు జిల్లాస్థాయి పోస్టింగుల్లోనూ చక్రాలు, బొంగరాలు తిప్పగలిగారు. ఈ పోస్టింగులకు ఒక రేట్ల పట్టిక

మెజారిటీ స్థానిక ఏజెన్సీలతో పాటు ప్రముఖ జాతీయ ఏజెన్సీలు కూడా ఈసారి తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ విజయాన్ని సంశయాతీతంగా ప్రకటిస్తున్నాయి. ఏబీపీ – సీ వోటర్, జన్ కీ బాత్‌లు 60 స్థానాలకు పైగా కాంగ్రెస్ గెలుస్తుందని అంచనా వేస్తే, ఇండియాటుడే – మై యాక్సిస్, టైమ్స్ నౌ- ఈటీజీ, ఇండియా టీవీ – సీఎన్‌ఎన్, టుడేస్ చాణక్య తదితర సంస్థలు ఈ సంఖ్య 70 దాకా వెళ్లొచ్చని ఊహిస్తున్నాయి. సమాజంలో గొంతు విప్పే స్వభావం వున్న ప్రభావ వర్గాల్లో ప్రభుత్వ వ్యతిరేకత గత కొంతకాలం నుంచి స్పష్టంగానే కనిపిస్తూ వచ్చింది. అయితే ఈ వ్యతిరేకత పాటక వర్గాల్లో, కింది సెక్షన్లలో ఉండకపోవచ్చనే అభిప్రాయం ఉండేది. రైతుబంధు, ఇతర సంక్షేమ కార్యక్రమాలు అందుకు కారణం కావచ్చు.

ఎగ్జిట్ పోల్స్ ఇస్తున్న సంకేతాల ప్రకారం ప్రభావ వర్గాలు, పాటక వర్గాలు అనే తేడా లేకుండా ప్రభుత్వ వ్యతిరేకత అంతటా ఆవరించినట్టు అర్థం చేసుకోవాలి. మెజారిటీ ఓటర్లు మార్పు కోరుకున్నట్టు కనిపిస్తున్నది. ప్రభుత్వానికి అనుకూలంగా నలభై శాతం కంటే తక్కువ మంది, వ్యతిరేకంగా అరవై శాతం కంటే ఎక్కువ మంది ఓటేసినట్టు అంచనాలు వెలువడ్డాయి. ఈ అంచనాలు ఎంతమేరకు వాస్తవమో ఆదివారం తేలిపోతుంది.

కూడా ఉంటుందనేది బహిరంగ రహస్యంగా మారింది. పైగా సదరు అధికారులందరూ ఎమ్మెల్యేల ఆదేశాల మేరకే పని చేయాల్సి ఉంటుంది. వారి పైన ఉండే శాఖాసంబంధిత ఉన్నతాధికారులందరూ నిమిత్తమాత్రులుగా మిగిలారు.

అధికారులు జేబుల్లో ఉండటంతో ఈ ప్రజా ప్రతినిధులు భూ వివాదాల్లో తలదూర్చారు. కారుచౌకగా కాజేసి బినామీ పేర్లతో రియల్ ఎస్టేట్ వెంచర్లు కూడా వేశారు. మంజీరా నుంచి మూసీ దాకా దేన్నీ వదలకుండా వందల కోట్ల విలువైన 'తైలాన్ని' పిండుకున్నారని ఆరోపణలు వచ్చాయి. మైనింగ్ దందాలు, రేషన్ బియ్యం రీసైక్లింగ్ దందాలు, కస్టమ్ మిల్లింగ్ బియ్యాన్ని భోంచేయడం వగైరా వ్యాపకాలను కొందరు ఎమ్మెల్యేలు చేపట్టారు. చివరికి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'దళిత బంధు' పథకంలోనూ బహిరంగంగానే కమీషన్లు కొట్టేసిన ప్రబుద్ధులున్నారు.

కొందరు ఎమ్మెల్యేలు ధరణిలోని లోటుపాట్లను ఆసరా చేసుకొని నిషేధిత జాబితాలోని భూములు, అసైన్డ్ భూములను భారీగా కొనుగోలు చేశారు. చెరువుశిఖం భూములు, కాందిశీకుల భూములను కూడా కొల్లగొట్టి కళ్లముందే కోట్లకు పడగెత్తారు. దేశంలో అతి కొద్దిమంది శ్రీమంతుల దగ్గర ఉండే విలాసవంతమైన వాహనాలను కొందరు ప్రజాప్రతినిధుల లగ్జరీ విల్లాల్లో మనం చూడవచ్చు. కొండలను అక్రమంగా పిండి చేసుకున్న అమాత్యుడొకరు, బండలను అక్రమంగా తరలించుకున్న అమాత్యుడొకరు, భూదందాలకు సహకరించని ఇద్దరు కలెక్టర్లనే శంకరగిరి మాన్యాలు పట్టించిన అమాత్యులు, కొత్త జిల్లాలకు కార్యాలయాల పేరుతో భూ దందాలు చేసిన అమాత్యులు... వీరికి ఏమాత్రం తీసిపోని ఇంకో పాతికమందికి పైగా ఎమ్మెల్యేలు ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీసినట్టు వినిపిస్తున్నది.

తీవ్రమైన ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలందరికీ మళ్లీ టిక్కెట్లు కేటాయించాలని నిర్ణయించడం కేసీఆర్ చేసిన అతి పెద్ద పొరపాటుగా పరిశీలకులు భావిస్తున్నారు. కనీసం 30 స్థానాల్లో కొత్తవారినీ, యువతరాన్నీ, క్లీన్ ఇమేజ్ గలవారినీ పరిచయం చేసి ఉన్నట్లయితే కచ్చితంగా మెరుగైన ఫలితాలను అధికార పార్టీ సాధించి ఉండేదనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. రెండుసార్లు గెలిస్తేనే తరాలకు సరిపోయేంత పోగేసిన వాళ్లను మూడోసారి ఎన్నుకోవడం పట్ల ప్రజలు విముఖత చూపినట్టు ట్రెండ్‌ను బట్టి అర్థమవుతున్నది. ఎన్నికల ప్రచారం సమయంలో కూడా ఇది వ్యక్తమైంది.

అసలు ఎమ్మెల్యేలకున్న అధికారాలేమిటి? విధులేమిటి అన్న అంశంపై విస్తృతమైన చర్చ జరగవలసిన అవసరం ఏర్పడింది. రాజ్యాంగం ప్రకారం కేంద్రానికీ, రాష్ట్రాలకూ చట్టాలు చేసే అంశాలపై రెండు ప్రత్యేక జాబితాలున్నాయి. ఒక ఉమ్మడి జాబితా ఉన్నది. రాష్ట్ర జాబితాలోని అంశాలు, లేదా ఉమ్మడి జాబితాలోని అంశాలపై శాసన సభలు చట్టాలు చేస్తాయి. ఈ క్రమంలో సదరు అంశంపై క్షుణ్ణమైన అధ్యయనం చేసి ఎమ్మెల్యేలు చర్చల్లో పాల్గొనాలి. మెజారిటీ పార్టీ ఎమ్మెల్యేలు తమలో ఒకరిని నాయకునిగా ఎన్నుకొంటే ఆ వ్యక్తి ముఖ్యమంత్రి అవుతారు. రాష్ట్రపతి ఎన్నికలో కూడా ఎమ్మెల్యే వోటర్‌గా ఉంటారు. రాజ్యాంగబద్ధంగా ఎమ్మెల్యేకు ఇంతకు మించిన అధికారాల్లేవు.

కొందరు ఎమ్మెల్యేలు ధరణిలోని లోటుపాట్లను ఆసరా చేసుకొని నిషేధిత జాబితాలోని భూములు, అసైన్డ్ భూములను భారీగా కొనుగోలు చేశారు. చెరువు శిఖం భూములు, కాందిశీకుల భూములను కూడా కొల్ల గొట్టి కళ్లముందే కోట్లకు పడగెత్తారు. దేశంలో అతి కొద్దిమంది శ్రీమంతుల దగ్గర ఉండే విలాసవంతమైన వాహనాలను కొందరు ప్రజాప్రతినిధుల లగ్జరీ విల్లాల్లో మనం చూడవచ్చు. కొండలను అక్రమంగా పిండి చేసుకున్న అమాత్యుడొకరు, బండలను అక్రమంగా తరలించుకున్న అమాత్యుడొకరు, భూదందాలకు సహకరించని ఇద్దరు కలెక్టర్లనే శంకరగిరి మాన్యాలు పట్టించిన అమాత్యులు, కొత్త జిల్లాలకు కార్యాలయాల పేరుతో భూ దందాలు చేసిన అమాత్యులు... వీరికి ఏమాత్రం తీసిపోని ఇంకో పాతికమందికి పైగా ఎమ్మెల్యేలు ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బ తీసినట్టు వినిపిస్తున్నది.

తీవ్రమైన ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలందరికీ మళ్లీ టిక్కెట్లు కేటాయించాలని నిర్ణయించడం కేసీఆర్ చేసిన అతి పెద్ద పొరపాటుగా పరిశీలకులు భావిస్తున్నారు. కనీసం 30 స్థానాల్లో కొత్త వారినీ, యువతరాన్నీ, క్లీన్ ఇమేజ్ గలవారినీ పరిచయం చేసి ఉన్నట్లయితే కచ్చితంగా మెరుగైన ఫలితాలను అధికార పార్టీ సాధించి ఉండేదనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. రెండుసార్లు గెలిస్తేనే తరాలకు సరిపోయేంత పోగేసిన వాళ్లను మూడోసారి ఎన్నుకోవడం పట్ల ప్రజలు విముఖత చూపినట్టు ట్రెండ్‌ను బట్టి అర్థమవుతున్నది. ఎన్నికల ప్రచారం సమయంలో కూడా ఇది వ్యక్తమైంది.

తన నియోజకవర్గంలోని ప్రజా సమస్యలను శాసనసభ ద్వారా మంత్రివర్గం దృష్టికి తీసుకొని వెళ్లవచ్చు. అధికార యంత్రాంగం ద్వారా ఆ సమస్య పరిష్కారం కావాలి. ఒక వంతెనగానీ, రోడ్డును గానీ ప్రభుత్వం మంజూరు చేస్తే ప్రభుత్వం తన శాఖల ద్వారా దానిని నిర్మించే ఏర్పాటు చేయడం విధాయకం. కానీ ప్రస్తుతం మన ఎమ్మెల్యేలు పనిని శాంక్షన్ చేయించుకోవడం దగ్గర్నుంచి కాంట్రాక్టర్‌ను నియమించి కమీషన్ వసూలు చేసుకునే వరకు దూసుకొని పోతున్నారు. సంతకాలు చేయడం వరకే అధికారుల పని! కళ్ల ముందు రాజకీయ అవినీతి కనిపిస్తున్నప్పుడు అధికారుల సంతకాలు ఊరికే రావు కదా! ఆ సంతకాలకూ ఓ లెక్కుంటుంది!!

ఎమ్మెల్యే నియోజక వర్గాలకు సమాంతరంగా ఉన్న పంచాయితీ సమితుల స్థానంలో ఐదారు చిన్న చిన్న మండలాలు రావడం కూడా ఎమ్మెల్యేలకు కలిసొచ్చింది. నియోజక వర్గంలో ఓ మినీ ముఖ్యమంత్రిగా అవతరించాడు. తన పరిధిలో ఒక పోలీస్ ఇన్‌స్పెక్టర్‌ను బదిలీ చేయాలన్నా, పోస్టింగ్ ఇవ్వాలన్నా ఆ శాఖ అత్యున్నత అధికారి డీజీపీ మాట కంటే ఎమ్మెల్యే మాటే చెల్లుబాటు అవుతున్నది. ఇది ఆరోగ్యకరమైన సంప్రదాయ మేనా? వ్యవస్థలు నిర్వీర్యం కావా? ధర్మోరక్షతి రక్షితః అంటారు. ఎమ్మెల్యేలనైనా, ఇంకెవరినైనా వారి చట్టబద్ధమైన అధికారాలకు, విధులకు పరిమితం చేస్తేనే వ్యవస్థలు ప్రజలకు నిష్పాక్షిక సేవలు అందించగలుగుతాయి. రాజకీయ పార్టీలు వాటి రాజకీయ అవసరాల కోసం ఎమ్మెల్యేలను శక్తిమంతులుగా మార్చి ఉండవచ్చు.

సర్వాధికారాల అండతో ఆ వ్యక్తి చెలరేగిపోయి పదవిని తన వంశపారంపర్య హక్కుగా భావిస్తున్నారు. దాన్ని నిలుపుకోవడం కోసం కోట్ల రూపాయలు వెదజల్లుతున్నారు. తెలంగాణ ఎన్నికల్లో కొందరు అధికార పార్టీ ఎమ్మెల్యేలు 70 నుంచి 80 కోట్ల వరకు ఖర్చు చేసినట్టు వార్తలు వస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో నిబద్ధత కలిగిన ప్రజాసేవకులు రాజకీయాల్లో నిలబడగలరా? కోట్లు వెదజల్లినవాడు ప్రజాకంటకునిగా మారకుండా ఉంటాడా? అలాంటి వారికి మూడోసారి నాలుగోసారి టిక్కెట్ ఇస్తే సదరు పార్టీకి గుదిబండగా మారడమే కాదు, ప్రజాస్వామ్యానికీ ప్రమాదకరంగా తయారవుతారు. అప్రతిష్ఠ మూటగట్టుకున్న ఎమ్మెల్యేలు ఈసారి అధికార పార్టీని ముంచుతారో, గట్టెక్కిస్తారో ఆదివారం మధ్యాహ్నానికి తేలిపోతుంది.

vardhelli1959@gmail.com

చేసిన బాసలు చెదిరిపోతే ఎలా?

విశ్లేషణ




లావణ్యా రాజమణి

ఐక్యరాజ్య సమితి సమావేశం (కాప్-28) ఇంకోటి దుబాయ్‌లో నవంబరు 30వ తేదీ మొదలైంది. 'కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్' (కాప్) అని పిలుస్తున్న ఈ సమావేశాలు భూమిని వాతావరణ మార్పుల ప్రభావం నుంచి రక్షించుకునే ఉద్దేశంతో నిర్వహిస్తున్నవి. ఇప్పటివరకూ తీసుకున్న నిర్ణయాలూ, వాటి అమలు వంటి అంశాలపై ప్రపంచదేశాలన్నీ కూర్చుని సమీక్షిస్తారిక్కడ. మూడు దశాబ్దాలుగా వాతావరణ మార్పులపై జరుగుతున్న చర్చల పుణ్యమా అని ఇప్పటివరకూ మూడు అంతర్జాతీయ చట్టాలు ఏర్పాటయ్యాయి. ఇందులో ఒకటి 2015 నాటి 'ప్యారిస్ ఒప్పందం'. అత్యవసరంగా పరిష్కార చర్యలు తీసుకోవాలన్న నిర్ణయాలు కోకొల్లలు. అన్నింటి లక్ష్యం మాత్రం ఒక్కటే. సురక్షితమైన భూమి!

ఈ మధ్యే విడుదలైన 'యూఎన్‌ఈపీ గ్యాప్ రిపోర్ట్' కూడా ప్యారిస్ ఒప్పందంలో భాగంగా దేశాలు చేసిన వాగ్దానాలన్నీ నెరవేరినా భూమి సగటు ఉష్ణోగ్రతలు లక్ష్యంగా నిర్ణయించుకున్న 1.5 డిగ్రీ సెల్సియస్‌గా కాకుండా 2.9 డిగ్రీ సెల్సియస్‌కు చేరతాయని చెప్పడం ఆందోళనకరం. 2021 నాటి 'గ్లాస్ గో' సమావేశాల్లోనూ సగటు ఉష్ణోగ్రతలను 1.5 డిగ్రీ సెల్సియస్‌కు పరిమితం చేస్తామని ప్రపంచం ప్రతిన బూనింది! షరతుల్లేని వాగ్దానాల విషయానికి వస్తే... ఇవి కూడా పూర్తిస్థాయిలో అమలైన పక్షంలో ఉష్ణోగ్రత పెరుగుదల అనేది 2.5 డిగ్రీ సెల్సియస్‌కు పరిమితమయ్యే అవకాశం ఉంది. ఐపీసీసీ 2022 నాటి నివేదిక కూడా దేశాల ఆర్థికసాయంలో మూడు నుంచి ఆరు రెట్లు తక్కువగా అందినట్లు చెప్పడం ఇక్కడ ప్రస్తావించాల్సిన అంశం. భూమి సగటు ఉష్ణోగ్రతలు 2.9 డిగ్రీ సెల్సియస్‌కు పెరగ డమంటే భూమిని కాష్ఠం చేసినట్లే! ప్రకృతి వ్యవస్థలు చిన్నాభిన్నమవుతాయి. ఫలితంగా ఎన్నో ప్రకృతి ఉపద్రవాలకు బీజం పడుతుంది. పైగా రికార్డుల్లో ఎన్నడూ లేనంత ఎక్కువ ఉష్ణోగ్రతలు ఈఏడాదే నమోదయ్యాయి. ఈ పరిస్థితులన్నింటి నేపథ్యంలోనే దుబాయ్‌లో మొదలైన కాప్-28కు ప్రాధాన్యం మరింత పెరిగింది. పరిస్థితిని చక్కదిద్దేందుకు ఏదైనా శంఖనాదం చేస్తుందా అని ప్రపంచం ఎదురు చూస్తోంది.

వాతావరణ మార్పులను ఎదుర్కోవాలంటే కేవలం చర్చలు సరిపోవు. ప్యారిస్ ఒప్పందం ఏకాభిప్రాయంపై ఏర్పడని కారణంగా... నిర్ణయాలు తీసుకునే విషయంలో సరైన వ్యవస్థ లేకపోవడం వల్ల మనం అనుకున్నంత వేగంగా పురోగతి సాధించలేకపోయాం. ఈ ఒప్పందంలో కేవలం కొన్ని వాగ్దానాలూ, ఒప్పందాలు మాత్రమే ఉన్నాయి. కొంత వినూత్నంగా ఆలోచించ గలిగితే ఇంతకంటే అద్భుతమైన ఫలితాలు సాధించవచ్చునని అప్పట్లోనే చాలామంది నిపుణులు చెప్పుకొచ్చారు కానీ పట్టించు కున్నది కొందరే! ఏదో ప్రజల ఆందోళనను కొంత నెమ్మదింప జేసేందుకా అన్నట్లు గొప్ప గొప్ప ప్రకటనలైతే జారీ అయ్యాయి. ఈ ప్రకటనలు మఖలో వచ్చి పుబ్బలో పోయే రకాలు.

2021లో జరిగిన గ్లాస్‌గో సమావేశాల్లో... 'దశల వారీగా బొగ్గు వాడకాన్ని తగ్గించాలి' అని ఒక నిర్ణయం తీసుకున్నారు. మొత్తంగా తొలగించాలన్న విషయానికి భారత్ అభ్యంతరం తెలిపింది. ఫలితంగా దశలవారీగా అన్న పదం వచ్చి చేరింది. అయితే భారత్‌లోనే కాదు... చాలా దేశాల్లోనూ బొగ్గు వాడకం తగ్గనూ లేదు. పూర్తిగా నిలిచిపోనూ లేదు. వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించేందుకు తీసుకునే చర్యలు ప్రభావవంతంగా ఉండాలంటే దానికి సర్వతోముఖ ప్రయత్నాలు అవసరం. భాగస్వాములందరూ కలిసికట్టుగా పని చేయాల్సి ఉంటుంది. కాబట్టి ఐరాస చర్చలు ఈ



అంశంపై నియమ నిబంధనలను ఖరారు చేయడంపై దృష్టి పెట్టడం మంచిది. దుబాయిలో జరిగే చర్చలు మన లక్ష్యానికి సంబంధించిన స్పష్టమైన మార్గాన్ని నిర్దేశించాలి.

దుబాయ్‌లో జరుగుతున్న కాప్-28 సమావేశాల్లో మొట్టమొదటిసారి ప్రపంచవ్యాప్త వాతావరణ పరిస్థితిపై తాజా సమీక్ష ఒకటి చేపట్టనున్నారు. 'గ్లోబల్ స్టాక్ టేక్' ద్వారా ప్యారిస్ ఒప్పందం అమలు విషయంలో ఇప్పటికి మనం సాధించింది ఏమిటి? సాధించాల్సింది ఏమిటన్న స్పష్టమైన అవగాహన ఏర్పడుతుందన్నమాట. ఈ ఏడాది సెప్టెంబరులో దీనికి సంబంధించిన నివేదికలు సిద్ధమయ్యాయి. ఆశయాలకు, ఆచరణకు మధ్య అంతరాన్ని విస్పష్టంగా ఈ నివేదికల్లో పేర్కొన్నారు.

కాప్-28 ఇంకో ముందడుగు వేసి ప్రపంచం నిర్దేశిత లక్ష్యానికి దూరంగా ఉన్న విషయాన్ని స్పష్టం చేయాలి. ప్రస్తుత వాగ్దానాలు సరిపోవని, ఆర్థిక సహకారం తగినంత అందని నేపథ్యంలో వీటి అమలు కూడా అసాధ్యమన్న విషయాన్ని సుస్పష్టం చేయాలి.

కాప్-28 ద్వారా ప్రపంచానికి అందించాల్సిన సందేశం ఇంకోటి కూడా ఉంది. కర్బన ఉద్గారాల తగ్గింపు, అందుకు సంబంధించిన లక్ష్యాలను నిర్దేశించడంపై ఎక్కువ దృష్టి పెట్టకపోవడం మంచిది. ఎందుకంటే గతంలో కాప్ సమావేశాలు మిగిలిన విషయాలను పక్కనబెట్టి కేవలం ప్రజల నుంచి వస్తున్న ఒత్తిడిని తట్టుకునేందుకన్నట్లు భారీ భారీ లక్ష్యాలు ప్రకటించి చతికిలబడ్డాయి కాబట్టి! ఈ లక్ష్యాలకు అంతర్జాతీయ ఆర్థిక, సాంకేతిక పరిజ్ఞాన, మానవ వనరుల పరమైన సాయం లభించినప్పుడు మాత్రమే వాస్తవంగా అమలు చేయడం సాధ్యమవుతుంది.

వాతావరణ మార్పులను తట్టుకునేందుకు చేయాల్సిన పనుల విషయంలోనూ కొంచెం పట్టువిడుపు ధోరణి అవసరం. మరింత కఠినమైన లక్ష్యాలను నిర్దేశించుకోవడం కంటే సంప్రదాయేతర ఇంధన వనరుల వాడకాన్ని పెంచాలని, ఇంధన సామర్థ్యాన్ని పెంచుకోవాలని కాప్-28 వేదికగా పిలుపునివ్వాలి. దీనికీ శిలాజ ఇంధనాల వాడకం తగ్గేందుకూ మధ్య పొంతన కుదిరేలా చూడాలి. అంటే.. లక్ష్యాలను నిర్దేశించడం కాకుండా మార్పు జరిగేందుకు, సక్రమ అమలుకు పూనికగా నిలవాలి అని అర్థం.

దీనికి అదనంగా కాప్-28 బాధ్యతల పంపిణీ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. దేశాల అంతర్గత లక్ష్యాలు కావచ్చు. దేశాల మధ్య కావచ్చు అన్నింటి విషయంలో సమదృష్టి పాటించడం అవ సరం. వాతావరణ మార్పుల సమస్యను పరిష్కరించాలంటే వ్యవస్థలకు వ్యవస్థలు మారాల్సి ఉంటుంది. ఇది కొంత విధ్వంసాన్నయితే సృష్టిస్తుంది. దీని ప్రభావం కూడా దిగువ వర్గాలపైనే ఎక్కువగా ఉంటుంది. కాబట్టి ఇటువంటి వారి ప్రయోజనాలు దెబ్బతినకుండా న్యాయమైన, అందరినీ కలుపుకొనిపోయే ఏర్పాట్లు అవసరం. ప్రత్యామ్నాయ జీవనోపాధులతో పాటు తమదన్న భావనను కల్పించడం కీలక మవుతుంది. కాప్-28 సమావేశాల్లో ఏ నిర్ణయం తీసుకున్నా.. వాటి అమలును చురుకుగా పర్యవేక్షించడం ముందుకు తీసుకెళ్లడం ప్రస్తుత తక్షణ కర్తవ్యం కావాలి. ఐక్యరాజ్య సమితి పరిధిలో.. బయట కూడా చేసిన వాగ్దానాలు నెరవేరేలా చూసేందుకు ఒక ప్రణాళిక కూడా అవసరం.


ఇటీవలి కాలంలో ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో ప్రభుత్వాలకు వ్యతిరేకంగా వాతావరణ సంబంధిత వ్యాజ్యాలు దాఖలవుతున్నాయి. అంతర్జాతీయ కోర్టుల్లోనూ హై ప్రొఫైల్ కేసులు విచారణలో ఉన్నాయి. ఇదంతా బాధ్యత ఎవరిదన్న విషయంపైనే! దేశాలు, ఐక్యరాజ్య సమితి కూడా తాము చేసిన వాగ్దానాలు కచ్చితంగా, సంపూర్ణంగా అమలయ్యేలా చూడాలి. తద్వారా మానవాళిని పరిరక్షించాలి.

వ్యాసకర్త ప్రొఫెసర్,
ఇంటర్నేషనల్ ఎన్విరాన్మెంటల్ లా, ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ

పాపపుణ్యాలు

'ఈ ప్రపంచంలో ఎవరూ పాపిగా ఉండటాన్ని కోరుకోరు. కానీ పాపపు పనులే ఎక్కువ చేస్తుంటారు. మనమందరం పుణ్యఫలాన్ని పొందడానికి ఇష్టపడతాం. కానీ పుణ్యకార్యాలు చేయం. అలాగే పాపం చెయ్యడానికి ఎవరూ ఇష్టపడటం లేదు. కానీ కృష్ణా! పాపం చేయడానికి బలవంతంగా ప్రేరేపించేదేది?'' అని అర్జునుడు అడిగాడు.

'అదే అర్జునా, ఆశ! ఆశే చెయ్యకూడనివన్నీ చేయిస్తుంది. ఆశతో ఒకటి పొందడానికి ప్రయత్నిస్తాం. ఎలాగైనాసరే దానిని పొందడానికి ధర్మాధర్మాలను పక్కనపెట్టేస్తాం. ఆ ఆశ నెరవేరడంతోనే అక్కడితో తృప్తి పొందుతామా అంటే లేదు. అగ్నిలో నెయ్యి పోస్తే అది ఆరిపోతుందా... ఇంకా ఇంకా మండుతుంది. అలాగే ఒక ఆశ పూర్తయితే మనసులో ఇంకొక ఆశ పుట్టుకొస్తుంది.' అన్నాడు కృష్ణ పరమాత్మ.



సరే, అలాగైతే ఆశ నెరవేరకుంటే మంచిదని చెప్పుకోవచ్చా. అలాగూ చెప్పలేం. ఆశ నెరవేరకుంటే మనకు ఆక్రోశం వస్తుంది. గోడకు విసిరిన రబ్బరు బంతి తిరిగి వెనక్కు వచ్చినట్టుగా నెరవేరని ఆశ కోపంగా తిరిగొచ్చి మనల్ని పాపంలోకి నెడుతుంది. ఆశకు తర్వాతి దశ క్రోధమని భగవాన్ గీతలో చెప్పారు. అది కూడా ఆశ వల్ల కలిగే ఫలితమే! అలాగైతే పాపం చెయ్యకుండా ఉండటానికి ఉన్న ఏకైక మార్గం ఆశను అంతం చేయడమే! ఇది ఏలా చేయడం. మనం ఏ పనీ చెయ్యకుండా ఉండలేం కదా! శరీరం ఏ కార్యం చేయకున్నా మన మనసు ఏదో ఒకటి ఆలోచిస్తూనే ఉంటుంది. మన మనసు కోరిక చుట్టూ తిరుగుతూ ఉంటుంది. అందువల్లే కోరికలు మనల్ని ఇంకా ఇంకా పాపంలోకి నెడుతుంటాయి.

ఆశను తిన్నగా ఆపలేం. కార్యాన్ని ఆపలేం. అలాగైతే మనకు మోక్షమే లేదా... ఈ సమస్యకు పరిష్కారం లేదా అంటే ఉంది. అదేమిటంటే లౌకికంగా లాభమివ్వని కార్యాలు చేయాలి. లోకోపకారం ఎక్కువ చేయాలి. మనమందరం నాలుగు విధాలుగా పాపాలు చేస్తుంటాం. దేహంతో, నోటితో, మనసుతో, డబ్బుతో చేసే పాపాలకు అంతు లేదు. ఏ నాలుగింటితో పాపాలు చేస్తున్నామో వాటితోనే పుణ్యకార్యాలు చేయాలంటారు కంచి పరమాచార్య. పరోపకారం, భగవన్నామస్మరణ, మనసును పవిత్రంగా ఉంచుకుని డబ్బును సత్కార్యాలకు ఉపయోగిస్తే సరిపోతుంది. ధర్మం చేసి పుణ్యాన్ని సంపాదించాలి.

– యామిజాల జగదీశ్



క్లుప్తంగా...

అమెరికాలో పెద్దపల్లి యువకుడి ఆత్మహత్య


అనిల్

పెద్దపల్లి రూరల్: అమెరికాలో ఉంటున్న పెద్దపల్లి మండలం తుర్కలమద్దికుంట గ్రామానికి చెందిన వెలిచాల అనిల్‌గౌడ్ అనే యువకుడు మూడు రోజుల క్రితం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు తమకు సమాచారం అందిందని మృతుడి తండ్రి మొగిలి శనివారం తెలిపారు. తమ కుమారుడు హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు చేసేందుకు అమెరికాలోని లాస్‌ఏంజెలిస్‌కు నాలుగు నెలల క్రితం వెళ్లాడని, ఆత్మహత్య ఎందుకు చేసుకోవాల్సి వచ్చిందనే విషయం తమకు తెలియదని మొగిలి కన్నీటి పర్యంతమయ్యారు. తమ కుమారుని మృతదేహాన్ని తీసుకొచ్చే ఆర్థిక స్తోమత లేదని, మంత్రి కేటీఆర్ చొరవ చూపి తమ కుటుంబానికి అండగా నిలవాలని ఆయన కోరారు. మొగిలి కల్లు అమ్ముకుని జీవనం సాగిస్తున్నారు.

కాజీపేటలో నిలిచిన గోల్కొండ ఎక్స్‌ప్రెస్

- రెండు గంటలపాటు ప్రయాణికులకు ఇబ్బందులు
- వరంగల్–చింతల్‌పల్లి స్టేషన్ల మధ్య రైల్వేలైన్ పనుల వల్ల అంతరాయం

కాజీపేట రూరల్: సికింద్రాబాద్ నుంచి గుంటూరు వెళ్లే గోల్కొండ ఎక్స్‌ప్రెస్ రైలు కాజీపేట జంక్షన్‌లో శనివారం రెండు గంటలపాటు నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రైల్వే అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... వరంగల్–చింతల్‌పల్లి రైల్వేస్టేషన్ల మధ్య మూడో రైల్వేలైన్ పనుల కారణంగా.. చేపట్టిన ఇంజనీరింగ్ బ్లాక్‌తో సికింద్రాబాద్, న్యూఢిల్లీ మార్గాల నుంచి వరంగల్ మీదుగా వెళ్లే రైళ్లకు అంతరాయం కలిగింది. దీంతో కాజీపేట ఫాతిమానగర్ బైపాస్ లైన్‌లో ఢిల్లీ–విజయవాడ మార్గంలో వెళ్లే ఎక్స్‌ప్రెస్‌ను నిలిపివేశారు. సికింద్రాబాద్–గుంటూరు వెళ్లే గోల్కొండ ఎక్స్‌ప్రెస్ కాజీపేటకు మధ్యాహ్నం 3:10 గంటలకు చేరుకుంది. రెండు గంటల అనంతరం సాయంత్రం 5:10 గంటలకు దానిని పంపించినట్లు రైల్వే అధికారులు తెలిపారు. కాజీపేట జంక్షన్‌లో రెండు గంటలపాటు గోల్కొండను నిలిపేయడంతో వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. కాజీపేట ఆర్పీఎఫ్ సీఐ సంజీవరావు, సిబ్బంది, స్టేషన్ అధికారులు ప్రయాణికులకు ఆలస్యానికి కారణాలు వివరించి నచ్చజెప్పారు.

కృష్ణా బోర్డు చేతికి శ్రీశైలం, సాగర్!

- ప్రాజెక్టుల అప్పగింతపై 6న ఢిల్లీలో కేంద్ర జలశక్తి శాఖ సమావేశం
- శనివారం జరిగిన సమావేశానికి తెలంగాణ గైర్హాజరు
- 4న ఏపీ ఇండెంట్‌పై త్రిసభ్య కమిటీ సమావేశం నిర్వహించాలి
- ఆలోగా కుడి కాల్వకు నీటి విడుదల ఆపాలని జలశక్తి శాఖ ఆదేశం


డ్యాంపై సీఆర్‌పీఎఫ్ పోలీసులు

సాక్షి, హైదరాబాద్: శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాలు, వాటి పరిధిలోని కాంపోనెంట్లను కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్‌ఎంబీ)కు అప్పగించే అంశంపై తెలంగాణ, ఏపీ అధికారులతో కేంద్ర జలశక్తి శాఖ ఢిల్లీలో సమావేశం నిర్వహించనుంది. ఈ నెల 6న ఉదయం 11 గంటలకు శ్రమశక్తి భవన్‌లో జరిగే ఈ భేటీలో తెలుగు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, నీటిపారుదల శాఖ కార్యదర్శులు పాల్గొని చర్చించనున్నారు. ఈ నెల 29న ఏపీ పోలీసులు నాగార్జునసాగర్ డ్యామ్‌ను బలవంతంగా తమ అధీనంలోకి తీసుకుని సీసీ కెమెరాలు, గేట్లను ధ్వంసం చేశారని, కుడి కాల్వకు నీటిని విడుదల చేసుకున్నారని తెలంగాణ సర్కారు కేంద్రానికి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీనిపై కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ శనివారం వర్చువల్‌గా ఇరు రాష్ట్రాలతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. కానీ దీనిలో తెలంగాణ అధికారులెవరూ పాల్గొనలేదు. ఆదివారం అసెంబ్లీ ఓట్ల లెక్కింపు ఉన్న నేపథ్యంలో తీరిక లేకుండా ఉన్నామని.. 5వ తేదీ తర్వాత సమావేశం నిర్వహించాలని జలశక్తి శాఖను కోరారు. కాగా.. ఈ భేటీకి ఏపీ తరఫున ఆ రాష్ట్ర జలవనరుల శాఖ ఈఎన్‌సీ సి.నారాయణరెడ్డి హాజరై మాట్లాడారు. విభజన చట్టం నిబంధనలకు విరుద్ధంగా తెలంగాణ వ్యవహరించడం, ఏపీ తాగునీటి అవసరాల కోసం పలుమార్లు విజ్ఞప్తి చేసినా నీటిని విడుదల చేయకపోవడంతోనే ఈ పరిస్థితి ఉత్పన్నమైందని వివరించారు. దీనిపై దేబశ్రీ ముఖర్జీ స్పందిస్తూ.. 6వ తేదీన సమావేశం నిర్వహిస్తామని, అన్ని అంశాలపై చర్చించి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. అప్పటివరకు ఇరు రాష్ట్రాలు సంయమనం పాటించాలని సూచించారు.

నీటి విడుదలపై సమావేశం

సాగర్ నుంచి తమకు నీటిని విడుదల చేయాలంటూ ఏపీ ఇచ్చిన ఇండెంట్‌పై చర్చించడానికి వీలుగా ఈనెల 4న కృష్ణాబోర్డు త్రిసభ్య కమిటీ కన్వీనర్ డీఎం రాయ్‌పురే, తెలంగాణ ఈఎన్‌సీ సి.మురళీధర్, ఏపీ ఈఎన్‌సీ సి.నారాయణరెడ్డి సమావేశం కావాలని జలశక్తి శాఖ కార్యదర్శి సూచించారు. అప్పటివరకు సాగర్ కుడికాల్వకు నీటి విడుదలను ఆపాలని ఏపీని కోరారు. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం కృష్ణా జలాల పంపిణీలో ఏపీ, తెలంగాణలకు న్యాయం చేయడానికి కేంద్రం సిద్ధంగా ఉందన్నారు.

పూర్వ స్థితిని పునరుద్ధరించాలి: తెలంగాణ లేఖ

నాగార్జునసాగర్ డ్యామ్‌పై ఈ నెల 28వ తేదీకి ముందున్న స్థితిని పునరుద్ధరించాలని తెలంగాణ మరోసారి కోరింది. ఈ మేరకు కృష్ణా బోర్డు చైర్మన్‌కు తెలంగాణ నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ సి.నారాయణరెడ్డి శనివారం లేఖ రాశారు. ఈ నెల 1న కేంద్ర హోంశాఖ కార్యదర్శి అజయ్‌భల్లా అధ్యక్షతన జరిగిన సమావేశంలో పూర్వస్థితి పునరుద్ధరణకు అంగీకారం కుదిరిందని గుర్తుచేశారు. సాగర్ డ్యామ్‌పై నుంచి తెలంగాణ పోలీసులను వెనక్కి తీసుకున్నామని, ఏపీ మాత్రం తమ పోలీసులను ఉపసంహరించుకోవడం లేదని పేర్కొన్నారు. సాగర్ కుడి కాల్వకు నీటి విడుదలను ఇంకా ఆపలేదన్నారు.

సాగర్‌కు చేరుకున్న కృష్ణాబోర్డు అధికారులు

నాగార్జునసాగర్ నుంచి కుడికాల్వకు నీటి విడుదలను పరిశీలించేందుకు కృష్ణాబోర్డు అధికారులు శనివారం ప్రాజెక్టు వద్దకు చేరుకున్నారు. ఏపీ పోలీసులు కొంతసేపు పాటు వారిని ప్రాజెక్టుపైకి అనుమతించలేదు. ఉన్నతాధికారులతో మాట్లాడిన తర్వాతే అనుమతించారు. మూడు రోజులుగా రెండు గేట్లను ఎత్తి కుడికాల్వకు నీటి విడుదల కొనసాగించిన ఏపీ.. శనివారం ఒక గేటును మూసివేసింది. ఇక తెలంగాణ ప్రభుత్వం తమ భూభాగం పరిధిలోని డ్యామ్ పర్యవేక్షణ బాధ్యతలను సీఆర్‌పీఎఫ్ బలగాలకు అప్పగించింది. ఏపీ పరిధిలోని డ్యామ్ భాగాన్ని సీఆర్‌పీఎఫ్‌కు ఆ రాష్ట్రం అప్పగించలేదని తెలంగాణ అధికారులు పేర్కొన్నారు.

సొల్యూషన్ లేని ‘అలియాస్’ సమస్య

- సింగరేణిలో ఆ పేర్ల చిక్కుముడి వీడేదెన్నడు?
- కారుణ్య ఉద్యోగాలు, పెన్షన్‌లు రాక అవస్థలు
- ఏళ్లుగా పట్టించుకోని అధికారులు
- వెయ్యి మందికి పైగానే తిప్పలు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో అలియాస్(పేరు మార్పిడి) సమస్య చిక్కుముడిగా మారింది. ఈ సమస్య కారణంగా సంస్థ వ్యాప్తంగా సుమారు వెయ్యి మందికి పైగా కార్మికుల పిల్లలకు వారసత్వ ఉద్యోగాలు రావడం లేదు. ఏళ్ల తరబడి కార్యాలయం చుట్టూ తిరిగినా పని జరగక, స్పౌస్‌లకు పెన్షన్ రాక అవస్థ పడుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. మరో పక్క కార్మికుల సమస్యలు తెలిసినప్పటికీ గుర్తింపు సంఘం నాయకులు ఆ వైపుగా దృష్టి సారించడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఏమిటీ సమస్య?

సింగరేణి సంస్థలో కార్మికులు అవసరమైన సందర్భాల్లో నియమ నిబంధనలు పక్కనపెట్టి... వచ్చిన వారిని వచ్చినట్లుగా నియమించారు. నిబంధనలన్నీ కచ్చితంగా అమలు చేస్తే ఎవరూ రారనే భావనతో అధికారులు ఈ నిర్ణయం తీసుకోగా, ఉద్యోగం వస్తుందనే ఆశ, కుటుంబాలకు ఉపాధి దొరుకుతుందనే భావనతో చాలామంది మారు పేర్లతో చేరారు. ఈ ప్రక్రియలో అటు అధికారులు.. ఇటు కార్మికుల తప్పిదం కూడా ఉందన్నది నిర్వివాదాంశం. ఉద్యోగం చేరాక రెండేళ్లకు కార్మికులను పర్మనెంట్ చేయడం పరిపాటి. కనీసం అప్పుడైనా కార్మికుల పూర్తి వివరాలు సేకరించి సరైన పేర్లతో పర్మనెంట్ చేయాల్సి ఉన్నా.... ఆనాటి సింగరేణి రిక్రూట్‌మెంట్ సెల్, విజిలెన్స్, ఇంటిలిజెన్స్ విభాగాల అధికారులు పట్టించుకోలేదు.

స్వయంగా సీఎం చెప్పినా అంతే

2018 ఎన్నికల తర్వాత రెండోసారి ముఖ్యమంత్రి అయ్యాక సీఎం కేసీఆర్ శ్రీరాంపూర్ ఏరియాలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఈ సమస్యపై మాట్లాడారు. కార్మికులకు సంబంధించి రికార్డుల్లో పేర్లు మార్చి, వారసత్వ ఉద్యోగాల ద్వారా కుటుంబాలకు ఇబ్బందులు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. అక్కడికక్కడే ప్రక్రియను వేగవంతం చేయాలని యాజమాన్యాన్ని ఆదేశించారు. ఇది జరిగి ఐదేళ్లు కావొస్తున్నా ప్రక్రియ పూర్తికాకపోవడంతో సుమారు వేయి మంది కార్మికులు కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తోంది. అధికారులు శ్రద్ధ కనబర్చకపోవడంతో ఉద్యోగుల పేర్లు మార్చకపోగా, ఇంటి పేర్లు, కుటుంబ సభ్యుల పేర్లు, ఇతరత్రా సమాచారం తప్పుగా నమోదవుతోంది. దీంతో పెన్షన్లు మంజూరు కాక, అర్హులైన కార్మికుల్లో కుటుంబీకులకు వారసత్వ ఉద్యోగాలు లభించక నానా అవస్థలు పడుతున్నారు.

న్యాయపరమైన చిక్కులు రాకుండా నిర్ణయం తీసుకుంటాం: బలరామ్



సింగరేణి డైరెక్టర్(పా) ఎస్.బలరామ్‌ను ఈ విషయమై వివరణ కోరగా... బోర్డ్ డైరెక్టర్ల సమావేశంలో చర్చించి, న్యాయపరమైన చిక్కులు రాకుండా త్వరలో నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. కార్మికుల పూర్తి వివరాల సేకరణ విషయంలో జాగ్రత్తలు పాటించాలని ఉద్యోగులకు ఆదేశాలు జారీచేస్తామని చెప్పారు.

ఆర్డీవో ఆఫీసులోనే పోస్టల్ బ్యాలెట్ బాక్సులు

పైగా వాటికి సీల్ లేని వైనం • రంగారెడ్డి జిల్లా ఆర్డీవో ఆఫీసు వద్ద అర్ధరాత్రి ఉద్రిక్తత

- స్ట్రాంగ్‌రూమ్‌కు తరలించడంలో నిర్లక్ష్యం చూపారంటూ ఆందోళన
- ఏజెంట్ పాసుల కోసం వచ్చి గుర్తించిన కాంగ్రెస్ శ్రేణులు
- అధికారులను నిలదీయడంతో టెన్షన్ వాతావరణం
- మరో గదిలోకి వెళ్లి గడియ పెట్టుకున్న ఆర్డీవో అనంతరెడ్డి
- ఘటనాస్థలికి చేరుకున్న కలెక్టర్ భారతి హోళికేరి

సాక్షి, రంగారెడ్డి జిల్లా: స్ట్రాంగ్ రూమ్‌కు తరలించాల్సిన పోస్టల్ బ్యాలెట్ బాక్సులు ఆర్డీఓ కార్యాలయంలోనే ఉండటంపై పెద్దదుమారమే రేగింది. విషయం తెలుసుకున్న కాంగ్రెస్, సీపీఐ శ్రేణులు పెద్ద ఎత్తున అక్కడకు చేరుకోవడంతో శనివారం అర్ధరాత్రి వరకు హైడ్రామా కొనసాగింది. వివరాలిలా.. ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి చెందిన పోలీసులు, ఇతర ఉద్యోగులు నవంబర్ 21 నుంచి 29 వరకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీటిని భద్రపరిచే విషయంలో రిటర్నింగ్ ఆఫీసర్ నిర్లక్ష్యంగా వ్యవహరించారనే విమర్శలు వెల్లువెత్తాయి. స్ట్రాంగ్‌రూమ్‌లకు చేరాల్సిన పోస్టల్ బ్యాలెట్ బాక్సులు.. సీల్ లేకుండా ఆర్డీఓ కార్యాలయంలోనే ఉండటం వివాదానికి కారణమైంది. ఈ విషయమై పోలింగ్ ఏజెంట్లకు కనీస సమాచారం కూడా ఇవ్వకుండా వాటిని తెరిచి ఉంచడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. శనివారం రాత్రి కౌంటింగ్ పాసుల కోసం ఆర్డీఓ కార్యాలయానికి చేరుకున్న కాంగ్రెస్ సహా ఇతర పార్టీలకు చెందిన ఏజెంట్లు ఈ విషయాన్ని గుర్తించి, ఆందోళనకు దిగారు. రిటర్నింగ్ ఆఫీసర్ అధికార బీఆర్‌ఎస్ పార్టీకి ఏజెంట్‌లా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఆయనను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

ఆందోళన.. లాఠీ చార్జ్

ఆందోళనకారులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక ఆర్డీఓ అనంతరెడ్డి చాంబర్ నుంచి మరో గదిలోకి వెళ్లి గడియపెట్టుకున్నారు. దీంతో ఆందోళనకారులు మరింత ఆగ్రహం వ్యక్తం చేశారు. బయటి నుంచి డోర్‌ను బలంగా బాదారు. వెంటనే పోలీసులు అక్కడి చేరుకుని ఆందోళనకారులకు సర్దిచెప్పే ప్రయత్నం చేసినా.. వారు వినిపించుకోలేదు. 2018 సాధారణ ఎన్నికల్లో ఫలితాల సమయంలోనూ అధికారులు ఇదేవిధంగా వ్యవహరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుత రిటర్నింగ్ అధికారి కూడా ఆయనే కావడంతో అధికార పార్టీకి తొత్తుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆయనను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులకు, ఆందోళనకారులకు మధ్య తోపులాట చేసుకుంది. పరిస్థితి అదుపు తప్పుతుండంతో అప్రమత్తమైన పోలీసులు లాఠీలకు పని చెప్పారు.


సీలు లేని పోస్టల్ బ్యాలెట్ బాక్సులు

ఆర్డీఓ కార్యాలయానికి కలెక్టర్

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భారతీ హోళీకేరీ రాత్రి 10.30 గంటలకు ఆర్డీఓ ఆఫీసుకు చేరుకున్నారు. బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకున్న ఉద్యోగులు, బాక్స్‌లను భద్రపరిచిన విధానంపై ఆరా తీశారు. ఈ సమయంలో పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీల ఏజెంట్లు కలెక్టర్‌తో వాగ్వాదానికి దిగారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..‘ప్రజాస్వామ్యంపై మీకెంత నమ్మకం ఉందో మాకూ అంతే ఉంది. ఎన్నికలు సజావుగా, ప్రశాంతంగా నిర్వహించేందుకే మేమున్నాం. అసలు ఏం జరిగిందో తెలుసుకున్న తర్వాతే ఓ నిర్ణయానికి రాగలం’అని చెప్పారు. ఇదే సమయంలో పలువురు కార్యకర్తలు ఆర్డీఓ ఆఫీసు ముందు బైఠాయించి స్థానిక ఎమ్మెల్యే కిషన్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సమయంలో చోటు చేసుకున్న తోపులాటలో పంబ శ్రీను అనే వ్యకికి చేతికి బలమైన గాయాలు కాగా.. కృష్ణ అనే మరో వ్యక్తి తలకు గాయమైంది. ఆగ్రహించిన ఆందోళనకారులు ఆర్డీఓ కార్యాలయం అద్దాలు ధ్వంసం చేశారు.

3 లక్షల మంది విద్యార్థులకు చేయూత

గ్రాడ్‌రైట్ ప్రతినిధి శశిధర్ సిస్టా

సాక్షి, హైదరాబాద్: అమెరికా వంటి దేశాల్లో చదివే మన దేశస్థుల్లో తెలుగువారే 35 శాతం మంది ఉంటున్న పరిస్థితుల్లో విదేశీ విద్యను ఎంచుకునే విద్యార్థులకు మరింతగా అందుబాటులో తీసుకురావాల్సిన అవసరం ఉందని పలువురు విద్యారంగ ప్రముఖులు, విదేశీ వర్సిటీల ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. ప్రముఖ ఎడ్యు :ఫిన్ టెక్ వేదిక గ్రాడ్‌రైట్ ఆధ్వర్యంలో నగరంలోని తాజ్ కృష్ణా హోటల్‌లో ।ఇన్నోవేషన్ ఫర్ సస్టెయినబుల్ గ్లోబల్ హయ్యర్ ఎడ్యుకేషన్ । మీద శనివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. విదేశీ విద్య ఖరీదుగా మారుతోందని అదే సమయంలో బ్యాంకులు, ఆర్థిక సంస్థలు అందించే చేయూత అవసరమైన విద్యార్థులు అందరికీ అందడం లేదన్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు షిఫ్టెడ్ పేరిట గ్లోబల్ ఎడ్యుకేషన్ హైవే ద్వారా 3 లక్షల మందికి చేయూత అందించనున్నామని గ్రాడ్‌రైట్ ప్రతినిధి శశిధర్ సిస్టా తెలిపారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ డాక్టర్ లారా పెర్నా, హరప్పా ఎడ్యుకేషన్ వ్యవస్థాపకులు, చైర్మన్ డాక్టర్ ప్రమత్ రాజ్ సిన్హా, సిఐఐ ఐడబ్ల్యూఎన్ తెలంగాణ చైర్‌పర్సన్ శ్రీవిద్యారెడ్డి, తదితరులు పలు అంశాలపై చర్చించారు.

మర్రి చెన్నారెడ్డి సేవలు మరువలేనివి

హైదరాబాద్: ముఖ్యమంత్రిగా.. పలు రాష్ట్రాలకు గవర్నర్‌గా మర్రి చెన్నారెడ్డి చేసిన సేవలు మరువలేనివని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. మర్రి చెన్నారెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని శనివారం ఇందిరాపార్కులోని మర్రి చెన్నారెడ్డి రాక్‌గార్డెన్‌లో ఆయన సమాధి వద్ద, మర్రి చెన్నారెడ్డి తనయులు మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డి, మర్రి రవీందర్‌రెడ్డి, మనుమలు మర్రి ఆదిత్యారెడ్డి, పురోవర్‌రెడ్డి ఆయన కుటుంబసభ్యులతో కలిసి నివాళులర్పించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా మర్రి చెన్నారెడ్డి చేసిన సేవలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కవాడిగూడ కార్పొరేటర్ జి. రచనశ్రీ నాయకులు జి. వెంకటేష్, పరిమళ్‌కుమార్, రమేషోరాం, రాజశేఖర్‌రెడ్డి, దిలీప్‌యాదవ్ పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న కిషన్‌రెడ్డి

సీపీఆర్ చేసి.. నవజాత శిశువుకు ప్రాణం పోసి..

నెలలు నిండని గర్భిణికి అంబులెన్స్‌లోనే ప్రసవం

- ప్రశంసలు అందుకుంటున్న కీసర 108 సిబ్బంది


నవజాత శిశువును ఆస్పత్రిలో అందజేస్తున్న108 సిబ్బంది

హైదరాబాద్: అత్యవసర పరిస్థితుల్లో నెలలు నిండని గర్భిణికి పురుడు పోసి నవజాత శిశువును కీసర 108 సిబ్బంది సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడారు. వివరాలిలా ఉన్నాయి. దమ్మాయిగూడ మున్సిపాలిటీలో నివాసముంటున్న సయ్యద్ జరీనా బేగం (23) 6 నెలల గర్భిణి ఇంట్లో మెట్లు దిగుతుండగా కాలుజారీ కింద పడటంతో కడుపు మెట్లకు తగలడంతో తీవ్రమైన నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న 108 సిబ్బంది ఈఎంటీ చిత్రం రవి, పైలట్ ఆంజనేయులు అంబులెన్స్ వాహనంలోకి తీసుకెళ్లారు. కడుపులోని బిడ్డ కదలికలు సరిగ్గా లేవని గమనించి ఈఎంటీ రవి 108 కాల్‌సెంటర్‌లో ఉన్న అత్యవసర వైద్యుడు డాక్టర్ దుర్గా ప్రసాద్‌కు సదరు మహిళ పరిస్థితిని ఫోన్‌లో వివరించారు. బిడ్డకు ప్రాణపాయ పరిస్థితి ఉంటుందని తెలిపిన డాక్టర్ చేసిన సూచనలను పాటిస్తూ గాంధీ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో తప్పని పరిస్థితుల్లో 108 వాహనంలోనే ప్రసవం చేసారు. పుట్టిన మగబిడ్డ సరిగ్గా ఎదగక పోవడంతో హార్ట్‌బీట్(గుండె కొట్టుకోవడం) తక్కువగా ఉండి శ్వాస తీసుకోవడం కూడా సరిగాలేదని గమనించిన ఈఎంటీ రవి నవజాత శిశువుకు సీపీఆర్ చేస్తూ కృత్రిమ శ్వాసను అందిస్తూ ఆస్పత్రికి చేర్చారు. క్లిష్ట పరిస్థితుల్లో కాన్పు చేసి తల్లీబిడ్డలను కాపాడినందుకు గాంధీ ఆసుపత్రి వైద్యులు, జరీనా బేగం కుటుంబసభ్యులు 108 వాహన సిబ్బందిని అభినందించారు.

కాయ్ రాజా కాయ్

- ఎవరు గెలుస్తారు? ఎంత మెజారిటీ?
- రంగంలోకి బెట్టింగ్ రాయుళ్లు
- ఫాంహౌస్‌లు, రిసార్ట్‌లలో ఏర్పాట్లు
- ప్రత్యేక పోలీసు బృందాల నిఘా

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో బెట్టింగ్ రాయుళ్లు రంగంలోకి దిగారు. శివారు ప్రాంతాల్లోని ఫాంహౌస్‌లు, రిసార్ట్‌లలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉదయం 8 గంటల నుంచే కౌంటింగ్ ప్రారంభం కావడంతో పందెం రాయుళ్లు కూడా సిద్ధమయ్యారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక వంటి సరిహద్దు రాష్ట్రాల్లోని పందెం రాయుళ్లు కూడా తెలంగాణ ఫలితాలపై ఆసక్తి కనబరుస్తున్నారు. అభ్యర్థుల గెలుపోటములపై బేరీజు వేస్తూ పందేలు కాయడమే కాదు.. ఎవరు ఎంత మెజారిటీతో గెలుస్తారు? సీటు, ఓటు శాతం, డిపాజిట్ల గల్లంతు, రాష్ట్రంలో ఏ పార్టీకి ఎన్ని సీట్లు ఇలా ప్రతి అంశాన్ని బెట్టింగ్‌కు వినియోగించుకుంటున్నారు. గ్రేటర్‌లో నాంపల్లి, గోషామహల్ నియోజకవర్గాలలో గెలుపోటములపై కోట్లలో పందేలు జరుగుతున్నట్లు సమాచారం. సీఎం కేసీఆర్, ఈటల రాజేందర్, రేవంత్‌రెడ్డి తలపడుతున్న గజ్వేల్, కామారెడ్డి నియోజకవర్గాలపై బెట్టింగ్ రాయుళ్లు భారీగా చేస్తున్నారు. బెట్టింగ్ సమాచారంతో గ్రేటర్ పోలీసులు అప్రమత్తమయ్యారు.

ఇక ‘ఎల్‌ఐసీ’ ఎంజీబీఎస్ మెట్రో స్టేషన్

సాక్షి, హైదరాబాద్: ఎంజీబీఎస్ మెట్రో స్టేషన్ పేరు మారింది. ఇక నుంచి ఈ స్టేషన్‌ను ఎల్‌ఐసీ ఎంజీబీఎస్ మెట్రోస్టేషన్‌గా పరిగణిస్తారు. ఈ మేరకు హైదరాబాద్ మెట్రో రైల్ ఇప్పటికే స్టేషన్ అనౌన్స్‌మెంట్‌లో మార్పు చేసింది. ఎంజీబీఎస్ మెట్రో స్టేషన్‌కు ముందు ఎల్‌ఐసీ అనే పదాన్ని చేరుస్తూ స్టేషన్‌లో ప్రత్యేక బోర్డులను ఏర్పాటు చేశారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో స్పాన్సర్లుగా వ్యవహరిస్తున్న వ్యాపార సంస్థల పేర్లను ఆయా స్టేషన్లకు ఏర్పాటు చేస్తున్న సంగతి తెలిసిందే. ప్రకాశ్‌నగర్, హైటెక్‌సిటీ, రాయదుర్గం తదితర స్టేషన్ల పేర్లను ఇప్పటికే మార్చారు. తాజాగా ఎంజీబీఎస్ మెట్రో స్టేషన్‌కు ఎల్‌ఐసీ కొత్తగా వచ్చి చేరింది.

జలమండలికి పీఆర్‌ఎస్‌ఐ నేషనల్ అవార్డు



సాక్షి, హైదరాబాద్: జలమండలికి మరో పురస్కారం లభించింది. పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా (పీఆర్‌ఎస్‌ఐ) నేషనల్ అవార్డు – 2023 ను జలమండలి దక్కించుకుంది. పీఆర్‌ఎస్‌ఐ నిర్వహించిన ఇంటర్నేషనల్ పబ్లిక్ రిలేషన్స్ ఫెస్టి వల్ – 2023లో ‘కాఫీ టేబుల్ బుక్’ కేటగిరీలో రెండో బహుమతి లభించింది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, ఎన్టీపీసీ, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం), ఇతర మల్టీనేషనల్ కంపె నీలతో పోటీ పడి ఈ అవార్డును దక్కించుకుంది. ఇ టీవల ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో అవార్డును ప్ర దానం చేశారు. శనివారం జలమండలి ప్రధాన కార్యాలయంలో పీఆర్వో సుభాష్, ఓఎస్డీ పీఆర్వో మనోహరాచారి ఎండీకి పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన వారిని అభినందించారు.

గతేడాది రెండు పీఆర్‌ఎస్‌ఐ అవార్డులు

పీఆర్‌ఎస్‌ఐ గతంలో నిర్వహించిన పలు పోటీల్లో జలమండలికి రెండు అవార్డులు దక్కాయి. వివిధ కేటగిరీల్లో నిర్వహించిన పోటీల్లో.. ఉత్తమ కమ్యునికేషన్ క్యాంపెయిన్, ప్రజా అవగాహన విభాగాల్లో జలమండలి మొదటి, మూడో బహుమతి దక్కించుకుంది. జలమండలి పీఆర్‌ఎస్ నేషనల్ అవార్డు గెలుచుకోవడం వరుసగా ఇది 4వసారి కావడం విశేషం. జలమండలి ఈ ఏడాది ఇప్పటికే 4 అవార్డులు గెలుచుకుంది. మార్చి 18న వరల్డ్ వాటర్, మే 1 న ఉత్తమ యాజమాన్య, జులై 5న పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (పీసీబీ), ఆగస్టు 1న గ్లోబల్ ఇన్నోవేషన్ ఇన్ వాటర్ టెక్నాలజీ–2023 అవార్డులు వచ్చాయి. తాజా అవార్డుతో మొత్తం జలమండలి ఈ ఏడాది 5 పురస్కారాలను ఖాతాలో వేసుకుంది.

8న విశాఖలో ఆర్గానిక్ మేళా

11వ తేదీ వరకు నిర్వహణ

సీతంపేట(విశాఖ ఉత్తర): గో ఆధారిత ప్రకృతి రైతు సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీ నుంచి 11వ తేదీ వరకు ఏయూ మద్దిలపాలెం మైదానంలో ఆర్గానిక్ మేళా నిర్వహిస్తున్నట్లు భారత కిసాన్ సంఘ్ జాతీయ నాయకుడు జలగం కుమార్ స్వామి తెలిపారు. దీనికి సంబంధించిన ప్రచార పోస్టర్లు శనివారం స్థానిక బీవీకే కళాశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి ఆధారిత పంటలు విస్తారంగా పండించడం ద్వారా జల, వాయు, భూమి కాలుష్యం నివారించవచ్చన్నారు. ఆర్గానిక్ మేళాలో 8న ఉత్తరాంధ్ర రైతుల సమావేశం, 9న గ్రాడ్యుయేట్ రైతుల సమావేశం, 10న మిద్దెతోట రైతుల సమావేశం, 11న ఆర్గానిక్ వ్యాపారం చేసే వారితో సమావేశం నిర్వహిస్తామన్నారు. 9వ తేదీ మధ్యాహ్నం ఫుడ్ ప్రాసెసింగ్ శిక్షణ కార్యక్రమం, 11వ తేదీ మధ్యాహ్నం డాక్టర్ రవివర్మ ఆరోగ్య సలహాలు, సూచనలు ఉంటాయన్నారు. సిటీ టెర్రస్ గార్డెన్ సభ్యులు అరుణ, సరితలు మిద్దె తోట పెంపకంపై అవగాహన కల్పిస్తారని వివరించారు.

డ్రగ్స్ తయారీ ముఠా అరెస్ట్

రూ.50 లక్షల విలువైన మాదకద్రవ్యాలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మాదకద్రవ్యాలు,వివరాలు వెల్లడిస్తున్న టీఎస్ఎన్ఏబీ ఎస్పీ గుమ్మి చక్రవర్తి

హైదరాబాద్: మాదకద్రవ్యాలు తయారు చేస్తున్న ముగ్గురు వ్యక్తులను తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో(టీఎస్ఎన్ఏబీ) పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.50 లక్షల విలువైన డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. శనివారం బషీర్‌బాగ్‌లోని పాత కమిషనరేట్‌లో టీఎస్ఎన్ఏబీ డీఎస్పీ సీహెచ్. శ్రీధర్‌తో కలిసి టీఎస్ఎన్ఏబీ ఎస్పీ గుమ్మి చక్రవర్తి వివరాలు వెల్లడించారు. సురారంలో ముగ్గురు వ్యక్తులు లిక్విడ్ మెథాంఫెటమైన్, క్రిస్టల్ మెథాంఫెటమైన్ డ్రగ్స్ తయారు చేస్తున్నట్లు సమాచారం అందడంతో సురారం పోలీసులతో కలిసి దాడులు నిర్వహించిన పోలీసులు గాజులరామారం ప్రాంతానికి చెందిన కమ్మ శ్రీనివాస్, నరసింహ రాజు, దాట్ల మణికంఠ వీర వెంకట నాగరాజులను అదుపులోకి తీసుకున్నారు. వారు లిక్విడ్ మెథాంఫెటమైన్‌ను ప్రాసెస్ చేసి క్రిస్టల్ మెథాంఫెటమైన్ డ్రగ్ తయారు చేస్తున్నట్లు తెలిపారు. వాటిని అవసరమైన వారికి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారన్నారు. వారి నుంచి రూ.50లక్షల విలువైన 60 గ్రాముల క్రిస్టల్ మెథాంఫెటామైన్, 700 ఎంఎల్ లిక్విడ్ మెథాంఫెటమైన్‌తో పాటు పలు పరికరాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. డ్రగ్స్ రాకెట్ గుట్టు రట్టు చేసిన ఇన్‌స్పెక్టర్లు పి.రమేష్ రెడ్డి, టీఎస్ఎన్ఏబి సీఐలు డి.సంతోష్ కుమార్, జి.ఎస్. డేనియల్, సి.వెంకటరాములుతో పాటు సూరారం పోలీసులను ఎస్పీ అభినందించారు.

జైలుకు వెళ్లినా తీరు మారలేదు

ప్రధాన నిందితుడు కమ్మ శ్రీనివాస్ 2013లో జీడిమెట్ల పారిశ్రామిక వాడలో మెథాంఫెటమైన్ డ్రగ్ తయారు చేస్తుండగా నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో అధికారులు అరెస్టు చేశారు. అతని నుంచి 10.9 కిలోల డ్రగ్స్ స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో అతను నాలుగేళ్లు జైలు శిక్ష అనుభవించారు. 2017లో బెయిల్‌పై బయటికి వచ్చిన అతను కాకినాడకు చెందిన చేపల చెరువుల వ్యాపారి నరసింహరాజు, దాట్ల మణికంఠలతో కలిసి డ్రగ్స్ తయారీ చేపట్టాడు. ఈ నేపథ్యంలో అందుకు అవసరమైన పరికరాలను కొనుగోలు చేసి సురారంలోని ఓ ఇంట్లో డ్రగ్స్ తయారు చేస్తున్నారు. మెథాంఫెటమైన్ డ్రగ్ రిలాక్స్ మూడ్‌లోకి తీసుకెళ్తుందని పలువురు దానిని వినియోగిస్తారు. గత రెండేళ్లుగా వారు దాదాపు ఆరు కిలోల డ్రగ్స్‌ను కస్టమర్లకు నేరుగా, సోషల్ మీడియా ద్వారా విక్రయించినట్లు పోలీసులు గుర్తించారు.

పీడీ యాక్టు నమోదుకు సిఫార్సు

కమ్మ శ్రీనివాస్‌పై ఇప్పటికే పలు కేసులు ఉన్నాయి. పలుమార్లు జైలుకు వెళ్లి వచ్చాడు. అయినా తన పంథా మార్చుకోకుండా మరో ఇద్దరితో కలిసి మళ్లీ డ్రగ్స్ తయారు చేస్తూ పట్టుబడ్డాడు. నిందితులపై సెక్షన్ 8సీ, రెడ్‌విత్ 22,28,29 ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద కేసులు నమోదు చేశామని, వారిపై పీడీ యాక్ట్‌కు సిఫార్సు చేయనున్నట్లు ఎస్పీ తెలిపారు.

షూటింగ్ సత్తా చాటిన జహ్రా



సాక్షి, హైదరాబాద్: న్యూఢిల్లీలోని ప్రపంచ ప్రఖ్యాత డాక్టర్ కర్ణిసింగ్ షూటింగ్ రేంజ్ వేదికగా జరిగిన 66వ జాతీయ షూటింగ్ చాంపియన్ షిప్ పోటీలలో నగరంలోని లయోలా కాలేజీకి చెందిన జహ్రా ముఫద్దల్ దీసవాలా ఐదు పతకాలను సాధించి సత్తా చాటింది. నవంబర్ 15 నుంచి డిసెంబర్ 2 వరకు కొనసాగిన ఈ పోటీల్లో జూనియర్ మహిళల వ్యక్తిగత విభాగంలో గోల్డ్, జూనియర్ మహిళల టీమ్ విభాగంలో గోల్డ్, మహిళల వ్యక్తిగత విభాగం, మహిళల జట్టు విభాగంలో రజత పతకాలు, మిక్స్‌డ్ ఈవెంట్ టీమ్ విభాగంలో గోల్డ్ సాధించి సత్తా చాటింది. ఈ సందర్భంగా ప్రపంచంలోని అత్యుత్తమ క్లే షూటర్లు ఉపయోగించే టాప్–ఆఫ్–ది–లైన్ పోటీ షాట్‌గన్ బెరెట్టా బ్రాండ్, డీటీ11 షాట్‌గన్‌తో ప్రయాణం చేశానని, హైదరాబాద్ యూనివర్సిటీలోని గచ్చిబౌలి షూటింగ్ రేంజ్‌లో ప్రాక్టిస్ చేస్తానని, మాజీ షూటర్, జాతీయ జట్టు కోచ్ శ్రేయాన్ కపూర్ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్నానని జహ్రా తెలిపింది.

క్లుప్తంగా...

చలి తీవ్రత ఈసారి తక్కువే

వాతావరణ శాఖ అంచనా

ఢిల్లీ: దేశవ్యాప్తంగా అత్యధిక ప్రాంతాల్లో ఈసారి డిసెంబర్ నెలలో ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా కాస్తంత అధికంగా నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. ''ఉత్తర, వాయవ్య, మధ్య, తూర్పు, ఈశాన్య ప్రాంతాల్లో చలిగాలుల తీవ్రత సాధారణ స్థాయి కన్నా తక్కువగా ఉండే అవకాశం ఉంది. అందుకే ఈసారి డిసెంబర్‌లో చలి తక్కువగా ఉండే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ డిసెంబర్-ఫిబ్రవరి సీజన్‌లో రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణంగా కన్నా కాస్తంత ఎక్కువ నమోదవ్వొచ్చు. ఈసారి ఎల్‌నినో పరిస్థితులు ఉండటమూ ఇందుకు మరో ప్రధాన కారణం'' అని విశ్లేషించింది.

ఢిల్లీలో పొగమంచు.. విమానాలు మళ్లింపు

సాక్షి, న్యూఢిల్లీ: పొగ మంచు కమ్మేయడంతో దేశ రాజధాని ఢిల్లీకి రావాల్సిన పలు విమానాలు దారి మళ్లించారు. విజిబిలిటీ తగ్గిపోవడంతో శనివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట మధ్య హైదరాబాద్, బెంగళూరు, ముంబై, విశాఖపట్నం, భువనేశ్వర్, కోల్‌కతా నగరాల నుంచి ఢిల్లీకి వస్తున్న 20 విమానాలను జైపూర్, లక్నో, అహ్మదాబాద్, అమృత్‌సర్ ఎయిర్‌పోర్టులకు దారి మళ్లించారు. ఢిల్లీ నుంచి లక్నో, జైపూర్, భువనేశ్వర్, హైదరాబాద్, బెంగళూరు వెళ్లాల్సిన విమానాలను రన్‌వే పైనే నిలిపివేసినట్లు ఎయిర్‌పోర్ట్ వర్గాలు వెల్లడించాయి.

ఇమ్రాన్ స్థానంలో గోహర్ అలీ

ఇస్లామాబాద్: పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌కు చెందిన పాకిస్తాన్ తెహ్రీక్-ఇ-ఇన్సాఫ్(పీటీఐ) పార్టీ చీఫ్‌గా గోహర్ అలీ ఖాన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పార్టీ ఎన్నికల గుర్తుగా 'బ్యాట్' కొనసాగాలంటే సంస్థాగత ఎన్నికలు జరపాల్సిందేనన్న ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా ఈ ఎన్నిక జరిగినట్లుగా భావిస్తున్నారు. గోహర్ పేరును ఇమ్రాన్ ప్రతిపాదించారు. శనివారం జరిగిన ప్రత్యేక సమావేశంలో గోహర్(45) పార్టీ అధ్యక్ష పదవికి పోటీ లేకుండా ఎన్నికైనట్లు డాన్ పత్రిక తెలిపింది. తోషఖానా అవినీతి కేసు సహా పలు కేసుల్లో నిందితుడిగా ఉన్న ఇమ్రాన్ సెప్టెంబర్ నుంచి జైలులో ఉన్నారు. అందుకే, సంస్థాగత ఎన్నికల్లో ఆయన పోటీ చేయలేకపోయారు.

వామ్మో చైనా ఇన్ఫెక్షన్

అమెరికాలో తీవ్ర ఆందోళనలు

వాషింగ్టన్: చైనాలో నానాటికీ పెరుగుతున్న శ్వాసకోశ ఇన్ఫెక్షన్లు ప్రపంచాన్ని కలవరపెడుతున్నాయి. తాజాగా గుర్తు తెలియని కొత్త రకం బ్యాక్టీరియల్ నిమోనియా దేశమంతటా శరవేగంగా వ్యాపిస్తుండటం మరింత భయోత్పాతానికి కారణమవుతోంది. ఈ నేపథ్యంలో తక్షణం ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని అమెరికాలో డిమాండ్లు పెరుగుతున్నాయి. చైనాకు రాకపోకలపై పూర్తిగా నిషేధం విధించాలని ఐదుగురు రిపబ్లికన్ సెనేటర్లు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌కు లేఖ రాశారు.

మహిళల మీద రేప్ కేసు?

సాధ్యాసాధ్యాల పరిశీలనకు సుప్రీంకోర్టు అంగీకారం

న్యూఢిల్లీ: అత్యాచార సంఘటనల్లో మహిళలే బాధితులుగా ఉంటారు. మరి వారి మీద రేప్ కేసు పెట్టొచ్చా? దీనిలో సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు సుప్రీంకోర్టు అంగీకరించింది. రేప్ కేసులో ముందస్తు బెయిల్ కోసం ఒక 61 ఏళ్ల మహిళ సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. సదరు మహిళపై కోడలు రేప్ కేసు పెట్టింది. కేసును జస్టిస్ హృషికేశ్, జస్టిస్ సంజయ్‌ల ధర్మాసనం విచారించింది. చట్టప్రకారం మహిళలపై ఇలా రేప్ కేసు పెట్టలేరని ఆమె తరఫు న్యాయవాది గుర్తు చేశారు. ఈ మేరకు గతంలో సుప్రీంకోర్టు ఒక తీర్పు వెలువర్చిందని గుర్తుచేశారు. దీంతో పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీం ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. నాలుగు వారాల్లోగా స్పందన తెలిపాలని ఆదేశించింది.

ఫిలిప్పీన్స్‌లో భూకంపం.. సునామీ హెచ్చరికలు జారీ

మనీలా: ఫిలిప్పీన్స్‌లోని మిండనావో దీవిని శనివారం శక్తివంతమైన భూకంపం కుదిపేసింది. భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 7.6గా నమోదైంది. భూకంపం నేపథ్యంలో అధికారులు సునామీ హెచ్చరికలను జారీ చేశారు. భూమిలో 32 కిలోమీటర్ల లోతులో రాత్రి 10.37 గంటల సమయంలో ఇది సంభవించింది. దక్షిణ ఫిలిప్పీన్స్, ఇండోనేసియాలోని కొన్ని ప్రాంతాలు, మలేసియాలో సునామీ అలలు మీటరు ఎత్తున ఎగసిపడే అవకాశముందని అంచనా వేసినట్లు పసిఫిక్ సునామీ వార్నింగ్ సెంటర్ తెలిపింది.


దక్షిణ గాజాపై ఇజ్రాయెల్ గురి

ఖాన్ యూనిస్: శనివారం దక్షిణ గాజాలోని నిర్దేశిత లక్ష్యాలపై ఇజ్రాయెల్ దాడులకు పాల్పడింది. ఇజ్రాయెల్ సైన్యం గాజా స్ట్రిప్‌లో హెలికాప్టర్ల ద్వారా మొట్టమొదటిసారిగా మ్యాప్ ముద్రించిన కరపత్రాలను విడిచిపెట్టింది. అందులో, దాడుల నుంచి రక్షణ పొందేందుకు తాముంటున్న చోటు నుంచి సురక్షిత ప్రాంతానికి ఎలా వెళ్లాలో తెలిపే వివరాలున్నాయి. శుక్రవారం ఉదయం నుంచి శనివారం వరకు దాడుల్లో కనీసం 200 మంది పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయినట్లు గాజాలోని ఆరోగ్య శాఖ తెలిపింది.

వాలుతున్న వెయ్యేళ్ల టవర్

ఏ క్షణమైనా కుప్పకూలొచ్చు!

ఇటలీ అనగానే అందరికీ టక్కున గుర్తొచ్చేది పీసా నగరంలోని ప్రపంచ ప్రఖ్యాత లీనింగ్ టవరే. నాలుగు డిగ్రీల కోణంలో ఒకవైపు వాలిపోయి అందరికీ ఆకట్టుకుంటూ కన్పిస్తుందా కట్టడం. అయితే ఇటలీలోనే మరో లీనింగ్ టవర్ కూడా ఉంది. అది కూడా కాస్త అటూ ఇటుగా పీసా టవర్ అంత ఎత్తు ఉంటుంది. అలాంటి టవర్ కాస్తా ఇప్పుడు ఏ క్షణమైనా కుప్పకూలేలా కన్పిస్తూ గుబులు రేపుతోంది....!



ఇటలీలో గుబులు రేపుతున్న మరో లీనింగ్ టవర్

- ఎలాగైనా కాపాడేందుకు ప్రభుత్వ ప్రయత్నాలు
- కూలినా పరిసరాలకు నష్టం జరగకుండా బారికేడ్ నిర్మాణం

ఇటలీలోని బొలోగ్నా నగరంలో గారిసెండా టవర్ ఇప్పుడు ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తోంది. పీసా టవర్ మాదిరిగానే ఇది కూడా నానాటికీ ఓ పక్కకు వాలిపోతుండటమే ఇందుకు కారణం. అలా ఈ టవర్ ఇప్పటిదాకా 4 డిగ్రీల కోణంలో పక్కకు ఒరిగింది. దీనికి తోడు దాని పునాదులు కొంతకాలంగా బాగా బలహీనపడుతూ వస్తున్నట్టు అధికారులు తేల్చారు. దాంతో నగర కౌన్సిల్ హుటాహుటిన సమావేశమై దీని గురించి కూలంకషంగా చర్చించింది. టవర్ ఏ క్షణమైనా కుప్పకూలే ప్రమాదముందని ధ్రువీకరించింది. అదే జరిగితే శిథిలాల ధాటికి పరిసర చుట్టుపక్కల అతి సమీపంలో ఉన్న పలు నివాస, వాణిజ్య సముదాయాలు తీవ్రంగా దెబ్బ తినే ప్రమాదముంది. దీన్ని నివారించేందుకు ముందు జాగ్రత్త చర్యగా టవర్ చుట్టూ యుద్ధ ప్రాతిపదికన 5 మీటర్ల ఎత్తున బారియర్ నిర్మిస్తున్నారు. 2024 ఏప్రిల్ లోపు దాన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దాంతోపాటు టవర్ చుట్టూ మెటల్ రాక్ ఫాల్ వలలను ఏర్పాటు చేస్తున్నారు. తద్వారా అది కూలినా పరిసర నిర్మాణాలకు ఎలాంటి నష్టమూ లేకుండా చూసేందుకు అన్ని జాగ్రత్తలూ తీసుకుంటున్నారు.

ఈ నేపథ్యంలో అక్టోబర్ నుంచి టవర్, దాని



టవర్ చుట్టూ ఏర్పాటుచేసిన మెటల్ రాక్ ఫాల్ వల

గ్రౌండ్ ఫ్లోర్‌లోని ప్లాజాలోకి సందర్శకులకు అనుమతి నిరాకరించారు. సందర్శనపై నిషేధం మరికొన్నేళ్ల దాకా (టవర్ కూలని పక్షంలో) కొనసాగుతుందని ఇప్పటికే ప్రకటించారు. బారియర్ నిర్మాణ వ్యయం 37 లక్షల పౌండ్లు(దాదాపు రూ.39.10 కోట్లు)గా అంచనా వేశారు. దీని కోసం ప్రజల నుంచి విరాళాలు సేకరిస్తుండటం విశేషం! ''నగరవాసులతో పాటు బొలోగ్నా నగరాన్ని, దాని ప్రఖ్యాత పర్యాటక చిహ్నాలను కాపాడాలని తపిస్తున్న ప్రపంచవ్యాప్తంగా ఉన్న పర్యాటక ప్రియులందరూ ఈ బృహత్తర యజ్ఞంలో భాగస్వాములు కావాలి'' అంటూ నగర కౌన్సిల్ పిలుపునిచ్చింది.

నిలబెట్టేందుకు తీవ్ర యత్నాలు

గారిసెండా టవర్ కూలిపోకుండా కాపాడేందుకు ఇటలీ శాయశక్తులా ప్రయత్నిస్తోంది. పీసా టవర్ కూడా క్రమంగా మరింత పక్కకు వాలి త్వరలో కూలిపోవడం ఖాయమని కొన్నేళ్ల క్రితం వార్తలొచ్చాయి. కానీ ప్రభుత్వం ఏళ్ల తరబడి నానా ప్రయత్నాలూ చేసి దాని ఒంపును కొంతమేర సరిచేసింది. ప్రస్తుతానికి అది కుప్పకూలే ముప్పు లేదని తేల్చింది. అలా పీసా టవర్‌ను కాస్త సురక్షితంగా మార్చిన అనుభవాన్నంతా గారిసెండా విషయంలో రంగరిస్తున్నారు. ఇందుకోసం సివిల్ ప్రొటెక్షన్ ప్లాన్ సిద్ధం చేశారు. తొలి దశలో దీన్ని వీలైనంత సురక్షితంగా తీర్చిదిద్దే పనిలో పడ్డారు. సంబంధిత పనులు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయి.

రెట్టింపు ఎత్తైన జంట టవర్

గారిసెండా నిజానికి బొలోగ్నా నగరానికి ప్రధాన ఆకర్షణగా నిలిచిన జంట టవర్లలో ఒకటి మాత్రమే! పైగా చిన్నది. ఎందుకంటే, దీని పక్కనే ఉన్న అసినెల్లీ టవర్ దీనికంటే దాదాపు రెట్టింపు పొడవైంది! అంటే దాదాపు 90 మీటర్లన్నమాట. ప్రఖ్యాత పీసా టవర్ ఎత్తు 56 మీటర్లే. అంటే, ఇది పీసాను తలదన్నేంత ఎత్తుందన్నమాట! అసినెల్లీ టవర్ నిర్మాణం గారిసెండా తర్వాత పదేళ్లకే, అంటే 1,119లో జరిగింది. ఇది కూడా కాస్త పక్కకు ఒరిగే ఉండటం విశేషం. అయితే ఆ ఒంపు మరీ పీసా, గారిసెండా అంతగా లేదు గనుక ప్రస్తుతానికి దీనికి వచ్చిన ముప్పేమీ లేనట్టే! – సాక్షి, నేషనల్ డెస్క్

దాదాపు వెయ్యేళ్ల నాటిది!

- గారిసెండా టవర్ ఇప్పటిది కాదు. మధ్య యుగానికి చెందినది.
- దీన్ని దాదాపు వెయ్యేళ్ల క్రితం, అంటే క్రీస్తు శకం 1,109 సంవత్సరంలో నిర్మించారు.
- టవర్ ప్రస్తుత ఎత్తు 47 మీటర్లు (154 అడుగులు).
- నిర్మించినప్పుడు ఇది చాలా ఎత్తుండేది.
- 200 ఏళ్లకే టవర్ ఒక పక్కకు ఒరగడం మొదలైంది.
- దాంతో 14వ శతాబ్దంలో దాని ఎత్తును బాగా తగ్గించారు.
- డాంటే 1321 సంవత్సరంలో ముగించిన అజరామర పద్య కావ్యం 'ది డివైన్ కామెడీ'లో కూడా గారిసెండా టవర్ ప్రస్తావన ఉంది.

పని మొదలెట్టిన ఆదిత్య-ఎల్ 1

- సౌరగాలులను రికార్డ్‌చేసిన ఆదిత్య సోలార్ విండ్ పార్టికల్ ఎక్స్‌పరిమెంట్
- వివరాలు షేర్ చేసిన ఇస్రో

సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా): సూర్యుడిని అధ్యయనం చేసేందుకు రోదసీలోకి దూసుకెళ్లిన ఆదిత్య-ఎల్ 1 తన ప్రయాణంలో మరో మైలు రాయిని అందుకుంది. ఈ ఉపగ్రహంలోని ఆదిత్య సోలార్ విండ్ పార్టికల్ ఎక్స్‌పరిమెంట్ అనే పరికరం తన కార్యకలాపాలను మొదలుపెట్టిందని భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో ప్రకటించింది. ఈ పరికరంలోని రెండు విభిన్న భాగాలు తమ పరిశోధనలను విజయవంతంగా కొనసాగిస్తున్నాయి. ఇవి సౌర గాలులను అధ్యయనం చేస్తున్నాయి' అని ఇస్రో వెల్లడించింది. సంబంధిత వివరాలను ఇస్రో తన 'ఎక్స్' ఖాతాలో ట్వీట్‌చేసింది. 'సోలార్ విండ్ పార్టికల్ ఎక్స్‌పరిమెంట్'లో భాగమైన సూపర్‌థర్మల్ అండ్ ఎనర్జిటిక్ పార్టికల్ స్పెక్ట్రోమీటర్(స్టెప్స్)ను సెప్టెంబర్ పదో తేదీన, సోలార్ విండ్ అయాన్ స్పెక్ట్రోమీటర్(స్విస్)ను నవంబర్ రెండో తేదీన యాక్టివేట్ చేయడం తెల్సిందే. ఈ రెండు భాగాలు తమ కార్యకలాపాలను విజయవంతంగా కొనసాగిస్తున్నాయని ఇస్రో పేర్కొంది. స్విస్‌లో ఉన్న రెండు సెన్సార్లు 360 డిగ్రీలో చక్కర్లు కొడుతూ విధులు నిర్వర్తిస్తున్నాయి. నవంబర్ నెలలో సోలార్ విండ్ అయాన్లు, ప్రైమరీ ప్రోటాన్స్, ఆల్ఫా పార్టికల్స్‌లను 'స్విస్' విజయవంతంగా లెక్కగట్టి విశ్లేషించగలిగిందని ఇస్రో ప్రకటించింది. ఈ సెన్సర్ సేకరించిన ఎనర్జీ హిస్టోగామ్‌ను పరిశీలించారు. దీంతో ప్రోటాన్, అయనీకరణ చెందిన హీలియం, ఆల్ఫా పార్టికల్స్‌లో కొన్ని భిన్న లక్షణాలు ఉన్నట్లు గుర్తించారు. ఈ తాజా విశ్లేషణతో సౌర గాలుల విలక్షణతపై ఇన్నాళ్లూ నెలకొన్న ప్రశ్నలకు సమాధానాలు దొరికే అవకాశముందని ఇస్రో శాస్త్రవేత్తలు ఆశాభావం వ్యక్తంచేశారు. సౌర గాలుల్లోని అంతర్గత ప్రక్రియలు.. భూమిపై ఏ విధమైన ప్రభావం చూపుతాయనే విషయంపై సమగ్ర అధ్యయనం చేసేందుకు తాజా డేటా సహాయకారిగా ఉంటుందని ఇస్రో పేర్కొంది. లాగ్రాంజ్ పాయింట్ వద్ద చోటుచేసుకునే కరోనల్ మాస్ ఎజెక్షన్స్‌పై ఓ అవగాహనకు రావచ్చని వెల్లడించింది. సూర్యుడిపై అధ్యయనం కోసం ఈ ఏడాది సెప్టెంబరు 2న నింగిలోకి దూసుకెళ్లిన 'ఆదిత్య – ఎల్ 1' తన ప్రయాణంలో దాదాపు చివరి దశను చేరుకుంది. భూమి నుంచి 15 లక్షల కి.మీ దూరంలో ఉన్న లాగ్రాంజ్ పాయింట్-1 చేరాక దాని కక్ష్యలో పరిభ్రమిస్తూ ఆదిత్య – ఎల్ 1 సూర్యుడిని అధ్యయనం చేయనుంది.



---

4 రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు నేడే విడుదల

తెలంగాణ, మధ్యప్రదేశ్, రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్‌ల్లో నేడే ఓట్ల లెక్కింపు

- ఏర్పాట్లన్నీ పూర్తి, కౌంటింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత
- ఉదయం ఎనిమిది గంటలకు పోస్టల్ ఓట్ల లెక్కింపుతో మొదలు

- 11 గంటలకల్లా ఫలితాల సరళిపై స్పష్టత వచ్చే అవకాశం
- మధ్యప్రదేశ్, రాజస్తాన్‌లో బీజేపీ నెగ్గవచ్చన్న ఎగ్జిట్ పోల్స్
- ఛత్తీస్‌గఢ్, తెలంగాణల్లో కాంగ్రెస్ గెలుస్తుందని అంచనాలు
- మిజోరంలో ఓట్ల లెక్కింపు, ఫలితాలు రేపు



న్యూఢిల్లీ: ఐదు రాష్ట్రాల్లో హోరాహోరీగా సాగిన ఎన్నికల సమరం ముగిసింది. ఓటింగ్ యంత్రాల్లో నిక్షిప్తమైన నేతల భవితవ్యం ఆదివారం వెల్లడి కానుంది. తెలంగాణ, మధ్యప్రదేశ్, రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో ఆదివారం ఓట్ల లెక్కింపు జరిగి ఫలితాలు వెల్లడి కానున్నాయి. నెలన్నరకు పైగా ప్రచారంలో నిరంతరాయంగా చెమటోడ్చి విశ్రాంతి తీసుకుంటున్న అభ్యర్థులు, నేతల్లో ఫలితాలపై చెప్పలేనంత ఉత్కంఠ నెలకొంది. ఐదో రాష్ట్రమైన మిజోరంలో ఓట్ల లెక్కింపు సోమవారానికి వాయిదా పడింది. వీటిని కీలకమైన 2024 లోక్‌సభ ఎన్నికలకు సెమీఫైనల్స్‌గా భావిస్తున్న నేపథ్యంలో ఫలితాలపై దేశ వ్యాప్తంగా అందరిలోనూ ఆసక్తి నెలకొంది.

మూడుచోట్ల ముఖాముఖి

మధ్యప్రదేశ్, రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో బీజేపీ, కాంగ్రెస్ మధ్య ముఖాముఖి పోరు సాగింది. మధ్యప్రదేశ్‌లో బీజేపీ, మిగతా రెండు రాష్ట్రాల్లో కాంగ్రెస్ అధికారంలో ఉన్న విషయం తెలిసిందే. గత మేలో కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో అధికార బీజేపీని మట్టికరిపించిన కాంగ్రెస్, అదే ఊపులో తాజా ఎన్నికల్లో మరిన్ని రాష్ట్రాల్లో పాగా వేస్తానని ఆశాభావంతో ఉంది. ఈసారి రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్‌లు తమ వశమవుతాయని బీజేపీ భావిస్తోంది. ఈసారి మధ్యప్రదేశ్‌లో బీజేపీకి బాగా మొగ్గుందని, రాజస్తాన్‌లో ఆ పార్టీ ముందంజలో ఉందని గురువారం వెలువడ్డ ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు పేర్కొన్నాయి. ఛత్తీస్‌గఢ్‌తో పాటు తెలంగాణలో కాంగ్రెస్‌కే విజయావకాశాలున్నట్టు తేల్చాయి. హోరాహోరీ పోటీ నేపథ్యంలో హంగ్ వచ్చే చోట ఎమ్మెల్యేలను శిబిరాలకు తరలించేందుకు రెండు పార్టీలూ ప్రయత్నాలు చేసుకుంటున్నట్టు సమాచారం.

ఉదయం ఎనిమిదికి షురూ

- నాలుగు రాష్ట్రాల్లోనూ ఓట్ల లెక్కింపు ఉదయం 8 గంటలకు మొదలు కానుంది.
- తొలుత పోస్టల్ బ్యాలెట్లు లెక్కిస్తారు.
- అనంతరం 8.30గంటలకు నుంచి ఓటింగ్ యంత్రాల్లోని ఓట్ల లెక్కింపు మొదలవుతుంది.

మధ్యప్రదేశ్

రాష్ట్రంలో 52 జిల్లా కేంద్రాల్లో కౌంటింగ్ జరగనుంది. ఇందుకు ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. ఇక్కడ 2,533 మంది అభ్యర్థులు రంగంలో ఉన్నారు. గురువారం నాటి ఎగ్జిట్ పోల్స్‌లో మూడు బీజేపీకి ఘనవిజయం ఖాయమని పేర్కొన్నాయి. 2018 మాదిరిగా రెండు పార్టీలూ విజయానికి దగ్గరగా వస్తాయని మరికొన్ని అంచనా వేశాయి. ఒకట్రెండు కాంగ్రెస్ విజయాన్ని సూచించాయి. భారీ మెజారిటీతో బీజేపీ అధికారాన్ని నిలుపుకుని తీరుతుందని ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ శనివారం ధీమా వ్యక్తంచేశారు. ప్రజలు ఈసారి మార్పుకే ఓటేశారని పీసీసీ అధ్యక్షుడు కమల్‌నాథ్ చెప్పుకొచ్చారు. 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ 114 సీట్లు సాధించగా బీజేపీ 109 స్థానాలతో సరిపెట్టుకుంది.

రాష్ట్రంలో మొత్తం అసెంబ్లీ స్థానాలు	230
మెజారిటీ మార్కు	116

రాజస్తాన్

ఈ కాంగ్రెస్ పాలిత రాష్ట్రంలో ఎన్నికల పోరు హోరాహోరీగా సాగింది. ప్రతి ఐదేళ్లకూ ప్రభుత్వాన్ని మార్చేయడం రాజస్తాన్ ప్రజల అలవాటు. ఈ ఆనవాయితీ ఈసారీ కొనసాగుతుందని, మోదీ మేనియా తోడై తమకు అధికారం కట్టబెడుతుందని బీజేపీ నేతలు చెబుతున్నారు. సీఎం గెహ్లోత్ మాత్రం ఈసారి ఆనవాయితీ మారుతుందని నమ్మకం పెట్టుకున్నారు. తన సంక్షేమ పథకాలు ఖచ్చితంగా గట్టెక్కిస్తాయని చెబుతున్నారు. 2018 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన నాటినుంచీ గెహ్లోత్‌పై కారాలూ మిరియాలూ నూరుతూ వస్తున్న కాంగ్రెస్ యువ నేత సచిన్ పైలట్ ప్రచార పర్వంలో మాత్రం సంయమనం పాటించారు.

రాష్ట్రంలో మొత్తం అసెంబ్లీ స్థానాలు	200
మెజారిటీ మార్కు	101

ఛత్తీస్‌గఢ్

రాష్ట్రంలో 33 జిల్లా కేంద్రాల్లో కౌంటింగ్ జరగనుంది. ఇందుకు అన్ని ఏర్పాట్లూ పూర్తయ్యాయి. లెక్కింపు ప్రక్రియ సజావుగా సాగేలా చూసేందుకు 90 మంది రిటర్నింగ్ అధికారులు, 416 మంది సహాయ రిటర్నింగ్ అధికారులు, 1,698 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించారు. రాష్ట్రంలో మొత్తం 1,181 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. వీరిలో కాంగ్రెస్ నుంచి సీఎం భూపేశ్ బఘెల్, ఉప ముఖ్యమంత్రి టీఎస్ సింగ్‌దేవ్, బీజేపీ నుంచి మాజీ ముఖ్యమంత్రి రమణ్‌సింగ్ తదితర ప్రముఖులున్నారు.

రాష్ట్రంలో మొత్తం అసెంబ్లీ స్థానాలు	90
మెజారిటీ మార్కు	46

'బహిష్కరణ'పై చర్చ జరగాల్సిందే

మొయిత్రా అంశంపై విపక్షాల పట్టు

న్యూఢిల్లీ: తృణమూల్ కాంగ్రెస్ మహిళా ఎంపీ మహువా మొయిత్రాను లోక్‌సభ నుంచి బహిష్కరించాలంటూ ఎథిక్స్ కమిటీ చేసిన సిఫార్సులు.. అఖిలపక్ష భేటీలో వేడిపుట్టించాయి. ఆ సిఫార్సులపై లోక్‌సభలో తుది నిర్ణయం తీసుకునేలోపే పార్లమెంట్‌లో వాటిపై చర్చ జరగాలని విపక్షాలు పట్టుబట్టాయి. సోమవారం నుంచి పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో శనివారం ఏర్పాటుచేసిన అఖిలపక్ష భేటీ వాడీవేడీగా జరిగింది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలో జరిగిన ఈ భేటీకి పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి, కాంగ్రెస్ నేతలు జైరామ్ రమేశ్, గౌరవ్ గొగోయ్, ప్రమోద్ తివారీలతో పాటు తృణమూల్ కాంగ్రెస్ నేతలు సుదీప్ బందోపాధ్యాయ్, డెరెక్ ఓబ్రియాన్, ఎన్సీపీ నేతలు ఫౌజియా ఖాన్ తదితరులు హాజరయ్యారు. 'నగదుకు ప్రశ్నలు' ఉదంతంలో మహువా మొయిత్రాను బహిష్కరించేందుకు వీలుగా లోక్‌సభ ఎథిక్స్ కమిటీ నివేదికపై పార్లమెంట్ తొలిరోజే నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వం యోస్తోంది. దీంతో ప్రభుత్వ వైఖరిని విపక్ష సభ్యులు ఆక్షేపించారు. బహిష్కరణపై తుది నిర్ణయం తీసుకునే ముందు నివేదికపై చర్చ చేపట్టాలని టీఎంసీ నేతలు డిమాండ్‌చేశారు. సభలో చర్చ జరక్కుండానే ఎథిక్స్ కమిటీ నివేదిక బహిర్గతం కావడాన్ని వారు నిరసించారు.

మహువాపై బహిష్కరణ వేటు తీవ్ర శిక్ష: అధీర్ రంజన్

టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రాను సభ నుంచి బహిష్కరించాలన్న యోచన అత్యంత తీవ్రమైనదని, దీని పర్యవసానాలు ఎన్నో రకాలుగా ఉంటాయని లోక్‌సభలో కాంగ్రెస్ నేత అధీర్ రంజన్ చౌధురి ఆగ్రహంవ్యక్తంచేశారు. పార్లమెంటరీ కమిటీ నిబంధనలు, ప్రక్రియలపై పునఃసమీక్ష చేపట్టాలని కోరారు. ఈ మేరకు శనివారం ఆయన లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు నాలుగు పేజీల లేఖ రాశారు.

అఖిలపక్షానికి హాజరుకాలేకపోయిన వైఎస్సార్‌సీపీ

సాక్షి, న్యూఢిల్లీ: హైదరాబాద్ నుంచి ఢిల్లీ వచ్చే ఎయిర్‌ఇండియా విమానం శనివారం దారి మళ్లింపు కారణంగా పార్లమెంటు అఖిలపక్ష సమావేశానికి వైఎస్సార్‌సీపీ హాజరుకాలేకపోయింది. ఉదయం 8.10 నిమిషాలకు ఢిల్లీ రావాల్సిన విమానాన్ని విజిబిలిటీ లేని కారణంగా జైపూర్ మళ్లించారు. ఇదే విమానంలో వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి ప్రయాణించారు. విమానం దారి మళ్లింపు కారణంగా ఉదయం పార్లమెంటు లైబ్రరీ భవనంలో నిర్వహించిన అఖిలపక్ష సమావేశానికి ఎంపీ విజయసాయిరెడ్డి హాజరుకాలేకపోయారు. పార్లమెంటు సమావేశాలు సజావుగా సాగడానికి సహకరిస్తామని వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ ఓ ప్రకటన విడుదల చేసింది.



మెలోనీ 'మెలోడీ'కి మోదీ ఫిదా

- మోదీతో సెల్ఫీని ఎక్స్‌లో పోస్ట్ చేసిన ఇటలీ ప్రధాని
- ఇంటర్నెట్లో వైరలైన పోస్టు, చూస్తుండగానే 2.2 కోట్ల వ్యూస్

న్యూఢిల్లీ: ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ చేసిన 'మెలోడీ'కి ప్రధాని నరేంద్ర మోదీతో పాటు నెటిజన్లంతా ఫిదా అయ్యారు. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ప్రధానులిద్దరి మధ్య నడిచిన పోస్టులు వైరల్‌గా మారాయి. శుక్రవారం దుబాయ్‌లో కాప్28 సదస్సు సందర్భంగా వారిద్దరూ భేటీ కావడం తెలిసిందే. ఈ సందర్భంగా మోదీతో తీసుకున్న సెల్ఫీని మెలోనీ శనివారం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'కాప్28 సదస్సులో మంచి మిత్రులు'అనే క్యాప్షన్‌తో పాటు, తామిద్దరి పేర్లనూ అందంగా కలుపుతూ 'మెలోడీ'అంటూ హాష్‌టాగ్ జత చేశారు. దాంతో ఆ పోస్ట్ వైరల్‌గా మారింది. చూస్తుండగానే దానికి ఏకంగా 2.2 కోట్ల వ్యూస్ వచ్చాయి. దీనికి మోదీ కూడా సరదాగా స్పందించారు. 'మిత్రులతో కలయిక ఎప్పుడూ ఆహ్లాదకరమే' అనే క్యాప్షన్‌తో మెలోనీ సెల్ఫీని రీపోస్ట్ చేశారు. వారి పోస్టులు ఇప్పుడు ఇంటర్నెట్‌లో ట్రెండింగ్‌లో ఉన్నాయి.


జీ20 నుంచీ ట్రెండింగ్‌లోనే..

నిజానికి 'మెలోడీ' హాష్‌టాగ్ గత నెలలో భారత్ తొలిసారి ఆతిథ్యమిచ్చిన జీ20 శిఖరాగ్ర సదస్సు జరిగినప్పటి నుంచీ ఇంటర్నెట్లో వైరలైంది. సోషల్ సైట్లలో తెగ తిరుగుతోంది. ఆ సదస్సు ఆద్యంతం మోదీ, మెలోనీ పరస్పరం స్నేహపూర్వకంగా మెలిగిన తీరు అందరి దృష్టినీ బాగా ఆకర్షించింది. ఆతిథ్య దేశ సారథిగా మిగతా దేశాధినేతలతో పాటు మెలోనీని కూడా మోదీ సాదరంగా సదస్సుకు ఆహ్వానించారు. ఆ సందర్భంగా ఆమె మోదీతో కరచాలనం చేశారు. కాసేపు ముచ్చటించుకుని ఇరువురూ నవ్వుల్లో మునిగి తేలారు. ఇదే ఒరవడి తాజాగా కాప్28 సదస్సులోనూ కొనసాగింది.

వాట్సాప్ స్టేటస్‌గా గర్ల్ ఫ్రెండ్ డెడ్‌బాడీ ఫొటో!

చెన్నై: గర్ల్ ఫ్రెండ్‌ను గొంతు పిసికి చంపేసిన ఓ యువకుడు, ఆమె మృతదేహం ఫొటోను తీసి వాట్సాప్ స్టేటస్‌లో పెట్టుకున్నాడు. మృతురాలి స్నేహితులు గుర్తు పట్టి, పోలీసులను అప్రమత్తం చేయడంతో అతగాడు దొరికిపోయాడు. ఈ ఘటన చెన్నైలో చోటుచేసుకుంది. కేరళలోని కొల్లంకు చెందిన ఫౌసియా(20) చెన్నైలోని ఓ హాస్టల్‌లో ఉంటూ క్రోంపేట్‌లోని కాలేజీలో నర్సింగ్ చదువుతోంది. ఆషిక్(20)అనే యువకుడితో అయిదేళ్లుగా సన్నిహితంగా ఉంటోంది. మైనర్‌గా ఉన్నప్పుడే ఫౌసియా గర్భవతి అయింది. ఆషిక్‌పై పోక్సో కేసు నమోదు కావడంతో జైలుకు వెళ్లాడు. ఫౌసియా పుట్టిన బిడ్డను దత్తతకిచ్చింది. జైలు నుంచి విడుదలయ్యాక ఆషిక్, ఫౌసియా సంబంధం తిరిగి కొనసాగుతోంది. శుక్రవారం చెన్నై వచ్చిన ఆషిక్ హోటల్‌లో రూం బుక్ చేసి, ఫౌసియాను వెంట తీసుకెళ్లాడు. అదే రోజు సాయంత్రం, మృతదేహం ఫొటోను తన వాట్సాప్ స్టేటస్‌లో పెట్టాడు. ఫౌసియా స్నేహితులు ఆ ఫొటోను గుర్తించి, పోలీసులకు సమాచారమిచ్చారు. వారు వెంటనే వెళ్లి హోటల్ రూంలో చూడగా ఫౌసియా మృతదేహం కనిపించింది. పరారీలో ఉన్న ఆషిక్‌ను సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా పట్టుకున్నారు. తనకు మరో యువతితో సంబంధముందని అనుమానిస్తూ మాట్లాడటంతో కోపం పట్టలేక ఫౌసియాను టీ షర్టుతో గొంతుకు బిగించి, చంపేసినట్లు పోలీసుల విచారణలో ఒప్పుకున్నాడు.

సాక్షి
కరీంనగర్
ఆదివారం | 3 | డిసెంబర్ | 2023



న్యూస్‌రీల్

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్ డే



కొత్తపల్లి(కరీంనగర్): టీఎస్ఎన్‌పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ పరిధిలోని విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రతీనెల మొదటి శనివారం గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నట్లు ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ తెలిపారు. కరీంనగర్ విద్యుత్‌భవన్‌లోని ఎస్ఈ చాంబర్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌డేలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించిన ఆయన అక్కడికక్కడే ఐదింటిని పరిష్కరిస్తూ మరో దరఖాస్తును వరంగల్‌లోని సంస్థ కార్యాలయానికి పంపించారు. కరీంనగర్ టౌన్ డివిజన్‌లో వచ్చిన 12దరఖాస్తులకు గాను రెండు దరఖాస్తులను డీఈ రాజం పరిష్కరించగా.. కరీంనగర్ రూరల్ డివిజన్‌లో నాలుగు దరఖాస్తులను మూడు రోజుల్లో పరిష్కరించనున్నట్లు డీఈ తిరుపతి తెలిపారు. హుజూరాబాద్ డివిజన్‌లో వచ్చిన మూడు దరఖాస్తులను మూడు రోజుల్లో పరిష్కరిస్తామని డీఈ లక్ష్మారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు పి.విజేందర్‌రెడ్డి, ఏ.రాజేశం, రాజేంద్రప్రసాద్, శ్రీహరి పాల్గొన్నారు.

పీహెచ్‌సీని తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో



చిగురుమామిడి: చిగురుమామిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌వో లలితాదేవి శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో గర్భిణులను గుర్తించి, వివరాలు నమోదు చేయాలని సూచించారు. సాధారణ కాన్పులకు ప్రభుత్వ ఆస్పత్రులకు రెఫర్ చేయాలని తెలిపారు. ఎన్‌సీడీ కార్యక్రమంలో భాగంగా ప్రతీఒక్కరి అబాకార్డ్ జనరేట్ చేసి ఈ సంజీవని కాల్స్ చేయాలని కోరారు. క్యాంపు నిర్వహించి హైరిస్క్ కేసులు గుర్తించాలని, వారి హెల్త్ వెల్‌నెస్ కేంద్రాలను రిఫర్ చేయాలని సూచించారు. అనంతరం లేబర్‌గది, ఫార్మసిస్టోర్, సిబ్బంది హాజరు రిజిష్టర్లతో పాటు పలు రికార్డులు తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయూష్ వైద్యాధికారిణి డాక్టర్ అప్సనా, హెచ్ఈఈవో రాజగోపాల్, ఫార్మసిస్టు రామేశం, హెల్త్ సూపర్‌వైజర్ హజీబాబా, స్టాఫ్‌నర్స్ గాయిత్రి పాల్గొన్నారు.

రేపు నగరంలో తాగునీటి సరఫరాకు అంతరాయం

కరీంనగర్ కార్పొరేషన్: నగరవ్యాప్తంగా సోమవారం తాగునీటి సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు నగరపాలకసంస్థ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్ కిష్టప్ప ఒక ప్రకటనలో తెలిపారు. మానేరు డ్యాం నుంచి ఫిల్టర్‌బెడ్‌కు నీటి సరఫరా చేసే వాటర్ పైప్ లైన్ లీకేజీ అవుతోందని ఆయన పేర్కొన్నారు. ఈ పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయనున్నందున ఈ నెల 4వ తేదీ నగరంలో తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని వెల్లడించారు. కావున నగరవాసులు తాగునీటిని పొదుపుగా వాడుకోవాలని ఆయన సూచించారు.

ఎలక్షన్ రెమ్యూనరేషన్, డీఏలు చెల్లించాలి

కరీంనగర్: ఎంతో వ్యయ ప్రయాసలకోర్చి, ఎలక్షన్ విధులు నిర్విఘ్నంగా నిర్వహించిన సిబ్బందికి తగిన విధంగా డీఏలు, రెమ్యూనరేషన్ ఇవ్వకపోవడం బాధాకరమని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మాడుగుల రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఒక్కో జిల్లాలో ఒక్కోవిధంగా రంగారెడ్డి పీవో, ఏపీవోకు రూ.2400, మిగతా జిల్లాల్లో రూ.1400, కొన్ని జిల్లాల్లో రూ.1800, రంగారెడ్డి జిల్లాలో రూ.1500, కొన్ని జిల్లాల్లో రూ.800, మరికొన్ని జిల్లాల్లో రూ.500 చెల్లించడం సరికాదని అన్నారు. ఇక డీఏ రూల్స్ ప్రకారం అర్ధరాత్రి దాటితే మరో డీఏ చెల్లించాలి కానీ మూస పద్ధతిలో రోజుకు ఒక డీఏ చొప్పున చెల్లించి మరో డీఏను చెల్లించకపోవడం నిబంధనలను తుంగలో తొక్కడమేనన్నారు. వెంటనే కలెక్టర్ స్పందించి పీవో, ఏపీవోలకు రెండు రోజుల ట్రెయినింగ్ డీఏలు, నాలుగు ఎలక్షన్ డీఏలు మొత్తం ఆరు డీఏలు, రెమ్యూనరేషన్ చెల్లించాలని డిమాండ్ చేశారు.

ర్యాండమైజేషన్ పూర్తి



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి

- కలెక్టర్ పమేలా సత్పతి


కరీంనగర్ అర్బన్: ఓట్ల లెక్కింపునకు ఎన్నికల సిబ్బంది ర్యాండమైజేషన్ ప్రక్రియ కౌంటింగ్ పరిశీలకులు సీఆర్ ప్రసన్న, ఎస్‌జే చౌడ, మనీష్‌కుమార్ లోహన్ సమక్షంలో పూర్తయినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. శనివారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో ఓట్ల లెక్కింపు సిబ్బంది ర్యాండమైజేషన్ నిర్వహించారు. జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఈ నెల 3న ఆదివారం ఎస్సారార్ కళాశాలలో జిల్లాలోని కరీంనగర్ 390 పోలింగ్ కేంద్రాల ద్వారా 27 మంది అభ్యర్థుల ఓట్లను లెక్కించడానికి 22 మంది కౌంటింగ్ సూపర్‌వైజర్లు, 28 మంది కౌంటింగ్ అసిస్టెంట్లు, 22 మంది మైక్రో అబ్జర్వర్లు, 16 రిజర్వుతో కలుపుకొని మొత్తం 88మందిని నియమించినట్లు పేర్కొన్నారు. మానకొండూర్‌కు సంబంధించి 316 పోలింగ్ కేంద్రాల ద్వారా 10మంది అభ్యర్థుల ఓట్లను లెక్కించడానికి 17మంది కౌంటింగ్ సూపర్‌వైజర్లు, 20మంది కౌంటింగ్ అసిస్టెంట్లు, 17మంది మైక్రో అబ్జర్వర్లు, 14 మంది రిజర్వ్‌తో కలుపుకొని 68మందిని నియమించామని అన్నారు. హుజూరాబాద్ 305 పోలింగ్ కేంద్రాల ద్వారా 22 మంది అభ్యర్థుల ఓట్లను లెక్కించడానికి 17మంది కౌంటింగ్ సూపర్‌వైజర్లు, 20మంది కౌంటింగ్ అసిస్టెంట్లు, 17 మంది మైక్రో అబ్జర్వర్లను 15 మంది రిజర్వ్‌తో కలుపుకొని 69మందిని నియమించినట్లు వివరించారు. చొప్పదండిలో 327 పోలింగ్ కేంద్రాలలో మంది ఓట్లను లెక్కించడానికి 16 మంది కౌంటింగ్ సూపర్‌వైజర్లు 18మంది కౌంటింగ్ అసిస్టెంట్లు, 16మంది మైక్రో అబ్జర్వర్లను 14మంది రిజర్వ్‌తో కలుపుకొని 64 మందిని మొత్తంగా 305మందిని నియమించినట్లు వివరించారు. ఆర్వోలు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మి కిరణ్, కె.మహేశ్వర్, ఎస్.రాజు, సీపీవో కొమురయ్య, డీఐవో శివరాం, డీటీవో నాగరాజు, జీఎం ఇండస్ట్రీస్ నవీన్ పాల్గొన్నారు.

కౌంటింగ్ ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్

అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు జరగనున్న ఎస్సారార్ కళాశాలను జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి శనివారం పరిశీలించారు. నియోజకవర్గాల వారీగా ఎన్ని టేబుళ్లు ఏర్పాటు చేశారు, ఎన్ని రౌండ్లుగా లెక్కించనున్నారు, సిబ్బంది వివరాలు, సౌకర్యాల ఏర్పాట్లను అధికారులతో సమీక్షించారు. అధికారులు, సిబ్బంది పారదర్శకంగా వ్యవహరించాలని, ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలుండాలని సూచించారు.

లెక్కింపులో సమస్య ఉంటే వీవీప్యాట్లే కీలకం

- ఇబ్బందులుంటే వినియోగించుకొనే వెసులుబాటు



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఎన్నికల్లో చివరి ఘట్టం ఓట్ల లెక్కింపు. ఈ సమయంలో ఈవీఎంలలో సమస్య వస్తే వీవీప్యాట్లే కీలకం. గత నెల 30న పోలింగ్‌తో అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంలలో నిక్షిప్తమై ఉంది. ఆదివారం ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఈమేరకు ఎస్సారార్ కళాశాలలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

పారదర్శక ఎన్నికలకు వీవీప్యాట్లు

ఎన్నికల్లో పారదర్శకతను పెంచడంతోపాటు ఓటర్ల నమ్మకాన్ని చూరగొనేందుకు ఎన్నికల సంఘం 2014 నాటి ఎన్నికల్లో వీవీప్యాట్లను అందుబాటులోకి తెచ్చింది. ఓటు వేయగానే కాగితంపై ఏ గుర్తుకు ఓటు వేశారో వీవీప్యాట్ తెరపై 7 సెకన్ల పాటు కనిపిస్తుంది. దీంతో ఓటరు తన ఓటు ఎవరికి పడిందోననే సందేహం కలగకుండా ఉంటుంది. ఈవీఎంలు మొరాయించడం, ఇతర సమస్యలు తలెత్తిన సమయంలో వీవీప్యాట్లలో భద్రపరచి ఉన్న చీటీలను లెక్కించి సమస్యను పరిష్కరిస్తారు. నియోజకవర్గంలో 5 వీవీప్యాట్లను లాటరీ పద్ధతిలో ఎంపిక చేసుకొని లెక్కిస్తారు. ఈవీఎంల ద్వారా వచ్చిన ఫలితం, వీవీప్యాట్స్ ద్వారా వచ్చిన ఫలితాన్ని సరిచూసుకొని ఆర్వో తుది ఫలితాన్ని ప్రకటిస్తారు.

ఈవీఎంలు మొరాయించినా..

ఒక్కో ఈవీఎంలో నిక్షిప్తమైన ఓట్ల వివరాలను సాధారణంగా లెక్కించేందుకు గరిష్టంగా రెండు నిమిషాల సమయం పడుతుంది. కొన్ని సందర్భాల్లో ఈవీఎంలు మొరాయిస్తే ఆగ్జిలరీ యూనిట్ ద్వారా పోటీలో ఉన్న అభ్యర్థుల్లో ఎవరెవరికి ఎన్ని ఓట్లు పోలయ్యాయో తెలుసుకునే అవకాశం ఉంది. ఇది సాధ్యం కాకపోతే వీవీప్యాట్ చీటీలను లెక్కించేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. ఎక్కడైనా మెజార్టీ స్వల్పంగా ఉన్నప్పుడు వీవీప్యాట్ లను లెక్కించాలని అభ్యర్థులు పట్టుపడితే విషయాన్ని స్థానిక అధికారులు ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లి వారి అనుమతితో తదుపరి చర్యలు తీసుకుంటారు.

గెలుపెవరిదో..

ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి



కౌంటింగ్‌కు సిద్ధంగా ఉన్న ఈవీఎంలు

ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్‌తో మొదలు

- మధ్యాహ్నానికి తేలనున్న అభ్యర్థుల భవితవ్యం
- తొలుత రామగుండం, ఆఖరున కరీంనగర్ ఫలితాలు!
- కరీంనగర్, హుజూరాబాద్‌పై కోస్తాలో జోరుగా బెట్టింగ్



ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

ఉమ్మడి జిల్లాలో ఓట్ల వివరాలు..

నియోజకవర్గం	పోస్టల్ బ్యాలెట్	ఈవీఎంలు	పోలైన ఓట్లు	రౌండ్లు	టేబుళ్లు
కరీంనగర్	1,700	390	2,24,504	25	16
చొప్పదండి	974	327	1,81,194	24	14
మానకొండూరు	1,424	287	1,84,413	23	14
హుజూరాబాద్	1,981	305	2,07,609	22	14
పెద్దపల్లి	1,815	580	2,07,397	21	14
మంథని	993	576	1,95,635	20	14
రామగుండం	1,356	520	1,51,865	19	14
జగిత్యాల	1,997	254	174584	19	14
కోరుట్ల	1,680	270	1,82,140	19	14
ధర్మపురి	1,295	259	1,79,271	20	14
సిరిసిల్ల	1,676	287	1,88,202	21	14
వేములవాడ	1,306	260	1,74,300	19	14

సాక్షి ప్రతినిధి, కరీంనగర్:

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని 12 అసెంబ్లీ స్థానాలకు సంబంధించిన ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆదివారం ఉదయం 8 గంటలకు తొలుత పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కించనున్న అధికారులు వీటి ఫలితాలను తొలి అరగంటలో వెల్లడించనున్నారు. ఉమ్మడి జిల్లాలోని కార్పొరేషన్లలో తక్కువ ఓటింగ్ నమోదైంది. పోలైన ఓట్ల పరంగా చూసినప్పుడు కరీంనగర్ 2,24,504 ఓట్లతో మొదటి స్థానంలో, రామగుండం 1,51,865 ఓట్లతో చివరి స్థానంలో నిలిచింది. ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తని పక్షంలో రామగుండం ఫలితాలే మొదట వచ్చే అవకాశముంది. ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. కరీంనగర్, హుజూరాబాద్ నియోజవర్గాల ఫలితాలపై కోస్తాంధ్రలో బెట్టింగ్ జోరుగా జరుగుతోంది.

కరీంనగర్ ఎస్సారార్ కాలేజీలో..

కరీంనగర్‌లోని ఎస్సారార్ కాలేజీలో కరీంనగర్, మానకొండూర్, హుజూరాబాద్, చొప్పదండి నియోజకవర్గాల ఓట్లు లెక్కించనున్నారు. ఇందుకోసం ఎన్నికల సిబ్బంది ర్యాండమైజేషన్ ప్రక్రియను కౌంటింగ్ పరిశీలకులు సీఆర్ ప్రసన్న, ఎస్‌జే చౌడ, మనీష్ కుమార్ లోహన్ సమక్షంలో పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. అన్ని నియోజకవర్గాలకు పోలైన ఓట్ల ఆధారంగా కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లు, రిజర్వు సిబ్బందిని అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు.

జగిత్యాల వీఆర్‌కే కళాశాలలో..

జగిత్యాల జిల్లా కేంద్రంలోని వీఆర్‌కే కళాశాలలో ఓట్ల లెక్కింపు కోసం ఏర్పాట్లు పూర్తి చేశారు. కోరుట్ల, ధర్మపురి, జగిత్యాల నియోజకవర్గాలకు చెందిన అభ్యర్థుల ఓట్ల లెక్కింపును లెక్కించనున్నారు. ఒక్కో నియోజకవర్గానికి సంబంధించి 14 టేబుళ్లను ఏర్పాటు చేశారు. ప్రతీ టేబుల్ వద్ద ఒక సూపర్‌వైజర్, ఒక మైక్రో అబ్జర్వర్, ఒక కౌంటింగ్ అసిస్టెంట్ ఉంటారు. జగిత్యాల ఫలితం 19, ధర్మపురి ఫలితం 20, కోరుట్ల ఫలితం 19 రౌండ్లలో వెలువడనున్నాయి.

జేఎన్టీయూలో పెద్దపల్లి కౌంటింగ్..

పెద్దపల్లి జిల్లాలోని పెద్దపల్లి, మంథని, రామగుండం నియోజవర్గాల ఓట్లను రామగిరి మండలంలోని జేఎన్టీయూ బ్లాక్–2లో లెక్కించనున్నారు. జిల్లాలో తొలి ఫలితం రామగుండానిదే. తర్వాత పెద్దపల్లి, మంథని ఫలితాలు వెలువడే అవకాశాలున్నాయి.

బద్దెనపల్లి గురుకులంలో సిరిసిల్ల, వేములవాడ..

రాజన్నసిరిసిల్ల జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపును తంగళ్లపల్లి మండలంలోని బద్దెనపల్లి గురుకుల విద్యాలయంలో చేపట్టనున్నారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్ ఏర్పాట్లను శనివారం పరిశీలించారు. ఆదివారం ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు.

ఇం'ధనం' @ రూ.7.20కోట్లు

- అసెంబ్లీ ఎన్నికల్లో భారీగా వినియోగం
- నెల రోజుల్లో 10లక్షల లీటర్లు ఖర్చు
- అభ్యర్థులకు తడిసిమోపెడు



కరీంనగర్ అర్బన్: అసెంబ్లీ ఎన్నికల్లో కోట్ల ఇంధనం ఖర్చయింది. ర్యాలీలు, సభలు, రోడ్‌షోలు, బైక్‌ర్యాలీ, రోజువారీ ప్రచారం క్రమంలో అభ్యర్థులకు ఇంధన ఖర్చు తడిసిమోపెడైంది. తమ ప్రచార వాహనాలు కదలాలంటే డీజిల్, పెట్రోల్ తప్పనిసరి. పెట్రోల్, డీజిల్ ధరల క్రమంలో అభ్యర్థులు బేజారయ్యారు. షెడ్యూల్ అక్టోబర్ 9న విడుదలవగా నవంబర్ 3నుంచి నామినేషన్ల ఘట్టం ప్రారంభమైంది. అక్టోబర్ 11 నుంచే పార్టీల కార్యక్రమాలు ఊపందుకోగా 53రోజుల పాటు ప్రచారం, పార్టీల సమావేశాలు జరగగా వాహన శ్రేణి తప్పనిసరి. వాహనాలంటేనే ఇంధన ధరలపై ఆలోచించాల్సి వచ్చిందని ఓ పార్టీ అభ్యర్థి 'సాక్షి'తో వాపోయారు.

ప్రచారమంటేనే భారీ ఖర్చు

జిల్లాలో నాలుగు నియోజకవర్గాల్లో 10,59,215 మంది ఓటర్లున్నారు. ప్రతి ఓటరును కలిసేలా అభ్యర్థులు రూట్ మ్యాపు సిద్ధం చేసుకోగా తదనుగుణంగా ప్రచారం నిర్వహించారు. ఒక్కో నియోజకవర్గంలో అన్ని గ్రామాలను కలియతిరుగుతూ 50కిలోమీటర్ల వరకు ప్రయాణించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో రోజువారీగా ఒక్కో వాహనం వంద కిలోమీటర్లు లెక్కకట్టినా ఇంధనానికి రూ.550వరకు ఖర్చవుతోంది. ఇలా ఒక్కో అభ్యర్థికి సంబంధించి ప్రచారం, అనుచరులకు సంబంధించి 20వాహనాలైనా 11వేల వరకు ఇంధనానికి ఖర్చవుతోంది. డ్రైవర్ బస్తా, కిరాయి అదనం. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం అభ్యర్థి గరిష్ట వ్యయం రూ.30.80లక్షలు మాత్రమే. దీంతో ఇంధన ధరల క్రమంలో అచితూచి వ్యవహరించారు.

బహిరంగ సభలు.. ఇన్‌చార్జిల ఖర్చు అదనం

అసెంబ్లీ ఎన్నికలను ప్రధాన పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకోగా కాకలు తీరిన నేతలు ప్రచారంలో భాగస్వాములయ్యారు. ఎన్నికల షెడ్యూల్‌కు ముందే పార్టీల అధినేతలు, ప్రధానమంత్రితో పాటు కేంద్ర మంత్రులు, కాంగ్రెస్ అగ్రనేతలు, ఇతర రాష్ట్రాల సీఎంలు భారీ బహిరంగ సభలు నిర్వహించారు. స్టార్ కాంపెయినర్లు 70 మంది వరకు ఉండగా వంద ఓటర్లకో ఇన్‌చార్జి ఉన్నారు. వీరంతా రాకపోకలు సాగించేందుకు వాహనాలకు ఇంధన వినియోగం తప్పనిసరి. దీంతో పాటు రోజువారీ ప్రచారంలో పాల్గొనే కార్యకర్తలకు ద్విచక్ర వాహనాల్లో పెట్రోల్ అదనపు భారం. ఈ క్రమంలో వేల లీటర్లలో ఇంధనం వినియోగించారు. మొత్తం ఎన్నికల ప్రచారంలో ఇంధనానికే రూ.కోట్లలో ఖర్చు కావడం రవాణా ప్రాధాన్యం చాటుతోంది.

ఇంధన వినియోగమిలా..

ఎన్నికల షెడ్యూల్ విడుదల:	అక్టోబర్ 9
పోలింగ్‌కు నవంబర్ 30వరకు గల రోజులు:	53
జిల్లాలో మొత్తం పెట్రోల్ బంకులు:	52
ఎన్నికలకు ముందు రోజువారీ వినియోగం:	76వేల లీటర్లు
ప్రచారంతో వినియోగం:	2,12,000 లీటర్లు
అదనపు వినియోగం:	1,36,000 లీటర్లు
అదనపు వినియోగంతో రోజు ఖర్చు:	రూ.13.60లక్షలు
ఎన్నికల్లో మొత్తం ఖర్చు(అంచనా):	రూ.7.20కోట్లు

గెలుస్తడు కాస్కో.. మెజారిటీ రాసుకో..

- ఎగ్జిట్ పోల్స్‌తో గెలుపోటములపై జోరుగా చర్చ
- ఏ పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయనేదానిపై ఆరా
- కేసీఆర్ మళ్లీ సీఎం అవుతారా?
- కాంగ్రెస్ వస్తే సీఎం ఎవరు? అనేదానిపై పందేలు



సాక్షి, పెద్దపల్లి: 'రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి వస్తుంది? ఎగ్జిట్ పోల్స్ నిజమవుతాయా? కాంగ్రెస్ సీట్లు గెలుస్తుందా? బీఆర్ఎస్‌యే అధికారంలోకి వస్తుంది కాస్కో అంటే.. కాంగ్రెస్ మెజార్టీ రాసుకో' అంటూ జిల్లాలో అసెంబ్లీ ఫలితాలపై జోరుగా బెట్టింగ్‌లు నడుస్తున్నాయి. స్థానిక అభ్యర్థుల కంటే రాష్ట్రంలో ఎవరు అధికారంలోకి వస్తారు, ఎవరు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్నారనే దానిపై చర్చ జరుగుతోంది. ఆదివారంతో ఎవరు అధికారాన్ని చేపట్టబోతున్నారనే అంశంపై స్పష్టత రానుండటంతో ప్రజలందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

ఎగ్జిట్ పోల్స్‌తో

గురువారం విడుదలైన ఎగ్జిట్‌పోల్స్ మరింత ఉత్కంఠ తెచ్చిపెట్టాయి. రాష్ట్రంలో కాంగ్రెస్‌కు అనుకూలంగా ఎగ్జిట్‌పోల్స్ రాగా, బీఆర్ఎస్ శ్రేణులు మాత్రం ఎగ్జిట్‌పోల్స్‌ను కొట్టిపారేస్తూ తుది ఫలితం తమకే అనుకూలంగా వస్తుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు. పట్టణాలతోపాటు గ్రామాల్లోనూ ఏ నలుగురు కలిసినా కేసీఆర్ మళ్లీ వస్తారా? కాంగ్రెస్ అధికారం చేపట్టేలా ఫుల్ మెజార్టీ వస్తుందా? మెజార్టీ వస్తే సీఎం ఎవరు? అంటూ లెక్కలు వేస్తూ సరదాగా పందేలు కాస్తున్నారు.

పందేలు పలురకాలు..

క్రికెట్‌లో ఎలాగైతే టాస్ ఎవరూ గెలుస్తారు నుంచి ఏ బాల్‌కు సిక్స్, ఫోర్ కొడుతారు లాంటి అంశాలపై బెట్టింగ్ కాచేవారు. ఇప్పుడు దాదాపు అన్ని సర్వేల్లో కాంగ్రెస్‌కు గరిష్టంగా 75స్థానాలు వస్తాయని చెప్పాయి. దీంతో అధికార పార్టీ గెలిచే మిగిలిన స్థానాలు ఏమిటి? బీజేపీ, బీఎస్పీల అభ్యర్థులు గెలిచే నియోజవర్గాలు ఏమిటి? అనే అంశాలపై పందేలు కాస్తున్నారు. ఎగ్జిట్‌పోల్స్ కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉండటంతో ఆ శ్రేణుల్లో జోష్ నెలకొంది. ఆదివారం వెల్లడికానున్న ఫలితాలతో అదృష్టం ఎవరిని వరించనుందో తేలిపోనుంది.

ఎస్సారార్ కౌంటింగ్ సెంటర్‌లో మూడంచెల భద్రత

- జిల్లావ్యాప్తంగా నేటినుంచి 4వ తేదీ ఉదయం వరకు 144 సెక్షన్
- ఉత్తర్వులు జారీ చేసిన సీపీ అభిషేక్ మహంతి

కరీంనగర్‌క్రైం: ఆదివారం రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో కరీంనగర్ జిల్లావ్యాప్తంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఎస్సారార్ కౌంటింగ్ కేంద్రం వద్ద సీపీ అభిషేక్ మహంతి ఆధ్వర్యంలో మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. కౌంటింగ్ సందర్భంగా పోటీ చేసిన అభ్యర్థులు, ఏజెంట్లు తదితరులకు ముందస్తుగానే పాస్‌లు జారీ చేశారు. పాస్‌లు ఉన్న వారిని మాత్రమే లోనికి అనుమతించనున్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా సాగేలా మూడోతేదీ ఉదయం ఆరుగంటల నుంచి 4వ తేదీ ఉదయం ఆరు గంటల వరకు కమిషనరేట్ వ్యాప్తంగా 144సెక్షన్ అమలులో ఉంటుందని సీపీ వెల్లడించారు. దీని ప్రకారం.. ఐదుగురికి మించి గుమికూడరాదని తెలిపారు. ఏదైనా చట్టపరిధిలోని కారణంచేత, సమావేశం అయ్యే అవసరం ఉంటే సంబంధిత అధికారి అనుమతి తప్పనిసరి అని తెలిపారు. 144సెక్షన్ ఉత్తర్వులు ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

లెక్కింపు ముగిసేవరకు కేంద్రాన్ని వదలొద్దు

- కౌంటింగ్ అబ్జర్వర్ సీఆర్.ప్రసన్న కుమార్

కరీంనగర్ అర్బన్: ఓట్ల లెక్కింపు సెంటర్‌లో ఉండే సిబ్బంది ఎవరూ కౌంటింగ్ ముగిసే వరకు కేంద్రాన్నివదిలి వెళ్లకూడదని కౌంటింగ్ అబ్జర్వర్ సీఆర్ ప్రసన్న కుమార్ సూచించారు. శనివారం కలెక్టరేట్ ఆడిటోరియంలో అసెంబ్లీ ఎన్నికల ఓట్ల కౌంటింగ్‌లో పాల్గొనే అకౌంటింగ్ సూపర్‌వైజర్లు, మైక్రో అబ్జర్వర్లకు మాస్టర్ ట్రైనర్లు శిక్షణ నిర్వహించారు. కౌంటింగ్ అబ్జర్వర్లు సీఆర్ ప్రసన్న, ఎస్‌జే.చౌడ, మనిష్ కుమార్‌లోహన్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కౌంటింగ్‌హాల్లో మైక్రో అబ్జర్వర్లు ఉదయం 6గంటలకు హాజరు కావాలని తెలిపారు. కౌంటింగ్ కేంద్రంలోని సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకువెళ్లకూడదని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్‌లను మొదటగా లెక్కించాలని, అనంతరం ఈవీఎంలోని ఓట్లను లెక్కించాలని సూచించారు. ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని, ఏవైనా సమస్యలు ఎదురైనట్లయితే వెంటనే రిటర్నింగ్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ సదానందం, మార్కెటింగ్ అధికారి పద్మావతి, ఎల్డీఎం ఆంజనేయులు, డీఈవో జనార్దన్ రావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కౌంటింగ్ అబ్జర్వర్ ప్రసన్నకుమార్

క్లుప్తంగా

డిజిటల్‌ విద్యపై అవగాహన ఉండాలి



జ్యోతిప్రజ్వలన చేసిన రవీందర్‌రెడ్డి, లెక్చరర్లు

కరీంనగర్‌రూరల్‌: నగునూరు తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో శనివారం కంప్యూటర్‌ సైన్స్‌ డిపార్ట్‌మెంట్‌ ఆధ్వర్యంలో అంతర్జాతీయ డిజిటల్‌ లిటరసీ డే నిర్వహించారు. కార్యక్రమాన్ని అల్ఫోర్స్‌ మహిళా డిగ్రీ కళాశాల చైర్మన్‌ రవీందర్‌రెడ్డి జ్యోతిప్రజ్వలన చేసి, ప్రారంభించారు. పోటీ ప్రపంచంలో విద్యార్థులందరికీ తప్పనిసరిగా డిజిటల్‌ విద్యపై అవగాహన ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులు డిజిటల్‌ లిటరసీపై ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్‌ డి.శ్రీహరి, వైస్‌ ప్రిన్సిపాల్‌ సమత, కంప్యూటర్‌ సైన్స్‌ డిపార్ట్‌మెంట్‌ హెచ్‌వోడీ లలితా అశ్విని, లైబ్రేరియన్‌ మోహన్‌రావు, లెక్చరర్లు ఇందిర, శారద, నమ్రత తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌యూ ఎన్‌ఎస్‌ఎస్‌ కో–ఆర్డినేటర్‌గా మనోహర్‌



నియామక పత్రం ఇస్తున్న వీసీ మల్లేశ్‌

కరీంనగర్‌ సిటీ: శాతవాహన విశ్వవిద్యాలయం ఎన్‌ఎస్‌ఎస్‌ నూతన కో–ఆర్డినేటర్‌గా డా.ఎ.మనోహర్‌ నియమితులయ్యారు. ఈ మేరకు వర్సిటీ వీసీ ప్రొఫెసర్‌ మల్లేశ్‌ శనివారం ఆయనకు నియామక పత్రం అందించారు. రిజిస్ట్రార్‌ వరప్రసాద్‌, అసిస్టెంట్‌ రిజిస్ట్రార్‌ ప్రసాద్‌, ఫైనాన్స్‌ ఆఫీసర్‌ రవీందర్‌, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్‌ ఎస్‌.వి.శ్రీరంగ ప్రసాద్‌, డాక్టర్‌రమేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

ఐక్యూఏసీ డైరెక్టర్‌గా శ్రీరంగప్రసాద్‌



నియామక పత్రం అందిస్తున్న వీసీ మల్లేశ్‌

కరీంనగర్‌ సిటీ: శాతవాహన యూనివర్సిటీ అంతర్గత బదిలీల్లో భాగంగా వర్సిటీ ఐక్యూఏసీ డైరెక్టర్‌గా డాక్టర్‌ ఎస్‌.వి.శ్రీరంగప్రసాద్‌ నియమితులయ్యారు. ఈ మేరకు విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య మల్లేశ్‌ శనివారం ఆయనకు నియామక పత్రం అందజేశారు.

సెల్‌ఫోన్‌ అప్పగింత



ఫోన్‌ అందిస్తున్న ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి

ముస్తాబాద్‌(సిరిసిల్ల): మండలంలోని గూడెం గ్రామానికి చెందిన రాజలింగం ఇటీవల తన స్మార్ట్‌ ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. ఆయన ఫిర్యాదు మేరకు ఐటీ కానిస్టేబుల్‌ రాజశేఖర్‌ ఫోన్‌ను రికవరీ చేశారు. ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి శనివారం బాధితుడిని పిలిపించి, అందజేశారు. ఈ సందర్భంగా రాజలింగం వారికి కృతజ్ఞతలు తెలిపాడు.

అపు'రూప' నేతకారుడు







- సిరిసిల్ల చిత్రకారుడి సజీవ చిత్రాలు
- అనుభూతులు.. అపురూపాలు..
- అద్భుత చిత్రాలను ఆవిష్కరించిన వెంగళ గణేశ్‌

సిరిసిల్ల : కోటి భావాలను ఆయన చిత్రాలు ఆవిష్కరిస్తాయి. ఎన్నెన్నో ఊహాలను, ఊసులను పంచుతాయి. ఒక్క క్షణం మనల్ని ఊహాలోకంలోకి తీసుకెళ్లాయి. కన్నీళ్లు పెట్టిస్తాయి, నవ్వులు పుట్టిస్తాయి. సిరిసిల్ల సుందరయ్యనగర్‌ నేత కార్మిక కుటుంబానికి చెందిన వెంగళ గణేశ్‌ చిత్రకారుడిగా అద్భుతమైన చిత్రాలను వేశారు. రంగులతో బొమ్మలేస్తూ.. అబ్బుర పరిచే అపు'రూపాల'ను ఆవిష్కరించారు. వెంగళ గణేశ్‌ చిత్రకళపై కథనమిది..

నేతన్నల బతుకులపై..

రాత్‌ పైలీ, దిన్‌ పైలీ(రేయింబవళ్లు) మరమగ్గాల మధ్య శ్రమించిన నేత కార్మికుడు బతుకుదెరువు లేక ఆ మగ్గాల మధ్యే నూలుపోగుల్ని ఉరితాళ్లు చేసుకున్న నేతన్న దుస్థితిని తన చిత్రంలో ఆవిష్కరించారు గణేశ్‌. తెలంగాణపల్లె పడచుల అందాల్ని.. పిల్లల ఆటలను, ప్రాంతీయ అసమానతలను ఎలిగెత్తిచాటారు. ప్రకృతి రమణీయత చిత్రాలతోపాటు సందేశాత్మక బొమ్మలను వేస్తూ ఆకట్టుకుంటున్నాడు. చిన్నారులు వాగులో ఇసుకతో పిట్టగూళ్ల ఆటను.. మూటాముల్లె చంకలో పాపతో వెళ్లే పల్లెపడచు చిత్రాన్ని హృదయాలనత్తుకునేలా





తీర్చిదిద్దారు. వందలాది చిత్రాలతో గణేశ్‌ చిత్రకారుడిగా గుర్తింపు సాధించారు.

సామాజిక ఉద్యమానికి బాసట

గణేశ్‌ తన చిత్రాలతో సామాజిక ఉద్యమాలకు బాసటగా నిలుస్తున్నాడు. వంద చిత్రాలతో శ్రీకృష్ణ కమిటీకి చిత్రనివేదన చేసి తెలంగాణ ఆకాంక్షను చాటుకున్నాడు. అంతకుముందు దివంగత మహానేత వైఎస్‌ రాజశేఖరరెడ్డి మరణానంతరం పదకొండు అడుగుల భారీ చిత్రాన్ని గణేశ్‌ తీర్చిదిద్దారు. ఎయిడ్స్‌, పర్యావరణ పరిరక్షణ, నేతన్నల ఆత్మహత్యలు, ముంబయిలో ఉగ్రవాదుల దాడులు లాంటి సమకాలిన సామాజికాంశాలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ సృజనాత్మకంగా చిత్రాలు వేస్తూ జిల్లా స్థాయిలో గ్రామీణ కళాజ్యోతి అవార్డు, కళాసేవ పురస్కారాన్ని అందుకున్నారు.



ఆసక్తితో చిత్రాలు వేస్తాను..

నాకు బొమ్మలు వేయడం చాలా ఇష్టం. ఆ ఆసక్తితోనే చిత్రాలు వేస్తాను. రంగులతో బొమ్మలు వేసే చిత్రకారులకు ఒక వేదిక లేదు. ఆర్ట్‌గ్యాలరీ ఉంటే చిత్రకారులకు మార్కెటింగ్‌ సౌకర్యం ఉంటుంది. మరింత మంది కళాకారులు తమ చిత్రనైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ ఉపాధి పొందుతారు. ఆర్ట్‌ గ్యాలరీ స్థాపించాలని ఉంది. ఈ రంగంలో ఆసక్తి గల యువకులకు, చిత్రకళలో శిక్షణ ఇస్తాను.

– వెంగళ గణేశ్‌, చిత్రకారుడు, సిరిసిల్ల.

జిల్లా స్థాయి ఖోఖో పోటీలకు స్పందన



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్జీఎఫ్‌ కార్యదర్శి శ్రీనివాస్‌

కరీంనగర్‌ స్పోర్ట్స్‌: పాఠశాలల క్రీడా సమాఖ్య జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం కరీంనగర్‌లోని అంబేడ్కర్‌ స్టేడియంలో నిర్వహించిన అండర్‌–14 బాలబాలికల ఖోఖో పోటీలకు స్పందన వచ్చింది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. పోటీలను జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య కార్యదర్శి శ్రీనివాస్‌ ప్రారంభించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో విజయం సాధించి, జిల్లాకు పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో పీడీ, పీఈటీలు సారయ్య, శంకరయ్య, ఎల్వీ రమణ, హన్మంతు, శ్రీనివాస్‌, సత్యనారాయణ, రేణుక, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లాస్థాయి అథ్లెటిక్స్‌ పోటీలు..

జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం కరీంనగర్‌లోని అంబేడ్కర్‌ స్టేడియంలో అండర్‌–14, 17 బాలబాలికలకు అథ్లెటిక్స్‌ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య కార్యదర్శి శ్రీనివాస్‌ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు తమ వయసు ధ్రువీకరణ పత్రంతో ఉదయం స్టేడియంలో రిపోర్టు చేయాలని సూచించారు.

కుక్కల దాడిలో బాలుడికి గాయాలు



బాలుడి తలపై గాయం

గన్నేరువరం(మానకొండూర్‌): మండలంలోని మాదాపూర్‌లో శనివారం కుక్కల దాడి చేయగా ఓ బాలుడికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. నౌండ్ల శంకర్‌–శిరీష దంపతుల కుమారుడు 13 నెలల అన్విత్‌ ఇంటి ముందు ఆడుకుంటున్నాడు. కుటుంబసభ్యులు ఇంట్లో సామగ్రి సర్దే పనిలో ఉన్నారు. ఒక్కసారిగా చిన్నారి ఏడుపు విని, శిరీష బయటకు వచ్చింది. కుక్కలు అన్విత్‌ను లాక్కెళ్తుండటం చూసి, వెంటనే వాటిని తరిమింది. బాబు తలపై గాయాలైనట్లు కుటుంబసభ్యులు తెలిపారు. చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

శతాధిక వృద్ధురాలి మృతి



భూమవ్వ (ఫైల్‌)

రామడుగు(చొప్పదండి): మండలంలోని వెదిర గ్రామానికి చెందిన పన్యాల భూమవ్వ(102) మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. వారం రోజులుగా అనారోగ్యంతో బాధ పడుతున్న ఆమె శనివారం ఉదయం చనిపోయినట్లు పేర్కొన్నారు. భూమవ్వకు ఇద్దరు కూతుళ్లు, ఇద్దరు కుమారులు, మనవళ్లు, మనవరాళ్లు ఉన్నారని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

పాలకుర్తి(రామగుండం): రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పాలకుర్తి మండలంలోని ఈసాలతక్కళ్లపల్లికి చెందిన పెసరి నవీన్‌ తన భార్య సమతను శనివారం బైక్‌పై ఆస్పత్రికి తీసుకెళ్తున్నాడు. పాలకుర్తి శివారులో ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టి, సమీపంలోని చెట్టుకు తగిలి ఆగిపోయింది. వెంటనే కారులోని ఎయిర్‌ బెలూన్స్‌ తెరుచుకోవడంతో అందులో ప్రయాణిస్తున్న వారికి ఎలాంటి గాయాలు కాలేదు. నవీన్‌, సమతలకు స్వల్ప గాయాలు కావడంతో స్థానికులు ఆస్పత్రికి తరలించారు. కాగా, సంఘటన స్థలం మూలమలుపు కావడం, రోడ్డును ఆనుకొని వ్యవసాయ బావి, చెట్ల పొదలు ఉండటంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదని వాహనదారులు తెలిపారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, చెట్ల పొదలు తొలగించి, సైన్‌ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు.

పశుగ్రాసం దగ్ధం



మంటలు ఆర్పుతున్న ఫైర్‌ సిబ్బంది

వేములవాడ: వేములవాడ పట్టణంలోని భగవంతరావునగర్‌లో శనివారం గడ్డి లోడుతో ఉన్న వ్యాన్‌కు ప్రమాదవశాత్తు నిప్పంటుకుంది. సమాచారం అందుకున్న ఫైర్‌ సిబ్బంది, టౌన్‌ సీఐ కరుణాకర్‌ అక్కడికి చేరుకుని స్థానికుల సహకారంతో మంటలు ఆర్పేశారు. దీంతో పెనుప్రమాదం తప్పింది. అక్కడే ఉన్న గోశాలకు వ్యాన్‌లో గడ్డి తీసుకురాగా, పార్క్‌ చేసిన ప్రదేశంలోనే అకస్మాత్తుగా మంటలు చెలరేగినట్లు కాలనీవాసులు తెలిపారు. కాలనీ అంతా పొగ కమ్ముకోవడంతో జనం ఊపిరి పీల్చుకునేందుకు ఇబ్బందులుపడ్డారు.

రాష్ట్ర స్థాయి క్రికెట్‌ పోటీలకు ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న హెచ్‌ఎం, పీడీ

చొప్పదండి: ఈ నెల 5వ తేదీ నుంచి గద్వాల్‌లో జరిగే రాష్ట్రస్థాయి స్కూల్‌ గేమ్స్‌ ఫెడరేషన్‌ అండర్‌–17 క్రికెట్‌ పోటీలకు చొప్పదండి బాలుర ఉన్నత పాఠశాల పదోతరగతి విద్యార్థి ఎం.సూర్యతేజ ఎంపికయ్యాడు. గత నెల 24న సెంటినరీకాలనీలో జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచడంతో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడని ఫిజికల్‌ డైరెక్టర్‌ కృష్ణ తెలిపారు. విద్యార్థిని హెచ్‌ఎం వైద్యుల రాజిరెడ్డి, ఎస్‌ఎంసీ చైర్మన్‌ మమత, ఉపాధ్యాయులు శనివారం అభినందించారు.

మహిళను నమ్మించి ఆభరణాలు చోరీ

మెట్‌పల్లి(కోరుట్ల): ఓ మహిళను నమ్మించి, ఆమె వద్ద నుంచి బంగారు ఆభరణాలు చోరీ చేసిన ఘటన మెట్‌పల్లి పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మెట్‌పల్లి దుబ్బవాడకు చెందిన ఆకుల గంగు శనివారం తన తోటకు నడుచుకుంటూ వెళ్తోంది. మార్గమధ్యలో ఎస్సారెస్పీ కెనాల్‌ వద్ద గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్రవాహనంపై వచ్చాడు. ఆమెకు రూ.1.50 లక్షల ఆఫర్‌తోపాటు తులం బంగారం వచ్చిందని సెల్‌ఫోన్‌లో చూపించాడు. తనతో వస్తే ఇప్పిస్తానని నమ్మబలికాడు. అంగీకరించడంతో ఆమె ఇంటికి వెళ్లాడు. తర్వాత ఒంటిపై బంగారం ఉంటే నగదు, బంగారం ఇవ్వరని చెప్పి, తీయించి, ఒక సంచిలో పెట్టించాడు. ఆమెను పాత బస్టాండ్‌ వద్ద దించాడు. అక్కడి నుంచి తిరిగి ఆ మహిళ ఇంటికి వెళ్లి, సంచిలో ఉంచిన 3 తులాల బంగారు ఆభరణాలను తీసుకొని, పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చిరంజీవి తెలిపారు.

'చితి'కిపోయిన ఇంటి పెద్దలు

- మొన్న కుమారుడు.. నిన్న తండ్రి
- పది రోజుల వ్యవధిలో ఇద్దరూ మృతి
- నేత కుటుంబంలో విషాదం



బాలయ్య (ఫైల్‌)



ముకుందం (ఫైల్‌)

కోనరావుపేట(వేములవాడ): నేతకార్మిక కుటుంబంలో విషాదం నెలకొంది. అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులతో ఇంటి పెద్దలు 'చితి'కిపోయారు. ఆ కుటుంబంలో అనారోగ్యానికి గురైన ఏకైక కుమారుడు పదిరోజుల క్రితం చనిపోగా, శుక్రవారం రాత్రి తండ్రి మృతిచెందాడు. గ్రామస్తులు విరాళాలు సేకరించి అంత్యక్రియలు నిర్వహించారు. వివరాలు.. కోనరావుపేట మండలం ధర్మారం గ్రామానికి చెందిన ఆడెపు బాలయ్య(70) కొన్నేళ్ల క్రితం ముంబయ్‌లో నేత కార్మికుడిగా పనిచేశాడు. అతడి కొడుకు ముకుందం(49) గ్రామంలోనే ప్రైవేట్‌ పాఠశాల నిర్వహించి నష్టపోయాడు. తర్వాత ఉపాధ్యాయుడిగా పనిచేశాడు. ముకుందంకు భార్య అరుంధతి, ఇద్దరు కుమారులు ఉన్నారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ వైద్యానికి డబ్బుల్లేక నవంబర్‌ 20న మృతిచెందాడు. గ్రామస్తులు విరాళాలు జమ చేసి అంత్యక్రియలు నిర్వహించారు. ముకుందం తండ్రి బాలయ్య శుక్రవారం రాత్రి మృతిచెందగా చందాలతో అంత్యక్రియలు నిర్వహించారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అప్పు చెల్లించి 'పోయాడు'

- కామారెడ్డి జిల్లాలో రోడ్డు ప్రమాదం.. రాజన్న సిరిసిల్ల జిల్లావాసి దుర్మరణం



సత్తయ్య (ఫైల్‌)



ఘటన స్థలంలో సత్తయ్య మృతదేహం

ముస్తాబాద్‌(సిరిసిల్ల): కూతురు పెళ్లికి చేసిన అప్పు చెల్లించి ఇంటికి వస్తున్న ఓ తండ్రి రోడ్డు ప్రమాదంలో అసువులు బాసిన ఘటన విషాదం నింపింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్‌కు చెందిన సింగరవేణి సత్తయ్య (50) గత నెల 23న తన ఒక్కగానొక్క కూతురు మనీషా వివాహాన్ని ఘనంగా జరిపించాడు. కూతురు పెళ్లికి చేసిన అప్పు తీర్చేందుకు శనివారం అల్మాస్‌పూర్‌ నుంచి కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలం మోతే గ్రామానికి బైక్‌పై బయలుదేరాడు. మోతే గ్రామంలో అప్పు చెల్లించి ఇంటికి వస్తుండగా గుర్తు తెలియని కారు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. సత్తయ్య మృతితో భార్య, కూతురు, కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి. వారం క్రితమే కూతురు పెళ్లి చేసి అంతలోనే రోడ్డు ప్రమాదంలో సత్తయ్య మృతిచెందడంతో అల్మాస్‌పూర్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

అదుపుతప్పి ధాన్యం లారీ బోల్తా

- డ్రైవర్‌కు తీవ్ర గాయాలు
- ఆకసాయిపల్లె గుట్టమలుపు వద్ద ఘటన



బాధితుడికి ప్రథమ చికిత్స అందిస్తున్న 108 సిబ్బంది



బోల్తాపడిన లారీ

ధర్మపురి: వరి ధాన్యం లోడుతో వెళ్తున్న ఓ లారీ బోల్తా పడిన ఘటనలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. జగిత్యాల వైపు నుంచి శని వారం మధ్యాహ్నం ఓ లారీ ధర్మపురికి ధాన్యం లోడుతో వెళ్తోంది. ఆకసాయిపల్లె గుట్టమలుపు వద్ద అదుపు తప్పి పడిపోయింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌ షేక్‌ రజల్‌ కాలు నుజ్జునుజ్జయింది. స్థానికులు 108కు సమాచారం అందించడంతో సిబ్బంది అని ల్‌ వచ్చి, ప్రథమ చికిత్స చేశాడు. అనంతరం అంబులెన్స్‌లో జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. బాధితుడు గోదావరిఖనివాసి అని తెలిసింది.

పాపకు జన్మనిచ్చి.. తల్లి మృతి

- మాతాశిశు సంరక్షణ కేంద్రం ఎదుట బాధితుల ఆందోళన
- జగిత్యాలలో ఘటన
- ఆలస్యంగా వెలుగులోకి..

జగిత్యాల: పాపకు జన్మనిచ్చి.. ఓ తల్లి మృతిచెందిన ఘటన శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. ధర్మపురి మండలానికి చెందిన ఓ గర్భిణి రెండు రోజుల క్రితం ప్రసవం కోసం జగిత్యాల మాతాశిశు సంరక్షణ కేంద్రానికి వచ్చింది. వైద్యులు సిజేరియన్‌ చేయగా పాపకు జన్మనిచ్చింది. శిశువు బాగానే ఉన్నప్పటికీ తల్లికి రక్తస్రావం ఆగకపోవడంతో కుటుంబసభ్యులు కరీంనగర్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడా ఇబ్బందులు ఎదురవడంతో నగునూర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. దురదృష్టవశాత్తు ఆమె మృతిచెందింది. దీంతో మృతురాలి కుటుంబసభ్యులు, బంధువులు జగిత్యాల ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. రాత్రి 10 గంటలకు సిజేరియన్‌ చేశారని, రక్తస్రావం ఆగకపోతే కనీస చర్యలు చేపట్టలేదని ఆరోపించారు. రక్తస్రావం జరుగుతుంటే మరుసటి రోజు ఉదయం 9 గంటలకు కరీంనగర్‌ పంపించారన్నారు. ఈ విషయమై ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను వివరణ కోరగా.. ఆమెకు రక్తం కూడా ఎక్కించామని, అయినా బ్లీడింగ్‌ ఎక్కువ కావడం, అందులోనూ కార్డియా అటాక్‌ జరిగి మృతిచెందినట్లు తెలిపారు.

వేర్వేరు కారణాలతో ముగ్గురి బలవన్మరణం

ఉమ్మడి కరీంనగర్‌ జిల్లాలోని కాల్వశ్రీరాంపూర్‌, కోనరావుపేట, ఎలిగేడు మండలాల పరిధిలో ముగ్గురు వేర్వేరు కారణాలతో ఆత్మహత్య చేసుకున్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి..



మల్లయ్య (ఫైల్‌)

కాల్వశ్రీరాంపూర్‌(పెద్దపల్లి): మండలంలోని గంగారం పంచాయతీ పరిధి ఊశన్నపల్లెకు చెందిన ముష్కె మల్లయ్య(50) ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ శ్రీనివాస్‌ తెలిపిన వివరాల ప్రకారం.. కుటుంబ కలహాల కారణంగా మల్లయ్య తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. శనివారం తన వ్యవసాయ భూమి వద్దకు వెళ్లి, చెట్టుకు ఉరేసుకున్నాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నాడు. మృతుడికి భార్య స్వరూప, కుమారుడు, కూతురు ఉన్నారు.

వ్యాపారంలో నష్టం రావడంతో ఒకరు..

కోనరావుపేట(వేములవాడ): మేకల వ్యాపారంలో ఓ వ్యక్తి నష్టపోవడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. సిరిసిల్ల పరిధిలోని చిన్నబోనాలకు చెందిన ముద్దం రాములుయాదవ్‌ (55) గత 30 సంవత్సరాలుగా మేకల వ్యాపారం చేశాడు. ఇటీవల వ్యాపారంలో రూ.5 లక్షల మేర నష్టం వచ్చింది. దీంతో కొద్దిరోజులుగా మనస్తాపానికి గురయ్యాడు. ఈ నెల 1న బయటకు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయలుదేరాడు. శుక్రవారం సాయంత్రం మండలంలోని కొలనూర్‌ శివారులో చెట్టుకు ఉరేసుకొని కనిపించగా, రైతులు చూసి పోలీసులకు సమాచారం అందించారు. ఏఎస్సై శ్రీనివాస్‌రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి భార్య నర్సవ్వ ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పేర్కొన్నారు. రాములుయాదవ్‌కు భార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు.

నేతకానిపల్లిలో వివాహిత..



చంద్రకళ మృతదేహం

ఎలిగేడు(పెద్దపల్లి): మండలంలో ధూళికట్ట అనుబంధ గ్రామం నేతకానిపల్లిలో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. జూలపల్లి ఎస్‌ఐ వెంకటకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. తిమ్మాపూర్‌ మండలంలోని బాలయ్యపల్లికి చెందిన గోదారి వెంకటయ్య చిన్న కూతురు చంద్రకళను నేతకానిపల్లికి చెందిన దుర్గం శ్రీనివాస్‌కు ఇచ్చి, ఐదేళ్ల క్రితం వివాహం జరిపించారు. ఈ దంపతులకు ఇద్దరు కూతుళ్లు హర్ష, హిందు సంతానం. చంద్రకళకు వెన్నుపూస సమస్యతో బాధ పడుతుండటంతో శ్రీనివాస్‌ వివిధ ఆస్పత్రుల్లో చూపించాడు. మందులు వాడినా ఫలితం లేకపోవడంతో తీవ్రమైన నొప్పితో బాధ పడుతుండేది. ఏ పనీ చేయలేక ఇంటివద్దే ఉండేది. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది, శనివారం మధ్యాహ్నం ఇంట్లోనే ఉరేసుకుంది. చంద్రకళ మృతి విషయంలో ఎవరిపై ఎలాంటి అనుమానం లేదని మృతురాలి తండ్రి ఫిర్యాదు చేశారని ఎస్‌ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

డ్రంకెన్‌ డ్రైవ్‌ కేసులో ముగ్గురికి జైలు

కరీంనగర్‌ క్రైం: డ్రంకెన్‌ డ్రైవ్‌ కేసులో ముగ్గురికి జైలుశిక్ష విధిస్తూ కరీంనగర్‌ మున్సిఫ్‌ కోర్టు తీర్పునిచ్చింది. కరీంనగర్‌ ట్రాఫిక్‌ ఏసీపీ సర్వర్‌ తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల కరీంనగర్‌లో మద్యం సేవించి, వాహనాలు నడుపుతూ పట్టుబడిన 8 మందిని ట్రాఫిక్‌ పోలీసులు శనివారం మున్సిఫ్‌ కోర్టులో హాజరుపరిచారు. చిగురుమామిడికి చెందిన మహిపాల్‌, కరీంనగర్‌కు చెందిన రాజు, కన్నాపూర్‌కు చెందిన కనకయ్యలకు మూడు రోజుల జైలుశిక్ష, రూ.6,500 జరిమానా, మిగతా ఐదుగురికి కలిపి రూ.9 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చినట్లు ఏసీపీ పేర్కొన్నారు.

క్లుప్తంగా

మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌కు శుభాకాంక్షలు


పొన్నం ప్రభాకర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

కరీంనగర్‌రూరల్: మాజీ ఎంపీ, కాంగ్రెస్ హుస్నాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పొన్నం ప్రభాకర్‌ను శనివారం హుస్నాబాద్‌లో కరీంనగర్ మండల కాంగ్రెస్ నాయకులు కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేగా గెలుస్తున్నారని, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడుతుందంటూ ప్రభాకర్‌ను అభినందించారు. కలిసిన వారిలో మండల నాయకులు మాసం సుధాకర్, ఆవుల గౌతమ్, బుచ్చాల అనిల్, గసికంటి శ్రీనివాస్ తదితరులున్నారు.

అల్పాహారం పంపిణీ


వడ్డిస్తున్న సభ్యులు

కరీంనగర్‌రూరల్: లయన్స్ ఇంటర్నేషనల్ జిల్లా 320జీ ఆధ్వర్యంలో మీల్స్ ఆన్ వీల్స్ ద్వారా శనివారం మాతా శిశు ఆస్పత్రి ఆవరణలో రోగులతో పాటు బంధువులకు అల్పాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు చింతల కిషన్, మాసినేని చక్రాధర్-స్వాతి దంపతులు, కొంజర్ల నవీన్, రావికంటి కృష్ణకిశోర్, మంద వెంకటరమణారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, ఎడ్ల శ్రీనివాస్‌రెడ్డి, కోమల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తీగలగుట్టపల్లి మాజీ సర్పంచ్ మృతి


రంగమ్మ(ఫైల్)

కరీంనగర్‌రూరల్: తీగలగుట్టపల్లి మాజీ సర్పంచ్ కాశెట్టి రంగమ్మ(85) అనారోగ్యంతో శుక్రవారం రాత్రి 10గంటలకు మృతిచెందారు. కరీంనగర్ కార్పొరేషన్‌లో విలీనం కాకముందు 2001 సంవత్సరం నుంచి 2005 వరకు తీగలగుట్టపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా రంగమ్మ పని చేశారు. శనివారం రంగమ్మ మృతదేహానికి పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు నివాళులర్పించారు. రంగమ్మ చిన్న కుమారుడు కాశెట్టి శ్రీనివాస్ రైతుబంధు సమితి కరీంనగర్ మండల కోఆర్డినేటర్ కాగా.. కోడలు లావణ్య రెండో డివిజన్ కార్పొరేటర్‌గా ఉన్నారు. మృతురాలికి ఇద్దరు కుమారులు కాశెట్టి లక్ష్మణ్, శ్రీనివాస్‌తో పాటు ముగ్గురు కూతుళ్లున్నారు. మధ్యాహ్నం కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తుల అశ్రునయనాల నడుమ అంత్యక్రియలు పూర్తి చేశారు.

ఐఎస్‌ఏ ఫెస్టివల్‌లో శంకర్ శిల్పం


నదీతీరంలో రేవెల్లి శంకర్

సప్తగిరికాలనీ(కరీంనగర్): ఉమ్మడి కరీంనగర్ జిల్లా, ప్రస్తుత పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం కుక్కలగూడూరు గ్రామానికి చెంది కరీంనగర్‌లో నివాసముంటున్న సైకత శిల్పి రేవెల్లి శంకర్ ఒడిస్సా రాష్ట్ర టూరిజం శాఖ నిర్వహిస్తున్న ఇంటర్నేషనల్ సాండ్ ఆర్ట్ ఫెస్టివల్లో రెండో రోజు శనివారం కోణార్క్ దేవాలయ సమీపంలో గల చంద్రభాగా నదీతీరంలో ఎకో టూరిజం అంశంపై సైకత శిల్పాన్ని రూపొందించి అభినందనలు అందుకున్నారు. అడవి, ఏనుగులు, చెట్లు, ఆహ్లాద వాతావరణంతో కూడిన శిల్పం అందరినీ ఆకట్టుకుంది.

సెయింట్‌జార్జ్‌లో అల్ఫాబెట్ జంగల్


జంతువుల వేషధారణలో విద్యార్థులు

కొత్తపల్లి: రేకుర్తిలోని సెయింట్ జార్జ్ నినోస్ బ్లాక్(సీబీఎస్‌ఈ)లో శనివారం అల్ఫాబెట్ జంగల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అల్ఫాబెట్ జంగల్‌లో భాగంగా ఏ టూ జెడ్ వరకు గల జంతువుల వేషధారణలో విద్యార్థులు ఆకట్టుకున్నారు. ఇలా చేయడం ద్వారా విద్యార్థులు జంతువుల పేర్లను సులభంగా గుర్తుంచుకునే అవకాశముంటుందని సెయింట్‌జార్జ్, ప్యారడైజ్ విద్యాసంస్థల చైర్మన్ డా.పి.ఫాతిమారెడ్డి తెలిపారు. ఇన్‌చార్జి సంధ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వానరాలతో పరేషాన్


వీధిలో తిరుగుతున్న వానరాలు


ఇంటిపై కోతులు

- వీధుల్లో రచ్చరచ్చ చేస్తున్న వైనం
- బెంబేలెత్తుతున్న ప్రజలు, చిన్నారులు

సప్తగిరికాలనీ(కరీంనగర్): కరీంనగర్ స్మార్ట్ సిటీ కొన్ని రోజుల నుంచి కోతుల బెడదతో నానా తంటాలు పడుతోంది. సిటీలోని పలు వీధుల్లో వానరాలు బీభత్సం సృష్టించడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో వీధుల్లో కుక్కల బెడద ఉండగా.. ఇటీవలీ కాలంలో తగ్గింది. తీరా కుక్కల బెడద తగ్గిందని అనుకున్న సిటిజన్లకు అంతలోనే కోతుల బెడద వచ్చి పడింది. వీధుల్లోని ఇళ్లలోకి కోతులు చొరబడి రచ్చరచ్చ చేస్తున్నాయని, ఎదురు తిరిగితే పైకి వచ్చి కొరుకుతున్నాయని వాపోతున్నారు. హోటళ్లు, పండ్ల దుకాణాలు తదితర వ్యాపార కేంద్రాల్లో కోతులు చొరబడి నానా బీభత్సం సృష్టిస్తున్నాయంటున్నారు. నగరపాలక సంస్థ అధికారులు చొరవ తీసుకొని కోతుల బెడద నుంచి తప్పించాలని కోరుతున్నారు.

గుంపులుగుంపులుగా..

నగరంలోని చాలా డివిజన్లలో కోతులు గుంపులుగుంపులుగా తిరుగుతున్నాయి. ఒకేసారి సుమారు 50కి పైగా కోతులు ఒక్కసారిగా ఇళ్లు, రేకులపైకి ఎక్కి చిందరవందర చేస్తున్నాయి. ఇలా చాలా వీధుల్లో కూడా ఇదే పరిస్థితి ఉందని వాపోతున్నారు. కోతులను కట్టిపడేసే మార్గం లేదా అంటున్నారు పలు కాలనీల వాసులు. కోతులు తమ పిల్లలపైకి వచ్చి ఇబ్బంది పెడుతున్నాయంటున్నారు. వెంటనే అధికారులు కోతులన్నింటిని వేరే చోటుకి పంపించే ప్రయత్నాలు చేపట్టాలని కోరుతున్నారు.

పిల్లలు భయపడుతున్నరు



పెద్ద సంఖ్యలో కోతులు వచ్చేసరికి మా కాలనీలోని పిల్లలందరూ భయపడుతున్నరు. ఒకటి, రెండు వస్తే సంతోషంగా ఉంటున్నరు. గుంపులుగా వచ్చి ఇష్టమచ్చినట్లు వ్యవహరిస్తూ నానా బీభత్సం సృష్టించడంతో జంకుతున్నరు.

- శేఖర్, రాంనగర్

ఇంటిపైనే ఉంటున్నయ్



కోతులన్ని ఒకేసారి గుంపులుగుంపులుగా వస్తున్నయ్. ఇంటిపైనే ఉంటూ మా రేకులపై ఎగిరి దూకుతున్నయ్. ఇంటిపైనే గంటల తరబడి సుమారు 20కి పైగా కోతులు తిరుగుతున్నయ్. నగరపాలక సంస్థ అధికారులు కోతుల బెడద నుంచి కాపాడాలి.

- అరవింద్, పద్మనగర్

అధికారులు చొరవ తీసుకోవాలి



గతంలో కుక్కల బెడద ఉండేది. ఇప్పుడు లేదు. మళ్లీ కోతుల గుంపు వచ్చింది. పెద్ద సంఖ్యలో వచ్చాయి. ఇంటి తలుపు తీసి ఉంటే చాలు.. ఇంట్లోకి వచ్చి చిందరవందర చేస్తున్నయ్. నగరపాలక సంస్థ అధికారులు వెంటనే చొరవ తీసుకుని కోతుల బెడద నుంచి తప్పించాలి.

- ప్రవీణ్, గోదాంగడ్డ

5 నుంచి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు


నిర్మాణం పూర్తయిన ఆలయం


విగ్రహాన్ని తీసుకొస్తున్న సభ్యులు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం మొగ్దుంపూర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీమల్లికార్జునస్వామి ఆలయంలో ఈనెల 5 నుంచి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నారు. వేదపండితుడు కాసుల చంద్రశేఖరశాస్త్రి ఆధ్వర్యంలో ఈనెల 5న ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనము, అఖండ దీపారాధన, అంకురార్పణ, సాయంత్రం దేవతాహవనం, మూలమంత్రహవనం, పూజాహారతి కార్యక్రమం నిర్వహిస్తారు. 6న మండల పూజ, కలశస్నపనం, నవగ్రహ పూజలు జరుగుతాయి. 7న ఆవాహిత మంటప పూజ, ధాన్యాధివాసం, మూలమంత్రహవనం, ఉదయం 11గంటలకు శ్రీమల్లికార్జునస్వామి విగ్రహంతో పాటు కేతమ్మ, మేడలమ్మ, వినాయకుడు, రేణుకాఎల్లమ్మ, అంజనేయస్వామి, ధ్వజస్తంభం, నవగ్రహ విగ్రహాలను ప్రతిష్ఠాపన చేస్తారు. మూడు రోజుల పాటు విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు కాశవేణి భూమయ్య, కమిటీ అధ్యక్షుడు కూకట్ల రాజయ్య, ప్రధాన కార్యదర్శి దాడి లక్ష్మణ్ తెలిపారు. గ్రామస్తులు అధికసంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని వారు కోరారు.


ప్రవచిస్తున్న పురాణం మహేశ్వరశర్మ

భక్తిలో ఆర్తి ఉండాలి

విద్యానగర్(కరీంనగర్): భక్తిలో ఆర్తితో పాటు చిత్తశుద్ధి, ఏకాగ్రత, శరణాగతి ఉండాలని వేద పండితుడు పురాణం మహేశ్వరశర్మ అన్నారు. కార్తీక మాసం సందర్భంగా కరీంనగర్ మండలం నగునూర్‌లోని శ్రీదురాభవానీ ఆలయంలో శనివారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. భగవంతుడు అపారమైన ధనకనకానికి తూగక.. భక్తితో మహాసాధ్వి సమర్పించిన చిన్న తులసి దళానికి తూగినట్లు, అచంచల భక్తితత్వాన్ని ఆకళింపు చేసుకొని పరమాత్ముడిని స్మరిస్తే మోక్ష ప్రాప్తి లభిస్తుందన్నారు. నేను అనే అహం వీడి నిర్మల హృదయంతో భక్తితో ఆరాధించడం తప్ప మానవుడికి మరో మార్గం లేదని అన్నారు. ఆదర్శ జీవన విధానంతో మనిషి జీవన వికాసం సురక్షితమవుతుందన్నారు. ఆలయ ప్రధానార్చకుడు పవనకృష్ణశర్మ, ఆలయ ఫౌండర్ చైర్మన్ వంగళ లక్ష్మణ్, ఆలయ కమిటీ బాధ్యులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు లక్ష దీపోత్సవం

విద్యానగర్(కరీంనగర్): కార్తీక మాసం సందర్భంగా నగునూర్‌లోని శ్రీదుర్గాభవానీ ఆలయంలో ఆదివారం సాయంత్రం లక్ష దీపోత్సవం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మాధికారి, వేద పండితుడు పురాణం మహేశ్వరశర్మ తెలిపారు. అమ్మవారికి కార్తీక మాస ప్రయోక్త చతుషష్టి పూజలు, దీప సంకల్పం, దీపారాధన, మహా మంగళ హారతి అనంతరం దీపోత్సవ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమాల్లో భక్తులు భాగస్వాములై అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

బొడ్రాయి పండుగ



పూజలు చేస్తున్న గడ్డం నాగరాజు

మానకొండూర్‌రూరల్: మండలంలోని శ్రీనివాస్‌నగర్‌లో శనివారం మహాలక్ష్మి, భూలక్ష్మి సహిత బొడ్రాయి పండుగను అర్చకుల ఆధ్వర్యంలో గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకుడు గడ్డం నాగరాజు పాల్గొని భక్తి, శ్రద్ధలతో అమ్మవార్లకు మొక్కులు చెల్లించారు. ఈసందర్భంగా నాగరాజును ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించారు. కొట్టి నరేశ్, రవీందర్, రవి, గ్రామప్రజలు పాల్గొన్నారు.


భజన మండలి సభ్యులు

భజన మండలికి ఆహ్వానం

విద్యానగర్(కరీంనగర్): జనగాం జిల్లా పాలకుర్తి మండలం వల్మిడిలోని శ్రీసీతారామాలయంలో కార్తీక మాసం సందర్భంగా భజన కార్యక్రమాలు నిర్వహించడానికి కరీంనగర్ గణేశ్‌నగర్‌కు చెందిన శ్రీనీలకంఠ భజన మండలి(మహిళావిభాగం)ని ఆలయ కమిటీ ఆహ్వానించినట్లు భజన మండలి అధ్యక్షురాలు వడాల మాధవి తెలిపారు. భజన మండలి సభ్యులు సోమవారం ఆలయంలో భజన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆమె చెప్పారు.



సాక్షి ఎఫెక్ట్

నగరవ్యాప్తంగా ఫాగింగ్

కరీంనగర్‌కార్పొరేషన్: నగరంలో దోమల నియంత్రణకు నగరపాలక సంస్థ శనివారం ఫాగింగ్ చేపట్టింది. నగరంలో దోమలు విపరీతంగా పెరిగిపోయి ప్రజలు వ్యాధులబారిన పడుతున్న వైనంపై 'పారిశుధ్యంపై పట్టింపేది.. జాడ లేని ఫాగింగ్ పేరిట ఈనెల 1న వచ్చిన సాక్షి కథనంపై అధికారులు స్పందించారు. నగరంలోని రాంనగర్, ముకరాంపుర, కాశ్మీర్‌గడ్డ, హౌసింగ్ బోర్డుకాలనీ తదితర ప్రాంతాల్లో శానిటేషన్ సిబ్బంది ఫాగింగ్ నిర్వహించారు. ఫాగింగ్ నిర్వహించినట్లు ఆయా కాలనీవాసుల నుంచి సంతకాలు కూడా సేకరించారు. ఫాగింగ్ నిరంతరం చేపట్టి దోమలను పూర్తిగా నిర్మూలించాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.

డిగ్రీ విద్యార్థులకు ఉచితంగా ఇంగ్లిష్ పుస్తకాలు


ఇంగ్లిష్ నోట్స్ ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు

కొత్తపల్లి: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేయనున్న ఇంగ్లిష్ నోట్స్‌ను శనివారం సీతారాంపూర్‌లో ఆవిష్కరించారు. హమ్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు, అధ్యాపకుడు ధనపూరి సాగర్ తయారు చేసిన డిగ్రీ మూడో సెమిస్టర్ నోట్స్‌ను ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ డా.అనంతం విడుదల చేశారు. శాతవాహన యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కళాశాలలో 3వ సెమిస్టర్ చదువుతున్న విద్యార్థులకు ఈ నోట్స్ ఎంతగానో ఉపయోగపడుతుందని, సులభంగా అర్థం చేసుకొని పరీక్షల్లో ఉత్తమ మార్కులు పొందేందుకు దోహదపడుతుందని అనంతం తెలిపారు. ఈ ఇంగ్లిష్ పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు సాగర్ చెప్పారు. దూర ప్రాంత విద్యార్థులు ఈ నోట్స్‌ను పొందాలంటే 8885549467 నెంబర్‌కు వాట్సాప్ ద్వారా కోరితే వారికి పీడీఎఫ్ రూపంలో పంపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డా.గుండా శ్రీనివాస్, ఆంగ్ల అధ్యాపకులు గుమ్మడి కుమారస్వామి, కుంటాల శ్రీనివాస్, జె.రమణ, ముని గోపాల్ పాల్గొన్నారు.

వైభవంగా నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠ


హాజరైన భక్తులు

సప్తగిరికాలనీ(కరీంనగర్): స్థానిక సాయినగర్ విజయగణపతి సాయిబాబా ఆలయంలో శనివారం నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. దేవతా పూజలు, హోమాలు, పూర్ణాహుతి, యంత్ర, విగ్రహ ప్రాణప్రతిష్ఠా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ ఆకునూరి చంద్రశేఖర్, ఎండోమెంట్ ఇన్స్‌పెక్టర్ పాము సత్యనారాయణ, ఈవో ఎండపల్లి మారుతి, వ్యవస్థాపక ధర్మకర్తలు నలువాల ప్రకాశ్, చిట్టుమల్ల కొండయ్య, ఆయిందాల లక్ష్మయ్య, వేదపండితులు కపర్థిశర్మ, దుర్గాప్రసాద్‌శర్మ, ప్రణీత్‌శర్మ, అర్చకులు, సిబ్బంది గుడికాడి శ్రీనివాస్, పిట్టల అంజయ్యతో పాటు డాక్టర్ చిట్టుమల్ల ప్రదీప్‌కుమార్, ఆర్.శ్రీధర్, ఎం.సత్యం, శ్రీనివాస్, ఎస్.చంద్రశేఖర్, భక్తులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ



కోరా పాఠశాల విద్యార్థులు

కరీంనగర్: పెద్దపెల్లి జిల్లా యైటింక్లయిన్‌కాలనీ అంబేద్కర్ స్టేడియంలో జరిగిన డాడ్జ్ బాల్ టోర్నమెంట్‌లో కరీంనగర్ జిల్లా కోరా ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరచడంతో పాటు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కౌశిక్, రిషి, అభినయ్, అక్షితసాయి, గీతిక, శ్రీనిధి, హారిక, పూజితను పాఠశాల చైర్మన్ మహిపాల్‌రెడ్డి, డైరెక్టర్లు వరప్రసాద్, రాంరెడ్డి, సింహాచలం హరికృష్ణ, వంగళ సంతోష్‌రెడ్డి పుష్పగుచ్ఛంతో అభినందించారు. శిక్షణ ఇచ్చిన పీఈటీ దుర్గరాజు, విద్యార్థుల తల్లిదండ్రులను అభినందించారు.

స్టార్టప్‌లకు రూ. కోటి ఫండింగ్

లీప్ ఎహెడ్ పేరిట ఎస్‌టీపీ స్టార్టప్ ప్రోత్సాహక కార్యక్రమం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో యువతను నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడం ద్వారా పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడానికి సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా (ఎస్‌టీపీఐ) ''లీప్ ఎహెడ్'' పేరిట ప్రత్యేక పథకాన్ని చేపట్టింది. ఈ పథకం ద్వారా ప్రారంభ దశలో (స్కేలింగ్) ఉన్న స్టార్టప్‌లతో పాటు గ్రోత్ స్టేజ్, ప్రోడక్ట్ డైవర్సిఫికేషన్, కొత్త ప్రాంతాలకు విస్తరించే ప్రణాళికలో ఉన్న స్టార్టప్‌లకు కోటి రూపాయల వరకు నిధులు సమకూర్చనుంది. ఈ పథకం కింద ఎంపికైన స్టార్టప్‌లకు మూడు నెలల పాటు హైబ్రీడ్ మోడల్‌లో శిక్షణ ఇచ్చి మెంటారింగ్ చేస్తూ మార్కెటింగ్, ఫండ్ రైజింగ్ వంటి అవకాశాలను కల్పిస్తుంది. ఇందుకోసం డిసెంబర్ 10లోగా దరఖాస్తు చేసుకోవాలని ఎస్‌టీపీఐ కోరింది. ఇప్పటివరకు రాష్ట్రం నుంచి 75 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 15 స్టార్టప్‌లను ఎంపిక చేసి ఆర్థిక సాయం అందిస్తారు.

ఎన్‌జీఐఎస్ కింద 95 స్టార్టప్స్ నమోదు

స్టార్టప్‌లను ప్రోత్సహించే నెక్స్ట్ జనరేషన్ ఇంక్యుబేషన్ స్కీం (ఎన్‌జీఐఎస్) కింద రాష్ట్రంలో 95 స్టార్టప్‌లు నమోదు చేసుకున్నట్లు వినయ్‌కుమార్ తెలిపారు. ఇందులో 28 స్టార్టప్స్‌కు రూ.25 లక్షల చొప్పున సీడ్ ఫండింగ్ అందించినట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం స్టార్టప్స్‌కు ప్రోత్సాహం అందిస్తుండటంతో పలు కాలేజీల్లో ఇంక్యుబేషన్ సెంటర్లలో యువత స్టార్టప్స్‌పై ప్రయోగాలు చేస్తున్నారన్నారు. విశాఖలో నాలుగో తరం సాంకేతిక పరిజ్ఞానం పెంచేలా ఏర్పాటు చేసిన కల్పతరువు సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్, ఆంధ్రా విశ్వవిద్యాలయంలో నాస్కామ్ ఏర్పాటు చేసిన సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లు స్టార్టప్స్‌కు మంచి వేదికలుగా మారాయని ఆయన వివరించారు.

6న విజయవాడలో ఔట్‌రీచ్ కార్యక్రమం

లీప్ ఎహెడ్ కార్యక్రమంపై విద్యార్థులు, ఔత్సాహిక స్టార్టప్స్‌కు అవగాహన కల్పించడానికి ఈ నెల 6న విజయవాడలో ఔట్ రీచ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎస్‌టీపీఐ విజయవాడ జాయింట్ డైరెక్టర్ బి.వినయ్‌కుమార్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఇంక్యుబేషన్, స్టార్టప్ సెంటర్లు ఉన్న పలు ఇంజనీరింగ్ కళాశాలల్లో కూడా సదస్సులు నిర్వహిస్తామన్నారు.

ఓట్ల కోసం టీడీపీ కుట్ర రాజకీయం!

- తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటేసిన వారిని ఏపీలో ఓటర్లుగా చేర్పించేందుకు పన్నాగం
- నిజాంపేటలోని ఓ కుల సంఘం భవనం వేదికగా వ్యూహరచన
- కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల్లో తమ వర్గం వారితో ఓట్ల నమోదుకు డ్రైవ్



టీడీపీ ఓటరు నమోదు కౌంటర్

నిజాంపేట: ఆంధ్రప్రదేశ్‌లో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచే సత్తా లేకపోవడంతో టీడీపీ నాయకులు కుట్ర రాజకీయాలకు తెరలేపారు. మొన్నటివరకు ఏపీలో పెద్ద ఎత్తున దొంగ ఓట్లు నమోదయ్యాయంటూ అనవసర రాద్ధాంతం చేసిన ఆ పార్టీ నేతలు ప్రస్తుతం తెలంగాణలోని ఓటర్లను ఏపీలో చేర్పించి లబ్ధి పొందేందుకు అడ్డదారులు తొక్కుతున్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు నవంబర్ 30న ముగియడంతో ఆ ఓటర్లను ఏపీలో ఓటర్లుగా చేర్పించేందుకు కుటిల ప్రయత్నాలకు శ్రీకారం చుట్టారు. ఇందుకోసం శనివారం నిజాంపేటలోని ఓ పాఠశాలలో ఏకంగా కౌంటర్ ఏర్పాటు చేశారు. 'ఏపీ కొత్త ఓటర్ల రిజిస్ట్రేషన్, ఓటర్ వెరిఫికేషన్ డ్రైవ్'అంటూ బ్యానర్ సైతం కట్టారు. తమ పార్టీకి అనుకూలంగా ఉండే వారందరినీ ఓటర్లుగా నమోదు చేసుకోవాలని కోరుతున్నారు. ఈ కుట్రకు మణికొండలో ఉన్న ఓ కుల సంఘం భవనం వేదికగా రెండు రోజుల కిందట ప్రణాళిక రచించినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల్లో ఆ వర్గం దొంగ ఓట్ల నమోదుకు టీడీపీ ప్రయత్నాలు ముమ్మరం చేస్తోంది. ఈ గిమ్మిక్కులు చూస్తున్న స్థానికులు అవాక్కవుతున్నారు.

ప్రభుత్వ బడులకు అంతర్జాతీయ నైపుణ్యాలు

భవిష్యత్‌లో విద్యార్థులు ప్రపంచ స్థాయి అవకాశాలను అందుకునేలా తీర్చిదిద్దనున్న ఏపీ ప్రభుత్వం

- పాఠశాలల్లో రూ.2,400 కోట్లతో డిజిటల్ వసతులు
- 6 నుంచి ఇంటర్ విద్యార్థులకు టెక్నాలజీపై ప్రాథమిక పాఠాలు
- ఏఐ, ఐవోటీ, డేటా సైన్స్, మెషీన్ లెర్నింగ్, గేమింగ్ సహా వివిధ సబ్జెక్టుల్లో బోధన
- వచ్చే విద్యా సంవత్సరం నుంచి 6,200 హైస్కూళ్లలో అమలు
- ఉపాధ్యాయులు, విద్యార్థులకు ఇంజనీరింగ్ నిపుణులతో తర్ఫీదు



సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు భవిష్యత్తులో ప్రపంచ స్థాయిలో అవకాశాలను అందిపుచ్చుకునేలా రాష్ట్ర ప్రభుత్వం వారిని తీర్చిదిద్దనుంది. ఈ నేపథ్యంలో ఆరో తరగతి నుంచే వివిధ టెక్ పాఠాలను బోధించనుంది. ఈ మేరకు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను భవిష్యత్ టెక్ నిపుణులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసింది. వచ్చే ఏడాది (2024–25) నుంచి మొత్తం 6,200 హైస్కూళ్లలో ఫ్యూచర్ స్కిల్స్‌ను అందించనుంది. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐవోటీ), ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మెషీన్ లెర్నింగ్ (ఎంఎల్), బ్లాక్‌చైన్ టెక్నాలజీ, వర్చువల్ రియాలిటీ (వీఆర్)– ఆగ్మెంటెడ్ రియాలిటీ (ఏఆర్), మెటావర్స్/ వెబ్ 3.0, 3డీ మోడలింగ్ అండ్ ప్రింటింగ్, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, బిగ్ డేటా/డేటా అనలిస్ట్, రోబోటిక్స్, గేమింగ్ వంటి విభాగాల్లో శిక్షణ ఇవ్వనున్నారు. రాబోయే కాలంలో ఈ కోర్సులకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ ఉండడంతో స్కూల్ స్థాయిలోనే వీటిపై పూర్తి అవగాహన కల్పించనున్నారు. ప్రస్తుతం విద్యార్థులు తెలుగు, ఇంగ్లిష్, హిందీ, సైన్స్, సోషల్, మ్యాథ్స్ (6) సబ్జెక్టులను చదువుతుండగా, ఇకపై ఏడో సబ్జెక్టుగా టెక్ పాఠాలు చదువుతారు. వచ్చే ఏడాది ఆరు, 9 తరగతి విద్యార్థులకు టెక్ పాఠాలను బోధించనున్నారు. 2025–26లో 7, 10 తరగతులకు, 2026–27లో ఎనిమిది, ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఫ్యూచర్ స్కిల్స్‌పై శిక్షణ అందించనున్నారు. ఇలా 2028 నాటికి మొత్తం ఆరు నుంచి +2 వరకు ఈ కార్యక్రమాన్ని విస్తరించనున్నారు.

డిజిటల్ వసతుల కోసం రూ.2,400 కోట్ల ఖర్చు..

ఇప్పటికే పాఠశాలల్లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెళ్లు (ఐఎఫ్‌పీలు), స్మార్ట్ టీవీలు, ట్యాబ్స్, ఇంగ్లిష్–మ్యాథ్స్ – పాల్ – కంప్యూటర్ ల్యాబ్స్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ లెర్నింగ్ కోసమే దాదాపు రూ.2,400 కోట్లు ఖర్చు చేస్తోంది. ఇకపై టెక్ అంశాల్లో విద్యార్థుల ఆలోచన శక్తిని పెంపొందించడంతోపాటు విజ్ఞానంలో ముందుండేలా శిక్షణనివ్వనున్నారు. నాస్కామ్, జేఎన్‌టీయూ నిపుణులు, రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి (ఏపీఎస్‌ఈఆర్‌టీ), స్వతంత్ర నిపుణులు రూపొందించిన ఫ్యూచర్ స్కిల్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌కు ఇప్పటికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అధ్యక్షతన మంత్రిమండలి ఆమోదం తెలిపింది. దీంతో వచ్చే విద్యా సంవత్సరం నుంచే ఈ కార్యక్రమాన్ని అమల్లోకి తీసుకురావడానికి అధికారులు సిద్ధమయ్యారు.

ఏడో సబ్జెక్టుగా టెక్ పాఠాలు..

6,200 ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు టెక్నాలజీ నైపుణ్యాలను నేర్పించేందుకు కంప్యూటర్ సైన్స్ లేదా ఎలక్ట్రానిక్స్‌లో ఎంటెక్/ఎంసీఏ/బీటెక్ చివరి ఏడాది చదువుతున్న విద్యార్థులు ఇంటర్న్‌షిప్ చేయాల్సి ఉంటుంది. తమ ప్రాజెక్టులో భాగంగా వీరు ఫ్యూచర్ స్కిల్స్ ఫెసిలిటేటర్స్‌గా ప్రభుత్వ పాఠశాలల్లో సేవలు అందిస్తారు. విద్యార్థులకు టెక్ పాఠాలు బోధించే ఉపాధ్యాయులకు వీరు 'టెక్నాలజీ లీడ్' శిక్షణ ఇస్తారు. ఏటా డిసెంబర్/ఏప్రిల్ నెలల్లో విద్యార్థులకు ప్రత్యేకంగా ఇండక్షన్ శిక్షణ ఇస్తారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో డిసెంబర్ 15 నాటికి ఇండక్షన్ ట్రైనింగ్ పూర్తి చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

తరగతిని బట్టి టెక్ కరిక్యులమ్..

విద్యార్థులకు అనువుగా ఎంపిక చేసిన అంశాలకు ప్రత్యేక కరిక్యులమ్‌ను సైతం రూపొందించారు. 6–8 తరగతులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కాన్సెప్ట్స్, అల్గారిథమ్, డేటా ఎనాలసిస్, ఏఐ ఎథిక్స్ అండ్ సోషల్ ఇంపాక్ట్స్, మ్యాథ్స్ అండ్ స్టాటిస్టిక్స్ అంశాల్లో ప్రాథమిక అంశాలపై అవగాహన కల్పిస్తారు.

▲ 9–10 తరగతులకు 'ఏఐ' టెక్నాలజీ, మెషీన్ లెర్నింగ్‌పై ప్రాథమిక అవగాహన, అప్లికేషన్స్, అల్గారిథమ్ అండ్ డేటా ఎనాలసిస్, ఆర్టిఫిషియల్ ఎథిక్స్, సోషల్ ఇంపాక్ట్, మ్యాథ్స్ అండ్ స్టాటిస్టిక్స్‌ను నేర్పిస్తారు.

▲ 11–12 తరగతుల విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై అడ్వాన్స్‌డ్ అంశాలను బోధిస్తారు.

ఈ అంశాల్లో అన్ని పాఠశాలల్లోనూ ఒకేసారి ఒకే పాఠాన్ని బోధించనున్నారు. దీనివల్ల విద్యార్థులు ఒక స్కూలు నుంచి మరో స్కూలుకు మారినా టెక్ అంశాల బోధనలో మార్పు ఉండదు. దీంతో విద్యార్థుల సామర్థ్యాలు మెరుగుపడడంతో పాటు అంతర్జాతీయ అవకాశాలను అందుకునే నైపుణ్యాలు నేర్చుకుంటారు.

సిలబస్ సిద్ధం చేస్తున్నాం..

ఎంపిక చేసిన 10 మాడ్యూల్స్ బోధనకు సిలబస్‌ను సిద్ధం చేస్తున్నాం. డిసెంబర్ నాటికి అన్ని స్కూళ్లకు ఐఎఫ్‌పీలు నూరు శాతం అందుబాటులోకి వస్తాయి. ఫ్యూచర్ స్కిల్స్ ఫెసిలిటేటర్స్ నియామకానికి అనుమతి లభించింది, వచ్చే నెల రోజుల్లో వీరి నియామకం పూర్తవుతుంది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి 6,200 హైస్కూళ్లలో ఫ్యూచర్ స్కిల్స్‌పై బోధన ప్రారంభమవుతుంది.

– కాటమనేని భాస్కర్, కమిషనర్, పాఠశాల విద్యాశాఖ మౌలిక వసతులు

ఒక వ్యక్తికి ఒక ఓటే ఉండాలి

- తెలంగాణలో ఓటున్న వారు ఇక్కడా ఓటు వేయడానికి చూస్తున్నారు
- ఏపీ మంత్రి మేరుగు నాగార్జున



పల్లెకోన (భట్టిప్రోలు): భారత రాజ్యాంగం ప్రకారం పేదవాడికైనా, కోటీశ్వరుడికైనా ఒక్క ఓటు మాత్రమే ఉంటుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగు నాగార్జున అన్నారు. భట్టిప్రోలు మండలం పల్లెకోనలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతి వ్యక్తికి ఓటు ఉండాలని కానీ ఓట్లు కాదన్నారు. తెలంగాణలో ఓటు వేసిన వారు కూడా ఆంధ్రాలో ఓటు వేయడానికి ప్రయత్నిస్తున్నారని, అది కరెక్టు కాదన్నారు. ఓటుకు నోటుతో వైఎస్సార్ సీపీని ఓడించాలని కొన్ని పార్టీలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు 60 లక్షలకుపైగా దొంగ ఓట్లను చేర్పించారని, దీనిపై ఎన్నికల కమిషనర్‌ని కూడా కలసి ఫిర్యాదు చేశామని తెలిపారు. పక్క రాష్ట్రాల నుంచి కూలీ పనులకు వచ్చిన వారి ఓట్లు చేర్చి కుప్పం నియోజకవర్గంలో ఇప్పటి వరకు చంద్రబాబు గెలుస్తున్నాడని, దీనిపై ఎన్నికల కమిషన్ రియాక్ట్ అవ్వాల్సిందేనన్నారు. వైఎస్సార్ సీపీ త్రికరణ శుద్ధితో ఎన్నికలకు వెళ్లాలని యోచిస్తున్నట్లు చెప్పారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టులో చట్టబద్ధంగా రావాల్సిన వాటా మాత్రమే తీసుకున్నామని మంత్రి నాగార్జున తెలిపారు. సీఎం వైఎస్ జగన్ ధైర్యవంతుడు కాబట్టి వెంటనే స్పందించారన్నారు. నీటి వాటాల విషయంలో అవసరమైతే కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుంటుందని తెలిపారు.


శనివారం తిరుమల శ్రీవారిని కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్న ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కిరణ్మయి

ఇక సింగరేణి పోరు

- 27న గుర్తింపు సంఘం ఎన్నికలు
- ప్రక్రియ పునఃప్రారంభం
- రేపు కార్మిక సంఘాలతో రిటర్నింగ్ అధికారి సమావేశం



శ్రీరాంపూర్(మంచిర్యాల): నిన్న మొన్నటి వరకు ఉన్న అసెంబ్లీ ఎన్నికల కోలాహలం నేటితో ముగియనుంది. ఇక సింగరేణిలో 'గుర్తింపు' ఎన్నికల పోరు మొదలైంది. అసెంబ్లీ ఎన్నికలతో మధ్యలో నిలిచిపోయిన సింగరేణి గుర్తింపు సంఘం 7వ దఫా ఎన్నికల ప్రక్రియ తిరిగి మొదలైంది. అంతకుముందు హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం అక్టోబర్ 28న సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు అక్టోబర్ 7 నుంచి నామినేషన్లు, స్క్రూటినీ, విత్‌డ్రాలు చేసి అక్టోబర్ 10కు ప్రక్రియను ముగించారు. ఈ క్రమంలో మధ్యలో అసెంబ్లీ ఎన్నికలు రావడంతో 'గుర్తింపు' ఎన్నికల నిర్వహణకు జిల్లా కలెక్టర్లు సుముఖంగా లేరని, అసెంబ్లీ ఎన్నికల తర్వాత నిర్వహించాలని, అప్పటి వరకు ఈ గుర్తింపు ఎన్నికలు వాయిదా వేయాలని అక్టోబర్ 11న కంపెనీ హైకోర్టును ఆశ్రయించింది. దీంతో హైకోర్టు ఈ ఎన్నికలను డిసెంబర్ 27కు వాయిదా వేస్తూ ఆదేశాల్చింది. ఈ మేరకు అసెంబ్లీ ఎన్నికలు ముగియడంతో తిరిగి సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల నిర్వహణకు రిటర్నింగ్ అధికారి ఏర్పాట్లు ప్రారంభించారు. ఎన్నికలకు సంబంధించి ఇప్పటికే సగం ప్రక్రియ పూర్తయిన సంగతి తెలిసిందే.

13 సంఘాలు పోటీ అర్హత..

ఇదివరకే ఇచ్చిన ఎన్నికల నోటిఫికేషన్ ప్రకారం ఇప్పటికి 13 కార్మిక సంఘాలు పోటీకి అర్హత సాధించి బరిలో నిలిచాయి. వారినే ఈ నెల 4న హైదరాబాద్‌లోని తన కార్యాలయానికి ఎన్నికలపై చర్చించడానికి రావాల్సిందిగా డెప్యూటీ సీఎల్‌సీ, ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్‌లు కార్మిక సంఘాల నేతలకు సమాచారం అందించారు. ఈ సమావేశంలో ఎన్నికల నిర్వహణపై చర్చిస్తారు. గతంలో ఉన్న ఎన్నికల షెడ్యూల్ ప్రకారం కంపెనీ సెప్టెంబర్ 30, 2023 నాటికే ఓటరు జాబితాను సమర్పించాల్సి ఉన్నా కంపెనీ కోర్టుకు వెళ్లడంతో సమర్పించలేదు. ఈ సమావేశంలో కంపెనీ ఈ ఓటరు జాబితాను సమర్పించాల్సి ఉంటుంది. దీనికి అనుగుణంగా ఎన్నికల ప్రక్రియను రిటర్నింగ్ అధికారి చేపడుతారు.

పోరుకు సిద్ధమైన కార్మిక సంఘాలు..

నిన్న మొన్నటి వరకు అసెంబ్లీ ఎన్నికల్లో తమ మాతృపార్టీల అభ్యర్థుల గెలుపోటములకు కృషి చేసిన కార్మిక సంఘాల నేతలకు ఇక తమ కోసం పోరాడాల్సిన సమయం వచ్చింది. గుర్తింపు ఎన్నికల పోరుకు కార్మిక సంఘాలన్నీ సన్నద్ధం అయ్యాయి. అసెంబ్లీ ఎన్నికల్లో క్యాడర్‌ను సమీకరించిన నేతలు అదే ఊపుతో సింగరేణి ఎన్నికల్లో అడుగుపెట్టబోతున్నారు. ఈసారి అన్ని సంఘాలు ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకొని ముందుకెళ్తున్నాయి. సింగరేణి విస్తరించిన 6 జిల్లాల పరిధిలో 11 అసెంబ్లీ స్థానాల్లో సింగరేణి ఓటర్లు నేడు వారి తీర్పు వెలువరించబోతున్నారు. ఈ ఫలితాలు రేపటి సింగరేణి ఎన్నికలపై ప్రభావం చూపే అవకాశం కూడా లేకపోలేదు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ప్రవీణ్‌కుమార్

భీమిని: మంచిర్యాల జిల్లా భీమిని మండలం కేస్లాపూర్‌లో జరిగిన జలంధర్ హత్యకేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్ అన్నారు. శనివారం ఆయన కేస్లాపూర్ గ్రామంలో జలంధర్ కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఈ హత్యకు కారణమైన వారు ఏ పార్టీకి చెందిన వారైనా వెంటనే శిక్షించాలన్నారు. హత్యకు పాల్పడ్డ సూత్రధారులు, పాత్రధారులపై పీడీ యాక్ట్ నమోదు చేయాలన్నారు. హోంమంత్రికి ఫోన్ చేసి చెప్పినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. తెలంగాణలో లా అండ్ ఆర్డర్ క్షీణించిపోయిందని, ఏ గ్రామంలోనైనా గూండాగిరి చేసే వారు ఉంటే తనకు సమాచారం ఇవ్వాలని, వారికి కఠిన శిక్షలు పడేలా చూస్తామని తెలిపారు.

నమో.. నారసింహా..


రథోత్సవంలో భక్తజనం


మూలవిరాట్టు దర్శనం కోసం గుట్టపైకి వెళ్తూ..


స్వామివారికి మొక్కులు చెల్లిస్తున్న భక్తులు


ఆలయం ఎదుట కిటకిటలాడుతున్న భక్తులు

- కన్నులపండువగా దేవునిపల్లి నృసింహుని రథోత్సవం
- జాతరకు భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తజనం..
- ఆలయానికి చేరుకునేందుకు భక్తులకు తప్పని అవస్థలు

సౌకర్యాలు కల్పించాం

స్వామివారి రథోత్సవం, జాతరకు తరలివచ్చే భక్తులకు వసతులు కల్పించాం. సర్పంచ్ కిషన్ సహకారంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా పకడ్బందీ చర్యలు తీసుకున్నాం.

– ముద్దసాని శంకరయ్య, ఆలయ ఈవో

పెద్దపల్లిరూరల్: దేవునిపల్లిలోని శ్రీలక్ష్మీనరసింహ స్వామి జాతర ఉత్సవాలు, రథోత్సవం శనివారం వైభవంగా జరిగాయి. ఏటా కార్తీక మాసంలో ఈ వేడుకలు నిర్వహిస్తారు. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గతనెల 24న స్వామివారి కల్యాణం జరిపించారు. పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు స్వామివారిని దర్శించుకుని మొక్కులు సమర్పించారు.

పోటెత్తిన భక్తులు..

జిల్లాలోని అన్నిగ్రామాలతోపాటు రాష్ట్రంలోని ఇతర జిల్లాలు, పొరుగున ఉన్న మహారాష్ట్రకు చెందిన భక్తులు వేలాదిగా తరలివచ్చారు. దీంతో స్వామివారి సన్నిధి భక్తులతో పోటెత్తింది. పెద్దపల్లి మండలం అందుగులపల్లి నుంచి దేవునిపల్లిలోని ఆలయానికి చేరుకునేందుకు దారి సరిగాలేక భక్తులు కొంత ఇబ్బంది పడ్డారు. వాహనాలను ఆలయానికి దూరంగానే నిలిపియడంతో కాలినడకన ఆలయానికి చేరుకునేందుకు అవస్థలు పడాల్సి వచ్చింది. పార్కింగ్ సమస్య తలెత్తకుండా బసంత్‌నగర్ పోలీసులు చర్యలు తీసుకున్నారు.

గుట్టపైకి కాలినడకన..

కోరమీసాల స్వామిని దర్శించుకుంటే కోరికలు తీరుతాయని భక్తుల విశ్వాసం. అందుకే గుట్టపై వెలసిన శ్రీలక్ష్మీనరసింహ స్వామి మూలవిరాట్టును దర్శించుకునేందుకు భక్తులు కాలినడకన గుట్టపైకి ఎక్కారు. కొంతకాలం క్రితం వరకు బండరాళ్లపై పాకుతూ వెళ్లే పరిస్థితి ఉండగా.. భక్తుల సౌకర్యార్థం సమీపంలోని కేశోరాం సిమెంట్ యాజమాన్యం 418 మెట్లు నిర్మించింది. దీంతో భక్తులకు ఉపశమనం లభించింది. గుట్ట దిగువన ఉన్న ఆలయంలోనూ స్వామివారి దర్శనానికి పెద్దసంఖ్యలో భక్తులు బారులుతీరారు. ప్రధాన అర్చకులు శ్రీకొండపాక లక్ష్మీనర్సింహాచార్యులు, శ్రీకాంతచార్యులు, రామాచార్యులు, లక్ష్మీనారాయణ తదితరులు పూజల్లో పాలుపంచుకున్నారు.


నృసింహుని జాతరలో భక్తుల కోలాహలం


స్వామివారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

ఇందారంలో 'మావో'ల కలకలం

- స్థానికులుగా చెలామణి
- నకిలీ పేర్లు, ఆధార్‌కార్డుతో ఇంటి నిర్మాణం
- పది నెలలుగా కార్యకలాపాలు
- పార్టీ బలోపేతం, నిధుల సేకరణ, రిక్రూట్‌మెంటు లక్ష్యం
- అరెస్టుతో ఉలిక్కిపడ్డ గ్రామస్తులు


మావోయిస్టులు నిర్మించుకున్న ఇల్లు ఇదే

జైపూర్: మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం ఇందారం గ్రామంలో శనివారం మావోయిస్టుల అరెస్టు ఒక్కసారిగా కలకలం రేపింది. మారుపేర్లు, నకిలీ ఆధార్‌కార్డులు సృష్టించుకుని ఇంటిని నిర్మించుకుని నివసిస్తుండడం సంచలనం సృష్టిస్తోంది. ఇందారం కేంద్రంగా పని చేస్తున్న మావోయిస్టు దంపతుల అరెస్టుతో అనేక ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అంబేద్కర్ కోనసీమ జిల్లా డెల్టా గన్నవరం మండలం నరేంద్రపురం గ్రామానికి చెందిన దొంగ గంగాధర్‌రావు అలియాస్ నర్సన్న, అలియాస్ బక్కన్న అలియాస్ వెంగో దాదా, అతడి భార్య భవాని అలియాస్ సుజాత అలియాస్ శ్యామల మావోయిస్టుల్లో పని చేస్తున్నారు. గంగాధర్‌రావు మావోయిస్టు పార్టీ సాంకేతిక విభాగంలో కేంద్ర కమిటీ సభ్యుడిగా, భవాని మావోయిస్టుగా ఉన్నారు. నకిలీ ఆధార్ కార్డులను సృష్టించుకుని ఇంటి స్థలం కొనుగోలు చేసుకుని చిన్న రేకుల ఇల్లు నిర్మించుకుని పది నెలలుగా ఉంటున్నారు. స్థానికులుగా చెలామణి అవుతున్నారు. కేంద్ర కమిటీ సభ్యుడు చంద్రన్న ఆదేశాల మేరకు దంపతులిద్దరు పార్టీ అభివృద్ధి, అర్బన్ నెట్‌వర్క్, బలోపేతం, నిధుల సమీకరణ, ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం, ప్రభుత్వ వ్యతిరేక కార్యకలాపాల కోసం ఇక్కడ ఉంటున్నట్లు పోలీసులు వెల్లడించారు. స్థానికులకు అనుమానం రాకుండా జల్లంపెల్లి బక్కయ్య, జల్లంపెల్లి లక్ష్మి పేరులతో నకిలీ ఆధార్‌కార్డులు, పాన్‌కార్డులు సృష్టించుకున్నారు. పక్కా సమాచారం మేరకు పోలీసులు ప్రత్యేక బృందాలతో తనిఖీ చేపట్టడంతో ఇందారం వాసులు ఉలిక్కిపడ్డారు. కొన్ని నెలలుగా కొత్త రిక్రూట్‌మెంటు లక్ష్యంగా గుట్టుచప్పుడు కాకుండా కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు నిఘా వర్గాలు తేల్చాయి. అప్పుడప్పుడు మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన సిరోంచకు వెళ్లి పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యుడు చంద్రన్న, రాష్ట్ర కమిటీ సభ్యులు భాస్కర్, బండి ప్రకాశ్, బడే చొక్కారావులతో కలిసి పార్టీ సమావేశాలకు హాజరయ్యేవారని, తెలంగాణ, ఒడిశా, ఛత్తీసగఢ్, జార్ఖండ్ రాష్ట్రాల్లో గత రెండు మూడేళ్లుగా తిరుగుతూ మావోయిస్టు కార్యకలాపాల్లో పాల్గొన్నట్లు తెలిసింది. దంపతులను అరెస్టు చేసిన పోలీసులు నకిలీ ఆధార్‌కార్డులు, పాన్‌కార్డులు, బ్యాంకు పాసుపుస్తకం, నగదు, ఏటీఎం కార్డు, ఫోన్లు, ట్యాబ్ స్వాధీనం చేసుకున్నారు.




పంట చేలో పాల కంకి పల్లకిలో పిల్ల ఎంకి నవ్వినంత అందంగా...

చీర గురించి ఎన్ని పాటలు రాసినా రాయాల్సినవి ఎన్నో మిగిలే ఉంటాయి. అందమైన చీరకట్టును చూస్తే పంటచేలో పాలకంకి, పల్లకిలో పిల్ల ఎంకీ నవ్వినంత అందంగా, అద్భుతంగా ఉంటుంది. డిజైనర్ నివేదిత సంజయ్ ప్రభు వినూత్నంగా డిజైన్ చేసిన చీరల ఛాయాచిత్రాలు నెటిజనులను ఆకట్టుకుంటున్నాయి. కేరళ కసువు శారీ (వైట్ కాటన్ శారీ విత్ గోల్డెన్ జరి బార్డర్) రకరకాల వేడుకలకు క్లాసిక్ ఫేవరేట్‌గా పేరు పొందింది. డిజైనర్ నివేదిత సంజయ్ ప్రభు ఈ చీరకు సంబంధించి పురాతన టెక్నిక్‌లను మాన్యువల్ స్క్రీన్ ప్రింటింగ్ ద్వారా తిరిగి తీసుకువచ్చింది. ప్రతి ప్రింట్ ఒక అందమైన కథ చెబుతుంది. అరటిఆకుల నుంచి ఇంగ్లీజ్ రోజ్, చెంబూర్ ఫ్లవర్ వరకు ప్రకృతిలోని ఎన్నో అందాలు కసువు చీరెలో కనిపించి కనువిందు చేస్తాయి.

వైరల్

స్టేడియంల సంగతి ఏమిటోగానీ రైల్వేస్టేషన్‌లకు క్రికెటర్‌ల పేర్లు ఊహించలేము. అయితే గుజరాత్‌లోని సూరత్ సమీపంలోని ఒక రైల్వేస్టేషన్ పేరు సచిన్. మాజీ క్రికెటర్ సునీల్ గవాస్కర్ ఈ రైల్వేస్టేషన్ ముందు దిగిన ఫోటో వైరల్‌గా మారింది.

'ఈ రైల్వేస్టేషన్‌కు మన ఆల్‌టైమ్ గ్రేట్ క్రికెటర్‌లలో ఒకరైన నా ఫేవరెట్ క్రికెటర్, నా అభిమాన వ్యక్తి పేరు పెట్టారు. గత శతాబ్దానికి చెందిన పెద్దల ముందు చూపు అబ్బుర పరుస్తుంది' అని ఇన్‌స్టాగ్రామ్‌లో రాశాడు సునీల్ గవాస్కర్.

ఇది చూసి 'సచిన్‌లో సన్నీని చూడడం ఆనందంగా ఉంది' అంటూ స్పందించాడు సచిన్ తెండూల్కర్.

ఈ రైల్వే స్టేషన్ పేరు సచిన్!



నిజానికి ఈ రైల్వేస్టేషన్‌కి 'సచిన్' అనే పేరు సచిన్ తెండూల్కర్ తాత ముత్తాల కాలంలోనే ఉంది. సచిన్ తెండూల్కర్ పేరుకు, ఈ రైల్వేస్టేషన్ పేరుకు ఎలాంటి సంబంధం లేకపోయినా సరదా కోసం 'పూర్వీకుల ముందుచూపు అబ్బురపరిచింది' అని రాశాడు గవాస్కర్.


అలోకిక భట్టాచార్య, అమితాబ్

రైల్లో సీటు కింద... విమానంలో నెత్తి మీద

'కౌన్ బనేగా కరోడ్‌పతి' తాజా సీజన్‌లో కోల్‌కతాకు చెందిన ఒక గృహిణి తాను నవ్వడమే కాక అమితాబ్‌ను విపరీతంగా నవ్వించింది. కేబీసీ వల్ల మొదటిసారి విమానం ఎక్కిన ఆమె రైల్లోలాగా చీటికి మాటికి సీటు కింద చూసుకుంటూ లగేజీ ఉందా లేదాననే హైరానా విమానంలో లేకపోవడం తనకు నచ్చిందని చెప్పింది. ఇంకా సరదా కబుర్లు చెప్పి అమితాబ్‌ను నవ్వించిన అలోకిక భట్టాచార్య వైరల్ వీడియో గురించి....

సోనీ టీవీలో ప్రసారమవుతున్న 'కౌన్ బనేగా కరోడ్‌పతి' తాజా సిరీస్ తాజా ఎపిసోడ్‌లో కోల్‌కటాకు చెందిన అలోకిక భట్టాచార్య అనే గృహిణి అమితాబ్‌నే కాక ప్రేక్షకులను చాలా నవ్వించింది. ఆమె క్లిప్పింగ్‌ను అమితాబ్‌తో పాటు ఇతరులు 'ఎక్స్'లో షేర్ చేయడంతో నెటిజన్లు ముచ్చటపడుతున్నారు. గత 17 ఏళ్లుగా ప్రయత్నిస్తే ఇప్పటికి కేబీసీలో పాల్గొనే అవకాశం దొరికిన అలోకిక 'జై కేబీసీ' నినాదంతో హాట్‌సీట్‌లో కూచుంది. 'మీ ప్రయాణం ఎలా సాగింది?' అని అమితాబ్ అడిగితే 'కేబీసీ పుణ్యమా అని మొదటిసారి విమానం ఎక్కాను. మాలాంటి వాళ్లం రైలెక్కి ప్రతి పది నిమిషాలకూ ఒకసారి సీటు కింద లగేజ్ ఉందా లేదా చూసుకుంటాం. అర్ధరాత్రి మెలకువ వచ్చినా మొదట సీటు కిందే చూస్తాం. విమానంలో ఆ బాధ లేదు. లగేజ్ నెత్తి మీద పెట్టారు. పోతుందనే భయం వేయలేదు' అనేసరికి అమితాబ్ చాలా నవ్వాడు. 'కేబీసీ వాళ్లు ఎలాంటి ప్రశ్నలు వెతికి ఇస్తున్నారంటే నేనసలు ఏమైనా చదువుకున్నానా అని సందేహం వస్తోంది' అని నవ్వించిందామె. 'నువ్విలా నువ్వుతుంటే మీ అత్తగారు ఏమీ అనదా?' అంటే 'అంటుంది. కాని నేను నా జీవితంలో జరిగిన మంచి విషయాలు గుర్తు తెచ్చుకుని ఎప్పుడూ నవ్వుతుంటాను. అదే నా ఆరోగ్య రహస్యం. మూడు పూటలా అన్నం, పప్పు, చేపలు తింటూ కూడా సన్నగా ఎలా ఉన్నానో చూడండి. ఫ్రీగా. కొంతమంది ఇలా ఉండటానికి డబ్బు కట్టి జిమ్ చేస్తుంటారు' అని నవ్వించిందామె. అలోకిక ఈ ఆటలో పన్నెండున్నర లక్షలు గెలిచి ఆట నుంచి విరమించుకుంది. ఆ మొత్తం ఆమెకు చాలా ముఖ్యమైనదే. కాని అమితాబ్‌తో నవ్వులు చిందించడం అంతకంటే ముఖ్యంగా ఆమె భావించింది.

లవ్ యూ బామ్మా



85 సంవత్సరాల వయసులో కంటెంట్ క్రియేటర్‌గా మారింది విజయ నిశ్చల్. ఫ్రెంచ్ ఫ్రై, సమోస. గులాబ్ జామూన్, పొటాటో బాల్స్...ఒక్కటా రెండా ఎన్నెన్నో పసందైన వంటలను ఎలా చేయాలో తన చానల్ ద్వారా నేర్పుతుంది నిశ్చల్. వంటలు చేస్తూ ఆ వంటకు తగినట్లుగా హుషారుగా పాటలు పాడుతుంటుంది. ఈ బామ్మ చానల్‌కు 8.41 లక్షల ఫాలోవర్‌లు ఉన్నారు. తాజాగా నిశ్చల్ బామ్మ చేసిన 'ఎగ్‌లెస్ కేక్' వీడియో వైరల్‌గా మారింది. ఈ వీడియో 1.1 మిలియన్‌ల వ్యూస్ దక్కించుకుంది.

'ఎగ్‌లెస్ కోసం ఎన్నో చోట్ల ప్రయత్నించాను. మీ వీడియో చూసిన తరువాత నేను స్వయంగా చేశాను. ఇదంతా మీ చలవే. లవ్ యూ బామ్మా'

'వంటల్లో ఓనమాలు కూడా తెలియని నేను మీ వల్ల ఇప్పుడు ఎన్నో వంటలు చేయగలుగుతున్నాను. నా టాలెంట్‌ను చూసి ఫ్రెండ్స్ ప్రశంసిస్తున్నారు'... ఇలాంటి కామెంట్స్ ఎన్నో కనబడుతున్నాయి.

శశిథరూర్‌లాగా ఇంగ్లీష్ గిట్ల మాట్లాడాలే...

కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ అరుదైన, పలకడానికి కష్టంగా ఉన్న ఇంగ్లీష్ పదాలు వాడుతుంటాడు అనేది తెలిసిన విషయమే. అతడి ఖరీదైన ఇంగ్లీష్‌కు చాలా మంది అభిమానులు ఉన్నారు. తాజాగా ఆస్ట్రేలియాకు చెందిన జే అనే టీచర్ 'శశి థరూర్స్ ఇంగ్లీష్ యాక్సెంట్ ఈజ్ బ్యూటీఫుల్' అనడమే కాదు అతడిలా చక్కని ఇంగ్లీష్ మాట్లాడాలంటే అంటూ కొన్ని టిప్స్ చెప్పాడు. ఇన్‌స్టాగ్రామ్‌లో జే పోస్ట్ చేసిన ఈ వీడియో వైరల్ అయింది. శశి థరూర్ ఇంగ్లీష్‌లో మాట్లాడుతున్న వీడియోలను ప్లే చేస్తూ....



'చూడండి ఈ పదాన్ని ఎలా పలికాడో. ఆ పదాన్ని ఎలా స్ట్రెస్ చేశాడో' అంటూ చెబుతూ పోతాడు జే.

రైలే కళ్యాణ వేదిక!

కళ్యాణం వచ్చినా, కక్కొచ్చినా ఆగదు...అంటారు. కళ్యాణ ఘడియ ముంచుకొచ్చింది...అనుకున్నారేమో ఒక ప్రేమ జంట బెంగాల్-జార్ఖండ్ మూవింగ్ ట్రైన్‌లోనే దండలు మార్చుకున్నారు. ఆ తరువాత వరుడు వధువు మెడలో తాళి కట్టాడు. వధువు భావోద్వేగానికి గురై ఏడ్చింది. ఈ 'రైలు పెళ్లి' వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. బోగీలో ఉన్న ప్రయాణికులు ఈ పెళ్లి తంతు చూసి మొదట



షాక్ తిన్నా ఆ తరువాత మాత్రం ఆశీర్వదించారు.

'మల్టీ పర్పస్ ఇండియన్ రైల్వేస్'

'విమానంలో జరిగే పెళ్లి కంటే ఇది నయం. తక్కువ ఖర్చు కదా'... ఇలాంటి కామెంట్స్ నెటిజనుల నుంచి వచ్చాయి. ఇక మరో పెళ్లి విషయానికి వస్తే... దిల్లీకి చెందిన 27 సంవత్సరాల అవినాష్ కుమార్ డెంగ్యూ బారిన పడ్డాడు. బెడ్ మీద నుంచి లేవలేని పరిస్థితి. ఈలోపు పెళ్లిరోజు రానే వచ్చింది. దీంతో హాస్పిటల్‌లోనే వధువు మెడలో తాళి కట్టించి పెళ్లి చేశారు.

హెల్త్

కాపాడే కన్నీరు పొడిబారితే..!

కన్ను ఎప్పుడూ తడిగా ఉంటుంది. ఏదైనా కాస్త తగలగానే కళ్లల్లోంచి నీళ్లు కారిపోతుంటాయి. కన్ను పొడిబారితే ప్రమాదమని ప్రకృతి ఈ కన్నీళ్లను ఏర్పాటు చేసింది. నిత్యం ఏసీ గదుల్లో ఉండటం, కంప్యూటర్‌దో, ల్యాప్‌టాప్‌లదో, ఆఖరికి మొబైల్ స్క్రీన్‌నో ఎప్పుడూ చూస్తూ ఉండటంతో పాటు... కొన్ని ఇతర ఆరోగ్య సమస్యలు, జబ్బులు ఉన్నప్పుడు కూడా కన్నుపొడిబారుతుంది. ఇలా పొడిబారడం వల్ల కంటి ఇన్ఫెక్షన్లు వచ్చేందుకూ, ఒక్కోసారి చూపు కోల్పోయేందుకూ అవకాశముంది. కన్ను పొడిబారే సమస్యను వైద్య పరిభాషలో 'కెరటో కంజంక్టివైటిస్ సిక్కా'(డ్రై ఐ) అని చెబుతారు. ఈ కండిషన్ అవగాహన పెంచుకుని, కంటిని ఎలా కాపాడుకోవాలో తెలుసుకోవడానికి ఉపయోగపడేదే ఈ కథనం.



కంటిని తడిగా ఉంచడానికి లాక్రిమల్ గ్లాండ్స్ అనే ప్రధాన కన్నీటి గ్రంథితో పాటు మ్యూసిన్ గ్లాండ్స్, మెబిమియన్ గ్లాండ్స్ అనే మరో రెండు రకాల గ్రంథులూ తోడ్పడతాయి. ఇందులో లాక్రిమల్ గ్లాండ్స్ నీటి మోతాదులెక్కువగా ఉండే కన్నీటినీ, మ్యూసిన్ గ్లాండ్స్ కాస్త జిగురుగా ఉండే పదార్థాన్నీ, ఇక మెబొమియాన్ గ్లాండ్స్ అనేవి కాస్త నూనెలా ఉండే పదార్థాన్ని (ల్యూబ్రికెంట్‌గా ఉపయోగపడేందుకు) స్రవిస్తాయి. ఈ మూడూ కలిసి పూర్తి కన్నీటి స్రావాలకు కారణమవుతాయి.

గ్రంథుల పనితీరు మారుతుండే లోపాలు...

ఈ మూడు గ్రంథుల పనితీరుల్లో, దేనిలో లోపం వచ్చినా... కన్నీటి నాణ్యత దెబ్బతింటుంది. ఏయే గ్రంథుల్లో లోపాలుంటాయో, దాన్ని బట్టి కన్నుపొడిబారడమనే ప్రక్రియలోనూ తేడాలొస్తాయి.

ఉదాహరణకు...

- లాక్రిమల్ గ్లాండ్ కన్నీటిలోని నీళ్లను స్రవిస్తుంది. కాబట్టి దీనిలో లోపంతో కన్నీటిలోని నీరు మోతాదులు తగ్గుతాయి. • మ్యూసిన్ తగ్గితే 'టియర్ బ్రేకింగ్ టైమ్' తగ్గుతుంది. అంటే కన్నీరు స్రవించాక అది ఓ పొర (ఫిల్మ్)లా ఏర్పడి... కొంతసేపు కన్ను ఉపరితలం మీద ఉంటుంది. ఏర్పడ్డ తర్వాత ఆ ఫిల్మ్ ఎంతసేపు ఉంటే... కంటికి అంత రక్షణ. • ఇక కన్ను త్వరగా పొడిబారుతుందంటే... (అంటే నీరు త్వరత్వరగా ఆవిరై పోతుందంటే) మెబోమియన్ గ్లాండ్స్ పనితీరు తగ్గిందని అర్థం. బయట గాలివేగం ఎక్కువగా ఉన్నప్పుడు (విసురుగా గాలి వీస్తున్నప్పుడు), టూవీలర్ డ్రైవింగ్‌లో కన్నీరు ఎక్కువగా ఆవిరవుతుంది.

లక్షణాలు

కళ్లలో మంట : కళ్లలో తగినంతగా నీరు ప్రవించనప్పుడు కళ్లు మంటలు వస్తాయి. కానీ కళ్లు ఎర్రబారవు. **మసక బారడం :** కొందరిలో చూపు కాస్తంత మసకబారవచ్చు. **వెలుగును చూడలేకపోవడం :** ఎక్కువ వెలుగును చూడలేకపోవడం, ప్రకాశవంతమైన కాంతిని భరించలేకపోవడం. **కాంటాక్ట్ లెన్స్‌లు పెట్టుకునేవారిలో:** కాంటాక్ట్‌లెన్స్‌లు వాడటంలో ఇబ్బందిగా ఉండటం.

కానీ జీవనశైలి మార్పులతో అంటే ఏసీలు, స్క్రీన్‌ను చాలాసేపు చూడటం, పొగతాగడం వంటి అలవాట్లతో ఆవిరి కావడం పెరుగుతుంది. దీన్నే 'ఎవాపరేటివ్ డ్రై ఐ' అంటారు.

కన్ను పొడిబారడానికి మరికొన్ని కారణాలు...

కన్ను పొడిబారడానికి అనేక కారణాలు ఉంటాయి. అవి...

- **వయసు పైబడటం:** వయసు పెరుగుతున్న కొద్దీ కన్ను పొడిబారడమూ పెరుగుతుంటుంది. మహిళల్లో మెనోపాజ్ తర్వాత ఇది ఎక్కువ. • **కొన్ని వైద్య సమస్యలు:** థైరాయిడ్, రుమటాయిడ్ ఆర్థ్రైటిస్, సాధారణ ఆటోఇమ్యూన్ సమస్యలు, కొలాజన్ వాస్క్యులార్ డిసీజ్, దీర్ఘకాలిక డయాబెటిస్, సిస్టమిక్ లూపస్ అరిథమటోసిస్ వంటి రుగ్మతలు ఉన్నవారిలో, కీళ్ల నొప్పులతో బాధపడేవారిలో ఈ సమస్య ఎక్కువ. • **కొన్ని రకాల మందులు :** యాంటీ డిప్రెసెంట్స్, యాంగ్జైటీని తగ్గించే మందులు, శరీరంలో నీటిని బయటకు పంపించే డైయూరెటిక్స్, మహిళల్లో గర్భనిరోధక మందులు, స్టెరాయిడ్స్, దీర్ఘకాలం పాటు గ్లకోమాకు మందులు వాడేవారిలో... ఇలా అనేక మందులతో ఈ సమస్య పెరుగుతుంది.
- **జీవనశైలి మార్పులతో :** • ఏసీ గదుల్లో ఎక్కువసేపు ఉండటం • కనురెప్పలను తక్కువగా కదిలించడం... కంప్యూటర్ పైనా లేదా ల్యాప్‌టాప్, టీవీ, మొబైల్ వరకూ ఏదైనా స్క్రీన్‌ను ఎక్కువగా సేపు చూస్తుండటం, మైక్రోస్కోప్ వంటి ఉపకరణాలపై ఎక్కువగా పనిచేయడం. • కనురెప్పలను పూర్తిగా మూయలేకపోవడం. • కంటికి గాయం కావడం వల్ల కనురెప్పలను తగినంత కదిలించలేనప్పుడు. • కనురెప్ప అంచుల్లో ఇన్ఫెక్షన్ (బ్లెఫరైటిస్) ఉన్నవారిలో కన్ను పొడిబారడం ఎక్కువ. • కంటికి లేజర్ చికిత్స చేయించుకున్నవారిలో మొదటి మూడునెలల్లో మాత్రం కన్నుపొడిబారే సమస్య వచ్చేందుకు అవకాశం ఉంది.

ఇక కొందరిలో కారణాలేవీ కనిపించకుండానే ఈ సమస్య రావచ్చు.


డా॥ రవికుమార్ రెడ్డి, సీనియర్ కంటి వైద్య నిపుణులు

నిర్ధారణ ఇలా...

- లక్షణాలను బట్టి కంటి డాక్టర్‌లు సమస్యను నిర్ధారణ చేస్తారు. అయితే కొందరిలో కొన్ని రకాల ఇతర వ్యాధుల వల్ల (జోగ్రన్స్ సిండ్రోమ్ వంటి వాటి కారణంగా) ఇలా జరుగుతుందేమో అని చూస్తారు. అందుకే కన్ను పొడిబారిన లక్షణాలు ఉండేవారికి వ్యాధి నిర్ధారణ చేసే సమయంలో అనేక ఇతర లక్షణాలను కూడా డాక్టర్లు అడిగి తెలుసుకుంటూ ఉంటారు.



- **షిర్మర్ టియర్ టెస్ట్:** కొన్ని సందర్భాల్లో షిర్మర్ పరీక్షతో దీన్ని నిర్ధారణ చేస్తారు. ఈ పరీక్షలో ఒక రకం ఫిల్టర్ పేపర్‌ను కంటి కిందివైపు రెప్ప కింద ఐదు నిమిషాల పాటు ఉంచుతారు. ఆ వ్యవధిలో ఆ పేపర్ ఎంత తడి అవుతుందో పరిశీలించడం ద్వారా లాక్రిమల్ గ్లాండ్ లోపాల్ని పరీక్షిస్తారు.
- **టియర్ బ్రేకప్ టైమింగ్ :** కంటి ఉపరితలంపై ఏర్పడే టియర్ ఫిల్మ్ ఎంతసేపటికి బ్రేక్ అవుతుందో తెలుసుకునే ఈ పరీక్షతో మ్యూసిన్ గ్రంథి లోపాలను తెలుసుకుంటారు.
- **మెబోమియోగ్రఫీ :** ఈ టెస్ట్‌తో మెబోమియన్ గ్రంథి లోపం తెలుస్తుంది.
- **ఓసీటీ :** ఆప్టికల్ కొహరెన్స్ టోమోగ్రఫీ (ఓసీటీ) అనే పరీక్ష ద్వారా టియర్ ఫిల్మ్ మందం ఎంత ఉందో తెలుసుకుంటారు.

ఇబ్బందులివీ...

కన్ను పొడిబారడం వల్ల వచ్చే సమస్యలు అందరిలో ఒకేలా ఉండవు. ఈ కింద పేర్కొన్న వాటిలో కొన్ని కనిపించవచ్చు. • కొందరిలో కంటిపైన ఉండే కంజెక్టివా పొరలో ఇన్ఫెక్షన్ రావచ్చు. (కంజంక్టివైటిస్). • కొందరిలో కార్నియల్ ఇన్ఫెక్షన్ రావచ్చు. • సమస్య తీవ్రతను బట్టి కొందరి కళ్లలో చిన్న చిన్న పుండ్లు రావచ్చు. • చాలా అరుదుగా కొందరిలో కార్నియా దెబ్బతినే ప్రమాదంకూడా ఉండవచ్చు.

చికిత్స... గతంలో కన్నీటిని స్రవించే చుక్కల మందులు, జెల్స్‌తో చేసే చికిత్స స్థానంలో ఇప్పుడు ఏయే గ్రంథి లోపాలు ఏమిటో తెలుసుకుని, వాటికి అనుగుణంగా చేసే చికిత్సలు అందుబాటులోకి వచ్చాయి. ఉదాహరణకు...

కృత్రిమ కన్నీటి మందులు: కృత్రిమంగా కన్నీళ్లను పెంచే చుక్కల మందులు, జెల్ రూపంలో లభ్యమయ్యే మందుల్ని వాడటం ద్వారా డాక్టర్లు లాక్రిమల్ గ్లాండ్ పనితీరును చక్కదిద్దుతారు. 'సైక్లో ఇమ్యూన్ ఐ డ్రాప్స్' కూడా డ్రై ఐ చికిత్సకు ఉపయోగపడతాయి. అలాగే లాక్రిమల్ ప్లగ్స్‌ను వాడతారు. వీటివల్ల కన్నీళ్లు ముక్కులోకి జారిపోవు. దాంతో అవి కళ్లలోనే ఎక్కువసేపు ఉండి కళ్లను తడిగా ఉంచుతాయి. • ఇక మ్యూసిన్ గ్రంథి పనితీరు మెరుగుపరచడానికి 'సెక్రిటోగ్యాగ్స్' అనే ఉపకరణాలు ఉపయోగిస్తారు. • మెబోమియన్ గ్లాండ్స్ పనితీరును మెరుగుపరచడానికి కొన్ని రకాల మసాజ్‌లు, థెర్మో థెరపీలతో పాటు కొన్ని రకాల యాంటీబయాటిక్స్ వాడతారు. • డ్రై ఐ తీవ్రత చాలా ఎక్కువగా ఉన్న వారిలో సంప్రదాయ చికిత్సలతో తగ్గనప్పుడు బాధితుని నుంచి సీరమ్ (ఆటోలాగస్ సీరమ్) సేకరించి, చుక్కల రూపంలో వాడతారు. • **శస్త్రచికిత్స :** ఈ చికిత్సలో భాగంగా నోటిలోని అతి మృదువైన పొరలను తీసి, కంటిలో అమర్చి... పరిస్థితిని చక్కబరుస్తారు.

ఇవేకాకుండా... పని ప్రదేశాల్లో ఏ జాగ్రత్తలు తీసుకోవాలో, కంప్యూటర్ ముందు కంటిని హాని తక్కువగా ఉండేలా ఎలా కూర్చోవాలో, తగిన వ్యాయామాలేమిటో, బరువు తగ్గించుకోవడం, అవసరాన్ని బట్టి పనిచేసే గదిలో తేమ (హ్యుమిడిటీ) పెంచుకోవడం... ఇవన్నీ బాధితులకు కౌన్సెలింగ్‌లో డాక్టర్లు చెబుతారు.

కన్నుపొడిబారిపోవడం వల్ల ఒక్కోసారి చూపుకోల్పోవడం లాంటి పెను ముప్పు ఉండే అవకాశాలు ఎక్కువ. అందుకే కన్నుపొడిబారుతుంటే వెంటనే డాక్టర్‌ను సంప్రదించి తగిన మందులు వాడాలి.

ప్యాచుల లాంటి ఖాళీలతో కనిపించే పేనుకొరుకుడు!

కొందరిలో ఒత్తైన తలకట్టు కనిపిస్తూనే... మధ్య మధ్యలో నున్నటి ఖాళీలు (గ్యాప్‌లు) కనిపిస్తూ ఉంటాయి. ఆ ప్యాచ్‌లు న్యూనతకు గురిచేస్తాయి. ఈ సమస్యను 'పేనుకొరుకుడు' అనీ, వైద్య పరిభాషలో 'అలోపేషియా ఏరేటా' అని అంటారు. 'అలోపేషియా ఏరేటా' సమస్య ఉన్నప్పుడు అది తలకే పరిమితం కాకుండా... ఒక్కోసారి శరీరంలోని ఇతర భాగాల్లోనూ జుట్టు రాలేలా చేయవచ్చు. ఇక పురుషుల్లో గడ్డంలోనూ కనిపిస్తూ, కాస్మటిక్ పరంగా చూసినప్పుడు ఇబ్బందిగా పరిణమిస్తుంది.



కారణాలు...

ఈ సమస్యకు నిర్దిష్టమైన కారణం చెప్పడం కష్టం. ఒకరకంగా చెప్పాలంటే ఇది ఆటో ఇమ్యూన్ సమస్య. అంటే మన వ్యాధి నిరోధక శక్తి, మన దేహం పట్ల వ్యతిరేకంగా పనిచేయడం వల్ల ఉత్పన్నమయ్యే సమస్య. ఈ సమస్య కనిపించిన వారిలో అలర్జీ తాలూకు లక్షణాలూ కనిపించే అవకాశాలు ఎక్కువ. ఇక పిల్లల్లో ఈ సమస్య వస్తే... వారిలో థైరాయిడ్ సమస్యలూ (ప్రధానంగా హైపోథైరాయిడిజమ్), కళ్ల సమస్యలూ, కడుపులో ఇబ్బందులు... ఆటో ఇమ్యూనిటీ వల్ల కలిగే ఇతర సమస్యలూ కనిపించవచ్చు. ఇక కుటుంబ చరిత్రలో ఈ సమస్య ఉన్నప్పుడు అనువంశికంగా కూడా ఈ సమస్య రావచ్చు.


డా॥ స్వప్నప్రియ, సీనియర్ డర్మటాలజిస్ట్.


లక్షణాలు...

తలకట్టులో లేదా గడ్డంలో లేదా శరీరంలోని ఇతర భాగాల్లో ఉన్న జుట్టులో ప్యాచ్‌లుగా ఖాళీలు (గ్యాప్‌లు) కనిపిస్తుండటం. వాటితో పాటు బాధితుల్లో (ప్రధానంగా పిల్లల్లో) అలర్జీకి సంబంధించిన లక్షణాలు కనిపిస్తూ, జుట్టు కూడా వేగంగా రాలిపోతూ ఉండవచ్చు.

చికిత్స ఇలా..

వెంట్రుకలు రాలిపోయిన ప్రాంతాల్లో పైపూతగా రాసే స్టెరాయిడ్ క్రీమ్స్ (టాపికల్ స్టెరాయిడ్స్)ను డాక్టర్లు సూచిస్తుంటారు. కొన్ని సందర్భాల్లో జుట్టు రాలిన చోట చర్మానికి ఇంజెక్షన్లు ఇస్తారు. దీంతో పాటు కొందరిలో అల్ట్రా వయొలెట్ థెరపీ వంటి వాటితో కొంత వరకు ప్రయోజనం ఉంటుంది. కొన్ని సందర్భాల్లో హెయిర్ గ్రోత్ ప్రమోటింగ్ ఏజెంట్స్ మందుల్ని వాడాల్సి ఉంటుంది. ఇక టాపికల్ స్టెరాయిడ్స్‌తో పాటు స్టెరాయిడ్ మోతాదులు ఉండే మందులన్నీ బాధితులను చాలా అంశాలలో పరీక్షించి, పరిశీలించి, నిర్దిష్టమైన మోతాదుల్లో మాత్రమే ఇవ్వాల్సి ఉంటుంది. కాబట్టి వాటిని తప్పనిసరిగా డర్మటాలజిస్ట్‌ల పర్యవేక్షణలో మాత్రమే వాడాల్సి ఉంటుంది.

కొన్ని సందర్భాల్లో ఈ సమస్య మానసికంగా న్యూనతను పెంచే అవకాశం ఉన్నందున కొంత మందిలో ఇది కుంగుబాటు వంటి మానసిక సమస్యలకూ దారి తీయవచ్చు. ముఖ్యంగా పిల్లలు, టీనేజ్ యువతుల్లో ఈ సమస్య ఎక్కువ. బాధితులతో కౌన్సెలింగ్‌తో డాక్టర్లు ఏ కారణంగా ఈ మానసిక సమస్యలు వస్తున్నాయో తెలుసుకుని, ప్రధాన సమస్యకు చికిత్స అందిస్తే... మానసిక సమస్యలనూ తగ్గించడం సాధ్యమవుతుంది.



మెడి టిప్ — నిమోనియా నివారణకు...

నిమోనియా ఊపిరితిత్తులను ప్రభావితం చేసే శ్వాససమస్య. అనేక రకాల ఇన్ఫెక్షన్లు నిమోనియాకు దారితీస్తాయి. ఇలా సెకండరీ ఇన్ఫెక్షన్స్‌తో వచ్చే నిమోనియా ఒక్కోసారి ప్రాణాంతకం కూడా కావచ్చు. దీని నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలివి...

నివారణ ఇలా... • కొద్ది ప్రదేశంలోనే ఎక్కువమంది ఉండటం అనే ఓవర్ క్రౌడింగ్ పరిస్థితికి దూరంగా ఉండాలి. గుంపుల్లోకి వెళ్లకూడదు. • ఆస్తమా, బ్రాంకైటిస్ బాధితులు వాటిని నియంత్రణలో ఉంచుకోవాలి. • పొగ వాతావరణానికి ఎక్స్‌పోజ్ కాకుండా చూసుకోవాలి. అలాగే పొగతాగే అలవాటును తక్షణం మానేయాలి. • ఆల్కహాల్ అలవాటుకూ దూరంగా ఉండాలి. మద్యం వల్ల రోగనిరోధక శక్తి తగ్గుతుంది. అంతేకాదు... మత్తులో దగ్గడం కూడా తక్కువే. దాంతో ఊపిరితిత్తుల్లో ఉన్న మనకు సరిపడని పదార్థాలు అక్కడే ఉండిపోవడం వల్ల కూడా నిమోనియా తీవ్రమయ్యే ప్రమాదం ఉంది. • అన్ని పోషకాలు ఉండే సమతులాహారం తీసుకోవాలి. • క్రమం తప్పకుండా తేలికపాటి వ్యాయామం చేయడం వల్ల రోగనిరోధక శక్తి పెంపొందుతుంది. ఫలితంగా నిమోనియా మాత్రమే కాకుండా ఇతర ఇన్ఫెక్షన్లూ నివారితమవుతాయి. • చిన్నపిల్లలకు, పెద్దవయసు వారికి నిమోనియాను నివారించే వ్యాక్సిన్ ఇవ్వడం మంచిది.

సాక్షి
స్పోర్ట్స్
ఆదివారం
3-12-2023

మళ్లీ ఓడిన భారత మహిళలు

మహిళల జూనియర్ హాకీ వరల్డ్ కప్‌లో భారత జట్టుకు వరుసగా రెండో పరాజయం ఎదురైంది. శనివారం జరిగిన పూల్ 'సి' మ్యాచ్‌లో బెల్జియం 3–2 గోల్స్ తేడాతో భారత్‌ను ఓడించింది. భారత్ తరఫున అన్ను 47వ, 51వ నిమిషాల్లో గోల్స్ సాధించింది. బెల్జియం తరఫున నోవా ప్రూయెర్స్ (5వ నిమిషం), ఫ్రాన్స్ డి మాట్ (42వ ని.), అస్ట్రిడ్ బొనామి (52వ ని.) గోల్స్ నమోదు చేశారు. తొలి, మూడో క్వార్టర్‌లో ఒక్కో గోల్ సాధించి ముందుగా బెల్జియం 2–0తో ఆధిక్యంలో నిలిచింది. అయితే నాలుగు నిమిషాల వ్యవధిలో అన్ను రెండు గోల్స్ సాధించి స్కోరును సమం చేసింది. అయితే చివర్లో లభించిన పెనాల్టీ స్ట్రోక్‌ను సమర్థంగా ఉపయోగించుకున్న బెల్జియం మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. మరో వైపు మంగళవారం మలేసియాలోని కౌలాలంపూర్‌లో జూనియర్ పురుషుల హాకీ ప్రపంచ కప్ ప్రారంభం కానుంది. అదే రోజు జరిగే తొలి మ్యాచ్‌లో కొరియాతో భారత్ తలపడుతుంది.



టైటాన్స్ ఓటమితో మొదలు

ప్రొ కబడ్డీ లీగ్

అహ్మదాబాద్: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) తాజా సీజన్‌ను తెలుగు టైటాన్స్ పరాజయంతో ప్రారంభించింది. శనివారం జరిగిన లీగ్ తొలి మ్యాచ్‌లో టైటాన్స్ 32–38తో గుజరాత్ జెయింట్స్ చేతిలో ఓడింది. టైటాన్స్ కెప్టెన్, స్టార్ రైడర్ పవన్ సెహ్రావత్ (11 పాయింట్లు) చక్కని ఆటతీరు కనబరిచిన ప్పటికీ ఫలితం మాత్రం దక్కలేదు. 21 సార్లు కూతకు వెళ్లిన పవన్ 10 సార్లు పాయింట్లు తెచ్చిపెట్టాడు. ప్రత్యర్థి రైడింగ్‌కు వచ్చినపుడు నిలువరించి మరో టాకిల్ పాయింట్ సాధించాడు. మిగతావారిలో రైడర్ రజనీశ్, ఆల్‌రౌండర్ సంజీవి చెరో 5 పాయింట్లు సాధించారు. గుజరాత్ జట్టులో రైడర్ సోను అదరగొట్టాడు. తొలి అర్ధ భాగంలో 16–13తో జోరుమీదున్న తెలుగు జట్టును అతనే ద్వితీయార్ధంలో దెబ్బకొట్టాడు. 22వ నిమిషంలో సబ్‌స్టిట్యూట్ అయిన సోను 14 సార్లు రైడింగ్‌కు వెళ్లి 11 పాయింట్లు తెచ్చాడు. ఆల్‌రౌండర్లు రోహిత్ గులియా, మొహమ్మద్ నబిబక్ష్ చెరో 4 పాయింట్లు సాధించగా, రైడర్ రాకేశ్ 5 పాయింట్లు చేశాడు.



టైటాన్స్, జెయింట్స్ మధ్య మ్యాచ్ దృశ్యం

అనంతరం ఇక్కడే జరిగిన రెండో మ్యాచ్‌లో మాజీ చాంపియన్ (2015) యు ముంబా 34–31తో యూపీ యోధాస్‌పై గెలిచింది. ముంబా ఆల్‌రౌండర్ అమీర్ మొహమ్మద్ (12 పాయింట్లు) రాణించాడు. రింకూ 6, గుమన్ సింగ్ 5 పాయింట్లు చేశారు. యూపీ తరఫున సురేందర్ గిల్, అనిల్ కుమార్ చెరో 7 పాయింట్లు సాధించారు.

జాతీయ టీటీ విజేత శ్రీజ



సాక్షి, విజయవాడ: జాతీయ ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్ మహిళల సింగిల్స్‌లో తెలంగాణ ప్లేయర్ ఆకుల శ్రీజ విజేతగా నిలిచింది. టోర్నీలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు ప్రాతినిధ్యం వహించిన శ్రీజ శనివారం జరిగిన ఫైనల్లో 6–11, 9–11, 11–4, 9–11, 11–7, 12–10, 12–10 (4–3) స్కోరుతో అర్చనా కామత్ (పెట్రోలియం స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డ్)పై విజయం సాధించింది. తొలి నాలుగు గేమ్‌లలో మూడు ఓడి 1–3తో వెనుకబడిన శ్రీజ...ఆ తర్వాత చెలరేగి వరుసగా మూడు గేమ్‌లను గెలుచుకోగలిగింది. 3–3తో సమంగా నిలిచిన తర్వాతి చివరి గేమ్‌లో ఒక దశలో 10–8తో అర్చన విజయానికి చేరువైంది. అయితే వరుసగా నాలుగు పాయింట్లు సాధించి శ్రీజ మ్యాచ్‌ను ముగించింది. పురుషుల సింగిల్స్‌లో మానవ్ ఠక్కర్ (పీఎస్‌పీబీ)కి టైటిల్ దక్కింది. ఫైనల్లో జి.సత్యన్ (పీఎస్‌పీబీ)ని ఠక్కర్ గెలుపొందాడు. ఐదు గేమ్‌ల తర్వాత 2–3తో వెనుకబడిన తర్వాత ఆరో గేమ్‌లో 0–2 స్కోరు వద్ద వెన్నునొప్పితో సత్యన్ మ్యాచ్‌నుంచి వైదొలిగాడు.

బంగ్లాదేశ్ ఘన విజయం

సిల్హెట్: న్యూజిలాండ్‌తో శుక్రవారం ముగిసిన తొలి టెస్టులో బంగ్లాదేశ్ 150 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. 332 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఓవర్‌నైట్ స్కోరు 113/7తో ఆట కొనసాగించిన న్యూజిలాండ్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 181 పరుగులకు ఆలౌటైంది. చివరి రోజు 22.1 ఓవర్ల పాటు క్రీజ్‌లో నిలిచిన కివీస్ మరో 68 పరుగులు జోడించగలిగింది. డరైల్ మిచెల్ (58), కెప్టెన్ సౌతీ (34) కొద్దిసేపు పోరాడారు. లెఫ్టార్మ్ స్పిన్నర్ తైజుల్ ఇస్లామ్ (10/184) 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు.

ఫైనల్లో అశ్విని పొన్నప్ప జోడీ

లక్నో: సయ్యద్ మోడి అంతర్జాతీయ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో అశ్విని పొన్నప్ప–తనీషా క్రాస్టో జంట టైటిల్ పోరుకు అర్హత సాధించింది. శనివారం జరిగిన మహిళల డబుల్స్ సెమీఫైనల్లో పొన్నప్ప జోడీ తొలి గేమ్‌లో 10–11తో జపాన్ టాప్‌సీడ్ యూకి ఫుకుషిమా–సయాక హిరోత ద్వయంతో పోటాపోటీగా తలపడుతుండగా... జపాన్ జంట గాయంతో మ్యాచ్ మధ్యలోనే వైదొలగింది. పురుషుల సింగిల్స్‌లో సెమీఫైనల్లో ప్రియాన్షు రజావత్ 21–18, 14–21, 17–21తో చి యు జెన్ (చైనీస్ తైపీ) చేతిలో పోరాడి ఓడాడు.

విజయంతో ముగించేందుకు



- నేడు భారత్, ఆస్ట్రేలియా చివరి టి20 మ్యాచ్
- రా.గం.7 నుంచి స్పోర్ట్స్18, జియో సినిమాలో ప్రసారం

బెంగళూరు: భారత్, ఆస్ట్రేలియా టి20 సిరీస్ ఆఖరి మజిలీకి చేరింది. మరో గెలుపుతో సిరీస్ ఆధిక్యాన్ని 4–1కు చేర్చుకోవాలని టీమిండియా చూస్తుంటే... సిరీస్ ఎలాగూ చేజారింది కాబట్టి విజయంతోనైనా ముగింపు పలికి తిరుగుముఖం పట్టాలని కంగారూ సేన భావిస్తోంది. అయితే జట్ల బలాబలాల విషయానికొస్తే మాత్రం సూర్యకుమార్ సేనే పటిష్టంగా కనిపిస్తోంది. సిరీస్ ఇదివరకే సాధించడం, బౌలర్లు ఫామ్‌లోకి రావడం ఆతిథ్య భారత్‌ను దుర్బేధ్యంగా మార్చింది. వన్డే ప్రపంచకప్ సాధించిన ఆసీస్ జట్టు సభ్యుల్లో ఒక్క ట్రవిస్ హెడ్ తప్ప మిగిలిన 10 మంది ఆటగాళ్లంతా కొత్తవారే కావడం, నిలకడ లోపించడం కంగారూను మరింత కలవరపెడుతోన్న అంశం.

బౌలింగ్ బలగం

గత నాలుగు మ్యాచ్‌ల్ని నిశితంగా గమనిస్తే భారత్ బ్యాటింగ్ జోరుతో తొలి మూడు టి20ల్లో అవలీలగా 200 పైచిలుకు పరుగులు చేసింది. యశస్వి, రుతురాజ్, కెప్టెన్ సూర్యకుమార్, రింకూ సింగ్ ఇలా వీరంతా మెరిపించినవారే! కానీ బౌలింగ్ వైఫల్యంతో భారీ స్కోరు చేశాక కూడా మూడో టి20లో భారత్ ఓడింది. అయితే నాలుగో మ్యాచ్‌లో మాత్రం గత మ్యాచ్‌లకు భిన్నంగా తక్కువ స్కోరు చేసినా టీమిండియా సిరీస్ విజయాన్ని అందుకుంది. దీనికి బౌలింగ్ పదును పెరగడమే కారణం. అక్షర్ పటేల్, రవి బిష్ణోయ్‌ల స్పిన్, దీపక్ చహర్ పేస్‌లతో భారత్ బౌలింగ్ బలం పెరిగింది. ఇప్పుడు ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఏమాత్రం ఒత్తిడి లేని ఆఖరి మ్యాచ్‌లో గెలవడం కష్టం కానేకాదు. గత మ్యాచ్‌లో హిట్టర్ జితేశ్ శర్మ కూడా ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నాడు. చివరి రెండు మ్యాచ్‌ల కోసం వచ్చిన శ్రేయస్ అయ్యర్ గత మ్యాచ్ వైఫల్యాన్ని అధిగమించే పనిలో పడితే మాత్రం భారత్ మరో 200 పరుగుల్ని చేయడం ఇంకాస్త సులువవుతుంది.

ఒత్తిడిలో ఆసీస్

నాలుగో టి20లో టాస్ నెగ్గినప్పటికీ ఆస్ట్రేలియా తమ బ్యాటింగ్ ఆర్డర్‌పై నమ్మకంతో చేజింగ్ ఎంచుకొని భంగపడింది. దీంతోనే సిరీస్‌నూ కోల్పోయింది. ఈ నేపథ్యంలో ఆస్ట్రేలియాపైనే సిరీస్ ఆధిక్యాన్ని తగ్గించాలనన్న ఒత్తిడి భారంగా మారింది. హెడ్ మెరిపిస్తున్నా... ఫిలిప్, హార్డీ, టిమ్ డేవిడ్‌ల నుంచి ఆశించినంత సహకారం లభించకపోవడం బ్యాటింగ్ ఆర్డర్‌ను ఆందోళన పరుస్తోంది. ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియా వన్డే జట్టు విజయంతో ఇంటికెళ్లినట్లే... టి20 జట్టు సిరీస్‌తో కాకపోయినా... ఆఖరి ఫలితంతో సంతృప్తిగా స్వదేశం వెళ్లాలంటే ఆటగాళ్లంతా మరింత బాధ్యత కనబరచాల్సి వుంటుంది.

పిచ్–వాతావరణం

ఇక్కడి చిన్నస్వామి స్టేడియం బ్యాటింగ్‌కు బాగా కలిసొచ్చే గ్రౌండ్. ప్రతీసారి కూడా బౌండరీలు, సిక్సర్ల మజాను పంచుతోంది. కాబట్టి టాస్ గెలిస్తే ఏ జట్టయినా ఛేదనకే మొగ్గు చూపుతుంది. ఆటకు వాన ముప్పు లేదు.

జట్లు (అంచనా)

భారత్: సూర్యకుమార్ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, రుతురాజ్, శ్రేయస్ అయ్యర్, జితేశ్ శర్మ, రింకూ సింగ్, అక్షర్ పటేల్, దీపక్ చహర్, రవి బిష్ణోయ్, అవేశ్‌ఖాన్, ముకేశ్.

ఆస్ట్రేలియా: మాథ్యూ వేడ్ (కెప్టెన్), ఫిలిప్, హెడ్, మెక్‌డెర్మాట్, ఆరోన్ హార్డీ, టిమ్ డేవిడ్, షార్ట్, ద్వార్‌షుయిస్, క్రిస్ గ్రీన్, బెహ్రెన్‌డార్ఫ్, తన్వీర్ సంఘా/నాథన్ ఎలిస్.

'గ్రాండ్‌మాస్టర్' వైశాలి

- ఈ ఘనత సాధించిన మూడో భారత మహిళా క్రీడాకారిణి
- భారత 84వ జీఎంగా గుర్తింపు
- జీఎం ప్రజ్ఞానందకు వైశాలి సోదరి



చెన్నై: భారత చెస్ క్రీడాకారిణి వైశాలి రమేశ్‌బాబు తన కెరీర్‌లో కీలక మైలురాయిని అందుకుంది. తమిళనాడుకు చెందిన 22 ఏళ్ల వైశాలి శుక్రవారం 'గ్రాండ్‌మాస్టర్' హోదాను అందుకుంది. స్పెయిన్‌లో జరుగుతున్న ఎలోబ్రిగాట్ ఓపెన్ సందర్భంగా జీఎం గుర్తింపును దక్కించుకుంది. టోర్నీ తొలి రెండు రౌండ్‌లలో విజయం సాధించిన వైశాలి ఈ క్రమంలో 2500 ఎలో రేటింగ్‌ను దాటడంతో గ్రాండ్‌మాస్టర్ ఖాయమైంది. భారత్ తరఫున ఈ ఘనత సాధించిన 84వ ప్లేయర్‌గా వైశాలి గుర్తింపు పొందగా...భారత్‌నుంచి జీఎంగా మారిన మూడో మహిళా ప్లేయర్ మాత్రమే కావడం విశేషం. ఇప్పటికే చెస్ ప్రపంచంలో సంచలన విజయాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న జీఎం ప్రజ్ఞానందకు వైశాలి స్వయంగా అక్క కావడం విశేషం. వైశాలికంటే నాలుగేళ్లు చిన్నవాడైన ప్రజ్ఞానంద 2018లోనే గ్రాండ్‌మాస్టర్ హోదా అందుకోగా... ఐదేళ్ల తర్వాతి వైశాలి ఈ జాబితాలో చేరింది. పురుషుల విభాగంలో ఇదే టోర్నీకి ప్రజ్ఞానంద కూడా క్వాలిఫై అయ్యాడు. దాంతో 'క్యాండిడేట్స్' బరిలో నిలిచిన తొలి సోదర, సోదరి జోడీగా కూడా వీరు గుర్తింపు దక్కించుకున్నారు. భారత్‌నుంచి గ్రాండ్‌మాస్టర్ హోదా అందుకున్న తొలి మహిళగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కోనేరు హంపి (2002లో) గుర్తింపు పొందగా...2011లో ఆంధ్రప్రదేశ్‌కే చెందిన ద్రోణవల్లి హారిక కూడా ఈ హోదాను సాధించింది. చెస్ దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్ ఈ సందర్భంగా వైశాలికి అభినందనలు తెలియజేశాడు.

తద్వారా ప్రపంచ చెస్‌లో గ్రాండ్‌మాస్టర్లుగా నిలిచిన తొలి సోదర, సోదరి ద్వయంగా వీరిద్దరు నిలవడం చెప్పుకోదగ్గ మరో విశేషం.

తల్లిదండ్రుల ప్రోత్సాహంతో...

చదరంగంపై ఆసక్తితోనే చిన్న వయసులోనే ఎత్తుకు పైఎత్తులు వేయడం ప్రారంభించిన వైశాలిని తల్లిదండ్రులు రమేశ్‌బాబు, నాగలక్ష్మి ప్రోత్సహించి ప్రొఫెషనల్ చెస్ వైపు మళ్లించారు. ఆ తర్వాత వరుస విజయాలతో ఆమె దూసుకుపోయింది. వరల్డ్ యూత్ చాంపియన్‌షిప్‌లో వైశాలి అండర్–12, అండర్–14 విభాగాల్లో విజేతగా నిలిచింది. 2020 చెస్ ఒలింపియాడ్‌లో తొలిసారి స్వర్ణపతకం గెలిచిన భారత జట్టులో వైశాలి సభ్యురాలిగా ఉంది. 2018లో ఆమె ఉమన్ గ్రాండ్‌మాస్టర్ హోదాను అందుకుంది. ఆ తర్వాత 2019 ఎక్స్‌ట్రాకాన్ ఓపెన్‌లో తొలి జీఎం నార్మ్, 2022లో ఫిషర్ మెమోరియల్ టోర్నీలో రెండో జీఎం నార్మ్ సాధించిన వైశాలి ఈ ఏడాది ఖతర్ మాస్టర్స్‌లో మూడో జీఎం నార్మ్‌ను సొంతం చేసుకుంది. వరల్డ్ చాంపియన్‌షిప్ మ్యాచ్‌కు క్వాలిఫయింగ్‌గా పరిగణించే క్యాండిడేట్స్ టోర్నీకి వైశాలి అర్హత సాధించింది.



తల్లి నాగలక్ష్మి, తమ్ముడు ప్రజ్ఞానందతో వైశాలి

సినిమా



- 'కన్నప్ప'లో మంచు విష్ణు
- 'ఊరు పేరు భైరవకోన'లో సందీప్ కిషన్
- 'మహేంద్రగిరి వారాహి'లో సుమంత్
- 'పుష్ప–2'లో అల్లు అర్జున్
- 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి'లో విశ్వక్ సేన్

ఆలయాన వెలసిన కథ

పూనకాలు తెప్పించే, భక్తి పారవశ్యంలో ముంచే భక్తి రసాత్మక చిత్రాల నిర్మాణం తగ్గింది. పూర్తి స్థాయి భక్తి చిత్రాలంటే కమర్షియల్‌గా వర్కవుట్ అవుతాయా? అనే సందేహం ఉన్న నేపథ్యంలో ఆ తరహా చిత్రాలు నిర్మించడానికి నిర్మాతలు దాదాపు ముందుకు రావడంలేదు. అయితే కమర్షియల్ కథల్లో భక్తి జోడించి, సేఫ్ గేమ్ ఆడుతున్నారు. ఇలా ఆలయాన వెలసిన కథలతో రూపొందుతున్న కొన్ని చిత్రాల గురించి తెలుసుకుందాం.

● శివ భక్తుడు కన్నప్ప జీవితం ఆధారంగా రూపొందుతున్న సినిమా 'కన్నప్ప'. మంచు విష్ణు టైటిల్ రోల్ చేస్తున్నారు. మోహన్‌బాబు, మోహన్‌లాల్, ప్రభాస్, శరత్‌కుమార్, శివ రాజ్‌కుమార్, బ్రహ్మానందం ఈ సినిమాలో కీలక పాత్రలు పోషిస్తున్నారు. నాస్తికుడైన ఓ యోధుడు శివ భక్తునిగా ఎలా పరివర్తన చెందాడు? అనే కోణంలో ఈ సినిమా కథనం ఉంటుందని చిత్ర యూనిట్ చెబుతోంది. ఈ సినిమాలోని ప్రధాన సన్నివేశాలు శివాలయం నేపథ్యంలో ఉంటాయి. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వంలో అవా ఎంటర్‌టైన్‌మెంట్స్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ ఈ సినిమాను నిర్మిస్తున్నాయి.

* * *

● మహేంద్రగిరిలో కొలువు దీరిన వారాహి అమ్మవారి ఆలయం చుట్టూ తిరిగే కథతో 'మహేంద్రగిరి వారాహి' సినిమా తెరకెక్కుతోంది. సుమంత్, మీనాక్షీ గోస్వామి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాకు జాగర్లపూడి సంతోష్ దర్శకుడు. కాలిపు మధు, ఎం. సుబ్బారెడ్డి నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి అనూప్ రూబెన్స్ సంగీతదర్శకుడు.

ఈ సంగతి ఇలా ఉంచితే... హీరో సుమంత్, దర్శకుడు జాగర్లపూడి సంతోష్ కాంబినేషన్‌లో 2018లో వచ్చిన హిట్ ఫిల్మ్ 'సుబ్రహ్మణ్యపురం'లో లైట్‌గా భక్తి టచ్ ఉంది. తాజా చిత్రం 'మహేంద్రగిరి వారాహి'లో కాస్త ఎక్కువ ఉంటుంది.

* * *

● హీరో సందీప్ కిషన్, దర్శకుడు వీఐ ఆనంద్ కాంబినేషన్‌లో వచ్చిన చిత్రం 'ఊరు పేరు భైరవకోన'. ఇందులో కావ్యా థాపర్, వర్షా బొల్లమ్మ హీరోయిన్లు. భైరవకోన అనే ఊరిలో ఉండే ఓ దేవాలయం నేపథ్యంలో ఈ సినిమా కథనం ఉంటుంది. అనిల్ సుంకర సమర్పణలో రాజేశ్ దండా ఈ సినిమాను నిర్మించారు. ఈ సినిమా షూటింగ్ ఎప్పుడో పూర్తయింది. అయితే గ్రాఫిక్స్ ఎక్కువగా ఉన్నందువల్ల పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్‌కి ఎక్కువ సమయం పడుతోందట. త్వరలో రిలీజ్ గురించిన అప్‌డేట్ రానుందని సమాచారం.

* * *

● ఇటీవల విడుదలై, హిట్‌గా నిలిచిన చిత్రం 'మా ఊరి పొలిమేర 2'. 'మా ఊరి పొలిమేర' (2021)కు ఈ చిత్రం సీక్వెల్. 'సత్యం' రాజేశ్, కామాక్షీ భాస్కర్ల, గెటప్ శ్రీను, రాకేందు మౌళి ప్రధాన పాత్రలు పోషించారు. గౌరీ శ్రీను నిర్మించారు. ఈ సినిమాలో బ్లాక్ మ్యాజిక్ అంశాన్ని దర్శకుడు అనిల్ విశ్వనాథన్ ప్రస్తావించినప్పటికీ ప్రధానాంశం ఓ ఊరి పొలిమేరలో ఉన్న దేవాలయం చుట్టూ తిరుగుతుంది. ఆ దేవాలయంలో ఏదో నిధి ఉందని ఆ నిధిని సాధించే ప్రయత్నాలు చేస్తుంటారు ప్రధాన తారలు. కాగా 'మా ఊరి పొలిమేర 3' కూడా ఉంటుంది. సో.. మూడో భాగం కూడా నిధి నిక్షిప్తం చేయబడి ఉందని భావిస్తున్న ఆ ఊరి పొలిమేరలోని గుడి చుట్టూ తిరుగుతుందని ఊహించవచ్చు.



'మా ఊరి పొలిమేర–2'లో 'సత్యం' రాజేశ్

* * *

● ఆంధ్రప్రదేశ్‌లోని రాజమహేంద్రవరం మహాకాళేశ్వర ఆలయం విశిష్టత నేపథ్యంలో ఓ సినిమా తెరకెక్కుతోంది. ఈ సినిమాకు నటి పవిత్రా లోకేశ్ డైరెక్టర్. నటుడు వీకే నరేశ్ సమర్పణలో విజయకృష్ణ స్టూడియోస్ పై ఈ సినిమా రూపొందుతోంది. ఈ సినిమా గురించి గత ఏడాది మేలో వివరాలు వెల్లడించారు మేకర్స్. మరో అప్‌డేట్ రావాల్సి ఉంది.

మాస్ జాతర

హీరో అల్లు అర్జున్, దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో వచ్చిన 'పుష్ప: ది రైజ్' బ్లాక్‌బస్టర్ అయిన విషయం తెలిసిందే. ప్రస్తుతం మలి భాగం 'పుష్ప: ది రూల్'తో బిజీగా ఉన్నారు అల్లు అర్జున్, సుకుమార్. ఈ సినిమాలో గంగమ్మ జాతర నేపథ్యంలో ఓ భారీ యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరించారు. ఇంట్రవెల్ టైమ్‌లో వచ్చే ఈ జాతర ఓ పెద్ద హైలైట్‌గా ఉంటుందట. ఈ చిత్రంలో పుష్పరాజ్‌గా అల్లు అర్జున్, శ్రీ వల్లిగా రష్మికా మందన్నా నటిస్తున్నారు. నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న 'పుష్ప: ది రూల్' ఆగస్టు 15న విడుదల కానుంది. మరోవైపు విశ్వక్ సేన్, నేహా శెట్టి జంటగా అంజలి ఓ ప్రధాన పాత్రలో నటిస్తున్న సినిమా 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి'. చీకటి ప్రపంచంలో సాధారణ స్థాయి నుంచి ధనవంతుడిగా ఎదిగిన ఓ వ్యక్తి నేపథ్యంలో ఈ సినిమా సాగుతుంది. ఈ చిత్రదర్శకుడు కృష్ణ చైతన్య గంగానమ్మ జాతర నేపథ్యంలో ఓ యాక్షన్ సీక్వెన్స్ ప్లాన్ చేశారట. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య, వెంకట్ ఉప్పుటూరి, ఇన్నమూరి గోపీచంద్ నిర్మిస్తున్న ఈ చిత్రం మార్చి 8న రిలీజ్ కానుంది.

తెరపైకి సిల్క్ స్మిత జీవితం

అలనాటి గ్లామరస్ తార సిల్క్ స్మిత జీవితం 'సిల్క్ స్మిత: ది అన్‌టోల్డ్ స్టోరీ'గా వెండితెరపైకి రానుంది. సిల్క్ స్మితలా చంద్రికా రవి నటించనున్నారు. వి. మహస్తీ అమృతరాజ్ సమర్పణలో జయరామ్ దర్శకత్వంలో ఎస్‌బీ విజయ్ ఈ సినిమాను నిర్మించనున్నారు. శనివారం (డిసెంబరు 2) సిల్క్ స్మిత జయంతిని పురస్కరించుకుని ఈ చిత్రాన్ని ప్రకటించారు. ''సిల్క్ స్మిత అసలు పేరు వడ్లపాటి విజయలక్ష్మి. 1980, 1990వ దశకాల్లో గ్లామరస్ తారగా వెలుగొందారామె. స్మిత కుటుంబ సభ్యుల ఆశీర్వాదంతో 'సిల్క్ స్మిత: ది అన్‌టోల్డ్ స్టోరీ'ని ప్రపంచానికి చెప్పనున్నాం. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించనున్నాం. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ సినిమాను వచ్చే ఏడాది విడుదల చేస్తాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.



చంద్రికా రవి

ఎక్స్‌ట్రా వినోదం ఉంటుంది - నితిన్

నితిన్, శ్రీలీల జంటగా వక్కంతం వంశీ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'ఎక్స్‌ట్రా'. 'ఆర్డినరీ మ్యాన్' అనేది ఉపశీర్షిక. సుధాకర్ రెడ్డి, నిఖితా రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 8న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమాలోని 'ఒలే ఒలే పాపాయి పలాసకే వచ్చేయ్..' అనే మాస్ సాంగ్ ప్రోమోను విడుదల చేశారు. సంగీత దర్శకుడు హ్యారిస్ జైరాజ్ స్వరపరచిన ఈ పాటకు కాసర్ల శ్యామ్ సాహిత్యం అందించగా రామ్ మిరియాల, ప్రియ హిమెష్ పాడారు. ఈ సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో నితిన్ మాట్లాడుతూ– ''నా కెరీర్‌లోనే బెస్ట్ క్యారెక్టర్‌ను ఈ సినిమాలో చేశాను. సినిమా ఎక్స్‌ట్రా ఎంటర్‌టైన్‌మెంట్‌తో ఉంటుంది'' అన్నారు. ''ట్రైలర్‌కు పదింతల వినోదం మా సినిమాలో ఉంటుంది. ఈ సినిమా విషయంలో నాకు సపోర్ట్ చేసిన నితిన్‌గారికి థ్యాంక్స్. ఇంట్రవెల్ సన్నివేశంలో ఓ మంచి ట్విస్ట్ ఉంది'' అన్నారు వక్కంతం వంశీ. ''టైటిల్‌కి తగ్గట్టు ఈ సినిమా ఎక్స్‌ట్రార్డినరీగా ఉంటుంది'' అన్నారు సుధాకర్ రెడ్డి.



నితిన్, వక్కంతం వంశీ

ఈ ఏడాది కలిసొచ్చింది

రణబీర్ కపూర్, రష్మికా మందన్నా జంటగా సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'యానిమల్'. భూషణ్ కుమార్, ప్రణయ్ రెడ్డి వంగా, మురాద్ ఖేతని, క్రిషణ్ కుమార్ నిర్మించిన ఈ చిత్రం డిసెంబరు 1న రిలీజైంది. తెలుగు రాష్ట్రాల్లో 'యానిమల్' చిత్రాన్ని పంపిణీ చేసిన 'దిల్' రాజు మాట్లాడుతూ– ''ఈ సినిమా ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యింది. తెలుగు రాష్ట్రాల్లో తొలి రోజు రూ. 15 కోట్ల మేరకు గ్రాస్ కలెక్షన్స్ వచ్చాయి. తొలి వారాంతంలోనే 'యానిమల్' రూ. 35 కోట్ల గ్రాస్ కలెక్షన్స్‌ను రాబడుతుందని అంచనా వేస్తున్నాం. ఈ ఏడాది మాకు బాగా కలిసొచ్చింది. నిర్మాతగా, డిస్ట్రిబ్యూటర్‌గా చేసిన సినిమాలు మంచి విజయాలు సాధించాయి. మా శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌లో నాలుగు, 'దిల్' రాజు ప్రొడక్షన్స్ బ్యానర్‌లో మూడు సినిమాలు.. ఇలా మొత్తంగా ఏడు సినిమాలు చేస్తున్నాం. రామ్‌చరణ్‌గారి 'గేమ్ చేంజర్' సినిమా చిత్రీకరణ 80 శాతానికి పైగా చిత్రీకరణ పూర్తయింది. విజయ్ దేవరకొండ 'ఫ్యామిలీ మేన్'ను మార్చిలో రిలీజ్ చేస్తాం'' అని చెప్పుకొచ్చారు.



'దిల్' రాజు

దర్శకుడిగా నా బలం అదే

''ఓ దర్శకుడిగా యాక్షన్ చిత్రాల కథలు కూడా రాయగలను. కానీ ప్రేమ కథలు, కుటుంబ కథా చిత్రాలైతే కొత్త దర్శకులకు అవకాశాలు వస్తాయనే నమ్మకంతో 'హాయ్ నాన్న' కథ రాశాను. నాకు నానీగారు చాన్స్ ఇచ్చారు. నాలానే మిగతా దర్శకులకూ ప్రేమకథలు, కుటుంబ కథలతోనే అవకాశాలు వస్తాయని చెప్పలేను. నా విషయంలో జరిగిందని చెబుతున్నాను. అయితే ఏ జానర్ ఫిల్మ్ అయినా ఆ సినిమాతో ప్రేక్షకులు కనెక్ట్ అయ్యేది అందులోని భావోద్వేగాలతోనే. భావోద్వేగాలతో ప్రేక్షకులను కనెక్ట్ చేయడం నా బలం అని నా నమ్మకం'' అన్నారు శౌర్యువ్. నాని, మృణాల్ ఠాకూర్ హీరో హీరోయిన్లుగా బాల నటి కియారా ఖన్నా, హీరోయిన్ శ్రుతీహాసన్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'హాయ్ నాన్న'. శౌర్యువ్‌ను దర్శకుడిగా పరిచయం చేస్తూ, మోహన్ చెరుకూరి, డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 7న విడుదల కానుంది. ఈ సందర్భంగా శనివారం విలేకర్ల సమావేశంలో శౌర్యువ్ మాట్లాడుతూ– ''మాది వైజాగ్. మెడిసిన్ పూర్తి చేశాను. సినిమాలపై ఆసక్తితో ఇండస్ట్రీకి వచ్చాను. తండ్రీ కూతురి అనుబంధం, వీరికి మృణాల్ పాత్రతో ఉన్న సంబంధం.. ఈ అంశాల తాలూకు ఎమోషన్స్‌తో 'హాయ్ నాన్న' కథనం ఉంటుంది. నానీగారు కొన్ని సలహాలు, సూచనలు ఇచ్చారు. కథ రీత్యా ఏడ్చినా అందంగా ఉండాలని మృణాల్‌ను తీసుకున్నాం. శ్రుతీహాసన్‌గారి పాత్ర బాగుంటుంది. బేబీ కియారాకి యాక్టింగ్ ప్రతిభ ఉంది. హేషమ్‌గారు మంచి మ్యూజిక్ ఇచ్చారు. నేపథ్య సంగీతం ఇంకా బాగుంటుంది. సాను మంచి విజువల్స్ ఇచ్చారు'' అని చెప్పుకొచ్చారు.



శౌర్యువ్

ముప్పైకి పైగా భయపడే సీన్లు ఉన్నాయి

''నా 30 ఏళ్ల వయసులోనే ఐటీ కంపెనీలను సక్సెస్‌ఫుల్‌గా రన్ చేశాను. దాంతో సినిమా తీయడం సులభం అనుకున్నాను. కానీ వంద కాదు.. వెయ్యి కోట్లు ఉన్నా సినిమా చేయడం అంత సులభం కాదని తెలుసుకున్నాను. వందల మంది కలిసి పని చేస్తూ, అన్నీ కలిసి వస్తేనే ఓ సినిమా పూర్తవుతుంది. లేదంటే ఎన్ని కోట్లు డబ్బులున్నా ఇబ్బందులు పడాల్సి ఉంటుంది'' అన్నారు యశ్వంత్ దగ్గుమాటి. శ్రీరామ్, ఖుషీ జంటగా ఈశ్వరీ రావు, అవసరాల శ్రీనివాస్ కీలక పాత్రల్లో నటించిన హారర్ ఫిల్మ్ 'పిండం'. యశ్వంత్ దగ్గుమాటి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 15న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా యశ్వంత్ దగ్గుమాటి మాట్లాడుతూ– ''నాకు యూఎస్‌లో ఐటీ కంపెనీలున్నాయి. సాయికిరణ్‌కు సినిమాలపై ఆసక్తి. ఓ సినిమా చేద్దామని ఇండియా వచ్చాం. సిద్ధు జొన్నలగడ్డతో మేం చేయాల్సిన 'డల్లాస్ దేశీ దొంగలు' సినిమా లాక్‌డౌన్ వల్ల ఆగిపోయింది. ఆ తర్వాత మరో కథ అనుకున్నాం. అది కూడా కుదర్లేదు. ఆ నెక్ట్స్ 'పిండం' కథను రెడీ చేశారు సాయికిరణ్. ఓ సందర్భంలో సాయికిరణ్ వాళ్ల నాన్నమ్మ ఓ భవంతిని చూపించి, ఓ కథ చెప్పారట. ఆ కథకు కొన్ని కల్పిత అంశాలు జోడించి 'పిండం' కథ రాశారు. ఈ సినిమాలో ముప్పైకి పైగా భయపడే సన్నివేశాలు ఉన్నాయి. 1930, 1990, 2023.. ఇలా మూడు కాలమానాల్లో స్క్రీన్‌ప్లే ఉంటుంది. ఇక మా సంస్థలో మొదలైన తొలి చిత్రం 'డల్లాస్‌లో దేశీ దొంగలు' ఉంటుంది. మరికొన్ని కథలు ఉన్నాయి'' అన్నారు.



యశ్వంత్ దగ్గుమాటి

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

క్లుప్తంగా...

13న బీసీల చలో ఢిల్లీ

- జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

కాచిగూడ (హైదరాబాద్): పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బీసీలకు 50% రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 13,14 తేదీల్లో చలో ఢిల్లీ, పార్లమెంట్ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ అధ్యక్షతన శనివారం కాచిగూడలోని అభినందన్ గ్రాండ్‌లో జరిగిన సమావేశంలో ఆర్.కృష్ణయ్య పాల్గొని ప్రసంగించారు. బీసీల డిమాండ్ల సాధనకు పార్లమెంట్ వద్ద భారీ ప్రదర్శన నిర్వహిస్తామని వెల్లడించారు. అదేవిధంగా ప్రధానమంత్రి, కేంద్రమంత్రులు, ప్రతిపక్ష పార్టీల నేతలు, లోక్‌సభ, రాజ్యసభ సభ్యులను కలిసి పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టించడానికి ఒత్తిడి తెస్తామన్నారు. దేశ జనగణనలో బీసీ కులగణన చేపట్టాలని, బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీలకు సామాజిక రక్షణ, భద్రత కల్పించడానికి 'బీసీ యాక్ట్' తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో బీసీ హక్కుల పోరాట సమితి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బొల్లు మహేందర్, నీలం వెంకటేశ్, పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ బిల్లు పెట్టాలి

- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి తెలంగాణ రాష్ట్ర బీసీ సంఘం నేత రాజేశ్వర్ యాదవ్ విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: ప్రస్తుత పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లోనే చట్టసభల్లో బీసీ రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టాలని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి తెలంగాణ రాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షుడు రాజేశ్వర్ యాదవ్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కిషన్‌రెడ్డికి శనివారం ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ బిల్లు ద్వారా బీసీలకు అసెంబ్లీ, లోక్‌సభల్లో రిజర్వేషన్ల కల్పనకు అవకాశం ఏర్పడుతున్నందున, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని అందులో కోరారు.

బార్ కౌన్సిల్‌కు సాయం అందించిన ఒకే ఒక్క సీఎం వైఎస్సార్

- ఏపీలో ఇప్పుడు సీఎం వైఎస్ జగన్ కూడా బార్ కౌన్సిల్‌కు వంద కోట్లు కేటాయించారు
- అక్కడ కొత్త న్యాయవాదులకు ఐదేళ్ల వరకు స్టైపెండ్ ఇస్తున్నారు
- మీడియేషన్ చట్టబద్ధం కానుంది
- బార్ కౌన్సిల్ చైర్మన్‌గా 17 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా 'సాక్షి'తో ఎ.నరసింహారెడ్డి



సాక్షి, హైదరాబాద్: అనంత నరసింహారెడ్డి.. ఒక సారి కాదు.. రెండుసార్లు కాదు.. వరుసగా మూడుసార్లు రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఒక న్యాయవాది 17 ఏళ్ల పాటు ఆ పదవిలో కొనసాగి సేవలందించడం దేశంలోనే రికార్డు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత రాష్ట్ర బార్ కౌన్సిల్ తొలి చైర్మన్‌గానూ ఆయనే ఎన్నికయ్యారు. ఐదుసార్లు బార్ కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నికయ్యారు. బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడిగా వ్యవహరించారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా డిసిప్లినరీ కమిటీ కో–ఆప్షన్ సభ్యుడిగానూ పనిచేశారు. బార్ కౌన్సిల్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టి 17 ఏళ్లు పూర్తయిన సందర్భంగా 'సాక్షి'ఇంటర్వ్యూలో పలు విషయాలను వెల్లడించారు. ఇప్పటివరకు బార్ కౌన్సిల్‌కు నేరుగా సాయం చేసిన ఒకే ఒక్క ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని పేర్కొంటున్న నరసింహారెడ్డి వివరాలు ఆయన మాటల్లోనే..

సేవా భావంతోనే బార్ కౌన్సిల్‌కు...

జూనియర్ న్యాయవాదిగా పని చేస్తున్న సమయంలో సివిల్ కోర్టులో ఎక్కువగా కేసులు వాదించే వాడిని. అప్పటి నుంచే న్యాయవాదుల సంక్షేమానికి ఏదో చేయాలన్న తపన ఉండేది. దీంతో నన్ను బార్ కౌన్సిల్‌కు పోటీ చేయమని చాలా మంది న్యాయవాదులు ప్రోత్సహించారు. నాటి బార్ కౌన్సిల్ చైర్మన్ ఎల్లారెడ్డి కూడా ఆహ్వానించారు. అలా 1995లో తొలిసారి బార్ కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నికయ్యా. సమరసింహారెడ్డి మంత్రిగా ఉన్న సమయంలో ఆయనతో మాట్లాడి న్యాయవాదులకు సంక్షేమ నిధి ఏర్పాటు చేశాం. సహచరులు దేశాయ్ ప్రకాశ్‌రెడ్డి(మాజీ ఏజీ), జస్టిస్ ఏ.గోపాల్‌రెడ్డి (జడ్జి)తో కలసి పలు కార్యక్రమాలు చేపట్టాం.

మహానేత వైఎస్సార్‌తో అనుబంధం...

2006లో తొలిసారి బార్ కౌన్సిల్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టా. కొద్ది రోజుల తరువాత అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్సార్‌ను కలిసే అవకాశం వచ్చింది. న్యాయవాదుల సంక్షేమం కోసం ఏం చేద్దాం అని ఆయన అడగడంతో కొన్ని వివరాలను చెప్పా. ఒక్కొక్కటిగా చేస్తూ పోదాం అంటూ న్యాయ శాఖ మంత్రిని పిలిచి వెంటనే రూ.1.65 కోట్లను మంజూరు చేశారు. అప్పటికే ఇతర రంగాలు సాంకేతిక వైపు పరుగులు ప్రారంభించడంతో నాటి సీజే జస్టిస్ మదన్‌లోకూర్ సూచన మేరకు బార్ అసోసియేషన్లలో కంప్యూటర్లు, ప్రింటర్లు, ఇంటర్నెట్ ఏర్పాటు చేశాం. వాటి వినియోగంపై న్యాయవాదులకు శిక్షణనిచ్చాం.

స్టైపెండ్ ఇవ్వాలని కోరుతున్నాం..

ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి న్యాయవాదుల సంక్షేమం కోసం బార్ కౌన్సిల్‌కు రూ.100 కోట్లు కేటాయించి.. రూ.25 కోట్లు మంజూరు చేశారు. అక్కడ కొత్త న్యాయవాదులకు ఐదేళ్ల వరకు స్టైపెండ్ ఇస్తున్నారు. అలాగే తెలంగాణ రాష్ట్రంలోనూ చేపట్టాలని కోరుతున్నా.. న్యాయవాదులు వినియోగించే స్టాంప్‌ల ద్వారా న్యాయవాదుల సంక్షేమ నిధికి కొంత మేర నిధులు చేకూరుతాయి. ప్రభుత్వ అధికారులు కూడా విధిగా ఈ స్టాంప్‌లు వినియోగించాలని చట్టం చెబుతున్నా వారు పాటించడంలేదు.

అడ్వొకేట్ లా అకాడమీ ఏర్పాటు నా కల..

రాష్ట్రంలో లా అకాడమీ ఏర్పాటు చేయలన్నది నా కల. యువ న్యాయవాదులకు శిక్షణ ఇవ్వడం, సీనియర్ న్యాయవాదులతో మార్గనిర్దేశం చేసే కార్యక్రమాలు చేయాలని భావించాం. కొన్నేళ్లుగా ప్రయత్నిస్తున్నా దీనిపై అడుగు ముందుకు పడటం లేదు.

మీడియేషన్ చట్టబద్ధం కానుంది..

కోర్టుల్లో విపరీతంగా పెరిగిపోతున్న కేసులకు మీడియేషనే పరిష్కారం. న్యాయవాదులకు మీడియేషన్‌పై అవగాహన కల్పించాలి. ముందుగా ఏ కేసునైనా మీడియేషన్‌కు పంపిన తర్వాతే విచారణ చేపట్టాలి. ఆ దిశగా కేంద్ర చట్టం చేస్తోంది. ఇది కార్యరూపం దాలిస్తే అధికారికంగా మీడియేటర్లను నియమిస్తారు. వారిచ్చే ఉత్తర్వులు చట్టబద్ధం అవుతాయి. అలాగే, పాత కాలపు పద్ధతులకు స్వస్తి పలికే చర్యలు తీసుకున్నాం. కోర్టుల్లో యువరానర్, మైలార్డ్ పదాలు అవసరం లేదని సర్, మేడమ్ అంటే చాలని నిర్ణయం తీసుకున్నాం. న్యాయవాదులకు ఉజ్వల భవిష్యత్ ఉంది.

వృద్ధ మావోయిస్టు దంపతుల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న రామగుండం పోలీసు కమిషనర్ రెమా రాజేశ్వరి

- రూ.1.57 లక్షల నగదు, నకిలీ కార్డులు స్వాధీనం
- రామగుండం సీపీ రాజేశ్వరి వెల్లడి

గోదావరిఖని, జైపూర్: మావోయిస్టు పార్టీ టెక్నికల్ టీంలో కీలకంగా వ్యవహరిస్తున్న దంపతులను అరెస్ట్ చేసినట్లు పెద్దపల్లి జిల్లా రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి వెల్లడించారు. శనివారం కమిషనరేట్‌లో జరిగిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. 'మంచిర్యాల జిల్లా జైపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇందారం గ్రామంలోని ఒక ఇంట్లో మావోయిస్ట్ పార్టీ టెక్నికల్ డిపార్ట్‌మెంట్, సెంట్రల్ టెక్నికల్ టీమ్ క్యాడర్‌కు చెందిన దొంగ గంగాధరరావు(80) అలియాస్ నర్సన్న అలియాస్ బక్కన్న అలియాస్ వెంగో దాదా, ఆయన భార్య భవాని(60) అలియాస్ సుజాత అలియాస్ శ్యామల ఉన్నారనే సమాచారం అందింది. ఈ మేరకు తనిఖీలు చేయగా, వారిరువురు పట్టుబడ్డారు.''అని సీపీ వివరించారు.

ఆంధ్రా నుంచి ఇందారం వరకూ..

''గంగాధర్‌రావు, శ్యామల దంపతులు ఆంధ్రాలోని అంబేడ్కర్ కోనసీమ జిల్లా డెల్టా గన్నవరం మండలం నరేంద్రపురం గ్రామానికి చెందిన వారు. గంగాధర్‌రావు నిషేధిత మావోయిస్ట్ పార్టీ సాంకేతిక విభాగంలో కేంద్ర కమిటీ సభ్యుడిగా పని చేస్తున్నారు. 1972లో జీవనోపాధి కోసం హైదరాబాద్ వచ్చి.. పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులై 1980లో పార్టీలో చేరి అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. 2000లో కేంద్ర కమిటీ సాంకేతిక విభాగం బాధ్యతలు చేపట్టారు. ఆయుధాలు, పేలుడు పదార్థాల తయారీదారుగా పని చేశారు''అని సీపీ తెలిపారు. కేంద్ర కమిటీ సభ్యుడు చంద్రన్న ఆదేశాల మేరకు గంగాధర్‌రావు తన భార్యతో కలిసి పది నెలల క్రితం ఇందారం వచ్చారని సీపీ చెప్పారు.

నకిలీ ఆధార్‌తో భూమి కొనుగోలు

జల్లంపెల్లి బక్కయ్య, జల్లంపెల్లి లక్ష్మి పేర్లతో వృద్ధ దంపతులు నకిలీ ఆధార్, పాన్ కార్డులు తయారు చేసి, వాటి ఆధారంగా ఇందారంలో స్థలం కొనుగోలు చేసి ఇల్లు నిర్మించుకున్నారని సీపీ రాజేశ్వరి తెలిపారు. ఈ మేరకు గంగాధర్‌రావు, భవానిపై జైపూర్ పోలీస్‌స్టేషన్‌లో పలు కేసులు నమోదు చేసినట్లు సీపీ వివరించారు. వీరికి మావోయిస్టు సానుభూతి పరుడు కుమురంభీం జిల్లా పెంచికల్‌పేట్ మండలం కమాన్‌పూర్ గ్రామానికి చెందిన చిప్పకుర్తి శ్రీనివాస్ సహకరించాడని, ప్రస్తుతం పరారీలో ఉన్న ఇతడిపై కేసు నమోదు చేశామని సీపీ వివరించారు. కాగా, అరెస్టయిన నిందితుల నుంచి జాలంపల్లి బక్కయ్య పేరిట ఉన్న ఆధార్‌కార్డుతోపాటు రూ.1.57లక్షల నగదు,, రెండు మొబైల్ ఫోన్లు, ఆరు సిమ్‌కార్డులు, ట్యాబ్, రెండు పెన్‌డ్రైవ్‌లు, విప్లవ సాహిత్యం స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. కాగా, అనారోగ్యంతో లొంగిపోయేందుకు, చికిత్స పొందేందుకు వచ్చిన దంపతులను పట్టుకున్నారన్న వాదనలపై సీపీని ప్రశ్నించగా ఖండించారు. చికిత్సకు సంబంధించిన కాగితాలేమీ లభించలేదన్నారు.

సిర్పూర్ పైనే ఏనుగంత ఆశ!

- త్రిముఖ పోటీలో ఫలితంపై బీఎస్పీలో ఉత్కంఠ
- కొన్ని నియోజకవర్గాల్లో ఫలితాలను తారుమారు చేసే స్థితిలో బీఎస్పీ

సాక్షి, హైదరాబాద్: బహుజన వాదం నినాదంతో రాష్ట్రంలో వేళ్లూనుకోవాలని ఆశపడ్డ బహుజన సమాజ్ పార్టీ ఎన్నికల ఫలితాల కోసం ఆసక్తిగా ఎదురు చూస్తోంది. స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన ఐపీఎస్ అధికారి ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్ బీఎస్పీలో చేరి గత రెండేళ్లుగా పార్టీని బలోపేతం చేసేందుకు శాయశక్తులా కృషి చేశారు. శాసనసభ ఎన్నికల్లో ఆయన స్వయంగా ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ నుంచి పోటీ చేయడమే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థులను బరిలోకి దించారు. సిర్పూరులో విజయం సాధిస్తామనే అంచనాతో పాటు పలు నియోజకవర్గాల్లో గెలుపు ఓటములను ప్రభావితం చేసే స్థాయిలో ఓట్లు సాధిస్తుందని ఆ పార్టీ లెక్కలు వేస్తోంది. రాష్ట్రంలో తొలిసారిగా 10 శాతం ఓట్లు సాధించడం లక్ష్యంగా బరిలోకి దిగినట్లు పార్టీ అంతర్గత సమావేశాల్లో చెపుతూ వచ్చారు. ఇందులో భాగంగానే పకడ్బందీగా అభ్యర్థులను ఎంపిక చేసి పలు నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులను భయపెట్టారనే చెప్పాలి.

ఆ మూడు పార్టీలు చీల్చుకునే ఓట్లపై..

సిర్పూరులో సిట్టింగ్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, బీజేపీ అభ్యర్థి పాల్వాయి హరీశ్‌బాబు, కాంగ్రెస్ అభ్యర్థి రావి శ్రీనివాస్‌లకు పార్టీ అభ్యర్థి ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్ ప్రచారం నుంచే గట్టిపోటీ ఇచ్చారు. దళిత, గిరిజనులు, బుద్ధిస్టుల ఓట్లతో పాటు ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పట్ల నెలకొన్న వ్యతిరేకత తనకు కలిసి వస్తుందని ఆయన భావిస్తున్నారు. అదే స్థాయిలో ఓటర్లను ఆకర్షించే ప్రయత్నం చేశారు. ఈ మేరకు ఎన్నికల్లో బీజేపీ, బీఆర్‌ఎస్‌కు దీటుగా ఓట్లు పోలయినట్లు ఆపార్టీ అంచనా వేస్తోంది. బీజేపీ, బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ఓట్లు పంచుకుంటే బీఎస్పీ విజయం సాధిస్తుందని ఆ పార్టీ నాయకులు విశ్లేషిస్తున్నారు. అయితే పోలింగ్ రోజు బీజేపీకి భారీగా ఓట్లు పోలవడం కొంత అనుమానాలకు తావిస్తుందనే ప్రచారం జరుగుతోంది.

ఈ నియోజకవర్గాల్లో గట్టి పోటీ

సిర్పూర్‌తో పాటు చివరి నిమిషంలో బీఎస్పీ నుంచి పోటీ చేసిన కాంగ్రెస్ నాయకుడు నీలం మధు, పెద్దపల్లి నుంచి బరిలో నిలిచిన దాసరి ఉష, సూర్యాపేట నుంచి వట్టె జానయ్య యాదవ్, నకిరేకల్ నుంచి పోటీ చేసిన మేడి ప్రియదర్శిని, ఆలంపూర్ నుంచి బరిలోకి దిగిన ప్రవీణ్‌కుమార్ సోదరుడు ఆర్. ప్రసన్న కుమార్ ప్రధాన పార్టీలకు గట్టి పోటీ ఇచ్చినట్లు పార్టీ భావిస్తోంది. ఈ నియోజకవర్గాలలో గెలవకపోయినా ప్రత్యర్థి పార్టీల ఓటములను నిర్దేశించే స్థితిలో ఓట్లు సాధిస్తుందని భావిస్తున్నారు. కాగా పోటీ చేసిన ఇతర నియోజకవర్గాలలో కూడా పార్టీ మెరుగైన ఓట్లను సాధించడం ద్వారా రాష్ట్రంలో ఓటింగ్ శాతాన్ని మెరుగుపరుచుకుంటుందని ఆ పార్టీ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ భావిస్తున్నారు.

'రివర్‌బోర్డు' అనుమతితోనే నీటి వినియోగం

సాక్షి, హైదరాబాద్: నాగార్జునసాగర్‌లో 18 టీఎంసీలు మాత్రమే ఉన్న నీటిని కృష్ణా రివర్‌బోర్డు అనుమతితోనే ఉభయ తెలుగు రాష్ట్రాలు వినియోగించుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం శనివారం ఒక ప్రకటనలో కోరారు. తెలంగాణ రాష్ట్రం ఎన్నికల హడావుడిలో ఉన్న సమయంలో ఉన్నట్టుండి వివాదం తలెత్తిందని పేర్కొన్నారు. రెండు రాష్ట్రాల మధ్య సామరస్యాన్ని నెలకొల్పి సానుకూలంగా సమస్యను పరిష్కరించాల్సిన కేంద్రం.. బాధ్యతను విస్మరించిందని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్రం వాస్తవాలను పరిగణనలోకి తీసుకుని బాధ్యతాయుతంగా పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.

క్లుప్తంగా...

హైదరాబాద్ నుంచి గోండియాకు విమానం



గోండియా విమాన సర్వీసును ప్రారంభిస్తున్న అధికారులు

శంషాబాద్ (హైదరాబాద్): శంషాబాద్ విమానాశ్రయం నుంచి మహారాష్ట్రలోని గోండియాకు ఇండిగో విమాన సర్వీసును ప్రారంభించింది. శనివారం ఉదయం 10.35 గంటలకు 6ఈ7534 విమాన సర్వీసు ఇక్కడి నుంచి బయల్దేరింది. రోజూ ఈ విమాన సర్వీసు 10.35 గంటలకు బయల్దేరి 12.35 గంటలకు గోండియాకు చేరుకుంటుంది. దీంతో శంషాబాద్ విమానాశ్రయం నుంచి మరో దేశీయ గమ్యస్థానానికి విమాన సర్వీసు పెరిగినట్లు అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో జీఎంఆర్, ఇండిగో అధికారులు పాల్గొన్నారు.

142 రైళ్ల రద్దు



సాక్షి, హైదరాబాద్: మిచాంగ్ తుపాను నేపథ్యంలో వివిధ ప్రాంతాల మధ్య నడిచే 142 రైళ్లను రద్దు చేసినట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్ రాకేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు హైదరాబాద్ నుంచి బయల్దేరే రైళ్లలో హైదరాబాద్–తాంబరం, సికింద్రాబాద్–కొల్లాం, సికింద్రాబాద్–తిరుపతి, లింగంపల్లి–తిరుపతి. సికింద్రాబాద్–రేపల్లె, కాచిగూడ–రేపల్లె, చెన్నై–హైదరాబాద్, సికింద్రాబాద్–గూడూరు, సికింద్రాబాద్–త్రివేండ్రం తదితర ప్రాంతాల మధ్య నడిచే రైళ్లు రద్దు కానున్నాయి.

దక్షిణ మధ్య రైల్వేకు రికార్డు స్థాయి ఆదాయం

నవంబర్‌లో రూ.1,600 కోట్ల ఆర్జన



సాక్షి, హైదరాబాద్: గత కొన్నేళ్లుగా గరిష్ట స్థాయి ఆదాయాన్ని ఆర్జిస్తూ తన పాత రికార్డులు అధిగమిస్తున్న దక్షిణ మధ్య రైల్వే ఇప్పుడు మరో ఘనతను సాధించింది. నవంబర్ నెలకు సంబంధించి రైల్వే శాఖ ఆల్‌టైమ్ రికార్డు సృష్టించింది. ఇటు ప్రయాణికుల రైళ్ల ద్వారా, అటు సరుకు రవాణా రైళ్ల ద్వారా నవంబర్‌లో రూ.1,600.53 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. గత ఏడాది నవంబర్‌లో గరిష్ట ఆదాయం రూ.1,454 కోట్లు మాత్రమే కాగా, ప్రయాణికుల రైళ్ల ద్వారా రైల్వే ఈ సంవత్సరం నవంబర్‌లో 469.40 కోట్ల ఆదాయాన్ని సాధించింది. ప్రయాణికుల అవసరాల మేరకు 342 అదనపు ట్రిప్పులను నడిపింది. ఇది 64 రైళ్లకు సమానం. వీటిల్లో 3.39 లక్షల మంది ప్రయాణికులు ప్రయాణించారు. అలాగే రైల్వే శాఖ ఈ నవంబర్‌లో 11.57 మెట్రిక్ టన్నుల సరుకును రవాణా చేసింది. దీని ద్వారా రూ.1,131.13 కోట్ల ఆదాయాన్ని సంపాదించింది. ఇది గతేడాది నవంబర్ ఆదాయం కంటే పది శాతం ఎక్కువ. కొత్త క్లయింట్‌లతో ఒప్పందాలు చేసుకోవటం, సరుకు రవాణా చేసే కొత్త గమ్యస్థానాలను జోడించటం, కొత్త ట్రాక్‌ను అందుబాటులోకి తేవటం వంటి చర్యల ద్వారా ఇది సాధ్యమైందని రైల్వే శాఖ వర్గాలు వెల్లడించాయి. ఆదాయాన్ని భారీగా పెంచడానికి కృషి చేసిన ఉద్యోగులు, ఇతర సిబ్బందిని జోన్ జీఎం అరుణ్‌కుమార్ జైన్ అభినందించారు. ఈ ఆర్థిక సంవత్సరం మొత్తానికి సంబంధించి కూడా ఇదే తరహా రికార్డును సాధించాలని ఆయన సూచించారు.

మొక్కల్లోని ప్రొటీన్లపై ప్రయోగాలు.. హెచ్‌సీయూకు పేటెంట్



పద్మశ్రీ



అరుణశ్రీ

రాయదుర్గం: పత్తి, పొగాకు వంటి వాణిజ్య పంటలను దెబ్బతీసే తెగుళ్లను సమర్థంగా నిర్మూలించగల మొక్కల్లోని రెండు రకాల ప్రొటీన్లను శాస్త్రీయంగా వేరు చేసే ప్రక్రియలో నూతన సాంకేతికను అభివృద్ధి చేసినందుకు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి కొత్త పేటెంట్ మంజూరైంది. మల్టీఫంక్షనల్ బోమన్–బిర్క్ అండ్ కునిట్జ్ ఇన్హిబిటర్లను వేరు చేయడం, శుద్ధి చేయడం కోసం నూతనంగా ఆవిష్కరించిన పద్ధతికి ఈ పేటెంట్ మంజూరైంది. హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ నుంచి ఇద్దరు శాస్త్రవేత్తలు ప్రయోగశాలలో దీన్ని అభివృద్ధి చేశారు. బయోటెక్నాలజీ అండ్ బయో ఇన్ఫర్మేటిక్స్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ కె.పద్మశ్రీ, డాక్టర్ ఎంకే అరుణశ్రీ... మరియమ్మ గుజ్జర్లపూడి, భారతి కోటర్య మార్గదర్శకత్వంలో ఈ ప్రయోగాలు నిర్వహించారు. మొక్కల్లో ఉండే బోమన్–బిర్క్, కునిట్జ్ ఇన్హిబిటర్లు తెగుళ్ల, వ్యాధికారక క్రిములకు వ్యతిరేకంగా రక్షణ సహా అనేక జీవసంబంధమైన విధులను కలిగి ఉన్నాయని ప్రొఫెసర్ పద్మశ్రీ వివరించారు. ఇవి రైతుకు అనుకూలమైనవని ఆమె పేర్కొన్నారు.

చవక నగరాల్లో అహ్మదాబాద్, చెన్నై

ప్రపంచంలో టాప్‌-10లో చోటు

ప్రపంచంలో తక్కువ ఖర్చుతో బతుకు వెళ్లదీయగల పెద్ద నగరాల్లో మన దేశానికి చెందిన రెండు సిటీలు అహ్మదాబాద్, చెన్నైలకు చోటు దక్కింది. ప్రఖ్యాత 'ఎకానమిస్ట్ ఇంటెలిజెన్స్ యూనిట్' సంస్థ ప్రపంచవ్యాప్తంగా 175 దేశాల్లోని పెద్ద నగరాలను ఎంపిక చేసి, సర్వే నిర్వహించి ఈ మేరకు నివేదికను విడుదల చేసింది. ఆయా నగరాల్లో నిత్యావసరాల నుంచి ఇంటి అద్దెల దాకా వివిధ ధరలను పరిశీలించి.. జీవించడానికి అయ్యే ఖర్చును తేల్చామని పేర్కొంది. ఇందులో సింగపూర్, స్విట్జర్లాండ్‌లోని జ్యూరిచ్ నగరాలు అత్యధిక జీవన వ్యయంలో టాప్‌లో నిలిచాయి. నిత్యావసరాలు, వస్తువుల ధరలు పెరిగి ద్రవ్యోల్బణం గణనీయంగా ఉండటంతో యూరప్, ఉత్తర అమెరికా



దేశాల్లోని నగరాల్లో జీవన వ్యయం పెరుగుతోందని తెలిపింది. ఇక తక్కువ వ్యయం ఉండే నగరాల్లో ఆసియా ఖండానికి చెందినవే ఎక్కువగా ఉన్నాయని నివేదిక వెల్లడించింది. – సాక్షి సెంట్రల్‌డెస్క్

జీవన వ్యయం తక్కువగా ఉండే టాప్‌-10 నగరాలివీ..

నగరం	దేశం
1. డమాస్కస్	సిరియా
2. టెహ్రాన్	ఇరాన్
3. ట్రిపోలీ	లిబియా
4. కరాచీ	పాకిస్తాన్
5. తాష్కెంట్	ఉజ్బెకిస్తాన్
6. ట్యూనిస్	ట్యూనీషియా
7. లుసాకా	జాంబియా
8. అహ్మదాబాద్	ఇండియా
9. లాగోస్	నైజీరియా
10. చెన్నై	ఇండియా

వారి మనసంతా ఇక్కడే!

- ఎన్నికల ఫలితాలపై ఎన్‌ఆర్‌ఐల ఆసక్తి
- గల్ఫ్ దేశాల వలస కార్మికుల్లో ఉత్కంఠ
- ఎవరు గెలుస్తారంటూ ఆరా
- మిత్రులతో రోజూ ఫోన్‌లలో చర్చలు



సిరిసిల్ల: విదేశాల్లో స్థిరపడ్డ వారంతా తెలంగాణ ఎన్నికల ఫలితాలపై ఆసక్తి చూపుతున్నారు. వారంతా నిత్యం ఇక్కడ ఉన్న మిత్రులతో టచ్‌లో ఉంటున్నారు. పోలింగ్ సరళి, స్థానిక రాజకీయాలపై చర్చిస్తున్నారు. జనం ఎటు వైపు ఓట్లు వేశారు.. ఎంత పోలింగ్ జరిగింది.. ఎవరు గెలుస్తారంటూ.. ఫోన్‌లలో మిత్రులను ఆరా తీస్తున్నారు. ఆదివారం ఎన్నికల ఫలితాలు వెలువడుతున్న తరుణంలో శనివారం రాత్రి నుంచే మిత్రులకు, బంధువులకు ఫోన్‌లు చేసి వివరాలు తెలుసుకుంటున్నారు.

ఉమ్మడి జిల్లా అంతటా వలసలే..

కరీంనగర్ ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గల్ఫ్ దేశాల్లో 1.20 లక్షల మంది ఉపాధి పొందుతుండగా వారి కుటుంబాలకు చెందిన మరో 5 లక్షల మంది ఓటర్లు ఈ ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ, కోరుట్ల, జగిత్యాల, ధర్మపురి, మానకొండూరు, చొప్పదండి, హుజూరాబాద్ నియోజకవర్గాలకు చెందిన వారు గల్ఫ్ దేశాల్లో ఎక్కువగా ఉన్నారు. ఎన్నికల సమయంలో వాళ్లంతా ఓటుహక్కు వినియోగించుకోలేకపోయినా కుటుంబసభ్యులతో ఫోన్‌లో టచ్‌లో ఉన్నారు. ప్రతీక్షణం ఎన్నికల సరళిపై ఆరా తీశారు.

ఎన్నారై పాలసీపై ఆశలు..

కేరళ తరహాలో విదేశీ విధానంపై తెలంగాణ ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకుంటుందని గల్ఫ్ వలసజీవులు ఆశిస్తున్నారు. నిజానికి వీసా ఉండి గల్ఫ్ దేశాలకు వెళ్లే వారికి తక్కువ వడ్డీతో బ్యాంకు రుణవసతి కల్పించడం, గల్ఫ్ సమస్యల పరిష్కారానికి జిల్లా కేంద్రంలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయడం, నకిలీ ఏజెంట్లను కట్టడిచేయడం, చట్టబద్ధమైన ఏజెన్సీల ద్వారా గల్ఫ్ దేశాలకు పంపడం, పొరుగుదేశాలకు వెళ్లేవారికి ఏదో ఒక రంగంలో నైపుణ్య శిక్షణనివ్వడం, అక్కడి పరిస్థితులపై ముందే అవగాహన కల్పించడం వంటి విధానాలను ఎన్నారై పాలసీలో రూపొందించాలని గల్ఫ్ వలస జీవులు కోరుతున్నారు. రూ.వంద కోట్ల బడ్జెట్‌ను ఏటా కేటాయిస్తూ గల్ఫ్ వలసజీవుల ఇబ్బందులను పరిష్కరించాలని వలస కార్మికులు కోరుతున్నారు. మనుషులు అక్కడే ఉన్నప్పటికీ మనసులు మాత్రం ఎన్నికల ఫలితాలపైనే ఉన్నాయి. తమ సొంత నియోజకవర్గాల్లో ఎవరు గెలుస్తారు.. మెజార్టీ ఎంత వస్తుందని ఆరా తీస్తున్నారు.

నోటిఫికేషన్ వచ్చినప్పటి నుంచి..

మాది వేములవాడ నియోజకవర్గంలోని కోనరావుపేట మండలం శివంగాలపల్లె. నేను మలేసియాలో దశాబ్దకాలంగా ఉద్యోగం చేస్తున్న. తెలంగాణలో ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినప్పటి నుంచి ప్రతిరోజూ పరిశీలిస్తున్న. ప్రచార సభలను కూడా టీవీల్లో చూశాను. ఎన్నికల సరళి, ఎగ్జిట్ పోల్స్‌ను కూడా తెలుసుకుంటున్నాం. ఏ ప్రభుత్వం ఏర్పడుతుందో అనే ఆసక్తి మా దగ్గర ఉండే తెలంగాణ వాసులు అందరిలోనూ ఉంది.
– శివంగాల రమేశ్, మలేసియా

ఏ పార్టీ గెలుస్తుందోనని..

మాది సిరిసిల్ల. ఎక్కడ ఉన్నా.. ఇండియాలో.. ప్రధానంగా మన తెలంగాణ రాజకీయాలపై ఆసక్తి ఉంటుంది. ఇప్పుడు జరుగుతున్న ఎన్నికల్లో ఏ పార్టీ విజయం సాధిస్తుందోనని చూస్తున్నాం. సోషల్ మీడియా, వాట్సాప్‌లలో వచ్చే వాటిని పరిశీలిస్తుంటాం. ఇటీవల ఇక్కడ వీకెండ్స్‌లో రాజకీయాలపైనే చర్చలు సాగుతున్నాయి. ఈసారి తెలంగాణలో ఎన్నికలు భిన్నంగా ఉన్నాయి. ఎన్నికల ఫలితాలపై ఉత్కంఠగా ఉంది.
– నక్క శశికుమార్, హాంకాంగ్

గల్ఫ్‌కార్మికుల బాధలు తీరాలి

మాది కరీంనగర్ జిల్లాలోని చొప్పదండి నియోజకవర్గం. ఎవరు గెలిచినా గల్ఫ్ కార్మికుల బాధలు తీర్చే ప్రభుత్వం రావాలి. నిజానికి ఎన్‌ఆర్‌ఐ పాలసీ తెస్తామని హామీ ఇచ్చి విస్మరించారు. గల్ఫ్ కార్పొరేషన్ లాంటివి ఏర్పాటు చేస్తామన్నారు. కానీ అమలు కాలేదు. గల్ఫ్ కార్మికులకు దీర్ఘకాలిక ప్రయోజనం కలిగించే ప్రభుత్వాలు రావాలని ఆశిస్తున్నాం. ఎన్నికల ఫలితాలపై ఆసక్తిగా ఉంది.
– ఎస్వీ రెడ్డి, దుబాయ్

ఇకపై 'స్మార్ట్'గా సంస్కృత, వేద పాఠశాలలు

నూతన జాతీయ విద్యావిధానంలో భాగంగా ప్రణాళిక సిద్ధం చేసిన కేంద్రం

సాక్షి, న్యూఢిల్లీ: వేదం, సంస్కృతం నేర్చుకునే విద్యార్థులు ఇకపై ఆధునిక పద్ధతుల్లో, హైటెక్ విద్యను అభ్యసించబోతున్నారు. నూతన జాతీయ విద్యా విధానం (ఎన్‌ఈపీ)లో భాగంగా ఇప్పటికే ఒక ప్రణాళికను కేంద్ర ప్రభుత్వం రూపొందించింది. తెలుగు రాష్ట్రాల్లోని యాభైకిపైగా వేద, సంస్కృత పాఠశాలలు సహా దేశవ్యాప్తంగా ఉన్న సంస్కృత, వేద పాఠశాలలను 'స్మార్ట్'ప్రపంచ స్థాయి ప్రమాణాలతో తీర్చిదిద్దాలని కేంద్ర విద్యా శాఖ నిర్ణయించింది. ఇందులోభాగంగా ముందుగా వేద మరియు సంస్కృత పాఠశాలలను అనుసంధానం చేయాలని యోచిస్తోంది. ఈ బాధ్యతను సాందీపని జాతీయ సంస్కృత విద్యా బోర్డుకు అప్పగించింది. ఈ మేరకు స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ మంత్రిత్వ శాఖను సాందీపని బోర్డు సంప్రదించింది. సంస్కృతం, వేద పాఠశాలల్లో నైపుణ్యాభివృద్ధి కోసం ప్రత్యేకంగా కోర్సులను రూపొందించాలని అభ్యర్థించింది. తాజాగా, బోర్డుతో విద్యా మంత్రిత్వ శాఖ ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించింది. ఇతర పాఠశాలలతో సమానంగా వేద, సంస్కృత పాఠశాలలను తీర్చిదిద్దడంపై సుదీర్ఘంగా చర్చించింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా దాదాపు 500 సంస్కృత, వేద పాఠశాలలు కేంద్ర ప్రభుత్వ సహకారంతో నడుస్తున్నాయి. ప్రైవేటు సంస్థలు, ట్రస్టులు కూడా పెద్ద సంఖ్యలో ఈ పాఠశాలలను నిర్వహిస్తున్నాయి. వీటిన్నింటినీ బోర్డు పరిధిలోకి తీసుకొచ్చే దిశగా బోర్డు చర్యలు చేపట్టింది. ఇన్నాళ్లు వేద, సంస్కృత పాఠశాలల్లో వేదాలు, అర్చక, పూజా విధానాలు నేర్చుకున్న విద్యార్థులు కంప్యూటర్‌లోనూ చక్కని ప్రావీణ్యం సంపాదించాలనేదే ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని అధికార వర్గాలు చెబుతున్నాయి.

విద్యార్థులు చేరని కాలేజీలు ఎందుకు?

- గ్రామీణ ప్రాంతాల్లో అరకొర చేరికలు
- 15 శాతం కంటే తక్కువ మంది ఉంటే వేరే కాలేజీకి.. స్కిల్ కోర్సులపై అరకొర అవగాహన..
- దోస్త్ ప్రవేశాలపై ఉన్నత విద్యా మండలి సమీక్ష
- భారీ మార్పుల దిశగా అడుగులు



సాక్షి, హైదరాబాద్: విద్యార్థులు పెద్దగా చేరని డిగ్రీ కాలేజీలపై ఉన్నత విద్యా మండలి దృష్టి పెట్టింది. ఏ కోర్సులో ఎంత మంది చేరారనే వివరాలు పరిశీలిస్తోంది. 15 శాతం కన్నా తక్కువమంది విద్యార్థులుంటే వారు.. సమీపంలోని కాలేజీల్లో చేరాలని సూచించింది. అన్ని కోర్సుల్లోనూ 15 శాతం కూడా చేరని కాలేజీలు దాదాపు 10 వరకూ ఉన్నాయి. వీటిని కొనసాగించే అవకాశం లేదని తెలుస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లోని కాలేజీల్లో విద్యార్థులు అరకొరగా చేరడంపై ఉన్నత విద్యామండలి అధికారులు ఆరా తీస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లోని కాలేజీలనే విద్యార్థులు ఎంచుకోవడానికి గల కారణాలను తెలుసుకుంటున్నారు. కొత్త కోర్సులను ప్రవేశపెడితే తప్ప ఆయా కాలేజీల మనుగడ కష్టమని అధికారులు భావిస్తున్నారు.

1.84 లక్షల సీట్లు ఖాళీ

ఈ సంవత్సరం కూడా భారీ ఎత్తున డిగ్రీ సీట్లు మిగిలిపోయాయి. రాష్ట్రంలో 1064 కాలేజీలుంటే, వీటిల్లో 3,89,049 డిగ్రీ సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఈ సంవత్సరం అన్ని కోర్సుల్లో చేరిన వారి సంఖ్య 2,04,674 మాత్రమే. ఇంకా 1,84,375 సీట్లు మిగిలిపోయాయి. వాస్తవానికి రాష్ట్రంలో 4.6 లక్షల సీట్లు అందుబాటులో ఉన్నాయి. వీటిల్లో దాదాపు 80 సీట్లను ఫ్రీజ్ చేశారు. విద్యార్థులు చేరని కోర్సులు, కాలేజీలకు ఈసారి దోస్త్‌లో అనుమతించలేదు. దీంతో కొన్ని సీట్లు తగ్గాయి. అయినప్పటికీ భారీగా సీట్లు మిగిలిపోవడంపై మండలి ఆరా తీస్తోంది. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో 1.25 లక్షలకుపైగా సీట్లు భర్తీ అయ్యాయి. గ్రామీణ ప్రాంతాల్లోని కాలేజీల్లో కంప్యూటర్ అనుసంధాన కోర్సులు లేకపోవడం, సంప్రదాయ డిగ్రీ కోర్సులను విద్యార్థులు ఇష్టపడకపోవడంతో సీట్లు మిగిలిపోయాయి.

ఆదరణలేని స్కిల్ కోర్సులు

డిగ్రీ చేస్తూనే పలు రకాల నైపుణ్యం సంపాదించే స్కిల్ కోర్సుల వైపు విద్యార్థులు పెద్దగా ఆసక్తి చూపలేదు. రాష్ట్రం మొత్తం మీద కేవలం 1398 మంది మాత్రమే చేరారు. దీంతో 10 వేలకుపైగా సీట్లు మిగిలిపోయాయి. కార్పొరేట్ మార్కెటింగ్, వివిధ అంశాల్లో సాంకేతిక నైపుణ్యం, పారిశ్రామిక అవసరాలకు తగ్గట్టుగా కొన్ని కోర్సులను డిగ్రీలో ప్రవేశపెట్టారు. విద్యార్థులు పరిశ్రమల్లో ప్రాక్టికల్‌గా నేర్చుకోవడమే కాకుండా, కొంత స్టైఫండ్ లభించేందుకు ఇవి దోహదపడుతున్నాయి. అయితే, అనుబంధ పరిశ్రమలు, ప్రాక్టికల్ ట్రైనింగ్ ఇచ్చే వ్యవస్థ లేదంటూ విద్యార్థులు వీటిని ఇష్టపడటం లేదని తెలుస్తోంది. విద్యార్థులు ఎక్కువగా బీకాం, లైఫ్‌సైన్స్ కోర్సుల వైపే మొగ్గు చూపుతున్నారు. దీంతో ఆదరణ లేని కోర్సులు కాకుండా, విద్యార్థులు కోరుకునే కోర్సులే అందించే విధంగా కాలేజీలను అప్‌గ్రేడ్ చేయాలని అధికారులు భావిస్తున్నారు. ఈ దిశగా వచ్చే ఏడాది భారీ మార్పులు తెస్తామని, మార్కెట్ డిమాండ్ ఉండే కోర్సులను అందించే కాలేజీలకే అనుమతి ఇస్తామని అధికారులు అంటున్నారు.

మార్పులు అనివార్యం..

రాష్ట్రంలో 50 శాతం కన్నా తక్కువగా విద్యార్థులు చేరిన కాలేజీలు వంద వరకూ ఉంటాయి. వీటిల్లో కొత్త కోర్సులు ప్రవేశపెడితేనే విద్యార్థులు చేరతారు. 15 శాతం కన్నా తక్కువ చేరిన కాలేజీల్లో బోధన కొనసాగించడం సాధ్యం కాదు. అందుకే ఈ కాలేజీల్లో విద్యార్థులను వేరే కాలేజీకి పంపుతున్నాం. గ్రామీణ ప్రాంతాల్లోని డిగ్రీ కాలేజీల్లో మార్పులు తేవాలి. కొత్త కోర్సులు ప్రవేశపెట్టేలా ప్రోత్సహించాలి. ఈ కసరత్తు మొదలైంది. వచ్చే ఏడాది భారీ మార్పులకు శ్రీకారం చుడతాం.
ప్రొఫెసర్ ఆర్ లింబాద్రి
(ఉన్నత విద్యా మండలి చైర్మన్)



శనివారం తిరుమలలో పొగమంచు..

రాష్ట్రంలో రెండ్రోజులు మోస్తరు వర్షాలు

- నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం
- ఆదివారం ఉదయానికి తుపానుగా మారే అవకాశం
- ఈనెల 5వ తేదీ నాటికి తీరం దాటనున్న తుపాను

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రానున్న రెండ్రోజులు వివిధ ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. ఆదివారం ఉదయానికి నైరుతి బంగాళాఖాతంలో తుపాను ఏర్పడే అవకాశం ఉన్నట్లు వెల్లడించింది. నైరుతి బంగాళాఖాతంలో కొనసాగుతున్న వాయుగుండం శనివారం తీవ్ర వాయుగుండంగా మారింది. ఇది గంటకు 18 కి.మీ వేగంతో పశ్చిమ–వాయవ్య దిశగా కదిలి నైరుతి బంగాళా ఖాతంలో కేంద్రీకృతమైంది. పుదుచ్చేరికి తూర్పు–ఆగ్నేయంగా 440 కిలోమీటర్లు, చెన్నైకి తూర్పు–ఆగ్నేయంగా 450 కిలోమీటర్లు, నెల్లూరుకు దక్షిణ–ఆగ్నేయంగా 580 కిలోమీటర్లు, బాపట్లకు దక్షిణ–ఆగ్నేయంగా 670 కిలోమీటర్లు, మచిలీపట్నానికి ఆగ్నేయంగా 670 కిలోమీటర్ల దూరంలో కొనసాగుతోంది. రానున్న 24 గంటల్లో పశ్చిమ వాయవ్య దిశగా పయనించి, నైరుతి బంగాళాఖాతం వద్ద తుపానుగా మారనున్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. ఆ తర్వాత వాయువ్య దిశగా కదులుతూ 4వ తేదీ తెల్లవారుజాము వరకు దక్షిణ ఆంధ్రప్రదేశ్, దానికి ఆనుకొని ఉన్న ఉత్తర తమిళనాడు సమీపంలోని పశ్చిమ మధ్య బంగాళాఖతం వరకు చేరుకుంటుందని వివరించింది. ఆ తర్వాత, ఉత్తరం వైపు కదులుతూ దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరానికి దాదాపు సమాంతరంగా కదులుతూ డిసెంబర్ 5వ తేదీ ఉదయానికి నెల్లూరు, మచిలీపట్నం మధ్య తీరం దాటు తుందని వాతావరణ శాఖ అంచనా వేసింది. తుపాను తీరం దాటే సమయంలో గరిష్టంగా గంటకు 80నుంచి 100 కిలోమీటర్ల వేగంతో గంటకు ఈదు రు గాలులు వీచే అవకాశం ఉన్నట్లు వివరించింది.

గురువారం రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో నమోదైన కనిష్ట ఉష్ణోగ్రతలు (డిగ్రీ సెల్సియస్)

కేంద్రం	కనిష్ట ఉష్ణోగ్రత
ఆదిలాబాద్	18.8
భద్రాచలం	21.0
హకీంపేట్	18.4
దుండిగల్	18.9
హనుమకొండ	19.0
హైదరాబాద్	19.5
ఖమ్మం	21.0
మహబూబ్‌నగర్	21.6
మెదక్	16.0
నల్లగొండ	20.4
నిజామాబాద్	20.3
రామగుండం	20.5

మరింతగా తగ్గనున్న ఉష్ణోగ్రతలు

రాష్ట్రంలోనూ రానున్న రెండ్రోజులు అక్కడక్కడా తేలికపాటి జల్లుల నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపింది. కొన్నిచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వానలు కూడా కురిసే అవకాశం ఉన్నట్లు సూచించింది. రానున్న రెండ్రోజులు రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు తగ్గుతాయని, 2 డిగ్రీ సెల్సియస్ నుంచి 3 డిగ్రీ సెల్సియస్ మేర గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు తగ్గుతాయని వివరించింది. శనివారం రాష్ట్రంలో నమోదైన ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే... గరిష్ట ఉష్ణోగ్రత హన్మకొండలో 33.5 డిగ్రీ సెల్సియస్, కనిష్ట ఉష్ణోగ్రత మెదక్‌లో 16.0 డిగ్రీ సెల్సియస్‌గా నమోదైంది.

అప్రమత్తంగా ఉండండి..

- సహాయక చర్యల్లో ఎలాంటి లోటూ రాకూడదు
- అధికారులకు ఏపీ సీఎం వైఎస్ జగన్ ఆదేశం
- ఎనిమిది జిల్లాలకు ముందస్తుగా నిధులు విడుదల



సాక్షి, అమరావతి: బంగాళాఖాతంలో ఏర్పడ్డ తీవ్ర వాయుగుండం తుపానుగా మారుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. తుపాను పరిస్థితులపై ముఖ్యమంత్రి శనివారం అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈనెల 4న ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు, మచిలీపట్నం మధ్య తీరం దాటే అవకాశముందని, అది ఉత్తర దిశగా ప్రయాణించే సూచనలున్నాయని అధికారులు సీఎంకు తెలిపారు. ఈ నేపథ్యంలో అన్ని రకాల చర్యలు తీసుకోవాలని సీఎం జగన్ వారిని ఆదేశించారు. సహాయ పునరావాస కార్యక్రమాలు చేపట్టడానికి ప్రభావిత జిల్లాల కలెక్టర్లు సర్వ సన్నద్ధంగా ఉండాలన్నారు. కరెంటు, రవాణా వ్యవస్థలకు అంతరాయాలు ఏర్పడితే వెంటనే వాటిని పునరుద్ధరించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. తుపాను ప్రభావం అధికంగా ఉన్న తీర ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని, అవసరమైన చోట సహాయ శిబిరాలు ఏర్పాటుచేయాలన్నారు. ఈ శిబిరాల్లో రక్షిత తాగునీరు, ఆహారం, పాలతో పాటు ఆరోగ్య శిబిరాలను కూడా ఏర్పాటు చేసుకోవాలన్నారు. మరోవైపు.. సీఎం జగన్ ఆదేశాల మేరకు ఎనిమిది జిల్లాలకు రాష్ట్ర ప్రభుత్వం ముందస్తుగా నిధులు విడుదల చేసింది. తిరుపతి జిల్లాకు రూ.2 కోట్లు, ఎస్‌పీఎస్‌ఆర్ నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, కృష్ణా, పశ్చిమ గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ జిల్లాలకు రూ.1 కోటి చొప్పున విడుదల చేశారు.

కిషన్‌రెడ్డికి అమెరికా అధ్యక్షుడి 'గోల్డ్ మెడాలియన్'

తొలిసారిగా భారతీయుడికి దక్కిన అరుదైన గౌరవం



సాక్షి, హైదరాబాద్: కేంద్ర పర్యాటక, సాంస్కృతిక వ్యవహారాలు, ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి శాఖల మంత్రి జి.కిషన్‌రెడ్డికి అరుదైన గౌరవం లభించింది. అమెరికా అధ్యక్షుడి 'గోల్డ్ మెడాలియన్'(బంగారు పతకం)కు ఆయన ఎంపికయ్యారు. ఈ మేరకు యూఎస్ అధ్యక్షుడు జో బైడెన్ ఈ పతకానికి కిషన్‌రెడ్డిని ఎంపిక చేసినట్లు ఒక లేఖ ద్వారా సమాచారం పంపించారు. భారత్‌కు సంబంధించిన పర్యాటక, సాంస్కృతిక, ఇతర అంశాలను అమెరికాతోపాటు ప్రపంచవ్యాప్తంగా ప్రచారం నిర్వహించినందుకు గుర్తింపుగా ఈ పతకానికి ఆయన ఎంపికయ్యారు. ఇందులో భాగంగా దేశంలోని ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి, ఇతర అంశాలపై ఆయన సాగించిన కృషికి కూడా ఈ గుర్తింపు లభించింది. ప్రపంచవ్యాప్తంగా గ్లోబల్ లీడర్లుగా ఎదిగి వివిధ అంశాలపై కృషి చేసినవారికి అమెరికా అధ్యక్షుడి మెడాలియన్‌ను అందజేస్తున్న విషయం తెలిసిందే. భారత్‌కు చెందిన నాయకుడికి తొలిసారిగా ఈ గౌరవం దక్కడం విశేషం.

కిసాన్ క్రెడిట్ కార్డులపై రుణాల పేరిట భారీ మోసం

- చేపల చెరువుల నిర్మాణానికి రుణాలు ఇచ్చినట్టు పత్రాలు చూపి రూ.311 కోట్లు కొల్లగొట్టిన నిందితులు
- ఏపీ, తెలంగాణలో కలిపి ఆరు ప్రాంతాల్లో ఈడీ సోదాలు

సాక్షి, హైదరాబాద్: కిసాన్ క్రెడిట్ కార్డ్(కేసీసీ)లపై చేపల చెరువుల నిర్మాణానికి రుణాలు ఇచ్చినట్టు లెక్కల్లో చూపి కోట్ల రూపాయలు దారిమళ్లించిన కేసు దర్యాప్తును ఈడీ అధికారులు ముమ్మరం చేశారు. సీబీఐ విశాఖపట్నం బ్రాంచ్ ఏసీబీ విభాగం నమోదు చేసిన ఈ కేసులో మనీలాండరింగ్ కోణంలో ఈడీ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఇందులో భాగంగా నవంబర్ 29న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో కలిపి మొత్తం ఆరు ప్రాంతాల్లో సోదాలు చేసినట్టు ఈడీ అధికారులు శనివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. అయితే ఈ సోదాలు ఏ ప్రాంతాల్లో చేశారన్న విషయాలు ఈడీ అధికారులు వెల్లడించలేదు. రాజమండ్రిలోని ఐడీబీఐ బ్యాంక్‌లో కిసాన్ క్రెడిట్‌కార్డులపై రుణాల పేరిట మొత్తం రూ. 311.05 కోట్లు దారిమళ్లించినట్టు ఈడీ అధికారుల దర్యాప్తులో తేలింది. నిందితులు వారి సంస్థలో పనిచేసే ఉద్యోగులు పలువురి నుంచి కేవైసీ డాక్యుమెంట్లు, బ్లాంక్ చెక్కులు, మరికొందరు రైతుల నుంచి వారికి సంబంధించిన పత్రాలను సేకరించి వారి పేరిట రుణాలు మంజూరు చేసినట్టు ఈడీ అధికారులు గుర్తించారు. ఈ సొమ్మును తర్వాత నిందితులు తమ కంపెనీల్లో పెట్టుబడులకు, కుటుంబసభ్యులు, బినామీల పేరిట ఆస్తుల కొనుగోలుకు వాడినట్టు ప్రాథమిక ఆధారాలు సేకరించినట్టు ఈడీ అధికారులు పేర్కొన్నారు. నిందితుల ఇళ్లలో జరిపిన సోదాల్లో కొన్ని కీలకపత్రాలు, డిజిటల్ ఆధారాలు స్వాధీనం చేసుకున్నామని, కేసు దర్యాప్తు కొనసాగుతోందని ఈడీ అధికారులు పేర్కొన్నారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.